గురువారం
22•3•2018
హైదరాబాద్
• వెల.5 రూ.
• సంపుటి 7 • సంచిక 284
• పేజీలు : 16 + (20/16)

నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక
WWW. NTNEWS.COM
/NTDAILYONLINE



PUBLISHED FROM HYDERABAD I KARIMNAGAR I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD

మాతో పెట్టుకోకు!

- ఎన్నికల ప్రక్రియను ప్రభావితం చేస్తే సహించం
- ఐటీ చట్టం కింద కఠినశిక్షలు ఎదుర్కోక తప్పదు
- ఫేస్‌బుక్ సంస్థకు కేంద్రమంత్రి రవిశంకర్ ప్రసాద్ హెచ్చరిక
- అవసరమైతే జుకర్‌బర్గ్‌కూ సమన్లు పంపుతామని వెల్లడి



5

అన్సారీ హత్య కేసులో.. 11 మందికి యావజ్జీవం

జార్ఖండ్ ఫాస్ట్‌ట్రాక్ కోర్టు సంచలన తీర్పు
గోరక్షణ పేరిట దాడుల కేసులలో ఇదే మొదటిది

5



కుప్వారాలో భీకరపోరు

- ఐదుగురు ఉగ్రవాదుల హతం
- అసువులు బాసిన ఐదుగురు భద్రతా సిబ్బంది
- ఉగ్రవాదులందరూ విదేశీయులే
- పరారైన ఉగ్రవాదుల కోసం కొనసాగుతున్న వేట

5



కనిష్క్ పాట వెయ్యి కోట్లు

ఎస్‌బీఐ సహా 14 బ్యాంకులకు కుచ్చుటోపీ

- బాధిత సంస్థల్లో పంజాబ్ నేషనల్ బ్యాంక్
- సీబీఐకి ఫిర్యాదుతో వెలుగులోకి తాజా కుంభకోణం
- బిచాణా ఎత్తేసి మారిషస్‌కు చెక్కేసిన భూపేశ్‌జైన్ దంపతులు

చెన్నై, మార్చి 21:

మొన్న జతిన్ మెహతా.. నిన్న నీరవ్‌మోదీ, మెహుల్‌చోక్సీ.. అందినకాడికి బ్యాంకుల నుంచి అప్పులు తీసుకుని, దర్జాగా దేశం నుంచి బిచాణా ఎత్తేసిన వీరి సరసన తాజాగా మరో బ్యాంకు దొంగ చేరాడు. విన్సమ్ డైమండ్స్ 7వేల కోట్ల కుంభకోణం, పంజాబ్ నేషనల్ బ్యాంకు (పీఎన్‌బీ)లో నీరవ్, చోక్సీల రూ.13,600 కోట్ల కుంభకోణం ప్రకంపనలు ఆగకముందే తాజాగా కనిష్క్ గోల్డ్ మోసం వెలుగులోకి వచ్చింది. కనిష్క్ గోల్డ్ ప్రమోటర్ భూపేశ్‌కుమార్ జైన్ ప్రభుత్వరంగంలోని దిగ్గజం ఎస్‌బీఐ సహా 14 బ్యాంకులకు వెయ్యి కోట్ల మేరకు కుచ్చుటోపీ పెట్టాడు. నీరవ్‌మోదీ దెబ్బకు దిమ్మతిరిగిన పంజాబ్ నేషనల్ బ్యాంకుకు కూడా భూపేశ్ భారీ ఝలకే ఇచ్చాడు. కొన్నాళ్లుగా బకాయిలు చెల్లించకపోగా, నోటీసులు ఇవ్వడానికి వెళితే పత్తా లేకుండా పోవడంతో కంగుతిన్న ఎస్‌బీఐ, ఇతర బ్యాంకర్లు సీబీఐకి ఫిర్యాదు చేయడంతో ఈ కుంభకోణం వెలుగులోకి వచ్చింది. ఈ సంస్థ ప్రమోటర్లు, డైరెక్టర్లుగా వ్యవహరిస్తున్న భూపేశ్‌కుమార్‌జైన్, ఆయన భార్య నీతూజైన్‌లు ప్రస్తుతం భారత్ నుంచి బిచాణా ఎత్తేసి, మారిషస్‌లో ఉంటున్నారని తెలుస్తున్నది. అసలే మొండిబకాయిలతోసత మతమవుతున్నదేశీ య బ్యాంకింగ్ రంగాన్ని తాజాగా

మిగతా 13వ పేజీలో

రాష్ట్రాలకు ఆర్థిక స్వేచ్ఛ

విద్య, వైద్యం వంటివి కేంద్రం వద్ద ఎందుకు? • అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాలపైనా కేంద్రం నిర్బంధం

నిధులివ్వడంలేదు.. ప్రోత్సాహం ఉండటం లేదు • కేంద్ర విధానాలపై సీఎం కే చంద్రశేఖర్‌రావు వ్యాఖ్యలు



శాసన మండలిలో సీఎం కేసీఆర్

బుధవారం జూబ్లీహాల్‌ను సందర్శించిన సందర్భంగా మండలిలో ప్రభుత్వ చీఫ్‌విప్ పాతూరి సుధాకర్‌రెడ్డి, ప్రభుత్వ విప్‌లు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, బోడకుంటి వెంకటేశ్వర్లు, ఎమ్మెల్సీలు మహ్మద్ సలీమ్ తదితరులతో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి కేసీఆర్

- అభివృద్ధి కోసమే అప్పులు చేస్తున్నాం ▪ తెలంగాణ కచ్చితంగా ధనిక రాష్ట్రమే
- జీఎస్డీపీలో 21 శాతం మాత్రమే అప్పులు ▪ కేంద్రం అప్పులు రూ.82 లక్షల కోట్లు
- దేశంలో 70 వేల టీఎంసీల నీరు ఉంది ▪ ప్రతి ఎకరానికి నీరిచ్చే అవకాశం ఉంది
- ప్రతిపక్షాలు విశ్లేషించుకోవాలి.. బడ్జెట్‌పై అవగాహన పెంచుకోవాలి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

రాష్ట్రాలకు ఆర్థిక స్వేచ్ఛ ఉండాలని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు స్పష్టంచేశారు. స్థానికంగా దృష్టి పెట్టాల్సిన అంశాలు కేంద్రం తన దగ్గర పెట్టుకోవటం అనవసరమని అభిప్రాయపడ్డారు. విద్య, వైద్యం, వ్యవసాయం, పట్టణ, గ్రామీణాభివృద్ధి వంటి శాఖలు కేంద్ర ప్రభుత్వం వద్ద ఉండాల్సిన అవసరం ఏమిటని ఆయన ప్రశ్నించారు. 'తెలంగాణ రాష్ట్రంలోని గట్టు మండలంలో ఉన్న ప్రభుత్వ పాఠశాల స్థితిగతుల గురించి కేంద్ర ప్రభుత్వానికి ఏం పట్టి ఉంటుంది? కేంద్రానికి ఏం సంబంధం?' అని సూటిగా ప్రశ్నించారు. 'అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాలను కూడా కేంద్రం నిర్బంధం చేస్తున్నది. నిధులు ఇవ్వడం లేదు. ప్రోత్సాహం ఉండటం లేదు. కావాల్సిన అనుమతులు ఇవ్వడం లేదు' అని సీఎం విమర్శించారు. బుధవారం శాసనమండలిలో బడ్జెట్‌పై చర్చ సందర్భంగా మాట్లాడుతూ, రాష్ట్రాలకు సంబంధించిన వాతావరణం వేరు.. పరిస్థితులు వేరు.. పండే పంటలు వేర్వేరుగా ఉంటాయని అన్నారు. ఇలాంటివాటిపై రాష్ట్రాలకే అధికారాలు ఉండాలని నొక్కిచెప్పారు. 'వీటికి సంబంధించిన కేంద్ర ప్రభుత్వ శాఖలు రాష్ట్రాలలో కొనసాగుతున్నప్పటికీ అక్కడ పర్యవేక్షించడానికి ఒక్క మనిషి కూడా కనిపించరు' అని చెప్పారు. అప్పులు చేయడం తప్పుకాదని ముఖ్యమంత్రి కేసీఆర్ స్పష్టం చేశారు. కేంద్రం కూడా భారీగా అప్పులు చేస్తున్నదని గుర్తుచేశారు. 'అవును తెలంగాణ కచ్చితంగా

మిగతా 2వ పేజీలో

6,609 కంపెనీలు.. 1.24 లక్షల కోట్ల పెట్టుబడులు



సుమారు 2 లక్షల మందికి ఉద్యోగాలు

ఇదీ టీఎస్ఐపాస్ ప్రగతి

పరిశ్రమలశాఖపై సీఎస్ ఎస్కే జోషి సమీక్ష

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

టీఎస్ఐపాస్ ద్వారా రూ.1.24 లక్షల కోట్లతో 6,609 కంపెనీలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాయని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి తెలిపారు. ఇప్పటివరకు రూ.38,203 కోట్ల పెట్టుబడులతో 4,382 కంపెనీలు తమ కార్యకలాపాలు ప్రారంభించాయని, వీటిద్వారా 1,87,978 మందికి ఉద్యోగ అవకాశాలు లభించాయని చెప్పారు. మరో 684 యూనిట్లు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయన్నారు. బుధవారం పరిశ్రమలశాఖ కార్యకలాపాలపై సీఎస్ జోషి సచివాలయంలో సమీక్షా సమావేశం

మిగతా 2వ పేజీలో

తెలంగాణ సోయితోనే ప్రాజెక్టుల రీడిజైనింగ్

కోటి ఎకరాల మాగాణంగా తెలంగాణం! ఇది సీఎం కేసీఆర్ సంకల్పం

- దేశానికి అన్నం పెట్టే భాండాగారంగా మారుస్తాం
- ప్రాజెక్టులను కట్టడంలో కొత్త ఒరవడికి శ్రీకారం
- కాళేశ్వరం జాతీయ హోదాకు బీజేపీ సహకరించాలి
- అసెంబ్లీ ప్రశ్నోత్తరాల్లో మంత్రి హరీశ్‌రావు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:




అసెంబ్లీలో మాట్లాడుతున్న మంత్రి తన్నీరు హరీశ్‌రావు

తెలంగాణ సోయితోనే తమ ప్రభుత్వం ఇరిగేషన్ ప్రాజెక్టులను రీ డిజైన్, రీ ఇంజినీరింగ్ చేసినట్టు రాష్ట్ర నీటిపారుదలశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు తెలిపారు. భవిష్యత్‌లో దేశానికి అన్నం పెట్టే భాండాగారంగా తెలంగాణ మారబోతున్నట్టు ఆయన చెప్పారు. ప్రాజెక్టులను కట్టడంలో తెలంగాణ.. దేశంలో కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టిందని అన్నారు. రైతుల ఆత్మహత్యలను నివారించాలని, ప్రతి నియోజకవర్గానికి సాగునీళ్లు ఇవ్వాలనే ఉద్దేశంతోనే ప్రాజెక్టులను యుద్ధప్రాతిపదికన పూర్తిచేస్తున్నామని మంత్రి బుధవారం శాసనసభలో తెలిపారు. ప్రతిపక్ష పార్టీలు రాజకీయ లబ్ధి కోసమే అనవసర ఆరోపణలు చేస్తున్నాయని మండిపడ్డ ఆయన.. రాజకీయ అవసరాల కంటే తమకు ప్రజల ఆకాంక్ష నెరవేర్చడమే ముఖ్యమని తేల్చిచెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా 37 లక్షల 9 వేల ఎకరాలకు సాగునీరు, పారిశ్రామిక అవసరాలకు, తాగునీటిని అందించనున్నట్టు ప్రకటించారు. త్వరలోనే తెలంగాణ పచ్చదనంలో కోనసీమలా కానున్నదని, ఆకుపచ్చ తెలంగాణ ఆవిర్భవించనున్నదని పేర్కొన్నారు. వందేండ్ల తర్వాత కూడా సీఎం కేసీఆర్‌ను, టీఆర్ఎస్ ప్రభుత్వాన్ని గుర్తుపెట్టుకునే విధంగా సాగునీటి రంగంలో పనులు సాగుతున్నట్టు మంత్రి హరీశ్ వివరించారు. మూడు షిప్టుల్లో రాత్రింబవళ్లు తేడా లేకుండా 3 బరాజ్‌ల పనులు వేగంగా

మిగతా 11వ పేజీలో

సిర్పూర్‌కు పూర్వవైభవం

రూ.628కోట్లతో పేపర్‌మిల్లు పునరుద్ధరణకు ముందుకొచ్చిన జేకే పేపర్స్ కంపెనీ



రాయితీలు, ప్రోత్సాహకాల్లో కొన్ని..

- స్టాంప్‌డ్యూటీ పూర్తిగా మినహాయింపు .
- పెట్టుబడిపై క్యాపిటల్ సబ్సిడీ 20 శాతం (గరిష్ఠంగా రూ.50 కోట్ల వరకు)
- పదేండ్లపాటు సుబాబుల్ అందుబాటులో ఉంచడంతో పాటుగా ఏడీఎంటీ (ఎయిర్ డ్రై మెట్రిక్ టన్ను) పై రూ.1000 వరకు సబ్సిడీ.
- సింగరేణి నుంచి రాయితీపై బొగ్గు సరఫరా
- కొత్త పెట్టుబడులపై ఐదేండ్లపాటు ఏడాదికి రెండు శాతం వడ్డీ రాయితీ.
- కంపెనీకి అవసరమైన మొక్కలు నాటడానికి అటవీ భూములను, అడవులను కొట్టివేసిన భూమిని అందుబాటులో ఉంచుతారు.
- తెలంగాణ ప్రభుత్వానికి మార్కెట్ రేట్ల ప్రకారం కాపియర్ పేపర్‌ను సరఫరా చేయడానికి ప్రాధాన్యం.
- నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్సీఎల్టీ) ముందు వాదనల లావాదేవీలపై స్టాంప్‌డ్యూటీ, పన్నులకు మినహాయింపు .

- 1200 మందికి పైగా ఉద్యోగాలు.. 10వేల మందికి ఉపాధి
- రాయితీలు, ప్రోత్సాహకాలను ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం
- మూడేండ్లపాటు ఒక్కో యూనిట్‌కు రూ.3 చొప్పున విద్యుత్ చార్జీల రీయింబర్స్
- పదేండ్లపాటు నూరు శాతం ఎస్జీఎస్టీ మినహాయింపు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

పేపర్ పరిశ్రమలో ఒకనాడు తనదైన ప్రత్యేకతను సంతరించుకొన్న సిర్పూర్ పేపర్ మిల్లు గేట్లు తిరిగి తెరుచుకోబోతున్నాయి. పూర్వపు ఆదిలాబాద్ జిల్లాలో అతి పెద్ద పరిశ్రమగా ప్రసిద్ధి చెందిన సిర్పూర్ కాగజ్ మిల్లును తిరిగి ప్రారంభించడానికి రంగం సిద్ధమైంది. వేల కార్మికులకు ఉపాధి కల్పించిన సంస్థ మూతపడటంతో దానిని తెరిపించేందుకు రాష్ట్ర పరిశ్రమలశాఖ మంత్రి కే తారకరామారావు, ఆదిలాబాద్ జిల్లా మంత్రులు జోగు రామన్న, ఇంద్రకరణ్ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే కోనేరు కోనప్పతో కలిసి అనేకమార్లు కంపెనీల యాజమాన్యాలు, బ్యాంకులు, ఇతర సంస్థలతో జరిపిన చర్చలు విజయవంతమయ్యాయి. ప్రతిష్ఠాత్మకమైన ఈ సంస్థను నిర్వహించడానికి జేకే పేపర్స్ కంపెనీ ముందుకొచ్చింది. ఇందుకోసంరూ.628 కోట్లు పెట్టుబడి పెట్టేందుకు సంసిద్ధత వ్యక్తంచేసింది. ప్రత్యక్షంగా, పరోక్షంగా వేల మందికి ఉపాధి కల్పించే ఈ కంపెనీని నిర్వహించడానికి ముందుకొచ్చిన కొత్త యాజమాన్యానికి అవసరమైన రాయితీలు, ప్రోత్సాహకాలను ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. కొత్తగా సంస్థ నిర్వహణను చేపట్టడానికి ముందుకొచ్చిన జేకే పేపర్స్ యాజమాన్యం బ్యాంకర్లతో చర్చలు జరిపిన

మిగతా 12వ పేజీలో

27 గురుకులాల హోదా పెంపు

ఇంటర్ కాలేజీలుగా గుర్తిస్తూ జీవో జారీచేసిన విద్యాశాఖ

2

ప్రైవేట్ ట్రావెల్స్‌పై కొరడా



రాష్ట్రవ్యాప్తంగా చెక్‌పోస్టుల వద్ద 99 బస్సులపై కేసులు నమోదు

రూ.1.61 లక్షల జరిమానా వసూలు

హైదరాబాద్‌లో 17 బస్సులపై రూ.20 వేల ఫైన్

6

రేపు శంషాబాద్ ఎయిర్‌పోర్టు పదో వార్షికోత్సవం

వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరుకానున్న సీఎం కేసీఆర్, కేంద్రమంత్రి జయంత్‌సిన్హా

శంషాబాద్, నమస్తే తెలంగాణ: హైదరాబాద్‌లోని శంషాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు పదో వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా జరుగనున్నది. ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు హాజరుకానున్నారు. కేంద్ర పౌర విమానయాన శాఖ సహాయమంత్రి జయంత్ సిన్హా, రాష్ట్ర మంత్రులు కేటీఆర్, మహేందర్‌రెడ్డి, ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్, కేంద్ర సివిల్ ఏవియేషన్ మంత్రిత్వశాఖ కార్యదర్శి రాజీవ్ చోబే, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శైలేంద్ర కుమార్ జోషి తదితరులు పాల్గొననున్నారు. మధ్యాహ్నం 3 గంటలకు ఎయిర్‌పోర్టులోని హజ్ టెర్మినల్‌లో వేడుకలు నిర్వహించనున్నట్టు జీఎమ్మార్ కమ్యూనికేషన్ ప్రతినిధివర్గాలు బుధవారం ఒక ప్రకటనలో తెలిపాయి.

ఫార్మా ఎగుమతుల నిబంధనల్లో సడలింపు

- బయోఏషియా సదస్సు సందర్భంగా రాష్ట్రం సిఫారసులతో మార్పులు
- హర్షం వ్యక్తంచేసిన మంత్రి కేటీఆర్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఫార్మా తదితర ఉత్పత్తుల ఎగుమతుల నిబంధనలు సరళతరం చేస్తూ వైద్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ పరిధిలోని సెంట్రల్ డ్రగ్స్ స్టాండర్డ్ కంట్రోల్ ఆర్గనైజేషన్ (సీడీఎస్సీవో) ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం కొన్ని దేశాలకు ఫార్మా, వ్యాక్సిన్లు ఎగుమతి చేయాలంటే నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ (ఎన్‌వోసీ)తప్పనిసరిగా సమర్పించాల్సి ఉండేది. ఈ అవసరం లేకుండా ఇప్పుడు నిబంధనలను సరళతరం చేయడం పట్ల రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి కే తారకరామారావు హర్షం వ్యక్తం చేశారు. గతనెలలో జరిగిన బయోఏషియా సదస్సు సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర అధికారులతో ఈ విషయమై చర్చించింది. పారిశ్రామికవేత్తలు, వ్యాపారులు, ఎగుమతిదారులకు ఇబ్బందికరంగా ఉన్న నిబంధనలను సరళీకరించాలని కోరింది. ఈ మేరకు నిబంధనలను సులభతరం చేశారు. రాష్ట్రం ఫార్మా, వ్యాక్సిన్ల ఎగుమతుల్లో ముందున్నదని, వీటి ఎగుమతులకు ఈ నిర్ణయంతో ప్రోత్సాహం లభిస్తుందని మంత్రి కేటీఆర్ అన్నారు. దీనితోపాటుగా బయోఏషియా సందర్భంగా మరో 12 కీలకమైన సిఫారసులు చేశామని తెలిపారు. వీటిని కూడా పరిష్కరించడానికి కేంద్ర ప్రభుత్వంతో ఎప్పటికప్పుడు సంప్రదింపులు జరుపుతున్నట్టు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఒకేదగ్గర అన్నిరకాలైన సమాచారం లభ్యమయ్యే విధంగా సీడీఎస్సీవోలో కొత్తగా పబ్లిక్ రిలేషన్ ఆఫీస్‌ను ఏర్పాటు చేసింది.

27 తెలంగాణ గురుకులాల హోదా పెంపు

ఇంటర్ కాలేజీలుగా గుర్తిస్తూ జీవో జారీచేసిన విద్యాశాఖ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

రాష్ట్రంలోని 27 తెలంగాణ గురుకుల విద్యాలయాల్లో ఇంటర్మీడియట్ తరగతులను బోధించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. ఈ మేరకు 27 తెలంగాణ గురుకుల పాఠశాలల హోదా పెంచి ఇంటర్మీడియట్ కాలేజీలుగా గుర్తిస్తూ బుధవారం విద్యాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రంజీవ్ ఆర్ ఆచార్య జీవో జారీచేశారు. ఈ గురుకుల విద్యాసంస్థల్లో 2018-19 విద్యా సంవత్సరం నుంచి ఇంటర్ తరగతులను ప్రారంభిస్తారు. ఇందులో 13 బాలుర గురుకులాలు, 14 బాలికల గురుకులాలు ఉన్నాయి. వీటికోసం అదనంగా 405 పోస్టులను మంజూరు చేయడంతోపాటు రూ.117.79 కోట్ల బడ్జెట్ విడుదల చేశారు.

హోదా పెరిగిన బాలుర గురుకుల విద్యాలయాలు: 1. బెల్లంపల్లి, మంచిర్యాల జిల్లా, 2. పెద్దాపూర్ క్యాంప్, జగిత్యాల జిల్లా, 3. మేడారం, పెద్దపల్లి జిల్లా, 4. వాలేర్, వరంగల్ అర్బన్ జిల్లా, 5. బండారుపల్లి, జయశంకర్ భూపాల్‌పల్లి జిల్లా, 6. తుంగతుర్తి, సూర్యాపేట జిల్లా, 7. ఎన్కూర్, ఖమ్మం జిల్లా, 8. పోచంపాడ్, నిజామాబాద్ జిల్లా, 9. మద్నూర్, కామారెడ్డి జిల్లా, 10. బీచుపల్లి, జోగుళాంబ గద్వాల జిల్లా, 11. తూప్రాన్, మెదక్ జిల్లా, 12. లింగంపల్లి, సంగారెడ్డి జిల్లా, 13. బోరబండ, హైదరాబాద్ జిల్లా.

బాలికల గురుకుల విద్యాలయాలు: 1. నిర్మల్, నిర్మల్ జిల్లా, 2. తాటిపల్లి జగిత్యాల జిల్లా, 3. నేరెళ్ల, సిరిసిల్లా రాజన్న జిల్లా, 4. వంగర, వరంగల్ అర్బన్ జిల్లా, 5. నెక్కొండ, వరంగల్ రూరల్ జిల్లా, 6. కొడకండ్ల, జనగామ జిల్లా, 7. బూర్గంపాడ్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, 8. చౌటుప్పల్, యాదాద్రి భువనగిరి జిల్లా, 9. పోచంపాడ్, నిజామాబాద్ జిల్లా, 10. బోధన్, నిజామాబాద్ జిల్లా, 11. మెదక్, మెదక్ జిల్లా, 12. దిగ్వల్, సంగారెడ్డి జిల్లా, 13. బోరబండ, హైదరాబాద్ జిల్లా, 14. తాండూరు, వికారాబాద్ జిల్లా.

మనసున్న మారాజు.. కేసీఆర్

- సబ్బండవర్ణాలకు అండగా సంక్షేమ పథకాలు
- ప్రధాని మోదీ నాలుగేండ్ల పాలనలో అభివృద్ధి జరిగిందా?
- ఉద్యోగాలు వచ్చాయా..? దేశ జీడీపీ పెరిగిందా..?
- బడ్జెట్‌పై చర్చకు శాసనమండలిలో ఆర్థికమంత్రి ఈటల సమాధానం



శాసనమండలిలో మాట్లాడుతున్న మంత్రి ఈటల

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: అందరియోగక్షేమాలు కోరుకునే మనసున్న మారాజుగా ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు సంక్షేమపథకాలు ప్రవేశపెట్టి సబ్బండవర్ణాలకు అండగా నిలబడ్డారని ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్ అన్నారు. మూడు దఫాలు ముఖ్యమంత్రిగా పనిచేసిన వ్యక్తి ప్రధాని అయితే దేశాన్ని అభివృద్ధిపథంలో నడిపిస్తారని ప్రజలు భావించారని, కానీ నాలుగేండ్ల పాలనలో ఎలాంటి పురోగతి లేదని మోదీపై తీవ్ర విమర్శలు చేశారు. కొత్త ఉద్యోగాలు రాలేదు.. దేశ జీడీపీ పెరిగిందీ లేదు.. తెలంగాణ రాష్ట్రానికి ఏవైనా ప్రత్యేక నిధులూ ఇచ్చిందీ లేదని కేంద్రప్రభుత్వంపై మండిపడ్డారు. బుధవారం శాసనమండలిలో బడ్జెట్‌పై చర్చకు మంత్రి ఈటల సమాధానమిచ్చారు. రాష్ట్రంలో రూ.80 వేల కోట్లతో ప్రాజెక్టులు చేపడుతుంటే అప్పులు చేసి వాటిని ఎందుకు కడుతున్నారంటూ కొంతమంది చేస్తున్న విమర్శలు అర్థరహితమని అన్నారు. డబ్బులుంటేనే ప్రాజెక్టులు చేపట్టాలంటే ఇంకా యాభైఏండ్లయినా వాటిని కట్టే పరిస్థితి ఉండదన్నారు. ప్రాజెక్టులతో ఫలితాలు వస్తే ఎన్నికోట్ల అప్పులైనా వాటంతటవే తీరిపోతాయని అన్నారు.

కేంద్ర జీడీపీ కంటే తెలంగాణ జీడీపీ అధికం

కేంద్ర జీడీపీ 2013-14లో 4.2 ఉంటే ఈ నాలుగేండ్లలో మోదీ ప్రభుత్వం కేవలం 6.6ను సాధించిందని, అదే తెలంగాణ ప్రభుత్వం మాత్రం రాష్ట్రంలో జీడీపీని 10.4కు పెంచిందని మంత్రి వివరించారు. దేశ ప్రజలకు ఏమీ చేయని బీజేపీ నేతలకు అభివృద్ధిలో దూసుకుపోతున్న టీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని విమర్శించే హక్కులేదని ఈటల చురక అంటించారు. కేంద్రప్రభుత్వం వైద్య, విద్యా రంగానికి కనీసం ఒక్క రూపాయన్నా ఇచ్చిందా? అని ప్రశ్నించారు. కేంద్ర తలసరి ఆదాయం 1,12,764 అయితే తెలంగాణ తలసరి ఆదాయం 1,75,534 అని, జీఎస్టీ లేకుంటే 22 శాతం అధిక ఆదాయం వచ్చేదని చెప్పారు. ఇంత అభివృద్ధి ఎలా సాధ్యమైందని దేశంలోని పలు రాష్ట్రాలు తెలంగాణ రాష్ట్రానికి అధ్యయనం కోసం వస్తున్నాయని చెప్పారు. అభివృద్ధి అనే విజన్‌ను ఏర్పాటుచేసుకుని ముందుకుసాగుతున్నామని అన్నారు.

శాంతి భద్రతలు భేష్..

తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు కాగానే పోలీస్ వ్యవస్థను పటిష్ఠపర్చేందుకు ముఖ్యమంత్రి చర్యలు తీసుకున్నారని, దీంతో రాష్ట్రంలో శాంతిభద్రతలు భేషుగ్గా ఉన్నాయని ఈటల చెప్పారు. 24 గంటల కరెంట్ సరఫరా చేయడంతో పారిశ్రామికవేత్తలు పెట్టుబడులు పెట్టేందుకు పెద్దఎత్తున ముందుకొస్తున్నారని అన్నారు. ఉమ్మడిరాష్ట్రంలో కరెంట్ సమస్యపై పారిశ్రామికవేత్తలు ఇందిరాపార్క్ వద్ద ధర్నాలు చేసిన రోజులున్నాయని గుర్తుచేశారు.

వ్యవసాయానికి పెద్దపీట

రైతులకు తెలంగాణ ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నదని ఈటల చెప్పారు. రైతు పంట రుణాల మాఫీ, 24 గంటల విద్యుత్ సరఫరా, వ్యవసాయ పెట్టుబడులకు ఎకరాకు రూ.8 వేల పంపిణీ, రైతులకు రూ.5 లక్షల ప్రమాదబీమా , రైతు ఉత్పత్తులకు మద్దతు ధర కల్పిస్తున్నామని పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు పూర్తయితే 2019-20లో ఉత్తర తెలంగాణలో మొదటివిడుతగా 40లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తామన్నారు. ఆరోగ్య భద్రత, కల్యాణలక్ష్మి-షాదీముబారక్, రెసిడెన్షియల్ పాఠశాలలు, మైనార్టీల అభివృద్ధి, కేసీఆర్ కిట్లు, గొర్రెల పంపిణీ, మత్స్యకారుల అభివృద్ధి, ఆసరా పింఛన్లు వంటి కార్యక్రమాలను చేపట్టి వాటిని ప్రజలకు చెంతకు చేర్చిన ప్రభుత్వం తమదని ఈటల పేర్కొన్నారు.

నిరసనలు ఆపేది లేదు

- రిజర్వేషన్లు కేటాయించే హక్కు రాష్ట్రాలకే ఇవ్వాలి
- లోక్‌సభ స్పీకర్‌కు తేల్చిచెప్పిన టీఆర్‌ఎస్ ఎంపీలు
- కార్యకలాపాలు లేకుండానే ఉభయసభలు వాయిదా
- కేంద్ర హోంమంత్రి హామీ ఇస్తేనే ఆందోళన విరమణ
- స్పష్టంచేసిన ఎంపీ వినోద్



బుధవారం లోక్‌సభ స్పీకర్ సుమిత్రా మహాజన్‌ను కలిసిన టీఆర్‌ఎస్ ఎంపీలు జితేందర్‌రెడ్డి, వినోద్‌కుమార్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, బీబీ పాటిల్, బూర నర్సయ్యగౌడ్, సీతారాంనాయక్, పసునూరి దయాకర్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, బాల్క సుమన్, మల్లారెడ్డి, నగేశ్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: పార్లమెంట్ ఉభయసభల్లో వాయిదాల పర్వం కొనసాగుతూనే ఉంది. బడ్జెట్ మలి దశ సమావేశాలు ప్రారంభమైననాటి నుంచి రిజర్వేషన్లను కేటాయించే హక్కు రాష్ట్రాలకు ఉండాలని కోరుతూ తాము చేస్తున్న ఆందోళనను విరమించేది లేదని టీఆర్‌ఎస్ ఎంపీలు తేల్చిచెప్పారు. బుధవారం ఉదయం సభ ప్రారంభం కాగానే.. టీఆర్‌ఎస్ ఎంపీలు వెల్‌లోకి దూసుకెళ్లి జై తెలంగాణ నినాదాలు చేశారు. రిజర్వేషన్లకు సంబంధించిన అంశంపై కేంద్రం స్పందించాలని డిమాండ్ చేశారు. దీంతో లోక్‌సభను మధ్యాహ్నం 12 గంటల వరకు వాయిదా వేశారు. 12 గంటల తరువాత కూడా పరిస్థితిలో మార్పు రాలేదు. ఈ ఆందోళనల మధ్యలోనే కేంద్ర ప్రభుత్వంపై టీడీపీ, వైసీపీ ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానాలను స్పీకర్ సుమిత్రా మహాజన్ చదివి వినిపించారు. అవిశ్వాసానికి మద్దతిచ్చే సభ్యులను లెక్కించాలంటే సభ ఆర్డర్‌లో ఉండాలని, లేకపోతే సాధ్యంకాదని స్పీకర్ ప్రకటించారు. అయినప్పటికీ.. టీఆర్‌ఎస్ ఎంపీలు వెనుకకు తగ్గకపోవడంతో.. నిరసనలు, ఆందోళనల మధ్య సభను నిర్వహించలేమంటూ సభను గురువారానికి వాయిదా వేశారు. రాజ్యసభలోనూ ఇదే పరిస్థితి నెలకొన్నది. మరోవైపు ఇరాక్‌లో 39 మంది భారతీయులు మృతి చెందిన ఘటనపై కాంగ్రెస్ సభ్యులు చర్చకు పట్టుబట్టారు. రాజ్యసభలో సభ్యులు వివిధ అంశాలపై ఆందోళనకు దిగగా.. చైర్మన్ వెంకయ్యనాయుడు రాజ్యసభను గురువారంకు వాయిదా వేశారు.

స్పీకర్‌ను కలిసిన టీఆర్‌ఎస్ ఎంపీలు

బుధవారం సభ వాయిదా అనంతరం టీఆర్‌ఎస్ ఎంపీలు లోక్‌సభ స్పీకర్ సుమిత్రా మహాజన్‌ను కలిశారు. రిజర్వేషన్ల ప్రక్రియను రాష్ట్రాలకు అప్పగించే విషయంలో కేంద్రం నుంచి స్పష్టమైన హామీ వచ్చేవరకూ తమ ఆందోళన కొనసాగుతూనే ఉంటుందని స్పీకర్‌కు తేల్చి చెప్పారు. అనంతరం ఎంపీ వినోద్‌కుమార్ మీడియాతో మాట్లాడుతూ రిజర్వేషన్ల అంశంపై కేంద్ర హోం శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ హామీ ఇస్తేనే పార్లమెంట్‌లో ఆందోళన విరమిస్తామని స్పష్టం చేశారు. మంగళవారం రాత్రి ఇదే విషయాన్ని కేంద్ర హోంమంత్రికి చెప్పామన్నారు. హామీ ఇవ్వకుంటే మా ఆందోళన ఉధృతం చేస్తామని తేల్చి చెప్పారు.

టీడీపీ ఎంపీల నిరసన

ఉభయసభలు వాయిదా పడిన అనంతరం టీడీపీ ఎంపీలు పార్లమెంట్ ఆవరణలో గాంధీ విగ్రహం దగ్గర ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఏపీకి ప్రత్యేక హోదా, విభజన హామీలు నెరవేర్చాలంటూ డిమాండ్ చేశారు. ఈ విషయంలో కేంద్రం డ్రామా చేస్తుందని టీడీపీ ఎంపీలు విమర్శించారు.

రాష్ట్రాలకు ఆర్థిక స్వేచ్ఛ

మొదటిపేజీ తరువాయి...

ధనిక రాష్ట్రమే. తెలంగాణ రెవెన్యూ మిగులు రాష్ట్రంగా ఉన్నది. మంచి వనరులున్నాయి. తెలంగాణ వృద్ధిరేటు 22 శాతంగా నమోదైంది. గత ఉమ్మడి రాష్ట్రంలో 2004 నుంచి 2014 వరకు క్యాపిటల్ ఎక్స్‌పెండిచర్ రూ.1.29 లక్షల కోట్లు ఉంది. తెలంగాణ ఏర్పాటైన నాలుగు సంవత్సరాలల్లోనే క్యాపిటల్ ఎక్స్‌పెండిచర్ రూ.1.20 లక్షల అయింది. ప్రస్తుతం దేశంలోనే వృద్ధిరేటులో తెలంగాణ ముందున్నది. ప్రస్తుతం దేశంలో జీడీపీలో అప్పులు రూ.82 లక్షల కోట్లు ఉన్నాయి. కేంద్రం ఇప్పటికే రూ.8.30 లక్షల కోట్ల చెల్లింపులు చేస్తున్నది. అంటే అప్పులు తీసుకొని కేంద్ర ప్రభుత్వం దుబారా చేస్తున్నదా? అప్పులు చేయడం తప్పా? ఇది తెలివైన ఆర్థికవ్యవస్థ. గత 25, 30 ఏండ్ల క్రితం చైనాలో గ్రోత్ రేటు తక్కువగా ఉండేది. ఇప్పుడు అక్కడ అనూహ్యంగా పెరుగుతున్నది. ఆర్థిక విధానాలలో స్వేచ్ఛ ఎలా ఉండాలి? అనే అలోచన లేదు. దేశ ఆర్థిక విధానంలో 71 సంవత్సరాలుగా దారుణ వైఫల్యం చెందారు' అని ఆయన అన్నారు.

కష్టపడితేనే కరంటు వచ్చింది

'రాష్ట్రానికి 24 గంటల కరంటు ఎలా వచ్చింది? ఇదేమైనా తమాషానా? ఎంతో కష్టపడ్డాం. అధికారుల కష్టం ఎంతో దాగి ఉన్నది. మాటలు చెప్తే కాదు. కేంద్రం జీడీపీలో అప్పులు 49.5 శాతంగా ఉన్నాయి. కేంద్రం రూ.82.50 లక్షల కోట్ల అప్పుల్లో ఉంది. కాని తెలంగాణ కేవలం 21% అప్పులు చేసింది. కేంద్ర ప్రభుత్వం, ఆర్‌బీఐ నిబంధనల ప్రకారమే అప్పులు చేస్తున్నాం. రాష్ట్రానికి అప్పులు చేసే అవకాశం కూడా ఉన్నది. అంతేకాదు అప్పులను ఎప్పటికప్పుడు చెల్లించడంలో క్రమశిక్షణ పాటిస్తున్నాం. తెలంగాణ ఆర్థిక పురోభివృద్ధిని సాధిస్తున్నది. అవినీతి జరుగడం లేదు. అందుకే తెలంగాణ రాష్ట్రానికి అప్పులు ఇస్తున్నారు' అని సీఎం చెప్పారు. 'రాష్ట్ర బడ్జెట్‌పై ఒక పద్ధతి ప్రకారం మాట్లాడుకుందాం. బడ్జెట్‌లో ఏమైనా తేడాలుంటే నిర్మాణాత్మకంగా విమర్శ చేస్తే స్వాగతిస్తాం. పరిపాలన గురించి, అందులో ఉండే ఇబ్బందుల గురించి, దేశ భవిష్యత్తు గురించి చర్చించుకుందాం. ఆర్థికంగా బలంగా ఉన్నందుకు బాండ్లు ఇవ్వడానికి బ్యాంకులు ముందుకు వస్తున్నాయి. అమెరికా దేశం కూడా అప్పుల్లో ఉంది. అక్కడ 14 ట్రిలియన్ డాలర్ల జీడీపీ ఉంటే..అంత కంటే ఎక్కువ అప్పులున్నాయి. జపాన్ దేశం అప్పులు ఆ దేశ జీడీపీకంటే 250% ఎక్కువగా ఉన్నాయి. అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాలను కూడా కేంద్రం నిర్బంధం చేస్తున్నది. నిధులు ఇవ్వడం లేదు. ప్రోత్సాహం ఉండటం లేదు. కావాల్సిన అనుమతులు ఇవ్వడం లేదు. మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ పథకాల కోసం రూ.24,000 కోట్ల నిధులు అడిగితే రూ.24 కూడా ఇవ్వలేదు. నీతి ఆయోగ్ సూచనల మేరకు రాష్ట్రానికి రావాల్సిన నిధులను కూడా కేంద్రం మంజూరు చేయడం లేదు. నిధుల కోసం కేంద్రం చుట్టూ అనేకసార్లు చక్కర్లు కొట్టినా పట్టించుకోవడం లేదు. సభ్యులకు విజ్ఞప్తి చేస్తున్నాను. ప్రతిపక్షాలు బడ్జెట్‌పై అవగాహన పెంచుకోవాలి. దీనిపై ఉన్నతమైన రీతిలో చర్చ జరుగాలి' అని సీఎం కేసీఆర్ పేర్కొన్నారు.

అభివృద్ధి కార్యక్రమాల కోసమే అప్పులు చేస్తున్నాం

'అప్పులు చేయని బీజేపీ రాష్ట్రాలు ఉన్నాయా? అప్పు చేసి పప్పుకూడు తినడం లేదు. అభివృద్ధి కోసం ఖర్చు పెడుతున్నాం. ఆస్తులు పెంచుతున్నాం. దుబారా చేయడం లేదు. కేంద్రం నుంచి నిధులు తెచ్చుకోవడం రాష్ట్రాల హక్కు. కేంద్ర ప్రాయోజిత పథకాలకు కేంద్రం నిధులు మంజూరుచేయాలి. అవును క్యాపిటల్ ఎక్స్‌పెండిచర్‌పై చర్చ జరుగాలి. అప్పుడే అధికారులు కూడా భయంతో పనిచేస్తారు. మనల్ని మనం విమర్శించుకోవద్దు. దేశంలో ప్రకృతి ప్రసాదించిన నీరు 70 వేల టీఎంసీలు ఉంది. దేశంలో ఉన్న 40 కోట్ల ఎకరాలకు నీరు అందించవచ్చు. అంటే ప్రతి ఎకరానికి నీరు అందించవచ్చు. 14 ఏండ్లుగా బ్రిజేశ్‌కుమార్ ట్రిబ్యునల్ పనిచేస్తూనే ఉంది. ఇప్పటివరకు నిర్ణయం జరుగకపోతే అభివృద్ధి ఎలా జరుగుతుంది? 71 సంవత్సరాల స్వతంత్ర భారతదేశంలో నదుల నీరు అందుబాటులో ఉన్నప్పటికీ మంచినీరు, సాగునీరు ఇవ్వలేకపోయారు. ఇప్పటికైనా మేల్కోండి. బుద్ధి తెచ్చుకోండి. నార్త్ చైనాలో 2,140 కిలోమీటర్ల నుంచి 1,600 టీఎంసీల నీరు తీసుకెళ్లి ఇస్తున్నారు. అక్కడ ఎంతో అభివృద్ధి జరుగుతున్నది. ఇక్కడ ఎంత దురదృష్టకరం. కాళేశ్వరం ప్రాజెక్టుకు ఎన్నో క్లియరెన్స్‌లను తీసుకువచ్చాం. ఈ ఏడాదిలో జూలై, ఆగస్టు వరకు రాష్ట్రంలో పుష్కలంగా జలం అందుబాటులోకి వస్తుంది' అని సీఎం కేసీఆర్ వివరించారు.

రైతులు అడుగకున్నా సాయం అందిస్తున్నాం

'ప్రపంచంలోఎక్కడా లేని పథకాలను రాష్ట్రంలో అమలుపరుస్తున్నాం. రెతులకు పెట్టుబడి సాయం దేశంలో ఎక్కడా అందించడం లేదు. అది తెలంగాణ రాష్ట్రంలో అమలుపరుస్తున్నాం. ప్రతి ఎకరానికి రూ.8,000 పెట్టుబడి సాయం అందిస్తున్నాం. పెట్టుబడి సాయం కావాలని రైతులు అడుగలేదు. అయినా ప్రభుత్వమే ఇందుకు శ్రీకారం చుట్టింది. రైతులను ఆదుకునే ప్రయత్నం కొనసాగుతుంది' అని సీఎం కేసీఆర్ చెప్పారు. ప్రతిపక్షాలు ఇప్పటికైనా నిర్మాణాత్మకంగా ఆలోచించాలని అన్నారు. 'హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ రంగం అభివృద్ధి చెందుతున్నది. ఈ రంగానికి సంబంధించి అనేక ప్రకటనలు వస్తున్నాయి. దీంతో రియల్ ఎస్టేట్ రంగంలో సానుకూల వృద్ధి చోటుచేసుకుంటున్నది' అని సీఎం కేసీఆర్ తెలిపారు.

ముహూర్తం

సూర్యోదయం: 6.22 గంటలకు

సూర్యాస్తమయం: 6.24 గంటలకు

శ్రీవిళంబి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, చైత్రమాసం, శుక్లపక్షం పంచమి మధ్యాహ్నం 1.53 వరకు, తదుపరి షష్ఠి, నక్షత్రం: కృత్తిక సాయంత్రం 6.05 వరకు తదుపరి రోహిణి, అమృతఘడియలు: మధ్యాహ్నం 3.47 నుంచి సాయంత్రం 5.23 వరకు, రాహుకాలం: మధ్యాహ్నం 1.53 నుంచి 3.23 వరకు, దుర్ముహూర్తం: మధ్యాహ్నం 3.11 నుంచి సాయంత్రం 4.47 వరకు, వర్జ్యం: ఉదయం 6.34 నుంచి 8.10 వరకు.

లోకం పోకడ



ఇంకానయం హాల్ టికెట్ నంబర్‌కు బదులు ఆధార్ నంబర్ వేయమన్లేదు!

6,609 కంపెనీలు.. 1.24 లక్షల కోట్ల పెట్టుబడులు

మొదటిపేజీ తరువాయి...



పరిశ్రమలశాఖ కార్యకలాపాలపై బుధవారం సచివాలయంలో అధికారులతో సమీక్షిస్తున్న సీఎస్ ఎస్కే జోషి. చిత్రంలో జయేశ్‌రంజన్, అహ్మద్ నదీమ్ తదితరులు కూడా ఉన్నారు.

నిర్వహించారు. ఫుడ్ ప్రాసెసింగ్, రిటైల్ ట్రేడ్ పాలసీ, ఎలక్ట్రికల్ వెహికిల్ పాలసీలపై త్వరలో ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్టు సీఎస్ తెలిపారు. ఈ మూడు పాలసీలపై సంబంధిత శాఖల అభిప్రాయాలను తీసుకున్నామని, వెంటనే ముసాయిదా రూపొందించి సమావేశం ఏర్పాటుచేస్తామని అధికారులు సీఎస్‌కు తెలిపారు. అనుమతులు ఇచ్చాక ఆరునెలల్లోగా ప్రారంభం కాని యూనిట్లలో కారణాలపై విశ్లేషణ చేయాలని సూచించారు. పరిశ్రమలకు అనుమతులతోపాటు, వివిధ శాఖలు తమశాఖ పరిధిలో అంశాల అమలుకు నిర్ణీత సమయాన్ని ఖరారుచేయాలని అన్నారు. సులభ వాణిజ్య విధానానికి సంబంధించి 372 సంస్కరణలు ఉండగా 362 ఆమోదం పొందాయని, నాలుగు అంశాలు రాష్ట్రానికి వర్తించనివి ఉండగా, మరో ఆరు వివిధశాఖల్లో పెండింగ్‌లో ఉన్నాయని అధికారులు వివరించారు. ఈవోడీబీ అమలుకు ఇప్పటి వరకు ఒక చట్టాన్ని సవరించామని, 17 జీవోలు విడుదల చేయగా, 42 సర్క్యులర్లు జారీ చేశామని చెప్పారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి టీ-ఐడియా పథకం ద్వారా 10,195 యూనిట్లకు రూ.1,658 కోట్లు, ఎస్‌సీపీ ద్వారా 8,994 యూనిట్లకు రూ. 542కోట్లు, టీఎస్పీ ద్వారా రూ7,976 యూనిట్లకు రూ.363 కోట్ల ప్రోత్సాహకాలు అందించినట్టు అధికారులు తెలిపారు. టీఎస్‌ఐఐసీకి సంబంధించి 23 మెగా ప్రాజెక్టులపై సీఎస్ సమీక్షించారు. సమావేశంలో ఐటీ, పరిశ్రమలశాఖ ముఖ్యకార్యదర్శి జయేశ్‌రంజన్, పరిశ్రమలశాఖ కమిషనర్ అహ్మద్ నదీమ్, టీఎస్‌ఐఐసీ ఎండీ ఈవీ నర్సింహారెడ్డి, పరిశ్రమలశాఖ సంయుక్త సంచాలకుడు సురేశ్, జహీరాబాద్ నిమ్జ్ సీఈవో మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

లెక్కాపత్రం లేని కృష్ణాబోర్డు ఉత్తర్వులు!

- గత ఉత్తర్వుల సోయిలేని బోర్డు అధికారులు
- నీటి వినియోగం లెక్కించకుండానే పంపిణీ
- తాజా కేటాయింపుల్ని వ్యతిరేకిస్తున్న తెలంగాణ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: సాధారణంగా మనం మాట్లాడుకునేటప్పుడు ముందు ఏమన్నాం.. ఆ తర్వాత ఏమంటున్నాం.. అనే సోయి ఉంటది. మొదట మాట్లాడినదానికి విరుద్ధంగా తర్వాత మాట్లాడలేం కదా! అలాంటిది.. ఘనత వహించిన కృష్ణా నదీ యాజమాన్య బోర్డు అధికారులు మాత్రం తొలుత ఇచ్చిన ఉత్తర్వులను తామే బేఖాతరు చేసి తదుపరి ఉత్తర్వులు ఇచ్చిన వైనం తాజాగా చర్చాంశమైంది. ఏపీ ఒత్తిళ్లకు తలొగ్గి.. రాష్ట్రాల నీటివినియోగాన్ని పరిగణనలోకి తీసుకోకుండానే రెండురోజుల కిందట చేసిన కేటాయింపులు బోర్డు ప్రతిష్ఠను ప్రశ్నార్థకంగా మార్చాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. తెలంగాణ నీటిపారుదలశాఖ సైతం తాజా కేటాయింపులపై తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేస్తూ లేఖ రాసేందుకు సిద్ధమవుతున్నట్టు తెలిసింది. ముఖ్యంగా సీఎస్ ఎస్కే జోషి రాసిన లేఖలోని అంశాలను కచ్చితంగా అమలు చేయాలని అందులో పునరుద్ఘాటించనున్నారు.

నిన్నటి పంపకం నేడు మరిస్తే ఎలా?

కృష్ణాజలాల పంపిణీలో భాగంగా శ్రీశైలం, సాగర్ జలాశయాల్లో ఎండీడీఎల్ ఎగువన ఉన్న నిల్వల్ని ఈనెల ఆరున కృష్ణాబోర్డు రెండు రాష్ట్రాలకు పంచింది. తెలంగాణకు 24.467 టీఎంసీలు, ఏపీకి 9.3 టీఎంసీలు కేటాయించింది. మంగళవారంనాటికి ఏపీ తన వాటా కంటే అదనంగా 1.35 టీఎంసీలను వాడుకోగా.. తెలంగాణ తన వాటాలో ఇంకా 7.26 టీఎంసీలు వాడుకోవాల్సి ఉన్నది. ఈ నేపథ్యంలో బోర్డు తదుపరి ఉత్తర్వులు ఇచ్చే సమయంలో గత కేటాయింపుల్లో ఎవరెంత వాడుకున్నారు? అనే కనీస లెక్కల్ని పరిగణనలోకి తీసుకోవాలి. కానీ రెండు రోజుల కిందట బోర్డు ఇచ్చిన తాజా నీటివిడుదల ఉత్తర్వుల్లో ఈ కనీస సోయిని మరిచారు. గతంగతః అన్నట్టుగా.. ఏపీ ఎక్కువ వాడుకున్న నీటిని లెక్కల్లోకి తీసుకోలేదు. చివరకు తెలంగాణకు ఇంకా మిగిలి ఉన్న వాటానూ పరిగణనలోకి తీసుకోలేదు. అన్నింటినీ కలిపి.. తెలంగాణకు మిగిలి ఉన్న గతవాటా నీటిలోనూ ఎక్కువ వాడుకున్న ఏపీకి భాగస్వామ్యం కల్పించడమంటే అసలు బోర్డు అధికారులు రికార్డులు నిర్వహిస్తున్నారా? లేక తూతూ మంత్రంగా నోటికొచ్చినట్లుగా ఉత్తర్వులను జారీచేస్తున్నారా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

సవరించి ఉత్తర్వులు ఇవ్వండి

బోర్డుచేసిన తప్పిదాలను గుర్తుచేస్తూ లేఖ రాసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమవుతున్నట్లు తెలిసింది. ముఖ్యంగా అందులో నాగార్జునసాగర్ జలాశయంలో మే 31 వరకు కచ్చితంగా 510 అడుగులు నిర్వహించాలన్న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి లేఖ సారాంశాన్ని మరోసారి గుర్తు చేయనున్నట్టు సమాచారం. తాజా ఉత్తర్వుల్లో.. తెలంగాణకు 17 టీఎంసీలు, ఏపీకి 16 టీఎంసీలు కేటాయించారు. ఈ లెక్కన మే నెలాఖరు వరకు సాగర్‌లో 510 అడుగులు నిర్వహించడం కుదురదని, పైగా గత ఉత్తర్వుల ప్రకారం ఏపీ 1.35 టీఎంసీలు ఎక్కువ వాడుకున్నందున ఏపీ కేటాయింపుల్ని సవరించాలని సూచించనున్నది అధికారవర్గాలు తెలిపాయి.

ఈజేహెచ్‌ఎస్, ఆరోగ్యశ్రీ సీఈవోగా పద్మ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఆరోగ్యశ్రీ, ఈజేహెచ్‌ఎస్ సీఈవోగా కే పద్మను ప్రభుత్వం నియమించింది. ఆరోగ్యశ్రీ సీఈవో మనోహర్ స్థానంలో ఆమెను సీఈవోగా నియమిస్తూనే ఉద్యోగులు, జర్నలిస్టులు, పెన్షనర్ల హెల్త్‌స్కీం సీఈవోగా పూర్తిస్థాయి అదనపు బాధ్యతలు నిర్వహించాలని సూచిస్తూ రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శాంతికుమారి బుధవారం ఉత్తర్వులు జారీచేశారు.



బుధవారం టీఆర్‌ఎస్‌ఎల్పీ కార్యాలయంలో నిర్వహించిన మాక్‌పోలింగ్‌లో పాల్గొన్న ఎమ్మెల్యేలు శ్రీనివాస్‌గౌడ్, గాదరి కిశోర్, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి. చిత్రంలో టీఆర్‌ఎస్ రాజ్యసభ అభ్యర్థి జోగినిపల్లి సంతోష్‌కుమార్ ఉన్నారు.

టీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలకు మాక్ పోలింగ్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాజ్యసభ ఎన్నికల్లో భాగంగా టీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలకు రెండోరోజు బుధవారం టీఆర్‌ఎస్‌ఎల్పీ కార్యాలయంలో మాక్‌పోలింగ్ నిర్వహించారు. ఈ మాక్‌పోలింగ్‌లో టీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలతోపాటు ముగ్గురు టీఆర్‌ఎస్ రాజ్యసభ అభ్యర్థులు జోగినిపల్లి సంతోష్‌కుమార్, బండ ప్రకాశ్, బడుగుల లింగయ్యయాదవ్ పాల్గొన్నారు. మాక్‌పోలింగ్‌కు ఎంఐఎం సభ్యులు కూడా హాజరయ్యారు. గురువారం తెలంగాణభవన్‌లో మరోసారి టీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలకు మాక్‌పోలింగ్ నిర్వహించాలని నిర్ణయించారు.

వానకాలం పంటల బీమా టెండర్లు ఖరారు

మూడు కంపెనీలను ఎంపికచేసిన ప్రభుత్వం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: వచ్చే వానకాలం సీజన్‌కు సంబంధించి ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన, వాతావరణ ఆధారిత పంటల బీమా పథకం అమలుకు మూడు బీమా కంపెనీలను వ్యవసాయశాఖ ఎంపిక చేసింది. ఇం దులో నేషనల్ ఇన్సూరెన్స్ కంపెనీ (ఎన్‌ఐసీ), వ్యవసాయ బీమా కంపెనీ (ఏఐసీ), టాటా బీమా కంపెనీలు ఉన్నాయి. మొత్తం 13 బీమా కంపెనీలు బిడ్డింగ్‌లో పాల్గొనగా.. టెండర్లు తక్కువ (ఎల్1) ప్రీమియం రేట్లను కోట్‌చేసిన మూడు కంపెనీలను ఎంపికచేశారు. గత ఏడాదితో పోలిస్తే ఈసారి ప్రీమియం రేటు కాస్త పెరిగినట్లు సమాచారం. పత్తి, వరికి క్లెయిమ్స్ అధిక మొత్తంలో చెల్లిస్తున్నందున ఈ పంటలకు ఎక్కువ ప్రీమియం రేటును కంపెనీలు కోట్ చేసినట్లు తెలిసింది. అయితే ప్రభుత్వం వీటిని అధికారికంగా ప్రకటించలేదు. ఏటా మే, జూన్‌లో పంటల బీమా నోటిఫికేషన్ విడుదల చేస్తారు. కేంద్ర ప్రభు త్వ ఆదేశాల మేరకు ఎక్కువ మంది రైతులను బీమా పరిధిలోకి తీసుకొచ్చేందుకు ఈసారి ముందస్తుగానే వ్యవసాయశాఖ ప్రక్రియను ప్రారంభించింది. రాష్ట్రాన్ని ఆరు క్లస్టర్లుగా విభజించి పంటల బీమా అమలు చేస్తున్నారు. క్లస్టర్-1లో ఆదిలాబాద్, మంచిర్యాల, కుమ్రంభీం, జయశంకర్ భూపాలపల్లి, సిద్దిపేట జిల్లాలు ఉన్నాయి. క్లస్టర్-2లో నిర్మల్, నిజామాబాద్, కామారెడ్డి, యాదాద్రి-భువనగిరి, రంగారెడ్డి జిల్లాలు, క్లస్టర్-3లో పెద్దపల్లి, కరీంనగర్, జగిత్యాల, జనగామ, క్లస్టర్-4లో ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, సంగారెడ్డి, మెదక్ జిల్లాలు, క్లస్టర్-5లో భద్రాద్రి, వరంగల్(అర్బన్), వరంగల్ (రూరల్), వనపర్తి జిల్లాలు, క్లస్టర్-6లో మేడ్చల్, మహబూబ్‌నగర్, జోగుళాంబ గద్వాల, వికారాబాద్, మహబూబాబాద్ జిల్లాలున్నాయి. వీటిలో ఒకటి, రెండు, ఆరు క్లస్టర్లలో పంటల బీమా అమలును ఎన్‌ఐసీ దక్కించుకున్నది. నాలుగు, ఐదు క్లస్టర్లలో ఏఐసీ, మూడో పరిధిలో టాటా కంపెనీ పంటల బీమా అమలు చేయనున్నది. బీమా కంపెనీలు ప్రీమియం పెంచడం వల్ల రైతులపై ఎటువంటి ప్రభావం లేకున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఆర్థికభారం పడుతుంది. వానకాలం ఆహార ధాన్యాల పంటలకు రైతులు రెండు శాతం ప్రీమియాన్ని చెల్లించాలి. పత్తి, మిర్చి సహా ఇతర వాణిజ్య, వాతావరణ ఆధారిత పంటలకు 5 శాతం ప్రీమియం రైతులు చెల్లించాలి. అయితే జిల్లాలను, అక్కడి వాతావరణ పరిస్థితుల ఆధారంగా ప్రీమియం రేటు మారుతుందని వ్యవసాయశాఖ వర్గాలు వెల్లడించాయి. ఈ రెండు పథకాల్లో బీమా కంపెనీలు కోట్ చేసే అదనపు సొమ్మును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భరించాల్సి ఉంటుంది. రాష్ట్రంలో 2017 వానకాలంలో 8.60 లక్షల మంది రైతులు, యాసంగిలో 1.60 లక్షల మంది రైతులు పంటల బీమా కింద నమోదైనట్లు అధికారుల ద్వారా తెలిసింది. ఈసారి సంఖ్య మరింత పెరిగే అవకాశాలున్నాయి.

ప్రభుత్వ కార్యక్రమాలకు జూబ్లీహాల్

- అధికారులకు సీఎం కేసీఆర్ సూచన
- నిజాం నవాబు అద్భుతంగా నిర్మించారు
- మండలి వద్ద కేసీఆర్‌కు స్వాగతం పలికిన డిప్యూటీ సీఎం కడియం, ఎమ్మెల్సీలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

పబ్లిక్‌గార్డెన్‌లోని జూబ్లీహాల్‌ను ప్రభుత్వ కార్యక్రమాలు, ప్రభుత్వ విందుల ఆతిథ్యానికి వేదికగా ఉపయోగించాలని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు.. అసెంబ్లీ, ఇతర ప్రభుత్వశాఖల అధికారులకు సూచించారు. బుధవారం శాసనమండలి సమావేశంలో పాల్గొన్న సీఎం కేసీఆర్ తిరిగి వెళుతున్నప్పుడు జూబ్లీహాల్ సెంట్రల్ హాల్, పాత కౌన్సిల్ ప్రాంగణంలోని చాంబర్లు, చైర్మన్, సీఎం చాంబర్లు, జూబ్లీహాల్‌లోని వివిధ ప్రాంతాలను మండలి సభ్యులతో కలిసి పరిశీలించారు. అసెంబ్లీ కార్యదర్శి డాక్టర్ వీ నరసింహాచార్యులు కౌన్సిల్‌లోని హాళ్లు, చాంబర్ల గురించి సీఎంకు వివరించారు. జూబ్లీహాల్‌ను నిజాం నవాబు అద్భుతంగా నిర్మించారని సీఎం కేసీఆర్ చెప్పారు. ఆ నిర్మాణాన్ని చెక్కుచెదురకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత మనపై ఉన్నదన్నారు. జూబ్లీహాల్‌కు మరమ్మతులు చేయాలని సూచించారు. తెలంగాణ కౌన్సిల్ సమావేశాలు జరుగుతున్న భవనాన్ని అవసరాల మేర అభివృద్ధి చేయాలని అధికారులకు సూచించారు. బడ్జెట్ సమావేశాల అనంతరం సీఎం సూచనల ప్రకారం పనులు చేపడుతామని అధికారులు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ శాసన మండలి చైర్మన్ చక్రపాణి ఉపయోగించిన చాంబర్‌ను సీఎం కేసీఆర్‌కు కేటాయించనున్నారు. మండలి వద్ద సీఎం కేసీఆర్‌కు డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి, మండలిలో ప్రభుత్వ చీఫ్‌విప్ పాతూరి సుధాకర్‌రెడ్డి, ప్రభుత్వ విప్‌లు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, బోడకుంటి వెంకటేశ్వర్లు, ఎమ్మెల్సీలు మహ్మద్ సలీమ్, ఫారుఖ్ హుస్సేన్, బాలసాని లక్ష్మీనారాయణ, శంభీపూర్‌రాజు తదితరులు స్వాగతం పలికారు.



బుధవారం శాసనమండలికి వచ్చిన ముఖ్యమంత్రి కేసీఆర్‌కు స్వాగతం పలుకుతున్న ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి, విప్‌లు బోడకుంటి వెంకటేశ్వర్లు, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీలు మహ్మద్ సలీం, ఫారుఖ్ హుస్సేన్, శంభీపూర్ రాజు కూడా ఉన్నారు.

ఉద్యోగుల సహకారంతోనే రాష్ట్రాభివృద్ధి

- నిజామాబాద్ ఎంపీ కల్వకుంట్ల కవిత
- ఇందూరులో రాష్ట్రస్థాయి టీఎన్జీవోస్ క్రీడలు ప్రారంభం



ఎంపీ కవితను సన్మానిస్తున్న టీఎన్జీవో అధ్యక్షుడు కారం రవీందర్‌రెడ్డి. చిత్రంలో బేవరేజెస్ కార్పొరేషన్ చైర్మన్ దేవీప్రసాద్ ఉన్నారు.

నిజామాబాద్ స్పోర్ట్స్: ప్రభుత్వ ఉద్యోగుల సహకారంతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని నిజామాబాద్ ఎంపీ కల్వకుంట్ల కవిత అన్నారు. నిజామాబాద్ జిల్లా టీఎన్జీవోస్ ఆధ్వర్యంలో ఇందూరులో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి క్రీడలను బుధవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ పాలకులు రూపొందించిన చట్టాలు, పాలసీలను సమర్థవంతంగా అమలుచేసేది ప్రభుత్వ ఉద్యోగులేనని తెలిపారు. టీఆర్‌ఎస్ ప్రభుత్వం ఉద్యోగులకు ఫ్రెండ్లీ గవర్నమెంట్ అని అన్నారు. పాలనను ప్రజలకు చేరువచేసేందుకే 31 కొత్త జిల్లాలను ఏర్పాటు చేసుకున్నామని, ఈ సందర్భంగా కొన్ని సమస్యలు ఉత్పన్నమైనప్పటికీ ఉద్యోగులందరూ ప్రభుత్వానికి సహకరిస్తూ ముందుకు సాగడం అభినందనీయన్నారు. ఇందుకు ప్రభుత్వ ఉద్యోగులందరికీ టీఆర్‌ఎస్ సర్కారు రుణపడి ఉంటుందని తెలిపారు. భూరికార్డుల ప్రక్షాళన విజయవంతంగా పూర్తిచేసి రెవెన్యూశాఖ సత్తాచాటిందని, రైతులకు 24 గంటల కరెంట్‌ను అందించడం విద్యుత్ ఉద్యోగులతోనే సాధ్యమైందని చెప్పారు. ఉద్యోగులకు కొత్త పీఆర్సీ ఏర్పాటుతోపాటు అవసరమైతే ఐఆర్ సైతం ఇస్తామని సీఎం అసెంబ్లీలో ప్రకటించారని ఎంపీ కవిత ఈ సందర్భంగా గుర్తుచేశారు. సీపీఎస్‌పై ప్రభుత్వ విధానాన్ని అసెంబ్లీ సాక్షిగా సీఎం కేసీఆర్ కుండబద్దలు కొట్టినట్లుగా చెప్పారన్నారు. రెవెన్యూ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో హెల్పింగ్ హ్యాండ్స్ స్వచ్ఛంద సంస్థను స్థాపించి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు భోజన వసతిని కల్పించడంతోపాటు, సాయంత్రం వేళలో పేదలకు అల్పాహారాన్ని అందించడం అభినందనీయని చెప్పారు. నిజామాబాద్ టీఎన్జీవోస్ అధ్యక్షుడు అలుక కిషన్ నాయకత్వంలో మొట్టమొదటిసారి రాష్ట్రస్థాయి క్రీడలను నిర్వహించడం సంతోషకరమన్నారు. అనంతరం మెదక్-నిజామాబాద్ మధ్య ప్రారంభోత్సవ కబడ్డీ మ్యాచ్‌ను రాష్ట్ర బేవరేజస్ కార్పొరేషన్ చైర్మన్ దేవీ ప్రసాద్ ప్రారంభించారు. కార్యక్రమంలో టీఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు కారం రవీందర్‌రెడ్డి, కలెక్టర్ రామ్మోహన్ రావు, నగర మేయర్ ఆకుల సుజాత, జేసీ రవీందర్‌రెడ్డి, ఆర్డీవో వినోద్‌కుమార్, నెట్‌క్యాప్ చైర్మన్ ఎస్ఏ అలీం, టీఎన్జీవోస్ ప్రధానకార్యదర్శి రాజేందర్, రెచల్, ఐసీడీఎస్ పీడీ స్రవంతి, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

ఉద్యోగుల సంక్షేమ నిధికి రూ.1.28 కోట్లు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్ర ఉద్యోగుల సంక్షేమ నిధికి రూ. 1.28 కోట్ల మొత్తాన్ని జమచేస్తూ ఆర్థికశాఖ ఉత్తర్వులను జారీ చేసింది. ఉద్యోగుల కంట్రిబ్యూషన్ ద్వారా సేకరించిన మొత్తాన్ని సంక్షేమ నిధికి జమచేసినట్లు అధికారులు వెల్లడించారు. ఈ సంక్షేమ నిధిని ఉద్యోగుల రుణాలు, ఇతర సంక్షేమానికి వెచ్చిస్తామని అధికారులు తెలిపారు.

కాళోజీ వర్సిటీలో ప్రవేశానికి దరఖాస్తులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: వైద్యకళాశాలల్లో పీజీ ప్రవేశం కోసం నీట్‌లో అర్హత సాధించిన అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్లో దరఖాస్తుల స్వీకరణకు కాళోజీ హెల్త్ యూనివర్సిటీ నోటిఫికేషన్ జారీచేసింది. ఈ నెల 23 నుంచి 28 వరకు దరఖాస్తులను స్వీకరించనున్నారు. అభ్యర్థులు www.knruhs.in వెబ్‌సైట్లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

KALOJI NARAYANA RAO UNIVERSITY OF HEALTH SCIENCES, TELANGANA

NOTIFICATION FOR ONLINE APPLICATIONS FOR ADMISSION INTO POST GRADUATE MEDICAL COURSES-2018-19 UNDER KNRUHS & NIMS

Application forms online are invited from candidates qualified in NEET - PG - 2018 for admission into PG Medical Courses - 2018-19 for competent authority quota seats in colleges affiliated to KNR UHS, Warangal & NIMS Hyderabad.

For detailed Notification regarding cut-off scores, eligibility, other instructions and Prospectus refer to KNRUHS website : www.knruhs.in Eligible Candidates can apply on-line from 23-03-2018 to 28-03-2018 on http://tspgmed.tsche.in

Dated: 21-03-2018 **REGISTRAR**

దక్షిణ మధ్య రైల్వే

Follow us on @SCRailwayIndia ద.మ. రైల్వే యొక్క టెండరు ప్రకటనల వివరాలను మా వెబ్‌సైట్ www.scr.indianrailways.gov.inలో చూడవచ్చును.

కాంట్రాక్ట్ ప్రాతిపదికపై రైల్ నిలయం స్టాఫ్ క్యాంటీన్, సికింద్రాబాద్‌లో కుక్ కేటగిరీ కొరకు వాక్ – ఇన్–ఇంటర్వ్యూ

PUB/0361

రైల్ నిలయం స్టాఫ్ క్యాంటీన్, సికింద్రాబాద్‌లో కాంట్రాక్ట్ ప్రాతిపదికపై దిగువ ఉద్యోగాల కొరకు వాక్ –ఇన్–ఇంటర్వ్యూ.

క్ర.సం.	కేటగిరీ	ఖాళీల సంఖ్య	ఇంటర్వ్యూ తేది & ప్రదేశం	పనిచేయు ప్రదేశం	కాంట్రాక్ట్ కాలం
1	కుక్స్	05 (ఐదు)	27-03-2018న ప్రిన్సిపల్ చీఫ్ పర్సనల్ ఆఫీసర్ (PCPO) వారి కార్యాలయం, 4వ అంతస్తు, రైల్ నిలయం, సికింద్రాబాద్ వద్ద.	రైల్ నిలయం స్టాఫ్ క్యాంటీన్, సికింద్రాబాద్	ఒక సంవత్సరం

విద్యార్హత, వయస్సు, అనుభవం, జీతం మరియు ఇతర నియమ, నిబంధనల గురించి మరిన్ని వివరాల కొరకు మరియు దరఖాస్తు నమూనా కొరకు దిగువ వెబ్‌సైట్‌ని దర్శించండి :

www.scr.indianrailways.gov.in — about us — Departments — Personnel

ప్రిన్సిపల్ చీఫ్ పర్సనల్ ఆఫీసర్/సికింద్రాబాద్

A0512

OSMANIA UNIVERSITY, HYDERABAD
NOTIFICATION
TSLAWCET /TSPGLCET 2018
(Conducted under the aegis of TSCHE, Hyderabad)

TS Law Common Entrance Test (TSLAWCET- 2018) for admission into 3 / 5 years law courses (LL.B) and TS PG Law Common Entrance Test (TSPGLCET-2018) for admission into LL.M courses offered by state Universities in Telangana State including their affiliated colleges for the academic year 2018-19 will be conducted by Osmania University, Hyderabad, T.S. Eligible candidates may apply through online mode only from **25.03.2018 to 25.04.2018** (without late fee), and may log onto **www.lawcet.tsche.ac.in/www.pglcet.tsche.ac.in** for further information.

Test	Date and Time	Registration Fee
TSLAWCET - 2018	25.05.2018 (11.00 AM – 12.30 PM)	Rs. 800/- For SC/STs Rs. 500/-
TSPGLAWCET - 2018	25.05.2018 (11.00 AM – 12.30 PM)	Rs. 1000/- For SC/STs Rs. 600/-

The Registration fee may be paid at **TS/AP Online Centres in T.S. and A.P.**, and also through payment gateway (Credit Card/Debit Card & Net Banking).

Warangal, Date: 22-03-2018 — Convener, TSLAWCET/TSPGLCET-2018

Government of India : Department of Posts
Ministry of Communications &IT
% Chief postmaster General Telangana Circle, Hyderabad-1

NO: RE-II/PM&MG/DR/2016-17 dtd at Hyderabad -1 the 22-3-2018

NOTIFICATION

Applications are invited from the eligible applicants for filling up of following Postman/Mail Guard posts in the Pay scale of Rs 21700 in level 3 of pay matrix as per 7 the cpc + Admissible allowance for the vacancies of 2016-17 in Telangana Postal Circle.

S.No.	Name of the Post	code	Total number of vacancies						
			UR	SC	ST	OBC	Ex-ser man	PH	Total
1	Postman	PM	76	14	6	36	14	5	132
2	Mail Guard	MG	2	0	1	1	0	0	4

2. **Age Limit** : 18-27 Years for General Category (Un reserved applicants). The applicable age relaxation is provided to persons belonging to SC/ST/OBC/ Ex service men candidates as per the extant orders. The age limit will be as on 21-04-2018.
3. **Education qualification** : For Postman & Mail Guard Matriculation/ SSC from a recognized Board or University.
4. The aspiring candidates are requested to access the website www.telanganapostalcircle.in for all other full details like vacancies, eligibility criteria etc., The applications are to be submitted on line and the Registration for on line applications commences from 00.00 Hrs of **22-03-2018** and last date for Registration of applications on line is 23.59 Hrs of **21-04-2018.**

Sd/- Asst Director (Rectt)
% Chief Postmaster General,
TS Circle, Hyderabad-1



పత్రికల్లో వస్తున్న కథనాల ప్రకారం కేంబ్రిడ్జ్ అనలిటికా సీఈవో అలెగ్జాండర్ నిక్స్ అనేకమంది ప్రతిపక్ష నేతలను కలిశారు. కేంబ్రిడ్జ్ అనలిటికా ఫేస్‌బుక్ ఖాతాల ద్వారా ఓటర్ల అభిప్రాయాన్ని మార్చేందుకు ప్రయత్నిస్తున్నది. నా ప్రశ్న ఏమిటంటే ఇలాంటి అక్రమ చర్యల ద్వారా వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ గెలువాలని చూస్తున్నదా?

రవిశంకర్ ప్రసాద్, కేంద్రమంత్రి

కేవలం 15 మంది పారిశ్రామిక వేత్తలకు 2.5 లక్షల కోట్ల రుణాలను మోదీ ప్రభుత్వం మాఫీ చేసింది. కానీ కర్ణాటకలో కాంగ్రెస్ రైతులకు 8 వేల కోట్లు మాఫీ చేస్తే తప్పుబడుతున్నారు! ఇదెక్కడి నీతి? బీజేపీ ఇప్పటికైనా తమది సూట్ బూట్ సర్కార్ అని ఒప్పుకున్నది.

సిద్ధరామయ్య, కర్ణాటక ముఖ్యమంత్రి



చరిత్రలో నేడు



1861

అమెరికాలో మొదటి 'నర్సింగ్ స్కూల్' ప్రారంభం.

1903



కరువు కారణంగా ఎండిపోయిన నయాగరా జలపాతం.



1977

ప్రధాని పదవికి రాజీనామా చేసిన ఇందిరా గాంధీ.

థర్డ్ ఫ్రంట్ అంటే మూడో స్థానంలోని కూటమి అని అర్థం కాదు. బీజేపీ, కాంగ్రెసేతర రాజకీయ పక్షాలతో ఏర్పడే ఫెడరల్ ఫ్రంట్ అని తెలంగాణ సీఎం కేసీఆర్ రాజకీయార్థం చెప్పారు. ఇప్పటిదాకా దేశంలో ఎన్నికల అనంతరమే రాజకీయ కూటములు ఏర్పడి, అధికారాన్ని చేజిక్కించుకున్నాయి. కానీ ఎన్నికలకు ముందే రాజకీయ కూటములు ఏర్పడి నిలదొక్కుకున్న దాఖలాలు ఇప్పటిదాకా లేవు. కేసీఆర్, మమతా బెనర్జీ ప్రతిపాదిస్తున్న ఫెడరల్ ఫ్రంట్ ఏ మేరకు బలోపేతమవుతుందో కాలమే చెప్పాలి. ఇదే నిజమైతే దేశరాజకీయాల్లో కొత్త శకం ఆరంభమైనట్లే.

ది హిందూ

అవినీతి వ్యతిరేక ఉద్యమకారుడిగా, వాస్తవాలపై ఆధారపడిన ఆరోపణల విశ్వసనీయతతో ఆప్ నేత కేజ్రీవాల్ ఢిల్లీ ముఖ్యమంత్రిగా కొత్త శకానికి నాందిపలికారు. ఈ క్రమంలో ఆయన అనేక మందిపై చేసిన అవినీతి ఆరోపణలపై పరువునష్టం కేసులను ఎదుర్కోవాల్సి రావటంతో, వాటి నుంచి తప్పించుకోవటం కోసం క్షమాపణలతో రాజీ కుదుర్చుకుంటున్నారు. అకాలీదల్ నేత బిక్రంసింగ్ మజీతియా, నితిన్ గడ్కరీ, అఖిల్‌సిబల్‌పై చేసిన అవినీతి ఆరోపణలకు గాను కేజ్రీ క్షమాపణలు చెప్పడంతో పంజాబ్ ఆప్ నేతలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు.

ది టైమ్స్ ఆఫ్ ఇండియా

డేటా చౌర్యం!

భారతీయుల వ్యక్తిగత వివరాలను దొంగిలించినట్టయితే సహించబోమంటూ కేంద్ర ఐటీ, న్యాయశాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్ సోషల్ మీడియా సైట్ ఫేస్‌బుక్ స్థాపకుడిని హెచ్చరించడం సందర్భోచితంగా ఉన్నది. ప్రభుత్వం భావవ్యక్తీకరణ స్వేచ్ఛను గుర్తిస్తున్నదని, సోషల్ మీడియా వేదికపై స్వేచ్ఛగా అభిప్రాయాలు పంచుకోవాలనేదే తమ అభిమతమని అయితే అవాంఛనీయ విధానాల ద్వారా ఎన్నికల ప్రక్రియను ప్రభావితం చేయ ప్రయత్నిస్తే సహించబోమని ఆయన స్పష్టం చేశారు. అమెరికాలో, బ్రిటన్‌లో ప్రజాభిప్రాయాన్ని ప్రభావితం చేయడానికి సోషల్ మీడియా ఉపయోగపడిన తీరు ప్రజాస్వామ్య ప్రియులు ఉలిక్కిపడేలా చేసింది. 2016 అమెరికా అధ్యక్ష ఎన్నికల్లోనూ, ఇదేవిధంగా బ్రిటన్‌లో బ్రెగ్జిట్‌పై ప్రజాభిప్రాయ సేకరణ జరిగినప్పుడు కేంబ్రిడ్జి అనలిటికా అనే సంస్థ ప్రజాభిప్రాయాన్ని ప్రభావితం చేయడానికి సోషల్ మీడియాను ఉపయోగించుకున్నదనే ఆరోపణలు దుమారం రేపుతున్నాయి. దీంతో అమెరికాలోనూ, బ్రిటన్‌లోనూ ఈ సంస్థపై దర్యాప్తు సాగుతున్నది. ఈలోగా భారత్‌తోపాటు దక్షిణాసియా దేశాలలోనూ ఈ కేంబ్రిడ్జి అనలిటికా చాప కింద నీరులా ప్రవేశిస్తున్నదనే వార్తలు ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. మన దేశంలో 2019 ఎన్నికలలో సహకరిస్తామంటూ ఈ సంస్థ కాంగ్రెస్, బీజేపీ పార్టీల నాయకత్వాలతో చర్చలు జరుపుతున్నదని తాజా వార్తలను బట్టి తెలుస్తున్నది. అయితే దేశంలోని రాజకీయపక్షాలు కూడబలుక్కుని ఇటువంటి అనారోగ్యకర పోకడలను అడ్డుకునే విధానాన్ని చర్చించాలె. కానీ బాధ్యతాయుతంగా వ్యవహరించవలసిన బీజేపీ, కాంగ్రెస్ పరస్పరం బురద జల్లుకుంటున్నాయి. కేంబ్రిడ్జి అనలిటికాతో సంబంధాలు ఉన్నది మీకంటే మీకని విమర్శించుకుంటున్నాయి.

తాజా సాంకేతిక పరిజ్ఞానం మూలంగా ఒక వ్యక్తి ఇష్టాయిష్టాలు, ప్రయోజనాలు, స్థితిగతులు మొదలైనవన్నీ వారికి తెలువకుండానే, ఇతరుల చేతికి చేరే ప్రమాదం ఏర్పడ్డది. ఈ వివరాల ఆధారంగా వారిని ఏ విధంగా ఆకర్షించాలో వ్యాపార సంస్థలు ఎత్తుగడలను రూపొందించుకోవచ్చు. వినియోగదారులు తాము ఒక వ్యాపార వ్యూహంలో భాగంగా ప్రభావితం అవుతున్నామనేది గ్రహించలేరు. ఇది నైతికంగా సమర్థనీయం కాదు. అయితే వినియోగదారుల చిట్టాను సేకరించడం ద్వారా ప్రభుత్వాలు వ్యక్తుల హక్కులను హరించవచ్చుననీ, ప్రత్యర్థులను ఇబ్బంది పెట్టవచ్చునని ఎంతోకాలంగా ఆందోళన వ్యక్తమవుతున్నది. ఇది వ్యాపార సంస్థలు ఉపయోగించుకోవడం కన్నా ప్రమాదకరమైనది.

కేంబ్రిడ్జి అనలిటికా సంస్థ ఫేస్‌బుక్ ఆధారంగా వినియోగదారుల వ్యక్తిగత వివరాలను సేకరించి తమతో ఒప్పందం కుదుర్చుకున్న నాయకులకు మద్దతుగా ప్రచారం చేయడానికి ఉపయోగించుకున్నది. ఒక పరిశోధకుడు తన పరిశోధన కోసమనే కారణం చూపి ఈ వివరాలను సేకరించాడు. అంతిమంగా ఈ వివరాలు కేంబ్రిడ్జి అనలిటికా సంస్థతో ఒప్పందం కుదుర్చుకున్న నాయకుల కోసం ఉపయోగపడ్డాయి. ఈ వినియోగదారుల చిట్టా (డేటా) చౌర్యం సాగుతున్నదని తెలిసీ ఫేస్‌బుక్ సంస్థ చూడనట్టు వ్యవహరించింది. వ్యక్తిగత వివరాలను పెద్ద ఎత్తున సేకరించడం ద్వారా తాము రాజకీయాలను ప్రభావితం చేశామని కేంబ్రిడ్జి అనలిటికా సంస్థ సీఈవోగా పనిచేసిన వ్యక్తే స్వయంగా వెల్లడించడం గమనార్హం. ఎన్నికలను ప్రభావితం చేయడానికి కేంబ్రిడ్జి అనలిటికా అనుసరించిన విధానాలు దిగ్భ్రాంతికరంగా ఉన్నాయి. వ్యక్తిగత వివరాలను సేకరించడమే కాకుండా, ఆ విషయం పొక్కకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. ప్రత్యర్థుల ప్రతిష్ఠను దెబ్బతీయడానికి యువతులను ఎరగా వేశారు. దాదాపు ఐదు కోట్లమంది వివరాలను సేకరించారు. నలభైకి పైగా రాజకీయ పోటీలలో ఈ సంస్థ తలదూర్చిందనేది ఆ సంస్థ సీఈవోగా ఇటీవలి వరకు పనిచేసిన నిక్స్ స్వయంగా వెల్లడించాడు. ఈ నేపథ్యం లో వ్యక్తిగత వివరాల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలనేభావన బలపడుతున్నది. అయితే దీని ని అరికట్టడం కూడా అంత సులభం కాదు.

తాజా సాంకేతిక పరిజ్ఞానం మూలంగా ఒక వ్యక్తి ఇష్టాయిష్టాలు, ప్రయోజనాలు, స్థితిగతులు మొదలైనవన్నీ వారికి తెలువకుండానే, ఇతరుల చేతికి చేరే ప్రమాదం ఏర్పడ్డది. ఈ వివరాల ఆధారంగా వారిని ఏ విధంగా ఆకర్షించాలో వ్యాపార సంస్థలు ఎత్తుగడలను రూపొందించుకోవచ్చు. వినియోగదారులు తాము ఒక వ్యాపార వ్యూహంలో భాగంగా ప్రభావితం అవుతున్నామనేది గ్రహించలేరు. ఇది నైతికంగా సమర్థనీయం కాదు. అయితే వినియోగదారుల చిట్టాను సేకరించడం ద్వారా ప్రభుత్వాలు వ్యక్తుల హక్కులను హరించవచ్చుననీ, ప్రత్యర్థులను ఇబ్బంది పెట్టవచ్చునని ఎంతోకాలంగా ఆందోళన వ్యక్తమవుతున్నది. ఇది వ్యాపార సంస్థలు ఉపయోగించుకోవడం కన్నా ప్రమాదకరమైనది. అయితే ఈ వ్యక్తుల చిట్టాను రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకోవచ్చునని, రాజకీయపార్టీల గెలుపు ఓటములను ప్రభావితం చేయవచ్చునని తాజాగా వెల్లడైంది. ప్రజలను ఆయా వర్గాలుగా గుర్తించి, నిర్దిష్ట సమూహాలను లక్ష్యంగా చేసుకొని ప్రచారం లేదా తప్పుడు ప్రచారం సాగించడం ప్రజాస్వామ్యాన్ని పక్కదారి పట్టించడమే. దీని వల్ల ప్రజలు కోరుకునే అర్హులైన అభ్యర్థులు కాకుండా, కుట్రదారులు ఎన్నికలలో పైచేయి సాధించవచ్చు. ఒక దేశంలో ప్రజాతీర్పును ప్రభావితం చేయడానికి ఇతర దేశాలు ప్రయత్నించవచ్చు. ఇప్పటికే అమెరికాలో ట్రంప్ గెలుపునకు రష్యా తెరచాటు తోడ్పాటు అందించిందనే ఆరోపణలు ఉన్నాయి. డేటాను అనుమతి లేకుండా, విచ్చలవిడిగా వాడుకోనివ్వడం ప్రమాదకరమని అనుభవానికి వచ్చింది. దీంతో వ్యక్తిగత గోప్యతను కాపాడటం కోసం చట్టాలను చేయడం పాశ్చాత్య దేశాలలో మొదలైంది. యూరోపియన్ యూనియన్ 'సాధారణ డేటా పరిరక్షణ నియంత్రణ' చట్టాన్ని రూపొందిస్తున్నది. ఇదే విధంగా బ్రిటన్ డేటా పరిరక్షణ బిల్లును తెచ్చింది. మన దేశంలో కూడా ఫేస్‌బుక్‌ను హెచ్చరించడానికే పరిమితం కాకుండా, డేటా పరిరక్షణకు నిర్దిష్ట చర్యలు తీసుకోవాలె. ప్రజాస్వామ్యాన్ని ఈ ప్రమాదం నుంచి కాపాడుకోవాలె.

ప్రకటన

నిరుద్యోగులకు 'వర్క్‌షాప్'

మాడల్ కేరీర్ సెంటర్ ఉస్మానియా యూనివర్సిటీ, ఎంట్రప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో 2018 మార్చి 27, 28 తేదీ ల్లో స్టాన్లీ ఇంజినీరింగ్ కాలేజీ ఫర్ వుమెన్ ఆబిడ్స్‌లో 'ఇ-కామర్స్'పై వర్క్‌షాప్ నిర్వహించబడుతున్నది. అమెజాన్ ద్వారా వ్యాపారం చేయాలనుకునే ఔత్సాహికులందరూ హాజరుకావచ్చు. దీంట్లో అమెజాన్ ద్వారా వ్యాపారం చేయటం నేర్పిస్తా రు. టెలిఫోన్ ఇంటర్వ్యూ ద్వారా 50 మం దిని ఎంపిక చేస్తారు. ఉ.9 నుంచి సా.5 వరకు వర్క్‌షాప్ ఉంటుంది. రిజిస్ట్రేషన్ కోసం శ్రీనివాస్:9603545845, రఘుపతి: 8247656356లో సంప్రదించవచ్చు.

- ఎన్. అనంతరెడ్డి, ఎంసీసీ మేనేజర్

జనగళం

ప్రభుత్వ నిర్ణయం అభినందనీయం

దేశంలో అత్యధికులకు ఆరోగ్యంపై అవగాహన లేకపోవటం వల్లనే వ్యాధి ముదిరేవరకూ నిర్లక్ష్యం చేస్తున్నారు. వ్యాధి ముదిరి ప్రాణంమీదికి వచ్చిన తర్వాత పెద్ద వైద్యశాలలకు పరుగెడుతున్నారు. సొంత వైద్యం, అనర్హులైన వైద్యుల పర్యవేక్షణలో కాలంగడుపుతూ ఇళ్లూ ఒళ్లూ గుల్ల చేసుకుంటున్నారు. గత ప్రభుత్వాలు కూడా ప్రాథమిక వైద్యశాలలను నిర్లక్ష్యం చేయడంతో గ్రామీణ ప్రాంతాల్లో వాటి నిర్వహణ అస్తవ్యస్తమై పేద ప్రజల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ముఖ్యంగా మారిన ఆహారపు అలవాట్లు, వ్యాయామం లేకపోవడం, దురలవాట్ల మూలంగా వ్యాధులు మధుమేహం, రక్తపోటు, ఊబకాయం ఇత్యాది పెరుగుతున్నాయి. మరొకవైపు శుభ్రత, అవగాహన లేమితో, వివిధ కాలుష్యాలతో అంటువ్యాధులు సైతం ప్రజలను పీడిస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో దీనికి విరుగుడుగా అందరికీ ఆరోగ్య పరీక్షలు వారి వద్దకే వెళ్లి చేయాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు చేయటం అభినందనీయం. ఉచితంగా ప్రభుత్వమే వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయబూనుకోవటం వల్ల ప్రజలకు అవగాహన పెరుగటమే గాక చాలా సమస్యలకు పరిష్కారం లభిస్తుంది.

- సుద్దాల వినోద్, ఓయూ హైదరాబాద్

ఉత్తరాలు, రచనలు పంపవలసిన చిరునామా: 8-2-603/1/7,8,9, కృష్ణాపురం, రోడ్‌నంబర్.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. editpage@namasthetelangaana.com Fax-040-23291118

ఆలోకన



టంకశాల అశోక్

'ఫ్రంట్' ప్రయత్నం తొలి అనుభవాలు

కేసీఆర్-మమత సమావేశం తర్వాత మూడు విషయాలు అర్థమవుతున్నాయి. ఒకటి, ఫెడరల్ ఫ్రంట్ అనటంలో ఎన్నికల కన్నా ముఖ్యంగా దేశంలో గత 70 ఏండ్లలో లేని గుణాత్మకమైన మార్పులు రావటం తన ఉద్దేశమని ఆయన చెప్తున్న ఫిలాసఫీ క్రమంగా ప్రచారంలోకి వస్తున్నది. రెండు, అటువంటి ఫ్రంట్ ఎందుకు అవసరమో ఆయన చెప్తున్న కారణాలతో ఇతరులు సూత్రరీత్యా ఏకీభవిస్తున్నారు. మూడు, ఆచరణకు వచ్చేసరికి ఎవరి రాజకీయ అవసరాలను వారు లెక్కిస్తూనే, వాటిని అధిగమించి ఈ కొత్త ఫ్రంట్ అనే ఆదర్శం కోసం ప్రయత్నించవలసి ఉంటుంది.

ఏ కొత్త ఆలోచనకు అయినా ఒక ఫిలాసఫీ రూపం రావటం, అది వ్యాపించటం, అందుకు క్రమక్రమంగా వీలైనంత ఆమోదం లభించటం అనేది అవసరం. ముఖ్యమంత్రి ఆలోచనలకు అనుగుణంగా భారత రాజ్యాంగంలో, చట్టాలలో ఏమున్నది ఏమిలేదు అనే చర్చను పక్కన ఉంచితే, అవన్నీ గత 70 ఏండ్ల ఆచరణలో చాలావరకు విఫలమయ్యాయనేది వాస్తవం. ఈ మధ్య కాలంలో తాము ప్రత్యామ్నాయం అంటూ ఏర్పడిన పలు వేదికలు కూడా ఒకటీ అరా మెరుపులను మినహాయిస్తే చివరకు అదేవిధంగా విఫలమయ్యాయి. ఈ 70 ఏండ్ల శూన్యం నుంచి ఆవిర్భవించే కొత్త వేదిక దేశంలో 'గుణాత్మకమైన మార్పు'ను తెచ్చేది కావాలని, కొత్త చరిత్రను సృష్టించాలని కేసీఆర్ అంటున్నారు. అటువంటి మార్పును తేగలిగేందుకు ప్రాథమిక సాధనాలు ఎన్నికలు, ప్రభుత్వాలు అవుతాయన్నది నిజమే. అదే సమయంలో ఆ ప్రభుత్వపు దార్శనికత, విధానాలు, ఆచరణ అన్నవి అంతిమ సాధనాలు అవుతాయి.

ఈ విధమైన ఫిలాసఫీ అన్నది కేసీఆర్ నుంచి ఇప్పటికి ఇంకా సూత్రప్రాయమైన దశలో ఉన్నది. అందులోకి రాగల భిన్నాంశాలు, వాటిపై వివరణలతో ఆ ఫిలాసఫీ రాగల రోజుల్లో తన స్వరూప స్వభావాలను మరింతగా సంతరించుకోగలదని భావించాలి. అదే సమయంలో గుర్తించవలసింది ఒకటున్నది. ఇన్నేండ్ల శూన్యమన్నది ఈ రోజున దేశ ప్రజలలో గల సార్వత్రిక అభిప్రాయం. వారు తమతమ జీవితానుభవాల ద్వారా ఈ అభిప్రాయాన్ని ఏర్పరుచుకున్నారు. చీకటి ఎందుకు చీకటిగా ఉంటుందో ఒక శాస్త్రవేత్త శాస్త్రీయంగా చెప్పవచ్చు. సామాన్యుడు తనకు అర్థమైన పద్ధతిలో చెప్పవచ్చు. కాని సారాంశంలో ఇరువురు చెప్పేది అదేగనుక ఇరువురి మధ్య ఆలోచనా సారూప్యతలు ఏర్పడుతాయి. ప్రస్తుతం కేసీఆర్ అంటున్న శూన్యాలు, గుణాత్మకమైన మార్పుల అవసరం గురించిన మాటలు ఇంత త్వరగా ప్రచారంలోకి రావటానికి గాని, ఆ మాటలతో సూత్రరీత్యా ఏకీభావనలు ఏర్పడటానికి గాని కారణం ఇదే. పైన అన్నట్లు, ఇందులోకి రాగల భిన్నాంశాలు, వాటిపై వివరణలతో ఆ ఫిలాసఫీ రాగల రోజులలో తన స్వరూప స్వభావాలను మరింత సంతరించుకున్నా కొద్దీ, 70 ఏండ్ల పాలనా వైఫల్యాలను ఎట్లా సరిదిద్దగలరో వివరించినా కొద్దీ, ఏకీభావనలు మరింత పెరిగే అవకాశం ఉంటుంది.

టీఆర్ఎస్ అధినేత 'ఫ్రంట్' అంటూ మొదట మాట్లాడగానే దేశంలోని రాజకీయ వర్గాలు, మీడియా తమ పద్ధతిలో తాము చూశాయి. ఈ నెల 19న కేసీఆర్ కోల్‌కతా వెళ్లినపుడు కూడా అదే కన్పించింది. అందుకు రెండు కారణాలున్నాయి. ఒకటి, దేశంలో గత 40 ఏండ్లుగా ఆ మాటకు మరొక అధికార రాజకీయ కూటమి అనే అర్థమే ప్రచారంలో ఉంది. రెండు, ప్రస్తుతం 2019 ఎన్నికలు సమీపిస్తూ అంతటా ఈ కూటమి లేదా ఆ కూటమి అన్న చర్చలే జరుగుతున్నాయి. ఈ రెండు కారణాల వల్ల ఎవరైనా సరే ఈ ఆలోచనను ఒక కొత్త కోణం నుంచి చూడటం తేలిక కాదు. అందరూ పాత ఆలోచనలలో కూరుకొని ఉన్నందువల్లనే తను అంటున్న గుణాత్మకమైన కొత్త దృక్పథం గురించి వివరించేందుకు, అటువంటిది కూడా ఒకటి ఉండవచ్చునని ఎదుటివారికి 'మైండ్‌లో రిజిస్టర్' చేసేందుకు కేసీఆర్ ఇంత శ్రమపడవలసి వస్తున్నది. మొదట అన్నట్లు, ఆయన చెప్తున్న ఈ ఫిలాసఫీ క్రమంగా ప్రచారంలోకి వస్తున్న మాట నిజమే అయినా, ఆ దిశలో ఆయన మునుముందు కూడా ఇట్లానే శ్రమపడవలసి ఉంటుంది. ఇందులో ఒక విచిత్రం కూడా ఉంది. 70 ఏండ్ల వైఫల్యాల గురించి సామాన్యుడి నుంచి మేధావివర్గం వరకు అందరూ అంగీకరిస్తున్నదే. అయినప్పటికీ, ఆ శూన్యంలోకి ఒక కొత్త ప్రయోగం అన్నదానిని, గతంలో ప్రత్యామ్నాయం అంటూ వచ్చి విఫలమైన వాటి అనుభవంతోనే దేశం చూస్తుంది. కేసీఆర్‌కు ఇది కూడా ఒక అవరోధమే. ఆయన తన వైపు నుంచి తాను, సాధారణ ప్రజలు తమ దిక్కు నుంచి తాము దీనిని అధిగమించవలసి ఉంటుంది. చెప్పేదాని గురించి సూత్రరీత్యా అంగీకరిస్తూనే స్వరూప-స్వభావాలు-ఆచరణల గురించిన సందేహాలు అనేకం ఉండటం సహజం.

> **నిర్మాణపరంగా ప్రజల ఫ్రంట్ అన్నది తేలికకాదు గాని, అందులోని భావస్ఫూర్తిని వాస్తవంగా ప్రతిఫలింపజేయగలిగితే గొప్పగానే ఉంటుంది. అయితే ఇందుకు భాగస్వాములు కాగల పార్టీలను, నాయకులను, శక్తులను, వ్యక్తులను అన్వేషించటంపై అంతిమంగా అంతా ఆధారపడి ఉంటుంది. దేశ నేపథ్యం, 70 ఏండ్ల అనుభవాలు, వర్తమాన-భవిష్యత్ అవసరాలను బట్టి ఈ కార్యపు మహత్తరత్వాన్ని చూస్తే, ఇందుకు కేసీఆర్ తన జీవితాన్నే అంకితం చేయవలసి వస్తుంది.**

ఇది సాధారణ ప్రజల పరిస్థితి కాగా, రాజకీయవర్గాల స్థాయిలో మరొక పరిస్థితి కన్పిస్తుంది. ఇది మమతా బెనర్జీ మాటలతో తెరలు తెరలుగా దాగి నేరుగానో, నర్మగర్భంగానో కనిపించిందే. తను చెప్పే తరహా గుణాత్మకమైన మార్పును, దానిని సాధించేందుకు ఒక కొత్త విధమైన ఫెడరల్ ఫ్రంట్ అవసరాన్ని మమతగాని, మరొకరుగాని కాదనటం కష్టం. అవి కనీసం నటన కోసమైనా అవుననక తప్పని విశ్లేషణలు, ప్రతిపాదనలు. అందువల్లనే బెంగాల్ ముఖ్యమంత్రి నుంచి సూత్రరీత్యా ఏకీభావనలు కన్పించాయి. రానున్న రోజులలో కేసీఆర్ 'ఎవరిని పడితే వారిని' అన్న పద్ధతిలో గాక ఇంకా ఎవరెవరిని ఎంపిక చేసుకొని కలుస్తారో తెలియదుగాని, వారి నుంచి కూడా 'సూత్రరీత్యా' ఇదే విధమైన ఏకీభావాలు వ్యక్తం కాగలవని భావిస్తే పొరపాటు ఉండబోదు.

అయితే ఎప్పుడైనా ఆదర్శాలన్నవి కొన్ని వాస్తవిక పరిస్థితులను కూడా అధిగమించవలసి ఉంటుంది. 'ఆచరణకు వచ్చేసరికి ఎవరి రాజకీయ అవసరాలను వారు లెక్కిస్తూనే, వాటిని అధిగమించి ఈ కొత్త ఫ్రంట్ అనే ఆదర్శం కోసం ప్రయత్నించవలసి ఉంటుంది' అని మొదట చెప్పుకున్న మాటకు అర్థం ఇదే. ఇటువంటి ఆచరణాత్మక (ప్రాక్టికల్/ప్రాగ్మాటిక్) వైఖరిని ఎవరు తీసుకున్నా వారిని నిందించగలది కూడా ఉండదు. ఎందుకో సూటిగా చెప్పుకోవాలంటే, 'ఆచరణాత్మక' పరిస్థితులను బట్టి వ్యవహరించటం, ఇంకా చెప్పదలిస్తే అందుకు ప్రాధాన్యం ఇవ్వటం ఆ నాయకునికి, పార్టీకి మనుగడతో ముడిపడిన విషయం. మౌలికంగా మనుగడ అంటూ లేనపుడు, బతికి ఉండి బలుసాకు అయినా తినలేపుడు, ఆదర్శాలను మాట్లాడగలరా? రాజకీయాల్లో అనేక పరిస్థితులు ఏర్పడుతుంటాయని, వేర్వేరు మనుషులతో కలిసి పనిచేయవలసి వస్తుందని, పెద్ద లక్ష్యాల కోసం చేసే రాజకీయాలకు సమయం తీసుకుంటుందని తృణమూల్ అధినేత్రి చేసిన వ్యాఖ్యలో గల భావం ఇదే.

అదే సమయంలో, ఒకవేళ సఫలమైతే చరిత్రాత్మకం కాగల ఈ ఆలోచనలోని మౌలికాంశాలను అందరూ గుర్తిస్తుండటం, ఏకీభవించటం అన్నది ప్రధానంగా గమనించవలసిన విషయం. ఆ పని ఎంత త్వరగా, లేక ఎంత సమయం తీసుకొని అన్నదానిపై ఎవరి పరిస్థితులు, ఆలోచనలు, వాటిని బట్టి సన్నద్ధతలు వారికున్నా, అటువంటి లక్ష్యసాధన కోసం పనిచేయాలనే సుముఖత కన్పించటం మరొక ప్రధానాంశం. కొత్త తరహా ఫ్రంట్ ప్రతిపాదన భవిష్యత్తుకు సంబంధించి ఆశలను కలిగించగల తొలి సూచనలు ఇవి. మరొకవిధంగా చెప్పాలంటే తొలి అనుభవాలు ఇవన్నీ. కేసీఆర్ కోల్‌కతా వెళ్లటానికి కన్న కొద్ది రోజుల ముందే, తాను ఆలోచిస్తున్నది 'ప్రజల ఫ్రంట్' అన్నారు. అది రాజకీయంగా కొత్త నమూనా కాగలదన్నారు. నిర్మాణపరంగా ప్రజల ఫ్రంట్ అన్నది తేలిక కాదు గాని, అందులోని భావస్ఫూర్తిని వాస్తవంగా ప్రతిఫలింపజేయగలిగితే గొప్పగానే ఉంటుంది. అయితే ఇందుకు భాగస్వాములు కాగల పార్టీలను, నాయకులను, శక్తులను, వ్యక్తులను అన్వేషించటంపై అంతిమంగా అంతా ఆధారపడి ఉంటుంది. దేశ నేపథ్యం, 70 ఏండ్ల అనుభవాలు, వర్తమాన-భవిష్యత్ అవసరాలను బట్టి ఈ కార్యపు మహత్తరత్వాన్ని చూస్తే, ఇందుకు కేసీఆర్ తన జీవితాన్నే అంకితం చేయవలసి వస్తుంది.

ప్రజలకు చేరువలో సర్కారు దవాఖాన

వైద్యం



డాక్టర్ పుట్టా శ్రీనివాస్

మనకెంతో గొప్ప దవాఖానలు ఉండవచ్చు. గొప్ప వైద్యులు ఉండవచ్చు. వైద్య సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో ఉండవచ్చు. కానీ అవి ప్రతి పౌరుడికీ చేరువైతేనే సార్థకత అని బార్బరా బాక్సర్ అన్నారు.

సీఎం కేసీఆర్ మానస పుత్రికగా చెప్పదగ్గ 'కేసీఆర్ కిట్' లాంటి వినూత్న పథకాలను చురుకుగా అమలుచేసిన వెంటనే ప్రభుత్వ దవాఖానలపై సామాన్య ప్రజలకు నమ్మకం గణనీయంగా పెరిగింది. నాలుగు దశాబ్దాలుగా సరైన బడ్జెట్ కేటాయింపుల్లేక, ఆధునీకరణ జరుగక, లోపాలు గుర్తించి వాటిని అధిగమించే ప్రయత్నాలు జరుగక ప్రైవేట్ రంగంతో పోటీలో వెనకబడిన ప్రభుత్వ దవాఖానలకు రాష్ట్ర ఆవిర్భావంతో కొత్త ఊపు, ఉత్సాహం వచ్చింది.

ఉమ్మడి పాలనలో సర్కారు దవాఖానల నిర్వహణ దారుణంగా ఉండేది. పాడైపోయిన పరికరాలు, సిబ్బంది, మౌలిక సదుపాయాల కొరత, పరిశుభ్రత లేని పరిసరాలు, మందుల కొరతతో దవాఖానలే రోగగ్రస్థమై ఉండేవి. ప్రజలు ఓ దశలో ప్రభుత్వ వైద్యంపై నమ్మకం కోల్పోయారు. చేసేదేం లేక ప్రైవేట్ దవాఖానలను ఆశ్రయించి అప్పుల పాలైన సందర్భాలు అనేకం. ఈ దుష్పరిణామాలపై దృష్టిసారించిన తెలంగాణ తొలి ప్రభుత్వం పరిస్థితులను చక్కదిద్దే కర్తవ్యంలో నిమగ్నమయ్యింది.

రాష్ట్ర రాజధానిలో జీవనశైలితో ముడిపడిన వ్యాధులు, వాటి చికిత్స ఖర్చుల వల్ల కుటుంబాలపై పడే ఆర్థిక భారంపై కొంతకాలం కిందట హైదరాబాద్ హోంసైన్సు కాలేజీలో పరిశోధన జరిగింది. ఈ పరిశోధనలో ప్రజల కష్టాలు, కడగండ్లు వెలుగులోకి వచ్చాయి. చికిత్స, మందుల ఖర్చుల కోసం ప్రజలు తమ అవసరాలన్నీ కుదించుకోవడం, ఆస్తులు అమ్ముకోవడం తదితర పరిణామాలు ఈ పరిశోధనలో వెల్లడయ్యాయి. వైద్య ఖర్చుల వల్ల 49 శాతం కుటుంబాలు రోజువారీ అవసరాలు కూడా తీరక సతమతమైతే, 54 శాతం కుటుంబాల్లో పిల్లల చదువు కూడా దెబ్బతిన్నది. 65 శాతం మంది భవిష్యత్తు అవసరాలకు పొదుపుచేసే అవకాశం కోల్పోయారు. సగటు కుటుంబ ఆదాయం కాస్త ఎక్కువ ఉండే నగరంలోనే పరిస్థితి ఇలా ఉంటే గ్రామీణ తెలంగాణ దుస్థితి వర్ణనాతీతం.

ఈ కఠిన పరిస్థితిలో అధికారం చేపట్టిన కేసీఆర్ సర్కార్ గత నాలుగేండ్లలో ప్రజారోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ కనబరిచింది. ప్రభుత్వ వైద్య ఆరోగ్య సేవలను సాధారణ ప్రజల చెంతకు చేర్చే కృషిలో లీనమైంది. ఈ చర్యల ప్రతిఫలం సర్కారు దవాఖానలకు వచ్చే రోగుల సంఖ్యలో కనిపిస్తుంది. 2014-15లో 3.35 లక్షల మంది రోగులు ఔట్ పేషెంట్లుగా చికిత్స పొందితే 2016-17లో ఆ సంఖ్య 4.51 లక్షలకు పెరిగింది. ఇన్ పేషెంట్ల సంఖ్య కూడా అదే సమయంలో 13.74 లక్షల నుంచి 20.24 లక్షలకు పెరిగింది. శస్త్రచికిత్సల సంఖ్య కూడా 3.32 లక్షల నుంచి 4.45 లక్షలకు పెరిగింది. ఇంత గణనీయమైన సత్వర మార్పు వెనుక ప్రభుత్వ బడ్జెట్ కేటాయింపుల పెంపు, వైద్య ఆరోగ్య మంత్రిత్వశాఖ, వైద్యులు , నర్సింగ్, పారా మెడికల్ తదితర సిబ్బంది నిర్విరామ కృషి ఉన్నది.

వైద్య ఆరోగ్య రంగం బడ్జెట్లో తెలంగాణ వాటా 2013-14 ఆర్థిక సంవత్సరంలో రూ.2,722 కోట్లు ఉంటే 2016-17కు రూ.6,092 కోట్లకు చేరాయి. అప్పటిదాకా సరిగా పట్టించుకోని కొన్నిరంగాలపై దృష్టి సారించడం, 2015-17 మధ్య సుమారు రూ.1,342 కోట్ల నిధులు ప్రభుత్వం వెచ్చించింది. ప్రభుత్వ దవాఖానలను పటిష్టపరిచే కృషిని కొనసాగిస్తూ తాజా 2018-19 బడ్జెట్‌లో ఆ కేటాయింపులను రూ.7,375 కోట్లకు పెంచారు. మొత్తం రాష్ట్ర బడ్జెట్‌లో వైద్యరంగం వాటా 4.22 శాతం కావడం విశేషం. ప్రజారోగ్యం కోసం చేసే కేటాయింపులు అనుత్పాదక వ్యయం కాదనీ, మానవ వనరుల అభివృద్ధి కోసం పెట్టే ఉపయోగకరమైన ఖర్చు అని తెలంగాణ సర్కార్ స్పష్టం చేసింది.

మన దేశంలో వ్యక్తిగతంగా వైద్యఆరోగ్య అవసరాల కోసం పెట్టే ఖర్చుల్లో ఎక్కువ భాగం మందుల కొనుగోలు కోసమేనని 2014-15లో సమర్పించిన జాతీయ ఆరోగ్య వ్యయ అంచనాల నివేదిక తెలిపింది. ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం మందుల కొనుగోలుకు భారీ మొత్తం కేటాయించి ప్రజలకు కొంత ఉపశమనం కల్పించింది. 2015-16లో ఔషధాల కొనుగోలుకు రూ.125 కోట్లు కేటాయించిన ప్రభుత్వం తాజా బడ్జెట్లో రూ. 344 కోట్లకు పెంచింది. దీనివల్ల ప్రభుత్వ దవాఖానల్లో ఎక్కువ రకాల మందులు ఎక్కువ సంఖ్యలో అందుబాటులో ఉంటాయి.

> **తాజా బడ్జెట్‌లో అత్యధిక కేటాయింపులు, గ్రామీణులకు చేరువగా వ్యాధి నిర్ధారణ పరీక్షలు తదితర చర్యలతో కేసీఆర్ ప్రభుత్వం ఆదుకుంటున్నది. రాష్ట్ర ప్రభుత్వం వైద్య, వైద్యేతర సిబ్బంది నియామకాలు, మౌలిక సదుపాయాల పెంపు, జిల్లా కేంద్రాలకు బోధనాస్పత్రుల, సూపర్ స్పెషాలిటీల విస్తరణ తదితర చర్యలతో ప్రభుత్వ వైద్య ఆరోగ్యరంగాన్ని పరిపుష్టం చేస్తున్నది. దీని ప్రతిఫలంగా ఆరోగ్య తెలంగాణ త్వరలోనే ఆవిష్కృతమవుతుందనడంలో సందేహం లేదు.**

గతంలో కారణాలేమైనప్పటికీ సర్కారు దవాఖానల్లో వైద్యపరీక్షల పరికరాల కొనుగోలు, నిర్వహణ, వినియోగం సవ్యంగా లేక, సకాలంలో రిపోర్టులు అందకపోయేవి. దీంతో రోగులు పరీక్షల కోసం బయటి డయాగ్నోస్టిక్ సెంటర్లకు వెళ్లాల్సి వచ్చేది. ఉస్మానియా, నిమ్స్, అపోలో దవాఖానల్లో వైద్య పరీక్షలపై రోగుల సంతృప్తిస్థాయిని పోల్చి చూసేందుకు సుమారు దశాబ్దం కిందట జరిపిన ఒక సర్వేలో 86 శాతం మంది రోగులు ఉస్మానియాలో రోగ నిర్ధారణ పరీక్షల నివేదికలపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ లోపాన్ని సరిచేసే చర్యల్లో భాగంగా ప్రభుత్వం కేవలం పరీక్షల పరికరాల కోసమే ఈసారి బడ్జెట్లో రూ.391 కోట్లు కేటాయించింది. కొత్త యంత్రాల రాకతో ఆయా విభాగాలు బాధ్యతగా పనిచేస్తే సర్కారు దవాఖానల్లో కార్పొరేట్‌స్థాయి నాణ్యమైన పరీక్షలు ఉచితం గా లభిస్తాయి.

కీలకమైన లాప్రోస్కోపిక్ , సూపర్ స్పెషాలిటీ శస్త్రచికిత్సలకు అవసరమయ్యే అధునాతన పరికరాలు అందుబాటులో లేక సర్కారు దవాఖానల్లో మెరుగైన సర్జన్లు అందుబాటులో ఉన్నా జనం ఖర్చులకు వెనుకాడకుండా కార్పొరేట్ దవాఖానలకు ఎగబడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ పరిస్థితిని అధిగమించడానికి కేవలం శస్త్రచికిత్స పరికరాల కొనుగోలుకే ఈ బడ్జెట్‌లో రూ.159 కోట్లు కేటాయించింది. ఉస్మానియా, గాంధీ తదితర దవాఖా నల సర్జన్లు చురుకుగా విజయవంతంగా ఖరీదైన లివర్, కిడ్నీ మార్పిడి లాంటి శస్త్రచికిత్సలు చేసి పేద రోగులను ఆదుకుంటున్నారు. ప్రభుత్వ తోడ్పాటు ఇలాగే కొనసాగితే ఈ సంక్లిష్ట సర్జరీల పరంపర త్వరలో వరంగల్, నిజామాబాద్, ఆదిలాబాద్, మహబూబ్‌నగర్ తదితర పట్టణాల్లోని బోధనాస్పత్రుల్లో కూడా ఊపందుకుంటుంది. తద్వారా గ్రామీణ తెలంగాణకు ఊరట లభిస్తుంది.

ప్రభుత్వం దవాఖానలు, వైద్య కళాశాలలను బలోపేతం చేయడానికి ఈ బడ్జెట్‌లో రూ.596 కోట్లు కేటాయించింది. రోగుల్లో ఏయే ఆదాయ వర్గాలు ఏ దవాఖానకు వెళ్తున్నాయో తెలుసుకునే ప్రయత్నంలో భాగంగా ఉస్మానియా, గాంధీ, అపోలో, కిమ్స్ దవాఖానల్లో గతంలో ఓ తులనాత్మక అధ్యయనం జరిగింది. ఆ నివేదిక ప్రకారం ఉస్మానియా, గాంధీ దవాఖానలకు వచ్చే రోగుల్లో 75 శాతం మంది నెలసరి ఆదాయం 3 వేల లోపే. 25 శాతం మంది 5 వేల రూపాయల ఆదాయం గడిస్తున్నారు. అపోలో, కిమ్స్‌కు వెళ్లే రోగుల్లో 87.5 శాతం 10 వేలకు మించి ఆదాయం వస్తున్నవాళ్లు. ఆశ్చర్యకరమైన విషయమేమంటే 12.5 శాతం రూ.3 వేల లోపు ఆదాయమున్న నిరుపేదలు కార్పొరేట్ దవాఖానలకు వెళ్లక తప్పడం లేదన్నారు. దీన్నిబట్టి చూస్తే ఎక్కువ శాతం పేద ప్రజలు సర్కార్ వైద్యంపై ఆధారపడగా, వాళ్లలో కొద్ది శాతం మంది ఆర్థిక ఇబ్బందులున్నా తప్పనిసరి పరిస్థితిలో కార్పొరేట్ వైద్యాన్ని ఆశ్రయిస్తున్నారు.

వీరికి అన్నివిధాలా ఉపశమనం ఇచ్చేలా కేసీఆర్ కిట్లు, తాజా బడ్జెట్‌లో అత్యధిక కేటాయింపులు, గ్రామీణులకు చేరువగా వ్యాధి నిర్ధారణ పరీక్షలు తదితర చర్యలతో కేసీఆర్ ప్రభుత్వం ఆదుకుంటున్నది. రాష్ట్ర ప్రభుత్వం వైద్య, వైద్యేతర సిబ్బంది నియామకాలు, మౌలిక సదుపాయాల పెంపు, జిల్లా కేంద్రాలకు బోధనాస్పత్రుల, సూపర్ స్పెషాలిటీల విస్తరణ తదితర చర్యలతో ప్రభుత్వ వైద్య ఆరోగ్య రంగాన్ని పరిపుష్టం చేస్తున్నది. దీని ప్రతిఫలంగా ఆరోగ్య తెలంగాణ త్వరలోనే ఆవిష్కృతమవుతుందనడంలో సందేహం లేదు. సర్వేజనాః సుఖినో భవంతు.

(వ్యాసకర్త: పాలక మండలి సభ్యుడు, కాళోజీ నారాయణరావు హెల్త్ యూనివర్సిటీ)

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.437, Near Velama Kalyana Mandapam, Devara Yamjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078,
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Katta Shekar Reddy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.

ఎస్సీ, ఎస్టీ చట్టాన్ని సడలించవద్దు

సుప్రీంకోర్టు తీర్పును సమీక్షించండి ■ కేంద్రాన్ని డిమాండ్ చేసిన కాంగ్రెస్, దళిత సంఘాలు

న్యూఢిల్లీ: ఎస్సీఎస్టీలపై అత్యాచారాల నిరోధక చట్టం కింద నమోదైన కేసుల్లో ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులను తక్షణం అరెస్ట్ చేయడానికి వీలులేకుండా ఆ చట్టంలోని నిబంధనలను సుప్రీంకోర్టు సడలించడంపై కాంగ్రెస్‌తోపాటు, దళిత సంఘాలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. ఎన్డీఏ పాలనలో దళితులపై దాడులు పెరిగాయని, ఈ పరిస్థితిలో సుప్రీంకోర్టు మంగళవారం ఇచ్చిన తీర్పును ప్రభుత్వం సమీక్షించాలి లేదా చట్టాన్ని సవరించాలని ఆ సంస్థల నాయకులు కోరారు. కోర్టు తీర్పు తరువాత ఎస్సీ ఎస్టీలు అభద్రతాభావానికి గురవుతున్నందున ప్రభుత్వం ఈ విషయంలో తన వైఖరిని వెల్లడించాలని కాంగ్రెస్ అధికార ప్రతినిధి ఆనంద్‌శర్మ మీడియాతో అన్నారు. కేంద్రం మౌనంగా ఉంటే అది కోర్టు తీర్పును సమర్థించినట్లే అవుతుందని పేర్కొన్నారు. బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్‌లు దేశంలో రిజర్వేషన్లు లేకుండా చేయాలని కుట్రపన్నాయని, వారి విధానాల ఫలితమే కోర్టు తీర్పు అని కాంగ్రెస్ ఎంపీ కుమారి సెల్జా ఆరోపించారు. ఈ కేసులో కక్షిదారుగా ఉన్న కేంద్రం, మహారాష్ట్ర ప్రభుత్వాలు కోర్టులో సరిగా వాదించలేదని కాంగ్రెస్ నేత రణదీప్ సుర్జేవాలా చెప్పారు. సుప్రీంతీర్పును సవాలు చేయాలని దళిత్ శోధన్ ముక్తి మంచ్ తదితర సంఘాలు కేంద్రాన్ని డిమాండ్ చేశాయి. ఎస్సీఎస్టీల చట్టం కింద నకిలీ కేసులు నమోదవుతున్నాయని, ఈ కేసుల్లో అమాయకులను నిందితులుగా పేర్కొన్న సందర్భాలు ఉన్నాయని సుప్రీంకోర్టు మంగళవారం ఇచ్చిన ఆదేశాల్లో పేర్కొంది. ఎస్సీఎస్టీలపై అత్యాచార కేసుల్లో ఉద్యోగులను నిందితులుగా పేర్కొనడం వల్ల పోలీసులు వారిని వెంటనే అరెస్ట్ చేయాల్సి వస్తున్నదని తెలిపింది. ఉన్నతాధికారుల ఆమోదం తీసుకున్న తరువాత మాత్రమే ఈ కేసుల్లో నిందితులుగా ఉన్న ఉద్యోగులను అరెస్ట్ చేయాలని ఆదేశించింది.

అన్సారీ హత్య కేసులో 11మంది 'గోరక్షకులకు' జీవితఖైదు

తీర్పునిచ్చిన జార్ఖండ్ ఫాస్ట్ ట్రాక్ కోర్టు

రామ్‌గఢ్: గోరక్షణ పేరుతో జరిగిన హింసాకాండ తాలూకు కేసులో తొలిసారి సంచలన తీర్పు వచ్చింది. అలీముద్దీన్ అన్సారీ హత్య కేసులో 11మందికి యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ బుధవారం ఫాస్ట్ ట్రాక్ కోర్టు తీర్పు వెలువరించింది. అన్సారీ కుటుంబానికి నష్టపరిహారం అందించేందుకు చర్యలు తీసుకోవాలని డిస్ట్రిక్ట్ సర్వీసెస్ లీగల్ అథారిటీ (డీఎల్ఎస్ఏ)ని ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఆదేశించింది. జార్ఖండ్ రాష్ట్రంలోని రామ్‌గఢ్ జిల్లాలో గత ఏడాది జూన్‌లో అలీముద్దీన్ అన్సారీ దారుణహత్యకు గురయ్యారు. 9నెలల్లో విచారణ పూర్తి చేసిన ఫాస్ట్ ట్రాక్ కోర్టు దోషులకు జీవిత ఖైదు విధించింది. శిక్షకు గురైన వారిలో బీజేపీ మీడియా సెల్ జిల్లా ఇంఛార్జి నిత్యానంద్ మహతో కూడా ఉన్నాడు. ఛార్జిషీట్ దాఖలైన వారిలో ఒకరు బాలుడు కావడంతో కోర్టు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. గోరక్షణ పేరుతో చట్టాన్ని చేతుల్లోకి తీసుకునే వారిని ఉపేక్షించేది లేదని ప్రధాని మోదీ ప్రకటించిన మరుసటి రోజే అన్సారీ హత్య జరిగింది. కాగా, కోర్టు తీర్పుపై అన్సారీ కుటుంబం హర్షం వ్యక్తం చేసింది.



అన్సారీ వ్యాన్‌ను దహనం చేసిన గోరక్షకులు(ఫైల్)

కేసు నేపథ్యమిదీ...

అలీముద్దీన్ అన్సారీ (55) ఓ వ్యానులో గొడ్డు మాసం తీసుకెళ్తున్నారన్న అనుమానంతో స్థానిక 'గోరక్షా సమితి'కి చెందిన కొందరు కార్యకర్తలు మూకుమ్మడిగా వ్యానును అడ్డుకున్నారు. అన్సారీపై దాడి జరిపి తీవ్రంగా కొట్టడంతో ఆయన అక్కడికక్కడే మృతిచెందారు. అతడి వాహనానికి నిప్పు పెట్టారు. ఈకేసును విచారించేందుకు జార్ఖండ్ ప్రభుత్వం ఫాస్ట్ ట్రాక్ కోర్టును గత ఏడాది జూన్ నెలలో ఏర్పాటుచేసింది. అన్సారీ భార్య మరియం ఖాతూన్ చేసిన ఫిర్యాదు మేరకు గత ఏడాది సెప్టెంబర్ 17న 12 మందిపై ఛార్జిషీట్ నమోదైంది. 'సాధ్యమైనంత శిక్ష విధించాలని కోర్టుకు విన్నవించా. అయితే నిందితులపై తొలి క్రిమినల్ కేసు అయినందున ఉదారంగా వ్యవహరించాలని డిఫెన్స్ న్యాయవాది కోర్టుకు విన్నవించారు. 11 మందికి యావజ్జీవ శిక్ష విధిస్తూ ఫాస్ట్ ట్రాక్ కోర్టు తీర్పునిచ్చింది. బాలుడని చెబుతున్న 12 వ నిందితుడిని యక్తువయస్కుడిగా పరిగణించాలని విన్నవించినా కోర్టు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు' అని అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ సుశీల్ కుమార్ శుక్లా చెప్పారు.

జీవం ఆవిర్భావంలో సైనైడ్ కీలకం!

హార్వర్డ్ పరిశోధకుల అధ్యయనంలో వెల్లడి

బోస్టన్: చిటికెడు సైనైడ్ ప్రాణం తీస్తుంది. కానీ అదే సైనైడ్ ఈ భూమిపై జీవం ఆవిర్భావానికి కీలకమైన పాత్రను పోషించిందని పరిశోధకులు పేర్కొంటున్నారు. సైనైడ్, రాగితో కలిసి అతినీలలోహిత కాంతితో వికిరణం చెందినప్పుడు సాధారణ చక్కెరలు ఉత్పత్తి అయి ఉండవచ్చుని, అవి మన గ్రహంపై జీవం ఆవిర్భావానికి దోహదపడి ఉండవచ్చుని అభిప్రాయపడుతున్నారు. అమెరికాలోని హార్వర్డ్ యూనివర్సిటీకి చెందిన జో టాడ్ మాట్లాడుతూ, 'జీవం ఆవిర్భావానికి సంబంధించిన కథను మనం ఆర్ఎన్ఏ ప్రపంచం అని పిలుస్తున్నాం. ఆర్ఎన్ఏ అనగా జీవకణాల్లో ఉండే న్యూక్లియిక్ యాసిడ్. ఆర్ఎన్ఐ నూక్లియోటైడ్ వంటిదానిని తయారు చేయాలంటే ఈ చక్కెరలు అవసరం. జీవం ఆవిర్భావం సమయంలో ఈ ప్రక్రియ జరిగి ఉండవచ్చు' అని పేర్కొన్నారు.



హెచ్1బీ వీసాలకు 2 నుంచి దరఖాస్తుల స్వీకరణ

ప్రీమియం ప్రాసెసింగ్‌పై కొనసాగనున్న సస్పెన్షన్

వాషింగ్టన్, మార్చి 21: హెచ్1బీ వీసాల కోసం దరఖాస్తులను ఏప్రిల్ రెండో తేదీ నుంచి స్వీకరిస్తామని అమెరికా బుధవారం ప్రకటించింది. అయితే వర్క్ వీసాల ప్రీమియం ప్రాసెసింగ్‌ను మాత్రం తాత్కాలికంగా సస్పెండ్ చేశామని తెలిపింది. సాంకేతిక నైపుణ్యత అవసరమైన ప్రత్యేక ఉద్యోగాల కోసం అమెరికన్ కంపెనీలు భర్తీ చేసుకొనే విదేశీయులకు హెచ్1బీ వీసాలను జారీ చేస్తారు. ఇటువంటి ఉద్యోగాలకు ఎక్కువగా భారత్, చైనా నుంచి అభ్యర్థులు ఎంపికవుతుంటారు. అక్టోబర్ 1, 2018 నుంచి ప్రారంభమయ్యే 2019 ఆర్థిక సంవత్సరం కోసం హెచ్1బీ పిటీషన్లను స్వీకరించనున్నట్టు అమెరికా పౌర, వలసదారుల సేవా సంస్థ (యూఎస్‌సీఐఎస్) బుధవారం తెలిపింది. ఇక ప్రీమియం ప్రాసెసింగ్‌పై విధించిన సస్పెన్షన్ ఈ ఏడాది సెప్టెంబర్ వరకు కొనసాగనున్నట్టు పేర్కొంది. అయితే హెచ్1బీ ప్రీమియం ప్రాసెసింగ్ కోసం దరఖాస్తులను మాత్రం స్వీకరిస్తామని, ఆ వీసాలపై 2019కి వర్తించే పరిమితి ఉండదని స్పష్టం చేసింది. హెచ్1బీ ప్రీమియం ప్రాసెసింగ్ సేవల కింద ఓ అమెరికన్ సంస్థ తమకవసరమైన ఓ విదేశీ ఉద్యోగికి జారీ చేసే వీసా ప్రక్రియను వేగవంతం చేయాలని విజ్ఞప్తి చేయవచ్చు. ఆ విజ్ఞప్తి మేరకు 15 రోజుల్లోనే వీసా జారీ చేస్తారు. అమెరికన్ కాంగ్రెస్ నిర్దేశించిన మేరకు 2019లో హెచ్1బీ వీసాలను 65 వేల మందికి జారీ చేయాలని నిర్ణయించారు.

సరోగసీ వ్యాపారంపై నిషేధం!

- **సవరణ బిల్లుపై కేంద్ర క్యాబినెట్ నిర్ణయం**
- **ఆయుష్మాన్ భారత్‌కు ఆమోదం**

న్యూఢిల్లీ: సరోగసీ ప్రక్రియను వాణిజ్యపరంగా వినియోగించుకోవటాన్ని నిషేధించే సవరణ బిల్లుకు కేంద్ర క్యాబినెట్ బుధవారం ఆమోదం తెలిపింది. పిల్లల్ని కనటానికి ఇటీవలి కాలంలో సరోగసీ ప్రక్రియను ఉపయోగిస్తున్న ఉదంతాలు పెరుగుతున్న నేపథ్యంలో కేంద్రం ఈ నిర్ణయం తీసుకుంది. పిల్లలు లేని జంటలకు మాత్రమే సరోగసీ ప్రక్రియ అందుబాటులో ఉండేలా, వాణిజ్యపరంగా మాత్రం దానిని నిషేధించాలా ఈ బిల్లును రూపొందించారు. మరోవైపు, పది కోట్ల పేద కుటుంబాలకు ఒక్కో కుటుంబానికి ఏడాదికి రూ.5 లక్షల చొప్పున ఆరోగ్య సేవల భరోసాను కల్పించే ఆయుష్మాన్ భారత్ పథకానికి క్యాబినెట్ ఆమోదం తెలిపింది. జాతీయ ఆరోగ్య మిషన్‌ను 31 మార్చి 2020 వరకూ పొడిగించాలని నిర్ణయించింది. అదేవిధంగా, ఓబీసీల ఉప వర్గీకరణ అంశాన్ని పరిశీలిస్తున్న జస్టిస్ జీ రోహిణి కమిషన్ పదవీకాలాన్ని జూన్ 20 వరకూ పొడిగించారు.

ఫేస్‌బుక్.. మాతో పెట్టుకోకు!!

ఎన్నికల ప్రక్రియను ప్రభావితం చేస్తే సహించం

ఐటీ చట్టం కింద కఠిన శిక్షలు తప్పవు ■ కేంద్రమంత్రి రవిశంకర్ ప్రసాద్ హెచ్చరిక

కేంబ్రిడ్జి అనలిటికా సంబంధాలపై బీజేపీ, కాంగ్రెస్ పరస్పరం ఆరోపణలు



న్యూఢిల్లీ, మార్చి 21:

ఫేస్‌బుక్ వినియోగదారుల వ్యక్తిగత సమాచారం దుర్వినియోగమవుతున్నదంటూ వస్తున్న వార్తల నేపథ్యంలో భారత ఎన్నికల ప్రక్రియను ఫేస్‌బుక్ ఏమాత్రం ప్రభావితం చేసినా సహించబోమని కేంద్ర న్యాయశాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్ స్పష్టంచేశారు. అవసరమైతే ఫేస్‌బుక్‌పై కఠినచర్యలకూ వెనుకాడబోమని బుధవారం ఆయన పేర్కొన్నారు. పత్రికాస్వేచ్ఛ, భావప్రకటనా స్వేచ్ఛకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టంచేస్తూనే.. ఆయన ఈ హెచ్చరికలు జారీ చేశారు. 2016నాటి అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్ కోసం పనిచేసిన రాజకీయ కన్సల్టింగ్ సంస్థ 'కేంబ్రిడ్జ్ అనలిటికా'కు దాదాపు ఐదుకోట్లమంది ఫేస్‌బుక్ ఖాతాదారుల సమాచారం అక్రమ మార్గాల్లో చేరిందని వార్తలు వచ్చాయి. లీకేజీపై వివరణ ఇవ్వాలంటూ బ్రిటన్ పార్లమెంటరీ కమిటీ ఫేస్‌బుక్ అధినేత జుకర్‌బర్గ్‌కు సమన్లు జారీ చేయడంతో ఈ వ్యవహారం సంచలనంగా మారింది. ఈ నేపథ్యంలో ఢిల్లీలోని పార్లమెంట్ భవన్‌లో బుధవారం మీడియాతో మాట్లాడిన రవిశంకర్‌ప్రసాద్.. 'మేం చాలా స్పష్టంగా చెబుతున్నాం. ఫేస్‌బుక్‌తోసహా సామాజిక మాధ్యమ వేదికలేవైనా భారత ఎన్నికల ప్రక్రియను ఏరకంగానూ ప్రభావితం చేసేందుకు ప్రయత్నించినా సహించే ప్రసక్తే లేదు' అని చెప్పారు. 20కోట్లమంది భారతీయులు ఫేస్‌బుక్‌ను వాడుతున్నారని, అమెరికా తర్వాత ఫేస్‌బుక్ వినియోగదారులున్న అతిపెద్ద దేశం భారతేనని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఫేస్‌బుక్ సీఈవో మార్క్ జుకర్‌బర్గ్‌కు కేంద్రమంత్రి హెచ్చరికలు జారీ చేశారు. 'జుకర్‌బర్గ్.. భారత ఐటీశాఖ గురించి మీకు బాగా తెలుసు. ఫేస్‌బుక్ ద్వారా భారతీయుల సమాచారం, వివరాలు అపహరణకు గురైతే ఎంతమాత్రం సహించం. అందుకు ఐటీ చట్టం కింద (మీరు) కఠిన శిక్షలు ఎదుర్కోవాల్సి



ఉంటుంది. మీకు సమన్లు పంపే అధికారం కూడా మాకు ఉంది' అని రవిశంకర్ ప్రసాద్ హెచ్చరించారు. కాగా కేంబ్రిడ్జ్ అనలిటికా (సీఏ) సంస్థతో కాంగ్రెస్ పార్టీకి సంబంధాలున్నాయని రవిశంకర్ ప్రసాద్ ఆరోపించారు. సమాచారాన్ని తస్కరించడం లేదా తారుమారు చేయడం ద్వారా గెలువడంపైనే కాంగ్రెస్ ఆధారపడుతుందా? రాహుల్ సోషల్ మీడియా ప్రొఫైల్‌లో కేంబ్రిడ్జి అనలిటికా పాత్ర ఎంత?' అని ప్రసాద్ ప్రశ్నించారు. 2019 ఎన్నికల కోసం కాంగ్రెస్ పార్టీ కేంబ్రిడ్జి ఎనలిటికానే నమ్ముకుందని, దానినే తన బ్రహ్మాస్త్రంగా చెప్పుకుంటున్నదని ఆరోపించారు. అయితే ఆయన ఆరోపణలను తిప్పికొట్టిన కాంగ్రెస్.. సీఏ సంస్థతో బీజేపీకే సంబంధాలున్నాయని విమర్శించింది. బీహార్, గుజరాత్ ఎన్నికల్లో ఆ సంస్థ సేవలను బీజేపీ వినియోగించుకుని ఓటర్లను ప్రభావితం చేసిందని కాంగ్రెస్ నేత రణదీప్ సూర్జేవాలా ఆరోపించారు. కేంబ్రిడ్జ్ అనలిటికాకు ఓబీఐ అనే సంస్థ భారత్‌లో అనుబంధంగా పనిచేస్తున్నదని, ఆ సంస్థ బీహార్‌కు చెందిన ఓ ఎన్డీయే నేత కుమారుడిదని పేర్కొన్నారు.

చిక్కుల్లో జుకర్‌బర్గ్!

- **సమాచార చౌర్యంపై దర్యాప్తు చేపట్టిన అమెరికా**
- **పరిమిత సేవలపై దక్షిణ కొరియా జరిమానా**
- **కేంబ్రిడ్జ్ అనలిటికా మోసం చేసింది: ఎఫ్‌బీ**



వాషింగ్టన్: వినియోగదారుల వ్యక్తిగత సమాచారం దుర్వినియోగమవుతున్నదంటూ వస్తున్న ఆరోపణల నేపథ్యంలో ఫేస్‌బుక్ చిక్కుల్లో పడింది. బ్రిటన్ పార్లమెంటరీ కమిటీ, యురోపియన్ కమిషన్ ఇప్పటికే ఫేస్‌బుక్‌కు నోటీసులు జారీ చేయగా, తాజాగా అమెరికాకు చెందిన ఫెడరల్ ట్రేడ్ కమిషన్ (ఎఫ్‌టీసీ) దర్యాప్తు ప్రారంభించింది. విచారణ నిమిత్తం ఫేస్‌బుక్ సీఈవో మార్క్ జుకర్‌బర్గ్ అమెరికా పార్లమెంటరీ కమిటీ ముందు హాజరుకాక తప్పదని వాల్‌స్ట్రీట్ జర్నల్ పేర్కొన్నది. ఒకవేళ యూజర్ల వ్యక్తిగత సమాచారం చోరీకి గురైందని తేలితే, ఎఫ్‌టీసీ ఒక్కో వినియోగదారుడి తరపున 40వేల డాలర్ల జరిమానా విధించే అవకాశముందని వాషింగ్టన్ పోస్ట్ వెల్లడించింది. మరోవైపు వినియోగదారులకు అందించే సేవలను పరిమితం చేసినందుకుగాను దక్షిణ కొరియా ఫేస్‌బుక్‌పై భారీగా జరిమానా విధించింది. షరతులు ఉల్లంఘించినందుకుగా 3.69లక్షల అమెరికన్ డాలర్ల మొత్తాన్ని ప్రభుత్వానికి చెల్లించాల్సిందిగా కొరియా కమ్యూనికేషన్ కమిషన్ ఎఫ్‌బీని బుధవారం ఆదేశించింది. సమాచార దుర్వినియోగానికి సంబంధించి ఆరోపణలు వెల్లువెత్తిన నేపథ్యంలో జరిగిన తప్పిదానికి కేంబ్రిడ్జి ఎనలిటికా సంస్థను నిందిస్తూ ఫేస్‌బుక్ బుధవారం ఓ ప్రకటనను విడుదల చేసింది. కేంబ్రిడ్జ్ అనలిటికాను తాము పూర్తిగా నమ్మామని, కానీ ఆ సంస్థ తమను మోసం చేసిందని అందులో ఫేస్‌బుక్ తెలిపింది. ప్రజల వ్యక్తిగత సమాచార భద్రతకు తాము ఇప్పటికీ కట్టుబడి ఉన్నామని పేర్కొన్నది. కాగా, యురోపియన్ కమిషనర్ ఆదేశాల మేరకు జుకర్‌బర్గ్ విచారణకు హాజరుకానున్నారు.

సీఈవోను సస్పెండ్ చేసిన కేంబ్రిడ్జ్ అనలిటికా

వివాదాలు చుట్టుముట్టిన నేపథ్యంలో తన సీఈవో అలెగ్జాండర్ నిక్స్‌పై బ్రిటిష్ సంస్థ కేంబ్రిడ్జ్ అనలిటికా వేటు వేసింది. ఆయనను సస్పెండ్ చేస్తూ సంస్థ యాజమాన్యం నిర్ణయం తీసుకుందని ఓ ప్రకటన విడుదల చేసింది. అంతేకాకుండా వినియోగదారుల సమాచారాన్ని సేకరించే యాప్‌ను తయారు చేసిన కేంబ్రిడ్జ్ యూనివర్సిటీ సైకాలజిస్ట్ అలెగ్జాండర్ కోగెన్‌ను మొత్తం వ్యవహారంలో దోషిగా నిలిపే ప్రయత్నం చేసింది. తనను బలిపశువును చేస్తున్నారని కోగెన్ ఆవేదన వ్యక్తంచేశారు. సామాజిక మాధ్యమం ద్వారా మనుషుల ప్రవర్తనను అంచనా వేసేందుకే యాప్ తయారు చేశానని, కానీ కేంబ్రిడ్జ్ అనలిటికా దానిని ట్రంప్ ఎన్నికల ప్రచారం కోసం వాడిందని ఆయన ఆరోపించారు.

ఇది ఫేస్‌బుక్‌ను డిలీట్ చేసే సమయం

వాట్సాప్ సహ వ్యవస్థాపకుడు బ్రియాన్ ఆక్టన్



ఫేస్‌బుక్ యూజర్ల వ్యక్తిగత సమాచారం దుర్వినియోగమవుతున్నదన్న వార్తల నేపథ్యంలో వాట్సాప్ సహ వ్యవస్థాపకుడు బ్రియాన్ ఆక్టన్ సంచలన వ్యాఖ్యలు చేశారు. వినియోగదారులు ఫేస్‌బుక్ ఖాతాలను రద్దు చేసుకోవాల్సిన సమయం ఆసన్నమైందని పేర్కొన్నారు. 'ఇది ఫేస్‌బుక్‌ను డిలీట్ చేసే సమయం' అంటూ బుధవారం ట్వీట్ చేశారు. జాన్ కౌమ్‌తో కలిసి వాట్సాప్‌ను ప్రారంభించిన ఆక్టన్ గత సెప్టెంబర్‌లో సంస్థనుంచి వైదొలిగారు. కాగా, 2014లో రూ.12.4లక్షల కోట్లకు వాట్సాప్‌ను ఫేస్‌బుక్ కొనుగోలు చేసింది. తాజా వివాదం నేపథ్యంలో '#deletefacebook హ్యాష్‌ట్యాగ్ వైరల్‌గా మారింది.

బాలిక హత్యకేసులో మరణశిక్షకు లాహోర్ హైకోర్టు సమర్థన

లాహోర్: పాకిస్థాన్ వ్యాప్తంగా సంచలనం రేపిన ఏడేండ్ల బాలికపై లైంగికదాడి, హత్య కేసులో నిందితుడికి విధించిన మరణశిక్షను లాహోర్ హైకోర్టు సమర్థించింది. దేశ చరిత్రలోనే తొలిసారిగా కేవలం నాలుగు రోజుల విచారణ అనంతరం.. ఉగ్రవాద వ్యతిరేక న్యాయస్థానం గత నెల నిందితుడు ఇమ్రాన్ అలీ (23)కి మరణశిక్ష విధిస్తూ తీర్పు చెప్పింది. కోర్టు మరణశిక్ష విధిస్తూ ఇచ్చిన తీర్పుపై అలీ లాహోర్ హైకోర్టుకు వెళ్లాడు. దీనిపై విచారణ చేపట్టిన ధర్మాసనం.. వాదనల అనంతరం అలీ విజ్ఞప్తిని తిరస్కరించింది. అలీ ఏడేండ్ల బాలికపై లైంగికదాడి చేసి, హతమార్చి కాసుర్ పట్టణంలోని చెత్తకుప్పలో మృతదేహాన్ని పడేశాడు.జ నవరిలోనిం దితుడిని అరెస్టుచేశారు.

ఫిలిప్పీన్స్‌లో లోయలో పడ్డ బస్సు 19 మంది దుర్మరణం

మనీలా: దక్షిణ ఫిలిప్పీన్స్ ఒక్సిడెంటల్ మిన్‌డోరో ప్రావిన్స్‌లోని సబ్లాయాన్ పట్టణ సమీపంలో ఘోర ప్రమాదం జరిగింది. మంగళవారం రాత్రి ప్రయాణికులతో వెళ్తున్న బస్సు 15 మీటర్ల లోయలో పడింది. ఈ ప్రమాదంలో 19 మంది దుర్మరణం చెందగా, మరో 21 మంది గాయపడ్డారు. రాజధాని మనీలాకు బస్సు వెళ్తుండగా మండోరో ద్వీపంలో బ్రిడ్జి రెయిలింగ్‌ను ఢీకొట్టి లోయలో పడిపోయిందని ఓ అధికారి బుధవారం తెలిపారు. డ్రైవర్ నియంత్రణ కోల్పోయిన కారణంగా బస్సు లోయలో పడిపోయిందని, ప్రమాదం నుంచి ప్రాణాలతో బయటపడ్డవారు తెలిపారన్నారు. మృతుల్లో బస్సు డ్రైవర్ కూడా ఉన్నారు.

ఆస్టిన్ బాంబుపేలుళ్ల అనుమానితుడు ఆత్మహత్య

వాషింగ్టన్: అమెరికాలో ఆస్టిన్ పార్సిల్ బాంబు పేలుళ్ల ఘటనలో అనుమానితుడిగా భావిస్తున్న యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బుధవారం పోలీసులు అతడిని అరెస్టు చేసేందుకు యత్నిస్తుండగా తన కారులో తనను తాను పేల్చుకున్నాడు. అనుమానితుడు మరణించాడని, అతడి లక్ష్యం ఏమిటో తెలియ లేదని ఆస్టిన్ పోలీస్ అధిపతి బ్రియాన్ మాన్లే మీడియాకు తెలిపారు. మార్చి రెండు నుంచి టెక్సాస్ రాజధానిలో ఆస్టిన్‌లో ఐదుచోట్ల బాంబు పేలుళ్లకు పాల్పడి ఇద్దరు చనిపోవడం, మరికొందరు గాయపడటానికి ఈ అనుమానితుడే బాధ్యుడని భావిస్తున్నట్టు ఆయన చెప్పారు.

స్పృహకోల్పోయాకే దవాఖానకు జయ!

జస్టిస్ ఆర్ముగసామి కమిషన్‌కు సమర్పించిన అఫిడవిట్‌లో శశికళ వెల్లడి



చెన్నై: తమిళనాడు మాజీ సీఎం జయలలిత తన నివాసంలోని బాత్రూంలో పడి స్పృహ కోల్పోయిన తరువాతే ఆమెను హాస్పిటల్‌కు తరలించామని ఆమె స్నేహితురాలు శశికళ తెలిపారు. ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో బెంగళూరు కోర్టు దోషిగా 2014 సెప్టెంబర్‌లో నిర్ణయించిన తరువాత జయ ఆరోగ్యం క్షీణించిందని, దాంతో ఆమె 2014 నవంబర్ నుంచి 2016 సెప్టెంబర్ మధ్యన దాదాపు 20 మంది డాక్టర్ల వద్ద చికిత్స తీసుకున్నారని శశికళ పేర్కొన్నారు. జయ మృతిపై నిజనిర్ధారణ కోసం ఏర్పాటైన జస్టిస్ ఆర్ముగసామి కమిషన్‌కు.. 55 పేజీల అఫిడవిట్‌ను గతవారం శశికళ సమర్పించారు. 2016 సెప్టెంబర్ రాత్రి 9 గంటలపుడు జయ తన ఇంట్లోని బాత్‌రూమ్‌లో పడి స్పృహ కోల్పోగా తాను తీసుకువెళ్లి మంచంపై పడుకోబెట్టానని. తరువాత ఆమెను అపోలో హాస్పిటల్‌కు తరలించామని, అప్పుడు కూడా ఆమె స్పృహలో లేరని శశికళ అఫిడవిట్‌లో తెలిపారు. ఆ మరునాడు మాత్రం జయ ఆరోగ్యం బాగుపడి మాట్లాడారని పేర్కొన్నారు. జయ దవాఖానలో ఉండగా నాటి గవర్నర్ సీహెచ్ విద్యాసాగర్ రావు రెండుసార్లు వచ్చి చూశారని, జయ ఆయనను చూసి చేయి ఊపారని పేర్కొన్నారు. నాటి లోక్‌సభ డిప్యూటీ స్పీకర్ ఎం తంబిదురై, కార్మికమంత్రి నిలోఫర్ కఫీల్‌తోపాటు, పలువురు మంత్రులు పార్టీ నాయకులు దవాఖానకు వచ్చారని తెలిపారు. జయ క్రమంగా సాధారణ పోషకాహారం తీసుకొంటూ చిన్న చిన్న వ్యాయామాలు చేశారని, ఉప ఎన్నికల సందర్భంగా అన్నాడీఎంకే అభ్యర్థుల అఫిడవిట్లపై వేలిముద్ర వేసినపుడు జయ స్పృహలోరనే ఉన్నారని పేర్కొన్నారు.

పెరియార్ విగ్రహం ధ్వంసం కేసులో..

సీఆర్పీఎఫ్ జవాన్ అరెస్ట్

చెన్నై/న్యూఢిల్లీ: తమిళనాడులోని పుదుకొట్టి జిల్లాలో ప్రముఖ సంఘ సంస్కర్త, ద్రవిడ ఉద్యమనేత పెరియార్ విగ్రహం ధ్వంసం కేసులో ఓ సీఆర్పీఎఫ్ జవాన్‌ను పోలీసులు అరెస్టుచేశారు. విదుతి గ్రామానికి చెందిన హెడ్ కానిస్టేబుల్ ఎస్ సెంథిల్ కుమార్ (35) ఛత్తీస్‌గఢ్‌లో విధులు నిర్వర్తిస్తున్నాడు. మానసిక సమస్యలతో ఇబ్బంది పడుతున్న ఆయన సెలవుపై సొంతూరికి వచ్చాడు. ఈ నెల 19న విగ్రహాన్ని కుమార్ ధ్వంసం చేసినట్లు సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా గుర్తించిన పోలీసులు ఆయనను అరెస్టు చేశారు. మనోవైకల్యంతో బాధపడుతున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ కేసులో కుమార్ అనే వ్యక్తిని అరెస్టు చేసినట్టు సీఎం పళనిస్వామి బుధవారం ప్రకటించారు. మరోవైపు కోయంబత్తూర్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు సీఆర్ నందకుమార్ ఇంటివద్ద బుధవారం పెట్రోల్ బాంబు దాడి జరిగింది. ఈ ఘటనలో ఎవరికీ గాయాలు కాలేదు.



ఉగ్రవాదులు తలదాచుకున్న ప్రాంతానికి చేరుకుంటున్న సైనిక బలగాలు

కుప్వారాలో భీకరపోరు

ఐదుగురు ఉగ్రవాదుల హతం

అసువులు బాసిన ఐదుగురు భద్రతా సిబ్బంది

శ్రీనగర్: జమ్ముకశ్మీర్‌లోని కుప్వారా జిల్లాలో ఉగ్రవాదులకు, భద్రతా సిబ్బందికి మధ్య భీకర ఎన్‌కౌంటర్ కొనసాగుతున్నది. బుధవారం రాత్రి కడపటి సమాచారం అందే సమయానికి భద్రతా బలగాలు ఐదుగురు ఉగ్రవాదులను మట్టుబెట్టాయి. ఉగ్రవాదుల తూటాలకు ఐదుగురు భద్రతా సిబ్బంది సైతం ప్రాణాలు కోల్పోయారు. సైన్యం కళ్లుగప్పిన ఉగ్రవాదులు సరిహద్దు దాటి ఎనిమిది కిలోమీటర్లు లోపలికి వచ్చారు. తమకోసం ఎదురు చూస్తున్న స్థానిక మిలిటెంట్లతో కలిసి కుప్వారా వైపు బయల్దేరారని, మధ్యలో కనిపించిన సైనికులపై కాల్పులు జరిపారని అధికారులు తెలిపారు. ఉగ్రవాదుల కాల్పుల్లో ఇద్దరు పోలీసులు, ముగ్గురు సైనికులు మరణించారు. సైన్యం ఎదురు దాడికి దిగగా నలుగురు ఉగ్రవాదులు హతమయ్యారు. మిగిలిన ఉగ్రవాదులు తలదాచుకున్న కొండగుహలను సైన్యం చుట్టుముట్టిందని, ఎన్‌కౌంటర్ కొనసాగుతున్నదని అధికారులు తెలిపారు.

13వ రోజూ సాగని చర్చ

రిజర్వేషన్లు పెంచాలని టీఆర్‌ఎస్, ప్రత్యేక హోదాపై టీడీపీ సభ్యుల ఆందోళన

పార్లమెంట్‌లో చర్చకు రాని అవిశ్వాస తీర్మానాలు

న్యూఢిల్లీ: పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలకు 13వ రోజు కూడా అంతరాయం ఏర్పడింది. బుధవారం లోక్‌సభ ప్రారంభం కాగానే రిజర్వేషన్లు పెంచాలని టీఆర్‌ఎస్ సభ్యులు, కావేరి బోర్డు ఏర్పాటు చేయాలని ఏఐఏడీఎంకే సభ్యులు, ఏపీకి ప్రత్యేక హోదా ప్రకటించాలని టీడీపీ సభ్యులు నిరసన తెలిపారు. దీంతో టీడీపీ, వైసీపీ పార్టీలు అందజేసిన అవిశ్వాస తీర్మానాలపై ఎలాంటి చర్చ జరుగలేదు. ఆందోళన నేపథ్యంలో స్పీకర్ సుమిత్ర మహాజన్ సభను పలుమార్లు వాయిదా వేశారు. ఆందోళన కారణంగా అవిశ్వాస తీర్మానాల చర్చకు కావాల్సిన 50 మంది ఎంపీల మద్దతును తాను లెక్కించలేకపోతున్నానని



రాజ్యసభలో వివిధ రాజకీయ పక్షాల ఆందోళన

చెప్పిన స్పీకర్.. సభను గురువారానికి వాయిదా వేస్తున్నానని ప్రకటించారు. మరోవైపు రాజ్యసభ కూడా గందరగోళం మధ్య గురువారానికి వాయిదా పడింది.

మయన్మార్ అధ్యక్ష పదవికి క్యావ్ రాజీనామా

యాంగూన్: మయన్మార్ అధ్యక్ష పదవికి రాజీనామా చేస్తున్నట్లు టిన్ క్యావ్ బుధవారం ప్రకటించారు. మయన్మార్ అధ్యక్షుడి అధికారిక ఫేస్ బుక్ పేజీలో ఈ విషయాన్ని టిన్ క్యావ్ స్పష్టం చేశారు. మయన్మార్ హక్కుల నేత ఆంగ్ సాన్ సూకీకి టిన్ క్యావ్ కుడి భుజంగా ఉండేవారు. విశ్రాంతి తీసుకోవడానికే అధ్యక్ష పదవికి రాజీనామా చేస్తున్నట్లు 71 ఏండ్ల వయసున్న టిన్ క్యావ్ తెలిపారు. వారం రోజుల్లో కొత్త అధ్యక్షుడిని ఎన్నుకోనున్నారు. అప్పటి వరకు ప్రస్తుత ఉపాధ్యక్షుడిగా ఉన్న మ్యింట స్వే తాత్కాలిక అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టనున్నారు.

రాజా, కనిమొళికి ఢిల్లీ హైకోర్టు నోటీసులు

- **2జీ కేసులో సీబీఐ, ఈడీ పిటిషన్లపై విచారణ ప్రారంభం**

న్యూఢిల్లీ: 2జీ స్పెక్ట్రమ్ కుంభకోణం కేసులో కేంద్ర టెలికం శాఖ మాజీ మంత్రి ఏ రాజా, డీఎంకే ఎంపీ కనిమొళితో పాటు ఇతరులకు ఢిల్లీ హైకోర్టు బుధవారం నోటీసులు జారీ చేసింది. సీబీఐ ప్రత్యేక కోర్టు వీరిని నిర్దోషులుగా ప్రకటించడాన్ని వ్యతిరేకిస్తూ సీబీఐ మంగళవారం దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించిన ఢిల్లీ హైకోర్టు ఈమేరకు స్పందన తెలియజేయాలని వారిని ఆదేశించింది. కాగా, మనీల్యాండరింగ్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) బుధవారం ఢిల్లీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈనెల 25 న చేపట్టనున్న ఈ వ్యాజ్యంపై స్పందన తెలియజేయాలని జస్టిస్ ఎస్‌పీ గార్గ్ వారిని ఆదేశించారు. మనీల్యాండరింగ్ కేసులో జప్తు చేసిన రూ.223 కోట్ల విలువైన ఆస్తులపై యథాతథ స్థితి కొనసాగించాలన్న విజ్ఞప్తికి కోర్టు అనుమతించింది.

సమాచారాన్ని ఎందుకు పోగుచేస్తున్నారు?

- **ఆధార్‌పై కేంద్ర సర్కార్‌ను ప్రశ్నించిన సుప్రీంకోర్టు**

న్యూఢిల్లీ: పౌరుల గుర్తింపు కోసమే ఆధార్ పథకం అని చెప్తున్న కేంద్ర ప్రభుత్వం, ఆ పేరు చెప్పి ప్రజల వ్యక్తిగత సమాచారాన్ని ఎందుకు పోగుచేస్తున్నారని సుప్రీంకోర్టు బుధవారం ప్రశ్నించింది. 'మీ లక్ష్యం గుర్తింపే అయితే, అందుకు ఇతర మార్గాలున్నాయి కదా' అని ప్రశ్నించింది. ఈ సందేహాలను నివృత్తి చేసేందుకు ఆధార్ పథకంపై యూఐడీఏఐ సీఈవో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేస్తారని, అందుకు అనుమతివ్వాలని కేంద్రం సుప్రీంకోర్టును అభ్యర్థించింది. ఆధార్ చట్టానికున్న రాజ్యాంగ చెల్లుబాటును సవాలు చేస్తూ దాఖలైన పలు పిటిషన్లపై విచారణ జరుపుతున్న రాజ్యాంగ ధర్మాసనంలోని ఇతర జడ్జీలతో చర్చించిన తరువాత పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ కోసం గురువారం ఒక తేదీని ఖరారు చేస్తామని చీఫ్ జస్టిస్ దీపక్ మిశ్రా చెప్పారు. ఆధార్ సమాచారం ఢిల్లీకి సమీపంలోని మనేసర్‌లో 13 అడుగుల ఎత్తయిన, ఐదు అడుగుల మందం ఉన్న గోడల మధ్య సురక్షితంగా ఉందని అటార్నీ జనరల్ కేకే వేణుగోపాల్ తెలిపారు.

కాబుల్‌లో ఆత్మాహుతి దాడి

29 మంది మృతి

పర్షియన్ నూతన సంవత్సర వేడుకల్లో విషాదం



కాబుల్: అఫ్ఘనిస్థాన్‌లో బుధవారం పర్షియన్ నూతన సంవత్సర వేడుకల్లో హింసాకాండ చోటుచేసుకున్నది. కాబుల్‌లోని షితేల ప్రార్థనా మందిరం వద్ద రోడ్డుపైనే ఐఎస్ ఉగ్రవాది ఆత్మాహుతి దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటనలో 29మంది మృతిచెందారు. మరో 52 మంది గాయపడ్డారు. నడుచుకుంటూ వచ్చిన దుండగుడు తనను తాను పేల్చుకున్నాడు. పర్షియన్ల కొత్త ఏడాది వేడుకల కోసం ఒక్కచోటకు చేరిన షితేలు లక్ష్యంగా దాడికి పాల్పడినట్టు ఐఎస్ ప్రకటించింది. వారాల వ్యవధిలోనే కాబుల్‌లో ఇది ఐదో ఆత్మాహుతి దాడి.



శ్రీరామనవమికి హైదరాబాద్ ముస్తాబవుతున్నది. ఈ నెల 25వ తేదీన జరుగనున్న వేడుకల్లో ప్రతిష్ఠించేందుకు శ్రీరాముడు, సీత, లక్ష్మణుడి విగ్రహాలు సిద్ధమవుతున్నాయి. కళాకారులు వివిధ పరిమాణాల్లో విగ్రహాలను తయారు చేస్తున్నారు. పండుగకు మరో మూడు రోజుల సమయమే మిగిలి ఉండటంతో తుది మెరుగులు దిద్దే పనుల్లో నిమగ్నమయ్యారు.

అమరవీరుల స్మృతివనం ఏర్పాటుకు ముందడుగు

3.29 ఎకరాలను ఆర్అండ్‌బీకి బదలాయించిన హెచ్ఎండీఏ

హుస్సేన్‌సాగర్ చెంతన లుంబినీ పార్కు పరిధిలో స్థలం

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: అమరవీరుల స్మృతివనం ఏర్పాటులో ముందడుగు పడింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు హెచ్ఎండీఏకు సంబంధించిన 3.29 ఎకరాల స్థలాన్ని రోడ్స్ అండ్ బిల్డింగ్స్(ఆర్అండ్‌బీ)శాఖకు బదలాయిస్తూ కమిషనర్ చిరంజీవులు రెండురోజుల కిందట నిర్ణయం తీసుకున్నారు. హైదరాబాద్ నడిబొడ్డున హుస్సేన్‌సాగర్ చెంతన లుంబినీ పార్కు పరిధిలో అత్యాధునిక హంగులతో ఏర్పాటు కానున్న అమరువీరుల స్మృతివనం డిజైన్ల ప్రక్రియను ఇటీవల ఆర్అండ్‌బీశాఖ పూర్తి చేసిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగానే 3.29 ఎకరాల పరిధిలోని లుంబినీ పార్కు క్లాక్ టవర్, లుంబినీ పార్కింగ్ ఏరియా, చిరు వ్యాపార కేంద్రాలు, హెచ్‌సీఐపీ డివిజన్ కార్యాలయం, పవర్ సబ్‌స్టేషన్, టూరిజంశాఖ కార్యాలయం పరిధిని కలుపుతూ హెచ్ఎండీఏ ఆర్అండ్‌బీకి అప్పగించింది. త్వరలోనే అమరవీరుల స్మృతివనం నిర్మాణ పనులపై స్పష్టత రానున్నది.

విదేశీ మద్యం బాటిళ్ల కేసులో పురుషోత్తంరెడ్డి అరెస్ట్

రిమాండ్ విధించడంతో తిరిగి చంచల్‌గూడ జైలుకు తరలింపు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: విదేశీ మద్యం బాటిళ్లు లభించిన కేసులో హెచ్ఎండీఏ మాజీ అధికారి పురుషోత్తంరెడ్డిని బుధవారం అమీర్‌పేట ఎక్సైజ్ పోలీసులు అరెస్ట్‌చేసి కోర్టులో హాజరుపరిచారు. కోర్టు రిమాండ్‌కు ఆదేశించడంతో తిరిగి చంచల్‌గూడ జైలుకు తరలించారు. ఆదాయానికి మించిన ఆస్తుల కేసును ఎదుర్కొంటున్న పురుషోత్తంరెడ్డి ఇంటిని 15 రోజుల కిందట ఏసీబీ అధికారులు సోదా చేయగా 14 విదేశీ మద్యం బాటిళ్లు దొరికాయి. ఏసీబీ అధికారులు ఈ సమాచారాన్ని స్థానిక అమీర్‌పేట ఎక్సైజ్ అధికారులకు తెలిపారు. దీంతో ఎక్సైజ్‌శాఖ అధికారులు పురుషోత్తంరెడ్డిపై కేసు నమోదుచేశారు. ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో చంచల్‌గూడ జైలులో ఉన్న పురుషోత్తంరెడ్డిని కోర్టు అనుమతితో ఎక్సైజ్ పోలీసులు బుధవారం అదుపులోకి తీసుకొని న్యాయస్థానంలో హాజరుపరిచారు. కోర్టు రిమాండ్‌కు ఆదేశించడంతో తిరిగి చంచల్‌గూడ జైలుకు తరలించినట్టు ఎక్సైజ్ అధికారులు తెలిపారు. పురుషోత్తంరెడ్డి జైలు నుంచి విడుదలైన తర్వాత నోటీసులు జారీచేసి విదేశీ మద్యం బాటిళ్ల సమాచారం తెలుసుకోనున్నట్టు ఎక్సైజ్ అధికారులు తెలిపారు.

ప్రైవేట్ ట్రావెల్స్‌పై కొరడా

రాష్ట్రవ్యాప్తంగా చెక్‌పోస్టుల వద్ద 99 బస్సులపై కేసులు నమోదు

రూ.1.61 లక్షల జరిమానా వసూలు

హైదరాబాద్‌లో 17 బస్సులపై రూ.20 వేల ఫైన్

హైదరాబాద్/సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: రాష్ట్రవ్యాప్తంగా ఉన్న రవాణాశాఖ చెక్ పోస్టుల్లో ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులపై రవాణాశాఖ అధికారులు బుధవారం విస్తృతంగా దాడులు నిర్వహించారు. రాష్ట్రంలోని 15 చెక్‌పోస్టుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ చేపట్టిన ఆకస్మిక దాడుల్లో 99 బస్సులపై కేసులు నమోదు చేసింది. జరిమానాల రూపంలో రూ.1,61,500 వసూలు చేసినట్టు జేటీసీ పాండురంగనాయక్ పేర్కొన్నారు. అలాగే హైదరాబాద్‌లోని జేటీసీ నాగోల్ కార్యాలయం పరిధిలో 8 బస్సులు, ఈస్ట్‌జోన్ పరిధిలో 4, సెంట్రల్‌లో 5 బస్సులపై కేసులు నమోదు చేసి, రూ.20 వేలు జరిమానా వసూలు చేసినట్టు జేటీసీ పాండురంగనాయక్ వివరించారు.

చెక్ పోస్టులవారీగా కేసులు

చెక్‌పోస్ట్	కేసుల సంఖ్య	జరిమానా
వాడపల్లి	3	రూ. 4,000
కృష్ణారివర్	18	రూ. 37,000
జహీరాబాద్	46	రూ.60,000
మద్నూర్	3	రూ.2,500
బైంసా	3	రూ.6,000
కోదాడ	11	రూ. 22,000
అలంపూర్	15	రూ.30,000
మొత్తం	**99**	**రూ.1,61,500**





ఓల్డ్‌సిటీలో అభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై సమీక్షిస్తున్న పురపాలకశాఖ మంత్రి కేటీఆర్. చిత్రంలో డిప్యూటీ సీఎం మహమూద్ అలీ, ఎంఐఎం ఎమ్మెల్యేలు అక్బరుద్దీన్ ఒవైసీ, ముంతాజ్ అహ్మద్‌ఖాన్, అహ్మద్ పాషాఖాద్రీ, అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాల, మౌజంఖాన్, మెహెరాజ్ హుస్సేన్, కౌసర్ మొహియొద్దీన్, ఎమ్మెల్సీ సయ్యద్ అమీనుల్ హసన్ జాఫ్రీ, పురపాలకశాఖ కార్యదర్శి అరవింద్‌కుమార్, జీహెచ్ఎంసీ కమిషనర్ జనార్దన్‌రెడ్డి తదితరులు

ఓల్డ్ సిటీ అభివృద్ధికి కృషి

- ఇప్పటికే పెద్ద ఎత్తున ప్రగతి కార్యక్రమాలు
- మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి
- అభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై సమీక్షలో మంత్రి కేటీఆర్
- డిప్యూటీ సీఎం, ఎంఐఎం ఎమ్మెల్యేలు, అధికారులతో భేటీ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్ర ప్రభుత్వం ఓల్డ్‌సిటీ అభివృద్ధికి కట్టుబడి ఉన్నదని, పాత బస్తీలో పెద్దఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నదని పురపాలక, ఐటీశాఖల మంత్రి కే తారకరామారావు పేర్కొన్నారు. బుధవారం అసెంబ్లీ సమావేశాలు ముగిశాక మంత్రి కేటీఆర్ అసెంబ్లీ కమిటీహాల్-2లో డిప్యూటీ సీఎం మహమూద్ అలీ, మజ్లిస్‌పార్టీ శాసనసభాపక్ష నేత అక్బరుద్దీన్ ఒవైసీ, ఆ పార్టీ ఎమ్మెల్యేలు ముంతాజ్ అహ్మద్‌ఖాన్, అహ్మద్ పాషాఖాద్రీ, అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాల, మౌజంఖాన్, మెహెరాజ్ హుస్సేన్, కౌసర్ మొహియొద్దీన్, ఎమ్మెల్సీ సయ్యద్ అమీనుల్ హసన్ జాఫ్రీ, వివిధశాఖల ఉన్నతాధికారులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఓల్డ్ సిటీలో అభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై సమీక్షించారు. పెండింగ్‌లో ఉన్న వాటర్‌వర్క్స్ ప్రాజెక్టులు, మాస్టర్ ప్లాన్, డబుల్‌బెడ్ రూం ఇండ్ల నిర్మాణం, మెట్రోప్రాజెక్టు, చార్మినార్ వద్ద ఫుట్‌పాత్, సాలార్‌జంగ్ బ్రిడ్జి వద్ద వ్యాపారం చేసుకొనేందుకు వీలుగా బ్రిడ్జి నిర్మాణం, ఇతర అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ.. చార్మినార్‌కు సందర్శకుల సంఖ్య పెరిగే అవకాశం ఉన్నదని, టాయ్‌లెట్లు, వాటర్ కియోస్కులు, మహిళల కోసం ప్రత్యేకంగా షీటాయిలెట్లు, పార్కింగ్ సదుపాయాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. త్వరలో చేపట్టనున్న మూసీ సుందరీకరణ, అభివృద్ధి ప్రణాళికల్లో దక్కన్ నిర్మాణ శైలిని దృష్టిలో ఉంచుకోవాలని సూచించారు. హాకర్ల కోసం సాలార్‌జంగ్ మ్యూజియం సమీపంలో మూసీపై నిర్మించనున్న బ్రిడ్జీలను నయాపూల్ బ్రిడ్జి మాదిరిగా డిజైన్ చేయాలని చెప్పారు. ఎమ్మెల్యే విజ్ఞప్తి మేరకు జలమండలి ద్వారా వేసవిలో ఓల్డ్‌సిటీకి ప్రస్తుత సరఫరాకు అదనంగా కనీసం ఐదు ఎంజీడీ (మిలియన్స్ ఆఫ్ గ్యాలన్స్ పర్ డే) నీటిని సరఫరా చేయాలని అధికారులను ఆదేశించారు. తక్కువ నిధులతో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలకు టీయూఎఫ్ఐడీసీ ద్వారా నిధులు ఇస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ఓల్డ్‌సిటీలో మెట్రో ప్రాజెక్టు పూర్తికి ప్రభుత్వం కట్టుబడి ఉన్నదని స్పష్టంచేశారు. రాబోయేరోజుల్లో ప్రజా అవసరాలను దృష్టిలో పెట్టుకొని నాగోల్ నుంచి ఫలక్‌నుమా వరకు, ఫలక్‌నుమా నుంచి ఎయిర్‌పోర్టు వరకు మెట్రో మార్గాలను భవిష్యత్ ప్రణాళికల్లో చేర్చాలన్న ఎమ్మెల్యేల విజ్ఞప్తికి మంత్రి సానుకూలంగా స్పందించారు. వీధుల అభివృద్ధి (ఫాసడ్) కోసం అధికారులు రూపొందించిన పలు డిజైన్లను పరిశీలించారు. ప్రాజెక్టుల పూర్తికి జీహెచ్ఎంసీలోని ఒక ఐఏఎస్ అధికారి ఆధ్వర్యంలో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటుచేస్తామని మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు.

డిప్యూటీ సీఎంతో కలిసి ఎమ్మెల్యేల పర్యటన నేడు

డిప్యూటీ సీఎం మహమూద్ అలీతో కలిసి మజ్లిస్ పార్టీ శాసనసభాపక్ష నేత అక్బరుద్దీన్ ఒవైసీ, ఆ పార్టీ ఎమ్మెల్యేలు గురువారం ఉదయం ఓల్డ్‌సిటీలోని పలు ప్రాంతాల్లో పర్యటించనున్నారు.

ఏడాదిలో లక్ష ఇండ్లు సిద్ధం!

వచ్చే మార్చినాటికి జీహెచ్ఎంసీలో డబుల్ బెడ్‌రూం ఇండ్లు పూర్తిచేసేలా ప్రణాళికలు • ఈ ఏడాది చివరికి అందుబాటులోకి 60 వేలు

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: హైదరాబాద్‌లోని లక్ష మంది నిరుపేదలకు మరో ఏడాదిలో డబుల్ బెడ్‌రూం ఇండ్లు అందనున్నాయి. లక్ష మంది పేదల సొంతింటి కల నెరవేర్చాలన్న ప్రభుత్వ సంకల్పాన్ని వచ్చే మార్చి నాటికి పూర్తి చేయాలని జీహెచ్ఎంసీ సంకల్పించింది. ఈ మేరకు పక్కా ప్రణాళికలు రూపొందించింది. నిర్దేశిత లక్ష ఇండ్లల్లో ఈ ఏడాది చివరినాటికి 60 వేల ఇండ్లను పూర్తిచేసి.. వచ్చే మార్చినాటికి మొత్తం సిద్ధం చేయనున్నారు. ఇప్పటికే ఉప్పల్ నియోజకవర్గం నాచారం పరిధిలోని సింగంచెరువుతండాలో 176 ఇండ్లు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి. మిగతావాటిని వచ్చే మార్చి నాటికి దశలవారీగా పూర్తిచే యనున్నారు.

109 ప్రాంతాల్లో..

జీహెచ్ఎంసీ పరిధిలోని పేదలకోసం 109 ప్రాంతాల్లో లక్ష డబుల్ బెడ్‌రూం ఇండ్లను నిర్మిస్తున్నారు. ఇందులో ఇన్-సిటూ (గుడిసెలను తొలిగించి వాటి స్థానంలో ఇండ్లు నిర్మించి ఇవ్వడం) పద్ధతిలో 41 ప్రాంతాల్లో పనులు జరుగుతున్నాయి. ఇక్కడ 10వేలకు పైగా ఇండ్లను నిర్మిస్తున్నారు. మిగిలిన ఇండ్లను 68 ప్రాంతాల్లోని ఖాళీ స్థలాల్లో నిర్మిస్తున్నారు. ఇందులో భోజగుట్ట, కొల్లూరు వంటి కొన్ని ప్రాంతాల్లో పనులు ప్రారంభం కావాల్సి ఉండగా, మిగతా చోట్ల పనులు వివిధ దశల్లో ఉన్నాయి. కొల్లూరులో మట్టి పనులు కొనసాగుతుండగా, భోజగుట్టలో పనులు చేపట్టాల్సి ఉన్నది. ఉప్పల్ నియోజకవర్గం నాచారంలోని సింగం చెరువుతండాలో ఇప్పటికే 176 ఇండ్లు పూర్తయ్యాయి. ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి. మరో నాలుగు ప్రాంతాల్లో 880 ఇండ్ల నిర్మాణం దాదాపు తుదిదశకు చేరుకున్నది. వాటిని ఈ ఏడాది ఆగస్టు నాటికి పూర్తిచేసేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. అదేవిధంగా సెప్టెంబర్‌లో సుమారు 22 వేలు, డిసెంబర్ నాటికి మరో 36 వేల ఇండ్లను సిద్ధం చేసి.. ఈ ఏడాది చివరినాటికి 60వేల ఇండ్లను ప్రారంభానికి సిద్ధంగా ఉంచాలని అధికారులు నిర్ణయించారు. మిగతా 40వేల ఇండ్లను వచ్చే ఏడాది మార్చికల్లా సిద్ధంచేయాలని ప్రణాళికలు రూపొందించారు. పురపాలకశాఖ మంత్రి కేటీఆర్ ఆదేశాల మేరకు సాధ్యమైనంత త్వరగా నిర్మాణాలు పూర్తి చేసేందుకు పక్కా ప్రణాళికలు రూపొందించామని, వాటికి అనుగుణంగా పనుల్లో వేగం పెంచామని చీఫ్ ఇంజినీర్ సురేశ్ కుమార్ తెలిపారు.

ఇండ్లు, మౌలిక సదుపాయాల ఖర్చు

ప్రాంతాలు	అంతస్తులు	ఇండ్లు	యూనిట్ వ్యయం (రూ.లక్షల్లో)	మొత్తం వ్యయం (రూ.కోట్లలో)
29	జీ+3	10,700	7.75	829.25
18	ఎస్+5	8,282	8.5	703.97
62	సీ+ఎస్+9	81,018	8.65	7,008.057
మొత్తం	109	1,00,000		8,541.277

ఇండ్లు అందుబాటులోకి (అంచనా)

సమయం	ఇండ్లు	ప్రాంతం
ఇప్పటికే సిద్ధమైనవి	176	1
ఆగస్టు	880	4
సెప్టెంబర్	22,000	39
డిసెంబర్	36,000	41
మార్చి	40,944	24



నాచారం సింగంచెరువు తండాలో పూర్తయిన డబుల్ బెడ్‌రూం కాలనీ

జిల్లాలవారీగా నిర్మిస్తున్న ఇండ్ల వివరాలు

జిల్లా	ఇన్-సిటూ.. ప్రాంతాలు/ఇండ్లు	ఖాళీ స్థలాల్లో.. ప్రాంతాలు/ఇండ్లు	మొత్తం ప్రాంతాలు/ఇండ్లు
హైదరాబాద్	34/8,545	2/637	36/9,182
రంగారెడ్డి	4/1,332	28/23,722	32/25,054
మేడ్చల్	3/392	28/37,152	31/37,544
సంగారెడ్డి	0/0	10/28,220	10/28,220
మొత్తం	**41/10,269**	**68/89,731**	**109/1,00,000**

లక్ష ఇండ్ల పురోగతి ఇలా..

పని	ప్రాంతాలు	ఇండ్లు
మట్టి, తవ్వకం పనులు	23	15,952
పునాదులు(పీసీసీ/ఫుటింగ్స్)	20	30,436
ఆర్‌సీసీ ఫ్రేమ్/బ్రిక్ వర్క్స్	47	46,190
పూర్తయినవి	01	176
పనులు మొదలుపెట్టాల్సినవి	18	7,246
మొత్తం	109	1,00,000



కంటెయినర్‌ను ఢీకొనడంతో నుజ్జునుజ్జయిన మినీవ్యాన్

కంటెయినర్‌ను ఢీకొన్న కోళ్ల వ్యాన్

ఔటర్‌పై రోడ్డు ప్రమాదం.. ఇద్దరి మృత్యువాత

ఆదిబట్ల: ఔటర్ రింగ్ రోడ్‌పై వండర్‌లా సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం చెందారు. బుధవారం ఉదయం ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన ఈ ఘటన వివరాలను సీఐ గోవిందరెడ్డి వెల్లడించారు. గ్రేటర్ పరిధిలోని మహేశ్వరం మండలం తుమ్మలూర్‌కు చెందిన డ్రైవర్ గద్దమీది శ్రీశైలం యాదవ్ (47), మహారాష్ట్రకు చెందిన క్లీనర్ కేర్‌బా(35) కలిసి మినీ కోళ్ల వ్యాన్‌లో బొంగుళూర్ నుంచి తుక్కుగూడ వైపు ఔటర్ మీదుగా అతివేగంగా వెళ్తున్నారు. వండర్‌లా సమీపంలోకి రాగానే వారి వాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టి అవతలివైపునకు వెళ్లిపోయింది. అదే సమయంలో శంషాబాద్ నుంచి పెద్దఅంబర్‌పేట్ వైపు వెళ్తున్న కంటెయినర్‌ను ఎదురుగా ఢీకొట్టింది. కంటెయినర్‌ను వెనుక నుంచి మరో డీసీఎం ఢీకొట్టింది. దీంతో కోళ్లవ్యాన్‌లోని శ్రీశైలం, కేర్‌బా అక్కడికక్కడే మృతి చెందగా, కంటెయినర్ డ్రైవర్‌కు గాయాలయ్యాయి.

పెద్దఅంబర్‌పేటలో కారు ఢీకొని ఇద్దరు మృతి



వివరాలు సేకరిస్తున్న పోలీసులు

హయత్‌నగర్: హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో రోడ్డు దాటుతుండగా కారు ఢీకొని ఇద్దరు మృతి చెందారు. మహారాష్ట్రకు చెందిన సుధాకర్ శ్యామ్ రావ్ మోహర్‌లే(50), మరో వ్యక్తి (30) బుధవారం రాత్రి పెద్ద అంబర్‌పేట పరిధిలోని కుంట్లూర్ రోడ్డులో వైన్స్ వద్ద మద్యం కొని రోడ్డు దాటుతున్నారు. అదే సమయంలో విజయవాడ నుంచి వస్తున్న కారు వీరిని బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇరువురూ అక్కడికక్కడే మృతి చెందారు. కారును వదిలి డ్రైవర్‌తోపాటు అందులోని వారు పరారయ్యారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



మేడ్చల్ జిల్లా కండ్లకోయ ఆక్సిజన్ పార్కులో పక్షుల సంరక్షణ కేంద్రానికి బుధవారం అటవీశాఖ మంత్రి జోగు రామన్న శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి, కలెక్టర్ ఎంవీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ భావితరాలకు మనం ఇచ్చే గొప్ప సంపద పచ్చదనమని, భవిష్యత్‌లో సకల జీవరాశి ఆరోగ్యంగా మనుగడ సాగించాలంటే పచ్చదనాన్ని పెంపొందించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉన్నదన్నారు. - మేడ్చల్, నమస్తే తెలంగాణ

గుట్కా రవాణా ముఠా గుట్టురట్టు

- రూ.50 లక్షల విలువైన పొగాకు ఉత్పత్తులు స్వాధీనం
- 19 మంది అరెస్ట్, 11 వాహనాలు సీజ్

శేరిలింగంపల్లి: పొరుగున ఉన్న కర్ణాటక రాష్ట్రం నుంచి హైదరాబాద్‌కు అక్రమంగా గుట్కా ప్యాకెట్లు, నిషేధిత పొగాకు ఉత్పత్తులను రవాణా చేస్తున్న భారీ ముఠాను సైబరాబాద్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అక్రమార్కుల ఎత్తుకు పైఎత్తు వేసిన సైబరాబాద్ పోలీసులు 19 మంది గుట్కా రవాణాదారులను పట్టుకొని, రూ.50 లక్షల విలువైన సొత్తును స్వాధీనం చేసుకున్నారు. మాదాపూర్ జోన్ డీసీపీ విశ్వప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. సైబరాబాద్ ఎస్‌వోటీ పోలీసుల ఆధ్వర్యంలో ఆర్సీపురం, చందానగర్ పోలీసుల సహకారంతో బుధవారం తెల్లవారుజామున నగర శివారు పరిధిలో దాడులు నిర్వహించారు. అక్రమంగా గుట్కా తరలిస్తున్న మొత్తం 11 కార్లను సీజ్ చేసి అందులో ఉన్న రూ.50 లక్షల విలువైన మిరాజ్, సాగర్, ఆర్ఆర్ గుట్కా, ఆర్ఆర్ పాన్‌మసాలా వంటి సంస్థల గుట్కా ప్యాకెట్లు, పొగాకు ఉత్పత్తులను స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడిలో కుషాయిగూడకు చెందిన రమేశ్(47), నేరెడ్‌మెట్‌కు చెందిన అనిల్(25), పెద్దపల్లి జిల్లాకు చెందిన చొల్లేటి రాకేశ్(25), కరీంనగర్‌కు చెందిన సోమ రమేశ్(34), ఎం రమేశ్(47), చాంద్రాయణగుట్టకు చెందిన ఎండీ షకీల్ అహ్మద్(47), బండ్లగూడకు చెందిన అంజ్జద్ అలీ(52), జహీరాబాద్‌కు చెందిన ఎండీ గౌస్(31), అంమ్జద్(19), అబ్దుల్ సమీ(30), జగద్గిరిగుట్టకు చెందిన షేక్ ఇర్ఫాన్ పాషా(25), బీదర్‌కు చెందిన జావెద్(30), షేక్ ఫారుఖ్(20), ఆర్సీపురానికి చెందిన భరత్(24), చందానగర్‌కు చెందిన సయ్యద్ సల్మాన్(22), బీదర్‌కు చెందిన సమీర్(22), ఫైజుద్దీన్(28), జీడిమెట్లకు చెందిన సత్తుఖాన్(28), దినేశ్‌కుమార్(38) పట్టుబడ్డారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రంలో పలు పొగాకు ఉత్పత్తులు, గుట్కా ప్యాకెట్లను నిషేధించిన విషయం తెలిసిందే. కొంతమంది అక్రమార్కులు నిషేధం లేని కర్ణాటక రాష్ట్రం నుంచి గుట్కా ఉత్పత్తులను అక్రమంగా రవాణా చేస్తూ హైదరాబాద్‌తో పాటు కరీంనగర్ తదితర ప్రాంతాల్లో విక్రయిస్తున్నారు. ఈ విషయమై పోలీసులు గట్టి నిఘా ఏర్పాటు చేయగా, అక్రమార్కులు రవాణా కోసం కొత్త పంథాను ఎంచుకున్నట్టు తేలింది. లారీలు, ఆటోల్లో తరలిస్తే పోలీసులు పసిగడుతున్నారని భావించి ఖరీదైన కార్లను ఉపయోగించుకొంటూ అక్రమ రవాణాకు తెరలేపారు. స్కోడా, ఇన్నోవా, మారుతి స్విఫ్ట్ వంటి కార్లలో గుట్కా ప్యాకెట్లను తరలించసాగారు. ఈ విషయమై సమాచారం అందుకున్న సైబరాబాద్ పోలీసులు వలపన్ని ఈ ముఠా గుట్టును రట్టు చేశారు.



సైబరాబాద్ పోలీసులు స్వాధీనం చేసుకున్న సొత్తుతో నిందితులు



టీనేజ్‌లో ఏం తింటున్నారు?

ఎదిగే పిల్లలకు.. ముఖ్యంగా టీనేజ్ పిల్లలకు ఎలాంటి ఆహారం ఇస్తున్నారు? మసాలాతో కూడిన ఆహారాన్ని ఎక్కువగా ఇవ్వొద్దని చెప్తున్నారు నిపుణులు.

బాగా మసాలాలు దట్టించిన కూరగాయలు లేదా రెడీమేడ్‌గా రకరకాల ఫ్లేవర్స్‌తో నోరూరించే ఆహారాన్ని పిల్లలకు అందించొద్దంటున్నారు పెన్సిల్వేనియా పరిశోధకులు. టీనేజీ పిల్లలు తినే ఆహారంపై తాజాగా వారు అధ్యయనం చేశారు. రూరల్ పెన్సిల్వేనియాలోని వేర్వేరు ప్రాంతాలకు చెందిన సుమారు 100 మంది విద్యార్థులపై ఈ అధ్యయనం జరిపారు. వీరిలో ఎక్కువమంది శాఖాహార వంటకాలను ఇష్టపడటం లేదట. వాటిని తిరస్కరించడమో లేదా కొద్ది మోతాదులో తినేసి మిగిలింది వదిలేయడమో చేస్తున్నారట. దాని స్థానంలో బాగా మసాలా దట్టించిన స్పైసీ కూరల్ని పెడితే లొట్టలేసుకుంటూ తింటున్నారట. రుచికి బాగానే ఉన్నా మసాలాలు మెదడుకు మంచివి కావనీ.. వాటి పట్ల పిల్లల్ని ఎంకరేజ్ చేయొద్దని పరిశోధకులు సూచిస్తున్నారు.

బాలికల విద్య కోసం కత్రినా..

ముంబై వేదికగా బాలికావిద్య, లింగ సమానత్వంపై పోరాడుతున్న ఓ ఎన్జీవోకు బాలీవుడ్ నటి కత్రినాకైఫ్ అండగా నిలిచారు.

'దేశంలో బాలికావిద్యను నిర్లక్ష్యం చేస్తున్నారు. తద్వారా లింగభేదాలు పెరిగిపోతున్నాయి. ఆడపిల్లను తల్లిదండ్రులు కచ్చితంగా చదివించాలి. అప్పుడే మంచి సమాజాన్ని చూడగలం. దీన్ని ప్రచారం చేయడానికి నేను సిద్ధంగా ఉన్నా' అని బాలీవుడ్ నటి కత్రినాకైఫ్ అంటున్నారు. ముంబై వేదికగా బాలికవిద్యపై ప్రచారం నిర్వహించడానికి 'ఎడ్యుకేట్ గర్ల్స్' అనే స్వచ్ఛంద సంస్థకు ఆమె అంబాసిడర్‌గా ఉండేందుకు ముందుకొచ్చారు. చదువు ద్వారానే లింగభేదాలను అధిగమించగలమని చెబుతున్నారు. ఎడ్యుకేట్ గర్ల్స్ అనే సంస్థను సఫీనా నిర్వహిస్తున్నారు. ఈ సంస్థ ద్వారా దాదాపు లక్షా 20 వేల మంది బడి మానేసిన బాలికలను మళ్లీ బడికి పంపించారు. 2007 నుంచి ఈ సంస్థ రాజస్థాన్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో 21వేల పాఠశాలను సందర్శించి విద్యార్థినులకు, 12వేలకు పైగా గ్రామీణులకు బాలికా విద్యపై అవగాహన కల్పించారు.




Life is Beautiful

నమస్తే తెలంగాణ

జిందగీ పేజీ పై మీ అభిప్రాయాలు, సలహాలు తెలియజేయండి.

zindagi@ntdaily.news
www.ntzindagi.com
/nt.zindagi

హైదరాబాద్
గురువారం 22 మార్చి 2018
WWW. NTNEWS.COM



నవమి నైవేద్యం

శ్రీహరియే కౌసల్యాపుత్రుడై..
జన్మించిన పర్వదినాన్ని శ్రీరామనవమిగా జరుపుకొంటాం..
ఆ రోజున రామధ్యానం చేస్తే పాపాలన్నీ హరించుకుపోతాయంటారు..
అలాగే ఆ రాముడికి ఇష్టమైన నైవేద్యాలు సమర్పిస్తే..
కోరిన కోరికలు నెరవేరుతాయని పురాణాలు చెబుతున్నాయి..
అందుకే ఆ దేవదేవుడికి పెట్టే నైవేద్యాలను ఈ రోజు ఇస్తున్నాం..
శ్రీరామనవమి రోజున వీటిని చేసి ఆ కోదండరాముడికి నైవేద్యంగా సమర్పించుకోండి..

పానకం



తయారీ :

చింతపండు నానబెట్టుకోవాలి. ఒక గిన్నెలో నీళ్లు పోసి అందులో చింతపండు రసం, శొంఠి, బెల్లం వేసి బాగా కలుపుకోవాలి. బెల్లం కరిగేదాకా కలుపుతుండాలి. ఇందులో యాలకుల పొడి, పచ్చ కర్పూరం, తులసి ఆకులు వేసి బాగా కలుపాలి. లవంగాలను కాస్త పొడిలా చేసి వేయాలి. దీన్ని అరగంట సేపు అలాగే ఉంచాలి. ఆ తర్వాత నైవేద్యంగా సమర్పించి, మీరూ లాగించేయండి. ఎండా కాలం చాలా బాగా పనిచేస్తుంది.

కావాల్సినవి :

చింతపండు : కొద్దిగా, **నీళ్లు :** 2 కప్పులు, **శొంఠి :** అర టీస్పూన్ , **బెల్లం :** పావు కప్పు, **యాలకుల పొడి :** పావు టీస్పూన్, **లవంగాలు :** 2, **పచ్చ కర్పూరం :** చిటికెడు **తులసి ఆకులు :** కొన్ని

చలిమిడి

కావాల్సినవి :

బియ్యం : ఒక కప్పు , **బెల్లం :** 3/4 కప్పు, **గసగసాలు :** 2టే బుల్‌స్పూన్స్, **నువ్వులు :** 2 టేబుల్‌స్పూన్స్ **జీడిపప్పులు :** 20, **కొబ్బరి ముక్కలు :** 2 టేబుల్‌స్పూన్స్ **నెయ్యి :** 2టే బుల్‌స్పూన్స్ **యాలకుల పొడి :** ఒక టీస్పూన్



తయారీ :

రాత్రంతా బియ్యాన్ని నానబెట్టి ఉంచాలి. ఉదయం ఆ నీళ్లను వంపేసి.. ఒక మంచి క్లాత్‌లో ఆ బియ్యాన్ని వేసి నీళ్లు పోయేలా మూట గట్టాలి. అరగంట తర్వాత ఈ బియ్యాన్ని మెత్తటి పొడిలా చేసుకోవాలి. ఒకసారి జల్లెడ పట్టి మళ్లీ మిక్సీలా వేసి మెత్తటి పొడి చేసుకొని పక్కన పెట్టాలి. బెల్లాన్ని తురిమి పెట్టి కడాయిలో నీళ్లు పోసి ఈ తురుముని అందులో వేసి పాకం తయారు చేసుకోవాలి. పాకం చిక్కగా అయ్యాక బియ్యం పిండిని అందులో వేసి మెల్లగా ఉండలు కట్టకుండా కలుపుతుండాలి. దీన్ని సన్నని మంట మీద అలా పెట్టి మరో కడాయిలో నెయ్యి వేసి జీడిపప్పు, కొబ్బరి ముక్కలను వేయించాలి. వీటిని తీసి పక్కన పెట్టి ఇందులోనే నువ్వులు, గసగసాలను వేయించుకోవాలి. ఇలా వేయించుకున్న వాటిని బియ్యం మిశ్రమంలో వేసి కలుపాలి. ఇందులోనే యాలకుల పొడి వేసి ఒక నిమిషం ఉంచి దించేయాలి. కమ్మనైన చలిమిడిని రామయ్యకు ఆరగింపుగా పెట్టండి.!

వడ పప్పు

కావాల్సినవి :

పెసరపప్పు : ఒక కప్పు
కొబ్బరి తురుము : 3 టేబుల్‌స్పూన్స్
పచ్చిమిరపకాయలు : 2
కీరా ముక్కలు : 2 టేబుల్‌స్పూన్స్
నిమ్మరసం : 2 టేబుల్‌స్పూన్స్
ఉప్పు : తగినంత



తయారీ :

పెసరపప్పును గంట పాటు నానబెట్టాలి. ఆ తర్వాత నీళ్లను వంపేయాలి. నీళ్లు అస్సలు లేకుండా చూసుకోవాలి. దీంట్లో కీరా ముక్కలు, కొబ్బరి తురుము, పచ్చిమిరపకాయ, నిమ్మరసం, ఉప్పు వేసి బాగా కలుపుకోవాలి. దీన్ని నైవేద్యంగా ఆ శ్రీరాముడికి సమర్పించుకోవాలి.

వడలు

కావాల్సినవి :

మినపపప్పు : ఒక కప్పు, **శనగపప్పు :** పావు కప్పు, **బియ్యం పిండి :** 2 టీస్పూన్స్, **పచ్చిమిరపకాయలు :** 2, **కొబ్బరి తురుము :** 3 టేబుల్‌స్పూన్స్, **అల్లం :** చిన్న ముక్క, **కరివేపాకు :** 2 రెమ్మలు **కొత్తిమీర :** చిన్న కట్ట, **ఇంగువ :** చిటికెడు, **ఉప్పు, నూనె :** తగినంత



తయారీ :

మినపపప్పు, శనగపప్పులో నీళ్లు పోసి మూడు గంటల పాటు నానబెట్టాలి. నీళ్లు మొత్తం వంపేసి ఈ పప్పులను కలిపి మెత్తగా గ్రైండ్ చేసుకోవాలి. అయితే గ్రైండ్ చేసేటప్పుడు కొద్దిగా నీళ్లు పోసుకోవాలి. పిండి కాస్త గట్టిగానే ఉండాలి కాబట్టి నీళ్లు తక్కువ పోయాలి. ఈ పిండిని ఒక గిన్నెలోకి తీసుకొని ఇందులో పచ్చిమిర్చి, కొత్తిమీర, కరివేపాకు, అల్లం ముక్కలు, ఇంగువ, ఉప్పు, కొబ్బరి తురుము, బియ్యం పిండి వేసి బాగా కలుపుకోవాలి. ఈ పిండిని కాసేపు పక్కన పెట్టాలి. ఈలోపు కడాయిలో నూనె పోసి బాగా వేడిచేయాలి. ఇప్పుడు ఆ మిశ్రమాన్ని చిన్న ఉండలు చేసి ఒత్తుకొని మధ్యలో రంధ్రం చేయాలి. వీటిని నూనెలో వేసి దోరగా వేయించుకోవాలి. రాముడికి ఇష్టమైన వడలు రెడీ!

సంబరం

కావాల్సినవి :

పెరుగు : ఒక కప్పు,
నీళ్లు : 1 1/2 కప్పులు
ఉప్పు : ఒక టీస్పూన్
చిన్న ఉల్లిపాయలు : 2
పచ్చిమిరపకాయ : 1
అల్లం : చిన్న ముక్క
కరివేపాకు : ఒక రెమ్మ



తయారీ :

పచ్చిమిరపకాయలను చిన్న ముక్కలుగా కట్ చేసుకోవాలి. అల్లం చెక్కు తీసి చిన్నగా కట్ చేయాలి. చిన్న ఉల్లిపాయలను ముక్కలు చేసి పెట్టుకోవాలి. ఇప్పుడు పెరుగును చిలికి ఇందులో నీళ్లు పోసి ఉప్పు వేసి కలుపాలి. దీంట్లో ఉల్లిపాయ ముక్కలు, కరివేపాకు, అల్లం, పచ్చిమిర్చి వేసి కలుపుకోవాలి. ఇలా చేసిన మజ్జిగనే సంబరం అని పిలుస్తారు. శ్రీరామనవమి సంబురాల సమయంలో రామునికి ఈ సంబరం నివేదించండి.

నమస్తే తెలంగాణ
విందు
హైదరాబాద్
గురువారం 22 మార్చి 2018



మా మంచి మామిడి!

పండ్లలో అతి మధురమైన, ఎక్కువమంది ఇష్టపడే పండు మామిడిపండు. అందుకే ఈ పండును ఫలరాజం అన్నారు. రుచి మాత్రమే కాదు.. చూడడానికి కూడా చాలా బాగుంటుంది. ఆరోగ్య ప్రయోజనాలు అందించడంలో మామిడిని మించిన పండు లేదు.

- మామిడిలో చాలారకాలున్నాయి. అందులో ఆల్ఫోన్సా, బంగినపల్లి రకాలను చాలామందిఇ ష్టపడుతారు.
- మామిడిపండులో కెరోటిన్, ఎ, ఈ, కె, సి విటమిన్లు, కాల్షియం, నియాసిన్, రిబోఫ్లేవియన్, బి6, థయామిన్, ఫోలేట్, కోలిన్ వంటి పోషకాలు పుష్కలంగా ఉంటాయి.
- మామిడిపండులో 107 కేలరీల శక్తి ఉంటుంది.
- ఒక్క మామిడిపండులో ఐరన్, పొటాషియం, ఫాస్ఫరస్, సోడియం, జింక్, కాపర్, సెలీనియం వంటి ఖనిజాలు కావల్సినన్ని ఉంటాయి.
- ఇందులో ఉండే పెక్టిన్ శరీరంలో పేరుకుపోయిన చెడు కొలెస్ట్రాల్‌నుక రిగిస్తుంది.
- మామిడిలో ఫైబర్, వాటర్ కంటెట్ ఉంటుంది. ఇవి జీర్ణప్రక్రియను సమర్థవంతంగా జరిగేలా చేస్తాయి.
- బరువు పెరుగాలనుకునే వారు రెగ్యులర్‌గా మామిడిపండు తింటే వేగంగా మీ బరువులో మార్పుసం భవిస్తుంది.
- రక్తహీనతతో బాధపడేవారికి మామిడి మంచి ఔషధం.
- క్యారెట్‌తో సమానంగా మామిడి కూడా శరీరానికి కావల్సినంతబీటా కెరోటిన్‌అ ందిస్తుంది.
- ఇది రోగ నిరోధకశక్తిని పెంచి, శరీరంలో పేరుకు పోయిన టాక్సిన్లను బయటకు విడుదల చేసేలా శరీరాన్ని ప్రేరేపిస్తుంది.



డాక్టర్
మయూరి ఆవుల
న్యూట్రిషియనిస్ట్
mayuri.trudiet
@gmail.com



చీకట్లో..ఆకాశంలో... సమాధుల మధ్య...

పుర్రెకో బుద్ధి, జిహ్వకో రుచి అంటారు పెద్దలు. తినే తిండి విషయంలో ఒక్కొక్కరిది ఒక్కో అభిరుచి. వారి అభిరుచికి తగినట్లు ఎన్నో రకాల రుచులను అందించడానికి పలు రకాల రెస్టారెంట్లు పుట్టుకొస్తున్నాయి. కేవలం రుచిలోనే కాదు హోటల్ రూపు రేఖల్లోనూ కొంతమంది డిఫరెంట్‌గా ఉండాలని కోరుకుంటారు. కేవలం మనదేశం లోనే కాదు ప్రపంచ వ్యాప్తంగా ఇలాంటి భిన్నమైన రెస్టారెంట్లు చాలానే ఉన్నాయి. విదేశాలకు టూర్లు వెళితే ఈ హోటల్స్‌ను తప్పకుండా సంర్శించాల్సిందే. వైవిధ్యతను కోరుకునే వారికోసం కొన్ని విభిన్న రెస్టారెంట్ల గురించి ఈ కథనం.

త్రిశంకు స్వర్గంలో...

త్రిశంకు స్వర్గం అనగానే అర్థమైపోయింటుంది. కెనడాలోని మాంట్రియల్ రెస్టారెంట్ లో మీరు డిన్నర్‌ను గాలిలో గురుత్వాకర్షణకు వ్యతిరేకంగా చేయవచ్చు. ఆకాశంలో 160 అడుగుల ఎత్తులో ఏర్పాటు చేసిన ఈ హోటల్‌లో కూర్చొని డిన్నర్ చేసేందుకు ఇక్కడ అవకాశం ఉంటుంది. డిన్నర్ చేయడానికి ఇక్కడికి వెళ్తే ప్రత్యేకంగా బల్లపరుపుగా ఉండి కుర్చీలు వేసిన హోటల్ కనిపిస్తుంది. తక్కువమందికి మాత్రమే అవకాశం ఉండే ఈ హోటల్ నిండగానే గాలిలోకి లేచి వేలాడుతుంది. అందరి భోజనం ముగిశాక తిరిగి కిందికి వస్తుంది.

వింత రెస్టారెంట్లు



పక్షిగూడు రెస్టారెంట్

ఈ రెస్టారెంట్ కూడా ఒకరకంగా ఆకాశంలో ఉన్నట్లే. అయితే చెట్టును ఆధారం చేసుకొని పక్షి గూడు మాదిరిగా నిర్మించిన ప్రత్యేక నిర్మాణంలో ఈ హోటల్స్ ఉంటాయి. వీటిని రెడ్ ఉడ్స్ ట్రీ హౌస్ అని పిలుస్తారు. వివిధ ఆకారాల్లో ఉండే ఇవి గ్రౌండ్ స్థాయి నుంచి 32 అడుగుల పైన ఉంటాయి. పిచ్చుక గూళ్ల మాదిరి గాలిలో వేలాడుతన్నట్లు ఉండే వీటిలో భోజనం చేసేందుకు జనాలు భలే ఇష్టపడుతున్నారట.



కోతులే వెయిటర్స్

సాధారణంగా మనం ఏ హోటల్‌కు వెళ్లిన మనుషులే సర్వ్ చేయడం చూస్తాం. కానీ జపాన్‌లోని కయాబుకియా టావెర్న్‌కు వెళ్తే మాత్రం ఒక వింత అనుభూతిని పొందుతాం. ఉత్సో మోమియాలోని ఈ జపనీస్ రెస్టారెంట్లో రెండు పెంపుడు కోతులు పని చేస్తున్నాయి.. మనుషులు చేసినట్లే ఇవి కస్టమర్లకు అవసరమైన వాటిని సర్వ్ చేస్తుంటాయి. వీటిని చూడడానికే పెద్ద సంఖ్యలో కస్టమర్లు వస్తుండడంతో రెస్టారెంట్ ఎప్పుడూ కళకళలాడుతూ ఉంటుంది.

నీటి లోపల

ఎప్పుడూ భూమిమీదున్న రెస్టారెంట్లో భోజనం చేసి బోరుకొట్టిందా? అయితే ఒకసారి మాల్దీవులకు వెళ్లి రండి. అవును అక్కడ అండర్ వాటర్ రెస్టారెంట్ చాలా ఫేమస్. మాల్దీవుల్లోని హిల్టన్ రిసార్ట్, స్పాకు వెళితే సముద్ర మట్టానికి 5 మీటర్ల లోతులో ఈ రెస్టారెంట్ ఉంటుంది. అయితే ఒక్కసారి 14 మంది కస్టమర్లు మాత్రమే భోజనం చేయగలుగుతారు. అందుకే మన వంతు వచ్చే వరకు వెయిట్ చేయాల్సిందే మరి!





ది టాయిలెట్ రెస్టారెంట్

పిచ్చి.. పీక్స్! టాయిలెట్‌లో కూర్చొని మీరెప్పుడైనా భోజనం చేశారా? ఒకవేళ చేయాలనిపిస్తే మాత్రం తైవాన్ వెళ్లాల్సిందే. అయితే అక్కడ టాయిలెట్‌లో కూర్చోబెట్టరు, కానీ ఆ ఆకారంలో ఉండే హోటల్స్ మాత్రం కనిపిస్తాయి. తైవాన్‌లోని ఈ రెస్టారెంట్‌లో మనం అన్నం తినాలంటే టాయిలెట్ ఆకారంలో ఉండే ప్లేట్‌లో భోజనం తీసుకొస్తారు. అలాగే ఇక్కడ ఉపయోగించే ప్రతి సామగ్రి కూడా టాయ్ లెట్స్ రూపంలో ఉంటాయి. ఈ రెస్టారెంట్ కు ఒకసారి వెళ్తే మీరు కూడా లొట్టలేసుకుంటూ టాయిలెట్స్ ఆకారంలో ఉండే ప్లేట్లలో అన్నం తినొొచ్చన్నమాట. చూడడానికి కొంత వింతగా ఉన్నప్పటికీ ఇది నిజం.




సమాధుల మధ్య

మన దేశంలోని అహ్మదాబాద్‌లో ఉన్న ఈ రెస్టారెంట్‌ను సమాధుల మధ్య నిర్మించారు. హోటల్ నిండా టేబుల్స్ ఉంటాయి. మధ్యలో సమాధులుంటాయి. అయితే వీటి మధ్య కస్టమర్లు టేబుల్స్‌లో కూర్చొని హ్యాపీగా భోజనం చేసి వెళ్తారు. ఇక్కడి స్థానికులకు ఈ హోటల్ అంటే చాలా ఇష్టం. అందుకే ఎప్పుడూ ఇది సందడిగా ఉంటుంది.

ది బబుల్ రూమ్

1979 లో ఫ్లోరిడాలో ఇది ఒక చిన్న భోజనశాలగా ప్రారంభమైంది. ఇప్పుడు మూడు స్టోర్డ్ మల్టీ థీమ్డ్ రెస్టారెంట్ గా మారింది. ఇక్కడ ప్రతి వెయిటర్ డిఫరెంట్ క్రైజ్ టోపీలు ధరిస్తారు. వీరిని బబుల్ స్కౌట్స్ అని పిలుస్తారు. కాస్త డిఫరెంట్‌గా ఉండే ఈ రెస్టారెంట్ అందరినీ ఆకట్టుకుంటున్నది.





చీకటమ్మ చీకటి

సాధారణంగా ఎవరైనా వెలుతురులో కూర్చొని భోజనం చేయాలనుకుంటారు. కానీ చైనాకు వెళ్తే మాత్రం ఒక డిఫరెంట్ రెస్టారెంట్ చూడొొచ్చు. ఈ రెస్టారెంట్ పేరే డార్క్ రెస్టారెంట్. అంటే అందులో అంతా అంధకారమే. అవును పూర్తిగా చీకట్లో కూర్చొని తినాల్సిందే. అయినా ఈ రెస్టారెంట్‌లో తినడానికి చాలామంది క్యూ కడుతున్నారట. అయితే ఇక్కడ వెయిటర్లు మాత్రం చీకట్లో కూడా అందరూ కనబడేటటువంటి కళ్ల జోళ్లు ధరిస్తారు. లేకుంటే వారికి కస్టమర్లు కనపడరు కదా మరి.



ఒకప్పుడు టాలీవుడ్ ఇండస్ట్రీని ఏలింది. ఇప్పుడు కోలీవుడ్‌లో స్థిరపడిపోయింది ముద్దుగుమ్మ. హన్సిక మళ్లీ ఒక డబ్బింగ్ సినిమాతో తెలుగు తెర మీద మెరువనుంది. ఈ సందర్భంగా ఆమెకు నచ్చిన విందు భోజనం గురించి నాలుగు ముచ్చట్లు..

ఇడ్లీలు లాగించేస్తుంది!

ఉత్తర భారతదేశంలో పుట్టి, పెరిగింది కాబట్టి ఆమెకు ఆ వంటకాలంటే మక్కువ ఎక్కువేనట. రాజ్మా-రైస్ ఉంటే ఇంకేమీ ఉండనవసరం లేదంటున్నది హన్సిక. అంతేకాదు.. దక్షిణ భారతదేశంలో అడుగుపెట్టాక ఇడ్లీల మీద ఇష్టం పెరిగిందట. ఇక సాంబార్ తోడైతే ఆ టేస్టే వేరంటున్నదీ బబ్లీ బ్యూటీ. బయట ప్రదేశాలకు వెళితే థాయ్ ఫుడ్ టేస్ట్ చేయడానికి ఇష్టపడుతుంది. ఇవికాకుండా రోజూ స్పెషల్ డైట్ ఫాలో అవుతుంది హన్సిక. ఉదయం రెండు గ్లాసుల నీటితో ఆమె రోజు మొదలవుతుందట. ఆ తర్వాత చక్కెర లేని గ్రీన్ టీ తాగుతుంది. బ్రేక్‌ఫాస్ట్‌గా కప్పు పొప్పడి ముక్కలు తింటుంది. పది పదకొండు గంటలకు మల్టీ గ్రెయిన్స్‌లో మూడు కోడిగుడ్లలోని తెల్లసొనని కలిపి ఆమ్లెట్ వేసుకొని తింటుంది. ఉడికించిన కూరగాయ ముక్కలతో లంచ్ పూర్తి చేస్తుంది. సాయంత్రం స్నాక్స్ లేదా గ్రీన్ టీ బిస్కెట్స్ తింటుంది. సాయంత్రం ఆరు గంటలకే డిన్నర్ కానిచ్చేస్తుందట. సలాడ్‌లతో డిన్నర్ కంప్లీట్. ఇక రోజులో ఎక్కువగా నీళ్లు తాగుతుంది. ఆదివారం మాత్రమే వీటికి చెల్లు చిటీనట. ఆ రోజు తనకు నచ్చిన వాటితో కడుపు నింపేస్తానంటున్నది హన్సిక మోత్వానీ!



కరకరలాడేలా..

- నెయ్యి త్వరగా పేరుకుపోకుండా ఉండాలంటే మీగడ కట్టేటప్పుడు కొద్దిగా నీళ్లు చల్లాలి.
- ఎక్కువ వెల్లుల్లి పాయలు పొట్టు తీయాలంటే వెల్లుల్లిపాయల్ని ఐదు నిమిషాల పాటు గోరువెచ్చని నీటిలో నానబెట్టి, పొడిబట్టతో తుడిస్తే పొట్టు సులభంగా వచ్చేస్తుంది.
- అల్లం ముక్కలు ఎండబెట్టి టీలో వేస్తే టీ రుచికరంగా ఉంటుంది.
- పూరీలు చేసేటప్పుడు తెల్లగా రావాలంటే.. వేడి నూనెలో నాలుగైదు జామ ఆకులు వేస్తే సరి.
- మురుకులు, పకోడి లాంటివి చేసేటప్పుడు కొద్దిగా పిండిలో కొద్దిగా పాలు పోసి పిండి కలుపాలి. ఆ తర్వాత ఉప్పు వేయాలి. అప్పుడే మురుకులు, పకోడి కరకరలాడుతాయి.

పోపుల పెట్టె



కరివేపాకు తింటే కలదు సుఖం!

- కరివేపాకులో శరీరానికి కావాల్సిన కాల్షియం, ఫాస్ఫరస్, ఐరన్, యాంటీ ఆక్సిడెంట్లు, బి విటమిన్, కెరోటిన్ పుష్కలంగా ఉంటాయి. దీనిద్వారా ప్రొటీన్లు, కొవ్వు పదార్థాలు, పీచు పదార్థాలు, ఖనిజ లవణాలు, క్యాలరీలు కూడా లభిస్తాయి.
- స్థూలకాయం కారణంగా వచ్చే మధుమేహాన్ని కరివేపాకు ద్వారా నియంత్రించవచ్చని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు. ప్రతిరోజూ ఉదయమే పది కరివేపాకులు తింటే రక్తంలో చక్కెర శాతం తగ్గుతుందట.
- పిల్లలకు ఆకలి మందగిస్తే.. రోజూ ఉదయం నెయ్యి వేసి కరివేపాకు పొడి కలిపి రెండు ముద్దలు తినిపిస్తే చాలు.. ఆకలి పెరుగుతుంది. ఆజీర్తి తగ్గుతుంది.
- డయేరియా వంటి వాటికి రెండు టీస్పూన్ల కరివేపాకు రసం బాగా పనిచేస్తుంది. కరివేపాకును వేయించి గానీ, ఎండబెట్టిగాని పొడి చేయాలి. దాన్ని తేనెలో కలిపి తీసుకుంటే ఆరోగ్యానికి ఎంతో మంచిది.
- కరివేపాకులో ఉండే యాంటీ ఆక్సిడెంట్స్ యూరిన్, బ్లాడర్ సమస్యలను తగ్గిస్తుంది. కరివేపాకుతో తయారుచేసిన జ్యూస్‌లో కొద్దిగా దాల్చిన చెక్కపొడి చేర్చి తాగడం వల్ల యూరినరీ సమస్యలు చాలా ఎఫెక్టివ్‌గా తగ్గించుకోవచ్చు.

సుడోకు

డైలీ సుడోకు 156 సమాధానం

2	9	4	6	1	5	3	7	8
5	3	7	9	2	8	1	4	6
6	8	1	4	3	7	9	2	5
7	6	5	1	4	9	2	8	3
9	1	2	5	8	3	4	6	7
8	4	3	2	7	6	5	9	1
1	2	8	3	6	4	7	5	9
3	5	6	7	9	2	8	1	4
4	7	9	8	5	1	6	3	2

డైలీ సుడోకు -157

7	4	9			1	3		2
	2		6			4		
6		3	9		4	1	7	
2				8				3
			1				9	
		4		6				
	3		2		8			
				3		8	1	
	7	8	5	9		2		

1. నిలువుగా, అడ్డంగా ప్రతివరుసలోనూ 1 నుంచి 9 వరకు అంకెలను నింపాలి.
2. ఒకసారి రాసిన అంకెను మరోసారి నింపకూడదు.
3. ప్రతి గడిలోనూ నింపిన అంకెను మళ్లీ నింపకూడదు.

సమాధానం రేపటి సంచికలో

ట్వీట్





సమ్మోహనం షూటింగ్ ప్రస్తుతం ఇక్కడే జరుపుకొంటుంది.

సుధీర్ బాబు
@isudheerbabu

సుధీర్ బాబును ట్విట్టర్‌లో ఫాలో అవుతున్న వారి సంఖ్య

462,393

కామన్‌మ్యాన్ వాయిస్

ప్రత్యేక హోదా సాధనలో తమదే పైచేయి అని నిరూపించడం కోసం, వైఎస్సార్సీపీని తక్కువ చేయాలనే తపనలో టీడీపీ, దేశాన్నీ, ప్రధానినీ, న్యాయవ్యవస్థనూ దారుణంగా అవమానిస్తున్నది. మన దేశంలో జ్యుడీషరి పవర్ ఇలా రాజకీయాల నాటకాలకు పనికి వచ్చే వ్యవహారంగా మిగిలిపోవడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం. దేశ పౌరులైనా వీటిని ఖండించాలి.

-విరించివిరి వింటి

ప్రపంచానికి పాఠాలు చెప్పిన నేత, సింపతీ కోసం పాకులాడడం ఎబ్బెట్టుగా ఉంది.

-Chiranjeevi Nimmaraju

ఆనందం అక్కడే ఉన్నా.. మన దరిద్రానికి అవకాశాలు మాత్రం దాని అవతలే ఉన్నయ్. జీవితం ఊరితో ముడిపడి ఉన్నా.. జీతం మాత్రం కాంక్రీట్ జంగల్‌లోనే ఉంది.

-Raj Kotte

వైరల్ వీడియో



కర్బూజ పండు తింటే ఏమవుతుందో తెలుసా? ఎన్ని లాభాలున్నాయో తెలిస్తే షాక్ అవ్వరు కానీ తెలుసుకుంటారని చెబుతున్నదీ వీడియో.

Muskmelon Best Benefits and Uses in telugu

Total views : 251,988+

Published on Mar 19, 2018

నమస్తే తెలంగాణ
రైతుబడి
హైదరాబాద్
గురువారం 7 డిసెంబర్ 2017
గురువారం 22 మార్చి 2018

వేసవిలో మొక్క హార్మోన్ల వాడకం


ఎండాకాలంలో సాగు చేసుకునే కూరగాయలు, పండ్లతోటల్లో పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, అంతగా అందని నీటి తడులతో పూత, కాత రాలిపోతుంది. దీనికి తోడు వైరస్ తెగుళ్ల ఉధృతి పెరుగడం వల్ల సమస్య తీవ్రమైంది. దీని నివారణకు మొక్క వృద్ధి నియంత్రకాలు రైతులు తప్పనిసరిగా వాడాలి.



- ఇందులో మొదటిది ప్లానోఫిక్స్. దీన్ని శాస్త్రీయంగా నాఫ్తలిన్ అసిటిక్ ఆమ్లం అంటారు. నిపుణుల సూచనల మేరకు తగిన మోతాదులో తగిన సమయం వాడాల్సి ఉంటుంది. పూత, కాత రాలడాన్ని తగ్గించడంతో పాటు కూరగాయల, పండ్ల పరిమాణం, నాణ్యత, దిగుబడి పెంచడంలో ఈ వృద్ధి నియంత్రకం ఉపయోగపడుతుంది.
- మిరపలో 2.22 మిల్లీ లీటర్ల ప్లానోఫిక్స్‌ను పది లీటర్ల నీటిలో కలిపి పూత దశలో, తర్వాత పదిరోజులకు మరోసారి పిచికారీ చేయాలి. దీనివల్ల మిరపలో కాయ నిలబడే శాతం పెరుగుతుంది.
- టమాటా, వంకాయలలో పది మి.లీ ప్లానోఫిక్స్‌ను పది లీటర్ల నీటిలో కలిపి తయారు చేసిన ద్రావణాన్ని పూత దశలో ఒకసారి, పదిహేను రోజుల్లో మరోసారి పిచికారీ చేయాలి. దీనివల్ల పూత రాలడం తగ్గుతుంది. కాయల నాణ్యత, దిగుబడి పెరుగుతుంది.
- ఖర్బూజలో కాయ ఏర్పడిన తర్వాత వాటి పరిమాణం, నాణ్యత పెరిగేందుకు 100 పీపీయంల ప్లానోఫిక్స్‌ను 4.5 లీటర్ల నీటిలో కలిపి ఏడు రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి. బత్తాయి, నిమ్మలలో పండ్లు బఠానీ పరిమాణంలో ఉన్నప్పుడు ఒకసారి పిచికారీ చేయాలి. ఇందుకు 2.2 మి.లీ హార్మోన్‌ను పది లీటర్ల నీటిలో కలిపి అందించాలి. మామిడిలో అయితే పిందెను రెండు సెం.మీ వ్యాసార్థం కలిగినప్పుడు ఐదు రోజుల వ్యవధిలో రెండుసార్లు, బఠానీ పరిమాణంలో ఉన్నప్పుడు ఏడు రోజుల వ్యవధిలో రెండుసార్లు, అలాగే పూతకు ముందు, పూత దశలో, పిందె ఏర్పడే సమయంలో ఈ మూడుదశల్లో కచ్చితంగా ఏదో రెండు దశల్లో 4.4 మి.లీ ప్లానోఫిక్స్‌ను 10 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి.
- ఈ హార్మోను కలిపిన ద్రావణాన్ని పిచికారీ చేసే సమయానికి గంట ముందు మాత్రమే తయారు చేసి వాడుకోవాలి. ఉదయం, సాయంత్రం (చల్లని సమయాల్లో) వేళల్లో మాత్రమే పిచికారీ చేయాలి. వేడి వాతావరణంలో ఎట్టిపరిస్థితుల్లో పిచికారీ చేయకూడదు.
- చాలా పురుగు మందులతో కలిపి సైతం ఈ హార్మోనును పిచికారీ చేసుకునే వీలు ఉన్నది. అయితే కేవలం హార్మోను పిచికారీతో ఫలితాలు బాగుంటాయి. ఒక శాతం యూరియాతో కలిపి ప్లానోఫిక్స్‌ను పిచికారీ చేసుకుంటే ఫలితాలు ఇంకా బాగుంటాయి. అయితే ఈ ద్రావణాన్ని తయారు చేసిన వెంటనే పిచికారీ చేయాలి.



-డాక్టర్ అమరపల్లి గీత
శాస్త్రవేత్త (ప్లాంట్ ఫిజియాలజి)
ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం
నాగర్‌కర్నూల్



20 వేల పెట్టుబడి 60 వేల ఆదాయం

సాధారణంగా ఆముదం సాగును వర్షాకాలంలోనే చేస్తారు. కానీ మన శాస్త్రవేత్తలు యాసంగిలోనూ ప్రయోగాత్మకంగా చేపట్టి విజయవంతంగా సాగు చేశారు. ఈ నేపథ్యంలో ఇబ్రహీం పట్నం మండలంలోని శేరిగూడ గ్రామంలో ముద్దు అంజిరెడ్డి అనే రైతు శాస్త్రవేత్తల, వ్యవసాయాధికారుల సూచనల మేరకు యాసంగిలో ఆముదం సాగు చేపట్టారు. అధికారుల సూచనలతో సాగు చేస్తూ మంచి దిగుబడులు సాధిస్తున్నారు.

వర్షాకాలంలో ఆముదం పంట సాగు చేస్తారు. అయితే ఈ కాలంలో పంటకు దాసరి పురుగు, బూజుతెగుళ్లు వంటి రోగా లు వస్తాయి. అయితే అంజిరెడ్డి మూడేండ్లుగా శాస్త్రవేత్తల సూచనల ప్రకారం యాసంగిలో డ్రిప్పు ద్వారా చేస్తున్నారు. యాసంగిలో ఈ పంట చేపట్టడం వల్ల ఎలాంటి చీడపీడలు ఆశించడంలేదని తెలిపారు. దీంతో యాసంగిలో ఆముదంసాగు చేయడం వల్ల ఖర్చు కూడా బాగా తగ్గుతాయి. ఈ వినూ త్న పద్ధతిలో సాగు చేసి మంచి ఫలితాలు పొందారు ముద్దు అంజిరెడ్డి. దీంతో యాసంగిలో ఆముదం సాగు చేయడానికి రైతులు ఆసక్తి చూపుతున్నారు. అంజిరెడ్డి వరుసగా మూడేండ్ల నుంచి యాసంగిలో ఆముదం సాగు చేస్తున్నారు. దీనివల్ల ఖర్చు తగ్గి మంచి దిగుబడులు వస్తున్నాయి. వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తలు కూడా ఆముదం సాగుపై ఎప్పటికప్పుడు సూచనలు, సలహాలు ఇచ్చారు. దీంతో ఎకరాకు 18 నుంచి 20క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చిందని రైతు తెలిపారు.

మూడేండ్లుగా సాగు

అంజిరెడ్డి యాసంగిలో డ్రిప్పుద్వారా గత మూడేండ్లుగా ఆము దం పంటను సాగుచేస్తున్నారు. ఆముదం పంట సాగుకు ఎకరాకు రూ.18 నుంచి రూ.20వేల వరకు ఖర్చు వస్తున్నప్పటికి యాభై నుంచి అరువై వేల వరకు ఆదాయం వచ్చిందని తెలిపారు. మొదటి ఏదాది అంజిరెడ్డి పీసీఎచ్ 1122 రకం ఆము దం పంటను వేశారు. అప్పట్లో ఆయనకు ఎకరాకు పదిహేను నుంచి పదహారు క్వింటాళ్లు మాత్రమే వచ్చాయి. ఆ తర్వాత శాస్త్రవేత్తల సూచనల మేరకు డీసీఎచ్519రకం విత్తనాలు వేశారు. దీనివల్ల ఎకరాకు పదహారు నుంచి పద్దెనిమిది క్వింటాళ్ల దిగుబడి వచ్చినట్టు చెప్పారు. డీసీఎచ్ 519 రకం విత్తనాలు వేసవికి తట్టుకుంటాయన్నారు. అలాగే చీడపీడలు, తెగుళ్లు వంటివి కూడా రావని శాస్త్రవేత్తలు సూచించినట్టు చెప్పారు. పండించిన పంటకు గిట్టుబాటు ధర కూడా లభిస్తున్నది. దీంతో ఈ పంటపైన మక్కువ చూపుతున్నారు. డీసీఎచ్ 519 రకం ఆముదం పంట కేవలం నాలుగు నెలల్లోనే చేతికొస్తుందని శాస్త్రవేత్తలు సూచించారు. దీంతో రైతులు ఈ పంట సాగుపైన చేయడానికి ఆసక్తి చూపుతున్నారు.

తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి

యాసంగిలో నీటి ఎద్దడి ఉంటుంది. దీంతో శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారుల సూచనల మేరకు తనకున్న కొద్దిపాటి నీటితో డ్రిప్పు ద్వారా ఆముదం పంటను సాగుచేశాను. సుమారు నాలుగు ఎకరాల్లో డ్రిప్పుద్వారా ఆముదం పంటను సాగుచేయడం వల్ల తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడులు వచ్చాయి. నాలుగు ఎకరాల్లో ఆముదం సాగుకు సుమారు ఎనభైవేల వరకు ఖర్చు రాగా రెండు నుంచి రెండున్నర లక్షల వరకు ఆదాయం వచ్చింది.

ముద్దు అంజిరెడ్డి, రైతు, 9440318077

అంతర్ పంటగా పప్పు దినుసులు..

యాసంగిలో డ్రిప్పుద్వారా సాగుచేస్తున్న ఆముదం పంటలో అంతర్ పంటలు కూడా వేసుకోవడానికి అవకాశం ఉంటుంది. శాస్త్రవేత్తల సూచనల, సలహాల మేరకు పెసళ్లు, మినుములు, బొబ్బర్లు, కందులు, వంటి అంతర్ పంటలను కూడా సాగుచేస్తున్నారు. అంజిరెడ్డి సాగు చేసిన ఆముదం పంటను అధ్యయ నం చేయడం కోసం అనేక మంది వచ్చారు. వారికి తాను సాగు విధానం గురించి వివరాలు అంజిరెడ్డి తెలియజేస్తున్నారు.

రెండుసార్లు రాష్ట్రస్థాయి అవార్డు..

శేరిగూడ గ్రామంలో ముద్దు అంజిరెడ్డి యాసంగిలో ఆముదం సాగుచేసి అత్యధిక దిగుబడులు సాధించినందుకు గానూ రెండుసార్లు రాష్ట్రస్థాయి అవార్డుకు ప్రభుత్వం ఎంపిక చేసింది. మొదటిసారి ఆముదంసాగులో అధిక దిగుబడులు సాధించినందుకు గానూ ఆయన రాష్ట్రస్థాయి అవార్డుకు ఎంపికయ్యా రు. ప్రస్తుతం ముఖ్యమంత్రి కేసీఆర్ ఆయనకు లక్షరూపాయల ప్రోత్సాహక బహుమతిని అందజేశారు. ఇటీవల రాజేంద్రనగర్ నూనె గింజల పరిశోధన సంస్థ కూడా ఆయనను రాష్ట్రస్థాయి అవార్డుకు ఎంపికచేసింది.



ఎం. శ్రీనివాస్‌రెడ్డి, ఇబ్రహీంపట్నం, 9550256819

సూక్ష్మ సేద్యం మేలు

రాష్ట్రంలో ఏటా 49 లక్షల హెక్టార్ల భూమిని వివిధ పరిస్థితుల్లో సాగు చేస్తున్నారు. ఇందులో సుమారు 60 శాతం భూమి వర్షాధారమే.. (ఇప్పుడు రాష్ట్రంలో నిర్మిస్తున్న సాగు నీటి ప్రాజెక్టులు పూర్తయితే ఇది సగానికిపైగా తగ్గే అవకాశం ఉన్నది.) మిగతాది బోరుబావులు, ప్రాజెక్టుల కింద సాగవుతున్నది. ఎండాకాలం ప్రారంభమైందంటే చాలు భూగర్భజలాలు అడుగంటి పోవడం.. పంటలు ఎండిపోవడం.. పశువులకు పశుగ్రాసం కొరత తదితర పరిస్థితులు తలెత్తుతాయి. ఇలాంటి సందర్భంలోనే రైతులు ఆరుతడి పంటలను ఎంచుకొని నీటి పొదుపు పద్ధతులను పాటించాలి. ఎండాకాలంలో అధిక ఉష్ణోగ్రతను తట్టుకునే పంట రకాలను ఎంచుకొని.. సూక్ష్మసేద్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడి వస్తుంది. మార్కెట్ పరంగా చూసుకన్నా ఎండాకాలంలో కూరగాయలు, ఆకుకూరలు, శుభకార్యాల సీజన్‌లో పూలకు మంచి డిమాండ్ ఉంటుంది. రైతు మొక్కలను చక్కగా కాపాడుకో గలిగతే అధిక లాభాలు పొందే అవకాశం ఉంటుంది.

వరి వంటి తరి పంటలకు నీటి వినియోగం ఎక్కువ.. ఎండాకాలంలో నీటి లభ్యత తక్కువగా ఉంటుంది. ఇలాంటి పరిస్థితుల్లో వరిసాగు చేస్తే నీరందంకనో.. అందినా సరిపడక.. పంట దిగుబడి తగ్గడం.. లేదా ఎండి పోవ డం జరుగుతుంటుంది. అందుకే రైతులు ఆరుతడి పంటలైన కూరగాయా లు, ఆకుకూరలు, పూలు ఎంచుకోవాలి. మొక్కను నీటిని తక్కువగా వినియోగించే సూక్ష్మసేద్య పద్ధతులైన డ్రిప్, స్ప్రింక్లర విధానాన్ని అవలంబించాలి. సంప్రదాయ పద్ధతితో నీటి వినియోగ సామర్థ్యం.. 30 నుంచి 45 శాతం ఉంటే.. తుంపర పద్ధతిలో 55 నుంచి 70 శాతం.. డ్రిప్ పద్ధతిలో 90 నుంచి 95 శాతం ఉంటుంది. ఇందులో పందిరి, షెడ్‌నెట్‌లు వినియోగిస్తే మొక్కలకు ఎండ వేడి నుంచి రక్షణ లభించి అధిక దిగుబడి వస్తుంది.



పంటలు.. రకాలు..

ఆరుతడి పంటల్లో టమాటా, వంకాయ, బెండ, మిరప, గోరుచిక్కుడు, ముల్లంగి, బీట్‌రూట్, క్యాబేజీ, ఎండాకాలం అధిక డిమాండ్ ఉంటే కీరదోస, పందిరి సాగులో దొండ, సోర, కాకర, చిక్కుడు తదితర కూరగాయాలతో పాటు పుదీనా, కొత్తమీర, పాలకూర, మెంతి, పుంటి, తోటకూర.. తదితర ఆకుకూరలు సాగు చేయవచ్చు. ఇందులో ఎండ వేడిమికి తట్టుకునే రకాలను ఎంచుకోవాలి.. ఉదాహరణకు టమాటా (యూఎస్440, అన్నపూర్ణ), మిరపలో జ్వాల.. వంటి రకాలు. వీటితో పాటు గులాబీ, చామంతి, మల్లె, జర్మని తదితర పూలను కూడా సాగు చేయవచ్చు. అయి తే నీటినిల్వను అధికంగా ఉంచుకొనే నల్లరేగడి నేలలు ఈ కాలంలో అనుకూలం. ఎర్ర, ఇతర చల్క నేలల్లో అయితే పందిరి, షెడ్‌నెట్లను వేసుకోవాలి.

డ్రిప్ పద్ధతిలో లాభాలు..

డ్రిప్ పద్ధతి వల్ల సంప్రదాయ పద్ధతిలో ఒక ఎకరాకు ఇచ్చే నీటిని 4 ఎకరాలకు ఇవ్వవచ్చు. సంప్రదాయ పద్ధతిలో కాల్వల ద్వారా వృథా అయ్యే 45 శాతం నీరు... ఈ పద్ధతిలో తగ్గుతుంది. కాలువలు ఉండవు. కాబట్టి భూమి కోతకు గురికాకుండా ఉంటుంది. భూసారంలో సమతుల్యత సాధ్యమవుతుంది. దాదాపు అన్ని కూరగాయలకు ఈ పద్ధతిని పాటించవచ్చు. నీటితో కరిగే ఎరువులు ఫెర్టిగేషన్ విధానం ద్వారా నేరుగా మొక్కకు అందిస్తే 25శాతం ఎరువులు కూడా ఆదా అవుతాయి. కలుపు కూలీ ఖర్చులు, బోదెలు చేయాల్సి అవసరం లేదు కాబట్టి ఆ ఖర్చులు, సమయం ఆదా అవడమే కాకుండా ఉండడమే కాదు.. అవరమైన నీరు మొక్కకు అందుతుంది. దీంతో దిగుబడి కూడా అధికంగా వస్తుంది.

డ్రిప్, స్ప్రింక్లర్ల పరికరాలు ఎలా పొందాలి..?

సూక్ష్మసేద్య సాగు పద్ధతిని ప్రభుత్వమే ప్రోత్సహిస్తున్నది. డ్రిప్, స్ప్రింక్లర్ల పరికరాలను ఎస్సీ, ఎస్టీలకు 100 శాతం, బీసీలకు 90 శాతం, ఇతరులకు 80 శాతం సబ్సిడీపై అందిస్తున్నది. ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కూడా రూ. 127 కోట్లను కేటాయించింది. రైతులు స్థానిక వ్యవసాయాధికారికి దరఖాస్తు చేసుకుంటే.. విచారణ చేసి.. పరికరాలు పొలం వద్ద బిగించి ఇస్తారు.

జాగ్రతలు..

- వేసవిలో తక్కువ నీటితో పాటు వేడిని తట్టుకొనే పంట రకాలు ఎంచుకోవాలి..
- నీటిని పొదుపుగా వాడుకోవాలి. మోటర్లు నిరంతరంగా నడిపించవద్దు.
- ఉదయం సాయంత్రం వేళల్లో మాత్రమే పంటకు నీళ్లివ్వాలి.
- పందిరి, షెడ్‌నెట్‌లాంటి పద్ధతులు అవలంబించాలి.
- బావులు ఉన్న రైతులు ఎలాంటి పంటలు సాగు చేయకపోవడమే మంచిది. ఎందుకంటే ఎండలు ఎక్కువైతే బావి ఎండిపోయే ప్రమాదం ఉన్నది.
- బోరుబావులు ఉన్న రైతులు నీటి లభ్యతను అంచనా వేసి పంటలు వేసుకోవాలి. రెండు మూడెకరాలకు మించి సాగు చేయకపోవడం ఉత్తమం.
- యాసంగిలో ఇప్పటికే వరి వేసిన రైతులు మరోపంట జోలికి పోకపోవడమే మంచిది. ఎందుకంటే మరో పంట వేస్తే.. నీరు సరిపోక ఇటు వరికి.. అటు మరో పంటకు ఇబ్బంది అవుతుంది.

-జూకంటి నరేందర్, 9989382510

సాంద్ర పద్ధతిలో గొర్రెల పెంపకం

దేశంలోనే మటన్ వినియోగంలో తెలంగాణ ప్రథమ స్థానంలో ఉన్నది. మటన్ డిమాండ్‌కు సరిపడా ఉత్పత్తిని సాధించడానికి కావల్సినన్ని గొర్రెల లభ్యత రాష్ట్రంలో లేదు. దీంతో ప్రతిరోజు వేల సంఖ్యలో గొర్రెలను ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి వస్తున్నది. అయితే రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల గొర్రెల పంపిణీ పథకం ప్రవేశపెట్టింది. దీంతో ఆయా వృత్తి కులాలకు ఆర్థిక భరోసా కలుగుతున్నది. అలాగే ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకునే సమస్యను కూడా అధిగమిస్తున్నారు.

మాంసం ఉత్పత్తులపై పరిశోధనకుగాను జాతీయ మాంస పరిశోధన కేంద్రం బోడుప్పల్ పురపాలక సంఘ పరిధిలోని చెంగిచెర్లలో నెలకొల్పబడింది. 2007వ ఏడాదిలో ఏర్పడిన జాతీయ మాంస పరిశోధన కేంద్రంలో మాంస ఉత్పత్తులపై పరిశోధనలు జరుగుతున్నాయి. ఇక్కడ పరిశోధనలకే పరిమితం కాకుండా మాంసం ప్రొడక్ట్‌ల తయారీలో శిక్షణ, మార్కెటింగ్ విధానం, నాణ్యమైన మాంసం తయారీపై శిక్షణ, ప్రత్యేక సదస్సులను నిర్వహిస్తున్నారు. దేశవ్యాప్తంగా ఏకైక 'క్వాలిటీ కంట్రోల్' కేంద్రంగల ఎన్‌ఆర్‌సీఎంలో మాలిక్యూలర్ టెస్టింగ్, యాంటీ బయోటిక్, పురుగు మందుల అవశేషాల నిర్ధారణ పరీక్షలు చేపట్టి నివేదికలు అందజేస్తారు. ఇటీవల మాంస ఉత్పత్తిపై ఎన్‌ఆర్‌సీఎం, క్రీడా సంస్థలు సంయుక్తంగా సేంద్రియ పద్ధతుల్లో గొర్రెల పెంపకంపై పరిశోధనలు చేశాయి. కొన్ని గైడ్‌లైన్స్‌లు రూపొందించి రైతులకు అవగాహన కలిగిస్తున్నాయి.





సాంద్ర పద్ధతిలో అధిక దిగుబడి

రానున్న రోజుల్లో సాంద్ర పద్ధతిలో గొర్రెలు, మేకల పెంపకం వల్ల లాభసాటి వ్యాపారంగా మారనున్నది. కొత్త జనరేషన్‌కు కూడా ఈ విధానం ద్వారా ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయి. పాత పద్ధతిలో(విస్తృత) గొర్రెలు,మేకలు పెంచేవారు. దానికి స్వస్తి పలికి సాంద్ర పద్ధతివైపు దృష్టి సారిస్తే అత్యధిక లాభాలు ఆర్జించవచ్చునని జాతీయ మాంస పరిశోధన కేంద్రం(ఎన్‌ఆర్‌సీఎం) శాస్త్రవేత్తలు తెలుపుతున్నారు. జీవాల్లో ఉత్పాదకతను పెంచుకుంటే 50శాతం అధికంగా మాంసాన్ని ఉత్పత్తి చేసేందుకు వీలుందంటున్నారు. కొత్త జనరేషన్‌కు కూడా ఇది లాభసాటి వ్యాపారంగా ఉంటుందనేది సంస్థ ఉద్దేశం. ఆధునిక పద్ధతుల్లో జీవాల పోషణ చేపట్టి ఎగుమతులను పెంచుకునే వీలున్నది. ఈ విధానంలోనూ రెండు పద్ధతుల్లో పొట్టేళ్లను పెంచుకునే వీలుందని తెలిపారు. 1. పచ్చి మేతతో షెడ్డుల్లో గొర్రెల పెంపకం. 2. బ్రాయిలర్ పద్ధతిలో పెంపకం. మొదటి విధానంలో షెడ్డుల్లో పెంచే పొట్టేళ్లకు అవసరమైన ఆహారాన్ని గడ్డిజాతి, పప్పుజాతి గ్రాసాలను పెంచి వాటిని చిన్నచిన్న ముక్కలుగా కత్తిరించి అందించడం. రెండవ బ్రాయిలర్ పద్ధతిలో సంపూర్ణ దాణాను తయారుచేసుకుని జీవాలకు ఆహారంగా అందివ్వడం.

బ్రాయిలర్ పద్ధతిలో ఉత్పాదకత పెంపు

బ్రాయిలర్ కోళ్ళ ఫారాల మాదిరిగా గొర్రెలు, మేకలను పెంచితే ఉత్పాదకత పెరుగుతుంది. విస్తృత పద్ధతిలో సగటున 10 కిలోల వరకే మాంసం ఉత్పత్తి అయితే బ్రాయిలర్ విధానంలో 15 కిలోల వరకు పెంచుకోవచ్చు. దేశవ్యాప్తంగా ఖాళీ భూముల, గ్రాసం కొరతకు పరిష్కారం బ్రాయిలర్ విధానమే మేలని జాతీయ మాంస పరిశోధన కేంద్రం తాజాగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సిఫార్సు చేసింది. ఈ విధానాన్ని అమలు చేస్తే మేకలు, గొర్రెల మాంసం లభ్యత 30 నుంచి 40 శాతం పైగా పెరుగవచ్చునని ఎన్‌ఆర్‌సీఎం డైరెక్టర్ డాక్టర్ ఎస్. వైద్యనాథన్ అభిప్రాయపడ్డారు.

వెల్లంకి జయపాల్‌రెడ్డి, బోడుప్పల్ 9346984911


సంపూర్ణ దాణా కేంద్రాలు



వాణిజ్యస్థాయిలో గొర్రెలు, మేకల పెంపకాన్ని చేపట్టే వారికి బ్రాయిలర్ పద్ధతి ఎంతో మేలు. ఇందులో అన్ని పోషకపదార్థాలతో సంతులితం చేయబడిన సంపూర్ణ దాణా పాకల్లోనే జీవాలకు అందించవచ్చు. దీనికి సంపూర్ణ దాణా తయారీ యంత్రాన్ని ఏర్పాటు చేసుకోవాలి. ఆర్థిక స్తోమతలేని వారు సమిష్టిగా మండల కేంద్రాల్లో ఏర్పాటు చేసుకోవాలి. మక్కజొన్న, జొన్నలు, వేరుశనగ, తవుడు మొదలైన వాటిలో నిర్దేశించిన పరిమాణంలో ఖనిజ లవణ మిశ్రమం, విటమిన్లు, సూక్ష్మ పోషకాలను ఒకచోట చేర్చి అన్ని కలిసేవరకు మిక్సర్‌తో కలియబెట్టాలి. రాష్ట్ర ప్రభుత్వం గొర్రెల పెంపకాన్ని ప్రోత్సహిస్తున్నది. కాబట్టి బ్రాయిలర్ విధానం శ్రేయస్కరం.

– డాక్టర్ పి. బస్వారెడ్డి, సీనియర్ శాస్త్రవేత్త 9966991274

వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డి యాత్ర



మమ్ముట్టి

దివంగత మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డి జీవితం వెండితెరపై ఆవిష్కృతం కాబోతున్నది. ఆయన పాత్రలో ప్రముఖ మలయాళ నటుడు మమ్ముట్టి నటించనున్నారు. 'ఆనందోబ్రహ్మ' చిత్రంతో గత ఏడాది మంచి విజయాన్ని అందుకున్న మహి.వి.రాఘవ్ ఈ చిత్రానికి దర్శకత్వం వహించనున్నారు. 70 ఎమ్.ఎమ్ పతాకంపై విజయ్ చిల్లా, శశిదేవిరెడ్డి నిర్మించనున్న ఈ సినిమాకు 'యాత్ర' అనే పేరును ఖరారుచేశారు. దాదాపు రెండు దశాబ్దాల తర్వాత మమ్ముట్టి ఈ సినిమాతో తెలుగులో పునరాగమనం చేయబోతున్నారు. నిర్మాతలు మాట్లాడుతూ 'వై.యస్.రాజశేఖర్‌రెడ్డి జీవితంలో జరిగిన కొన్ని ముఖ్య సంఘటనల ఆధారంగా ఈ సినిమాను రూపొందిస్తున్నాం. ఆద్యంతం భావోద్వేగ ప్రధానంగా సాగుతుంది. దర్శకుడు మహి.వి.రాఘవ్ సిద్ధం చేసిన కథ నచ్చడంతో ఈ సినిమాను నిర్మిస్తున్నాం. వై.ఎస్.ఆర్ పాత్రలో మమ్ముట్టి నటించడానికి అంగీకరించడం ఆనందంగా ఉంది. త్వరలో ఈ చిత్రానికి సంబంధించి పూర్తి వివరాల్నివెల్లడిస్తాం' అని తెలిపారు.

చిరుతేజ్‌సింగ్ స్ఫూర్తిగాథ



గిరిజన బాలిక చిరుతేజ్‌సింగ్ జీవిత చరిత్ర ఆధారంగా రూపొందించిన బాలల చిత్రం 'చిరుతేజ్ సింగ్'. డా॥ ఆనంద్‌కుమార్ దర్శకుడు. ఎన్.ఎస్.నాయక్ నిర్మాత. ఈ చిత్రాన్ని ఇటీవల హైదరాబాద్ లో అనాథ పిల్లల కోసం ప్రత్యేకంగా ప్రదర్శించారు. దర్శకుడు మాట్లాడుతూ 'కేవలం మూడు నిమిషాల వ్యవధిలో 236 ప్రపంచ పటాలను గుర్తించి బాల మేధావిగా ఎన్నో పతకాలు, ప్రశంసలు పొందిన చిరుతేజ్‌సింగ్ స్ఫూర్తిదాయక జీవిత చరిత్ర ఆధారంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించాం. తల్లీకూతురు అనుబంధానికి దర్పణంలా వుంటుంది. ప్రతి ఒక్కరి హృదయాల్ని కదిలిస్తుంది' అన్నారు.

సామాన్యుడి 'పంతం'



గోపీచంద్

గోపీచంద్ కథానాయకుడిగా శ్రీ సత్య సాయి ఆర్ట్స్ పతాకంపై రూపొందుతున్న తాజా చిత్రం 'పంతం'. కె.కె. రాధామోహన్ నిర్మిస్తున్నారు. కె. చక్రవర్తి దర్శకుడిగా పరిచయమవుతున్నారు. మెహరీన్ కథానాయిక. ఈ సినిమా ఫస్ట్‌లుక్‌ను బుధవారం చిత్రబృందం విడుదలచేసింది. ఈ సందర్భంగా నిర్మాత మాట్లాడుతూ 'గోపీచంద్ హీరోగా నటిస్తున్న 25వ చిత్రమిది. వాణిజ్య హంగులకు సామాజిక ఇతివృత్తాన్ని మేళవించి రూపొందిస్తున్నాం. అన్యాయాల్ని ప్రశ్నించే ఓ సామాన్యుడి కథ ఇది. అతడి పంతం దేనికోసమన్నది ఆకట్టుకుంటుంది. గోపీచంద్ పాత్రచిత్రణ శక్తివంతంగా ఉంటుంది. గత చిత్రాలకు పూర్తి భిన్నంగా స్టైలిష్‌గా ఆయన కనిపిస్తారు. మెహరీన్ పాత్ర కథకు కీలకంగా ఉంటుంది. 60శాతం చిత్రీకరణ పూర్తయింది. వేసవిలో చిత్రాన్ని విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం' అని తెలిపారు. పృథ్వీ, జయప్రకాష్‌రెడ్డి ముఖ్య పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి ఆర్ట్:ఎ.ఎస్. ప్రకాష్, స్క్రీన్‌ప్లే: కె. చక్రవర్తి, బాబీ, సంగీతం: గోపీసుందర్, సినిమాటోగ్రఫీ: ప్రసాద్ మూరెళ్ల.

రొమాంటిక్ ఎంటర్‌టైనర్!



రామ్‌కుమార్, నిరూప్ భండారి, అవంతిక, సతీష్‌శాస్త్రి

నిరూప్ భండారి, అవంతిక షెట్టి జంటగా నటిస్తున్న తాజా చిత్రం 'రాజరథం'. అనిల్ భండారి దర్శకుడు. తెలుగు, కన్నడ భాషల్లో తెరకెక్కిన ఈ చిత్రాన్ని జాలీ హిట్స్ పతాకంపై అజయ్ రెడ్డి, విషు, అంజు వల్లభ్, సతీష్ శాస్త్రి నిర్మించారు. తమిళ హీరో ఆర్య కీలక పాత్రలో నటించిన ఈ చిత్రం రేపు తెలుగు, కన్నడ భాషల్లో విడుదల కానుంది.

ఈ సందర్భంగా చిత్ర బృందం బుధవారం హైదరాబాద్‌లో ప్రీరిలీజ్ వేడుకను ఏర్పాటు చేసింది. హీరో నిరూప్ భండారి మాట్లాడుతూ ''రాజారథం' ఇదొక రొమాంటిక్ ఎంటర్‌టైనర్. ఇందులో అభి అనే పాత్రలో ఇంజనీరింగ్ స్టూడెంట్‌గా కనిపిస్తాను. మేఘ పాత్రలో అవంతిక కనిపిస్తుంది. సినిమాలో మా ఇద్దరి ప్రేమ కథతో పాటు మరో కథ కూడా వుంటుంది. అది ప్రేక్షకుల్ని సంభ్రమాశ్చర్యాలకులోను చేస్తుంది. సినిమాలోని ఓ కీలక పాత్రలో రానా కనిపిస్తారు. ఆయన పాత్ర ఏంటనేది ప్రస్తుతానికి సస్పెన్స్' అన్నారు. తెలుగు, కన్నడ భాషల్లో మంచి చిత్రాన్ని అందించాలనే తపనతో ఏ విషయంలోనూ రాజీపడకుండా చిత్రాన్ని నిర్మించాం. రెండు భాషల్లోనూ మంచి విజయాన్ని సాధిస్తుందనే నమ్మకముంది. దాదాపు 22 కోట్ల బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని నిర్మించాం' అని రామ్‌కుమార్ తెలిపారు. సతీష్‌శాస్త్రి మాట్లాడుతూ 'అనిల్ భండారి రూపొందించిన 'రంగీతరంగ' చిత్రాన్ని యుఎస్‌ఏలో మేమే విడుదల చేశాం. ఆ సినిమా తరువాత అతనితో కలిసి నిర్మించిన సినిమా ఇది. అంతా ఇది డబ్బింగ్ సినిమా అనుకుంటున్నారు కానీ అది నిజం కాదు. ఈ చిత్రాన్ని ఒకేసారి తెలుగు, కన్నడ భాషల్లో నిర్మించాం. ఇదొక క్లీన్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్. బర్ఫీ, జగ్గా జాసూస్ వంటి బాలీవుడ్ చిత్రాలకు పనిచేసిన కళాదర్శకుడు ఈ చిత్రానికి అద్భుతమైన సెట్‌లు వేశారు. మంచి నిర్మాణ విలువలతో నిర్మించిన ఈ చిత్రం తప్పకుండా తెలుగు ప్రేక్షకుల్ని ఆకట్టుకుంటుంది' అన్నారు. విజువల్ పరంగా కొత్త అనుభూతినిచ్చే చిత్రమిదని కథానాయిక అవంతిక షెట్టి తెలిపింది.



అసెంబ్లీ ఆవాజ్



జీహెచ్ఎంసీలో 826 ఆధునిక బస్సుషెల్టర్లు

- నాలుగు గ్రేడ్లుగా నిర్మాణాలకు చర్యలు
- శాసనమండలిలో మంత్రి కేటీఆర్



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో పీపీపీ పద్ధతిలో నాలుగుగ్రేడ్లుగా మొత్తం 826 ఆధునిక బస్సు షెల్టర్లను ఏర్పాటుచేస్తున్నామని మున్సిపల్‌శాఖ మంత్రి కే తారకరామారావు చెప్పారు. శాసన మండలిలో బుధవారం సయ్యద్ అమీనుల్ హసన్ జాఫ్రీతోపాటు పలువురు సభ్యులు అడిగిన ప్రశ్నలకు కేటీఆర్ సమాధానం ఇచ్చారు. గ్రేడ్-1 బస్సు షెల్టర్లలో ఏసీ, డస్ట్‌బిన్, మొబైల్ చార్జింగ్, వైఫై, టికెట్ మిషన్ వంటి అత్యాధునిక వసతులు ఉంటాయని చెప్పారు. గ్రేడ్-2, గ్రేడ్-3, గ్రేడ్-4 క్యాటగిరీల్లో ఆధునిక బస్సు షెల్టర్ల నిర్మాణాలు జరుగుతున్నాయని, 180 రోజుల్లో వీటిని నిర్మిస్తామని పేర్కొన్నారు. జీహెచ్ఎంసీ పరిధిలో 1,221 బస్సు షెల్టర్లు ఉండగా, మరో 47 బస్సు బేల నిర్మాణాలకు సైట్‌ను గుర్తించామని తెలిపారు. జీహెచ్ఎంసీ పరిధిలో స్ట్రాటజిక్ రోడ్ల నిర్మాణాల కోసం రూ.వెయ్యికోట్లను బాండ్ల ద్వారా సమీకరిస్తున్నామని కేటీఆర్ తెలిపారు. అందులోభాగంగా ఉప్పల్ - వరంగల్ మార్గంలో స్కైవేల నిర్మాణానికి కేంద్రం అనుమతి లభించిందని, టెండర్ల ప్రక్రియ కొనసాగుతున్నదని చెప్పారు. రాజీవ్ రహదారి, ఆదిలాబాద్‌లో రోడ్ల నిర్మాణాల కోసం కంటోన్మెంట్ 160 ఎకరాల భూమికి సంబంధించి సమస్యలు వస్తున్నాయని, దీనిపై రాష్ట్రానికి చెందిన ముగ్గురు మంత్రులు కోరినా రక్షణశాఖ పట్టించుకోకుండా ఇబ్బందులు పెడుతున్నదని పేర్కొన్నారు. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం ఇచ్చి పుచ్చుకునే ధోరణి అవలంబించడంలేదని కేటీఆర్ ఆవేదన వ్యక్తంచేశారు. దేశంలో మంచి పేరున్న మర్సర్స్ అనే సంస్థ జీహెచ్ఎంసీకి నంబర్‌వన్ రేటింగ్ ఇచ్చిందని చెప్పారు. స్ట్రాటజిక్ రోడ్ల నిర్మాణాలకు సంబంధించి రూ.23 వేలకోట్ల పనులు వివిధ నిర్మాణాల దశలో ఉన్నాయని వివరించారు. జీహెచ్ఎంసీ అభివృద్ధి కోసం బాండ్ల రూపంలో రూ.వెయ్యి కోట్లను సేకరిస్తున్నామని, అయితే అందుకు సెబీ అనుమతి ఇవ్వాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

మూడుశాఖల పద్దులపై ముగిసిన చర్చ

- పద్దులకు అసెంబ్లీ ఆమోదం
- సభ్యులకు వివరణ ఇచ్చిన మంత్రులు తలసాని, పోచారం, ఈటల

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: పశు సంవర్ధక, వ్యవసాయ, సహకార, పౌరసరఫరాల పద్దులపై సుదీర్ఘంగా చర్చించిన అసెంబ్లీ బుధవారం ఆ పద్దులకు ఆమోదం తెలిపింది. చర్చ సందర్భంగా సభ్యులు లేవనెత్తిన పలు అంశాలకు సంబంధిత శాఖల మంత్రులు సమాధానం ఇచ్చారు. పద్దులను ఆమోదించాల్సిందిగా సభ్యులను కోరారు. మంత్రుల సమాధానాలకు సంతృప్తి చెంది సభ్యులు పద్దులను ఆమోదించారు. అనంతరం స్పీకర్ స్థానంలో ఉన్న ఉపసభాపతి పద్మాదేవేందర్‌రెడ్డి అసెంబ్లీని గురువారం ఉదయం 10 గంటలకు వాయిదా వేశారు.

కేసీఆర్ సీఎం అయ్యాకే మార్పువచ్చింది: తలసాని

రాష్ట్రం ఏర్పడిన తరువాత గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు అభివృద్ధి చెందాలని, గ్రామీణ ఆర్థికవ్యవస్థ మెరుగుపడాలని సీఎం కేసీఆర్ రూ.5 వేల కోట్లతో గొర్రెల పంపిణీ పథకం అమలుచేస్తున్నారని, మత్స్యకారుల కోసం చేపపిల్లలు ఉచితంగా పంపిణీ చేయించారని పశుసంవర్ధకశాఖ మంత్రి తలసాని శ్రీనివాసయాదవ్ అన్నారు. బడ్జెట్ పద్దులపై మంత్రి తలసాని మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడి, కేసీఆర్ సీఎం అయ్యాక గొల్లకురుమలు, గంగపుత్రులు, ముదిరాజ్‌లు, డెయిరీ మీద ఆధారపడిన రైతులలో ప్రధాన మార్పు వచ్చిందన్నారు. ఈ శాఖకు కేటాయించిన రూ.1126.73 కోట్ల పద్దును ఆమోదించాలని సభ్యులకు విజ్ఞప్తి చేశారు.

కేసీఆర్ సీఎం కావడం రైతుల అదృష్టం: మంత్రి పోచారం

నిత్యం రైతుల గురించి ఆలోచించి, వారికోసం కష్టపడి పనిచేసే కేసీఆర్ ముఖ్యమంత్రి కావడం తెలంగాణ రైతాంగం చేసుకున్న అదృష్టమని వ్యవసాయశాఖ మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి అన్నారు. దేశంలో ఏ రాష్ట్రం తీసుకోని విధంగా సీఎం కేసీఆర్ రైతు సంక్షేమం కోసం చర్యలు తీసుకున్నారన్నారు. సీఎం కేసీఆర్ రైతు బిడ్డనే కాదు.. స్వయంగా వ్యవసాయం చేసిన రైతు. మంత్రి కేటీఆర్ ఒక ఊరికి వెళ్లినప్పుడు ఒక అవ్వ మీ నాన్నతో కలిసి మోట తోలానని చెప్పిన విషయాన్ని గుర్తుచేసిందని అన్నారు. ఆయన రైతు కాబట్టే రైతుల కోసం పనిచేస్తున్నారని చెప్పారు. ఈ ఏడాది వర్షాలు బాగా కురుస్తాయని వార్త రాగానే సీఎం కేసీఆర్ తనకు ఫోన్ చేసి సిద్ధంగా ఉండమని చెప్పారని గుర్తుచేశారు. ఈ సందర్భంగా రాజుల భోగాలు, ఇతరుల ఆడంబరాలన్నీ రైతులు బాగుంటేనే అన్న శ్రీశ్రీ కవితను ఈ సందర్భంగా మంత్రి పోచారం చదివి వినిపించారు. వ్యవసాయశాఖకు కేటాయించిన రూ.12,734.07 కోట్ల పద్దును ఆమోదించాలని సభను కోరారు.



మంత్రులు తలసాని, పోచారం, ఈటల

ఆ బిల్లును ఆమోదింపజేయండి: పోచారం

తెలంగాణలో నకిలీ విత్తనాలపై కొరడా ఝుళిపించడంతోపాటు పీడీ యాక్టుతో అక్రమార్కులను జైలులో వేశామని వ్యవసాయశాఖ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శాసనసభలో బుధవారం వ్యవసాయ, సహకార, పశుసంవర్ధక, మత్స్య, పౌరసరఫరాల శాఖ పద్దులపై జరిగిన చర్చల్లో భాగంగా బీజేపీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి నకిలీ విత్తనాల అంశాన్ని ప్రస్తావించారు. దీనికి పోచారం బదులిస్తూ.. ఈ దందాను దేశవ్యాప్తంగా అరికట్టే చట్టసవరణ బిల్లు కేంద్రం వద్ద పెండింగులో ఉన్నదని.. బీజేపీ ఎమ్మెల్యే కేంద్రమంత్రిని కలిసి బిల్లు ఆమోదం పొందేలా చొరవ తీసుకోవాలని సూచించారు.

అందరికి గ్యాస్: మంత్రి ఈటల

రాష్ట్రంలో ప్రతి ఒక్కరికి గ్యాస్ ఇచ్చేలా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి ఈటల రాజేందర్ తెలిపారు. కొత్త రేషన్‌కార్డులు నిలుపుదల చేయలేదన్నారు. రెండున్నర లక్షల కొత్త రేషన్‌కార్డులకు దరఖాస్తులు వస్తే వాటిల్లో 77 వేలు మంజూరు చేశామన్నారు. మిగతావాటిని కూడా పరిశీలించి అర్హులైన వారికి ఇస్తామని తెలిపారు. 'కొత్త కార్డులను ఏప్రిల్‌లోనే ఇచ్చే జిమ్మేదారి మాది' అని ఈటెల తెలిపారు.

ప్రతిఒక్కరూ కాళేశ్వరం ప్రాజెక్టు చూడాలి



- ఎమ్మెల్సీల పర్యటన ఏర్పాట్లపై సీఎంకు ధన్యవాదాలు
- మండలి చైర్మన్ స్వామిగౌడ్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టి నిర్మిస్తున్న కాళేశ్వరం ప్రాజెక్టును కండ్లున్న ప్రతిఒక్కరు చూడాల్సిందేనని మండలి చైర్మన్ స్వామిగౌడ్ అన్నారు. బుధవారం బడ్జెట్ సమావేశంపై చర్చ జరిగిన అనంతరం మాట్లాడుతూ, మండలిలోని 35 మంది సభ్యుల కాళేశ్వరం ప్రాజెక్టు పర్యటన ఏర్పాట్లు చేసినందుకు ముఖ్యమంత్రి కేసీఆర్‌కు, నీటిపారుదలశాఖ మంత్రి హరీశ్‌రావుకు సభ తరఫున ధన్యవాదాలు తెలిపారు. ఎత్తిపోతల పథకం ప్రాజెక్టు కట్టడం అద్భుతంగా ఉన్నదని, ఈ ప్రాజెక్టు చూడడానికి రెండుకండ్లు చాలవని అన్నారు. పార్టీలకు అతీతంగా కాళేశ్వరం ప్రాజెక్టును చూసేందుకు ఎంఐఎం, కాంగ్రెస్, బీజేపీ, టీఆర్‌ఎస్ సభ్యులు కలిసి వచ్చారని చెప్పారు. త్వరలోనే మహబూబ్‌నగర్, ఖమ్మం జిల్లాల్లో కడుతున్న సాగునీటి ప్రాజెక్టులను కౌన్సిల్ సభ్యులంతా కలిసి మరోమారు సందర్శిస్తారని తెలిపారు. అనంతరం సభను గురువారం ఉదయం 10 గంటలకు వాయిదా వేస్తున్నట్టు చైర్మన్ స్వామిగౌడ్ ప్రకటించారు.

ప్రశ్నోత్తరాల సమయం

మధ్యాహ్న భోజన పథకంపై నిరంతర నిఘా

- శాసనమండలిలో డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి వెల్లడి



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో మధ్యాహ్న భోజన పథకంలో జరుగుతున్న అవకతవకల నియంత్రణ కోసం నిరంతరం నిఘా పెడుతామని డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి చెప్పారు. అందుకోసం విజిలెన్స్ విభాగాన్ని ఏర్పాటుచేస్తామని పేర్కొన్నారు. బుధవారం శాసనమండలిలో సభ్యులు అడిగిన పలు ప్రశ్నలకు కడియం సమాధానం ఇచ్చారు. వచ్చే విద్యాసంవత్సరం (2018-19) నుంచే తెలుగుభాషను ఒకటి నుంచి పదోతరగతి వరకు తప్పనిసరి బోధనాంశంగా అమలుచేయాలని సీఎం కేసీఆర్ నిర్ణయం తీసుకున్నారని డిప్యూటీ సీఎం కడియం తెలిపారు. ఈ అంశంపై మండలిలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇస్తూ.. తెలుగుభాషను ఇంటర్మీడియట్ వరకు అమలు చేయాలని ప్రభుత్వం తొలుత భావించినప్పటికీ అది సాధ్యం కాలేదని చెప్పారు.

సోలార్ ప్లాంట్ల నిర్మాణ బాధ్యత కేంద్రానిదే

- మండలిలో మంత్రి జీ జగదీశ్‌రెడ్డి



సోలార్ ప్లాంట్ల నిర్మాణాల బాధ్యత పూర్తిగా కేంద్ర ప్రభుత్వానిదేనని రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి జీ జగదీశ్‌రెడ్డి పేర్కొన్నారు. ఇందులో రిజర్వేషన్లు పాటించడం సాధ్యంకాదని స్పష్టంచేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి పైసాను రిజర్వేషన్లకు అనుకూలంగా ఖర్చుపెడుతూ చరిత్ర సృష్టిస్తున్నదని, ఈ ఘనత సీఎం కేసీఆర్‌దేనని చెప్పారు. బుధవారం శాసనమండలిలో సభ్యులు రాజేశ్వరరావు, రాములు నాయక్ అడిగిన ప్రశ్నలకు జగదీశ్‌రెడ్డి సవివరంగా సమాధానం ఇచ్చారు. సౌర విద్యుత్ ప్లాంట్ల నిర్మాణాల్లో డాక్యుమెంట్స్‌తో నియమ నిబంధనలను రూపొందించే ప్రక్రియ కేంద్రం అజమాయిషీలో ఉన్నదని, అందులో రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకోదని పేర్కొన్నారు. కేంద్రం నుంచి వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొన్న రాష్ట్ర ప్రభుత్వం 1,617 సౌరకేంద్రాల ద్వారా 3046.88 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తితో దేశంలోనే అగ్రభాగాన నిలిచిందని తెలిపారు. సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు లైన్‌లాసెస్ లేకుండా సమీపప్రాంతాల్లోని సబ్‌స్టేషన్లకు సౌర విద్యుత్‌ప్లాంట్లను అనుసంధానించడమే అందుకు కారణమని కొనియాడారు.

మరో 12 నవజాత శిశు సంరక్షణ యూనిట్లు

- మంత్రి లక్ష్మారెడ్డి



రాష్ట్రంలో ప్రస్తుతం పనిచేస్తున్న 23 ప్రత్యేక నవజాత శిశు సంరక్షణ యూనిట్లకు అదనంగా 2018-19 సంవత్సరంలో 12 కొత్త యూనిట్లు ఏర్పాటు చేస్తామని వైద్యారోగ్యశాఖ మంత్రి లక్ష్మారెడ్డి బుధవారం అసెంబ్లీలో వెల్లడించారు. ప్రస్తుతం 57 నవజాత శిశు సుస్థిరత యూనిట్లు, 562 నవజాత శిశు కేర్ కర్నార్స్, 22 కంగారు మదర్ కేర్ యూనిట్లు, లాక్టేషన్ మేనేజ్‌మెంట్ యూనిట్లు ఉన్నట్లు చెప్పారు. హైదరాబాద్‌లోని నీలోఫర్ దవాఖానలో సమగ్ర లాక్టేషన్ మేనేజ్‌మెంట్ కేంద్రం ఏర్పాటుతోపాటు వరంగల్, నల్లగొండలకు లాక్టేషన్ మేనేజ్‌మెంట్ యూనిట్లను మంజూరు చేశామని, పనులు ప్రారంభించాల్సి ఉన్నదని స్పష్టం చేశారు. బుధవారం ప్రశ్నోత్తరాల సమయంలో ఎమ్మెల్యేలు రాజేందర్‌రెడ్డి, చింతా ప్రభాకర్, అజయ్‌కుమార్ పువ్వాడ అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానం చెప్పారు.

పాడి పరిశ్రమను నాశనం చేసిన గత ప్రభుత్వాలు

- మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్



వ్యవసాయం, పాడి పరిశ్రమ రెండు ఎంతో ముఖ్యమని, అయితే గత ప్రభుత్వాలు ఈ రెండింటిని నాశనం చేశాయని పాడి, పశుసంవర్ధకశాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. పాడి పరిశ్రమను బాగు చేసేందుకు, రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం అన్నివిధాలా చర్యలు తీసుకుంటుందని చెప్పారు. రాష్ట్రంలో పాల ఉత్పత్తి మొత్తం పరిమాణం రోజుకు 105.68 లక్షల లీటర్లు ఉండగా, వినియోగం రోజుకు 123.73 లక్షల లీటర్లు అని వివరించారు. బుధవారం శాసనసభలో ఎమ్మెల్యేలు శ్రీనివాస్‌గౌడ్, సోలిపేట రామలింగారెడ్డి అడిగిన ప్రశ్నలకు మంత్రి తలసాని సమాధానం చెప్పారు.

శాసనసభలో పలు బిల్లుల ప్రతిపాదనలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణ పోలీస్ (పోలీస్ డైరెక్టర్ జనరల్, పోలీస్ బలగాల అధిపతి ఎంపిక, నియామకం) - 2018 బిల్లును బుధవారం శాసనసభలో మంత్రి హరీశ్‌రావు ప్రతిపాదించగా సభ ఆమోదించింది. దీంతోపాటు 2018-19 సంవత్సరానికి వార్షిక బడ్జెట్‌లో భాగంగా వ్యవసాయంశాఖ, సహకారశాఖ, పశుసంవర్ధక, మత్స్యశాఖ, పౌరసరఫరాలశాఖల నిర్వహణకు ప్రభుత్వానికి నిధులు మంజూరు చేయాలని ఆయా శాఖల మంత్రులు శాసనసభలోప్రతి పాదించారు.

గవర్నర్‌కు చేరిన స్థానిక సంస్థల నివేదిక

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలోని స్థానిక సంస్థల కార్యకలాపాలకు సంబంధించిన 2017 సంవత్సర పద్దులు, లావాదేవీలపై ఆడిట్ వ్యాఖ్యలు, పరిశీలన నివేదికను భారత కంప్ట్రోలర్ ఆడిటర్ జనరల్ (కాగ్) ప్రతినిధులు బుధవారం రాష్ట్ర గవర్నర్, తెలంగాణ ప్రభుత్వానికి అందజేశారు. ఈ నివేదికను అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల చివరిరోజు శాసనసభలో ప్రవేశపెట్టనున్నారు.

తెలంగాణ సోయితోనే ప్రాజెక్టుల రీడిజైనింగ్

మొదటిపేజీ తరువాయి...

కొనసాగుతున్నాయని, గత ఆరునెలల్లో రెండు కోట్లకు పైగా సిమెంట్ బస్తాలను వినియోగించి 60 శాతానికి పైగా నిర్మాణాలను పూర్తిచేసినట్లు వెల్లడించారు. సీఎం కేసీఆర్ రోజూ ప్రత్యక్ష ప్రసారం ద్వారా కాళేశ్వరం పనులను పర్యవేక్షిస్తున్నారని చెప్పారు. బుధవారం ప్రశ్నోత్తరాల సమయంలో కాళేశ్వరం ప్రాజెక్టు పనులపై టీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు గొంగిడి సునీత, కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, రసమయి బాలకిషన్, నీటిపారుదల ప్రాజెక్టుల రీడిజైనింగ్‌పై బీజేపీ ఎమ్మెల్యేలు కిషన్‌రెడ్డి, లక్ష్మణ్, ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ అడిగిన ప్రశ్నలకు మంత్రి హరీశ్ సమాధానాలు చెప్పారు.

తెలంగాణ సోయితోనే ప్రాజెక్టుల రీడిజైనింగ్

గతంలో కాంట్రాక్టర్ల ఇష్టారీతిగా ప్రాజెక్టుల రీడిజైనింగ్ ఉండేదని, ప్రస్తుతం ఆ స్వేచ్ఛ నిపుణులైన ఇంజినీర్లకు ఇచ్చినట్టు మంత్రి హరీశ్‌రావు చెప్పారు. సీఎం కేసీఆర్ సూచనలు పాటిస్తూ భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని ప్రణాళికలు రచించినట్లు తెలిపారు. సమైక్యరాష్ట్రంలో డిజైన్ చేసిన ప్రాణహిత చేవెళ్ల సుజల స్రవంతి, జేసీఆర్ దేవాదుల ఎత్తిపోతల, ఇందిరమ్మ వరద కాల్వ, పీవీ నరసింహారావు కంతనపల్లి సుజల స్రవంతి, సీతారామ ఎత్తిపోతల పథకాలను తెలంగాణ అవసరాలకు అనుగుణంగా రీడిజైన్ చేసి నిర్మిస్తున్నామని పేర్కొన్నారు. ఇవి పాత డిజైన్‌లో నిర్మించడం సాధ్యం కాదు కాబట్టే రీడిజైన్ చేశామని చెప్పారు. పాలమూరు ప్రాజెక్టు కట్టకపోతే తెలంగాణ ప్రభుత్వం చారిత్రక తప్పిదం చేసినట్టవుతుందని.. దాన్ని పూర్తిచేస్తేనే భవిష్యత్ తరాలకు న్యాయం చేసినవారమవుతామన్నారు. ఈ ప్రాజెక్టును కడితేనే కృష్ణా జలాల కేటాయింపుల్లో న్యాయం జరుగుతుందని వివరించారు. కంతనపల్లి దగ్గర ప్రతిపాదించిన విధంగా ప్రాజెక్టు నిర్మిస్తే 20 గిరిజన గ్రామాలు, 11వేల ఎకరాలు మునుగుతాయని, అందుకే రీడిజైన్ చేసి ఒక్క గ్రామం మునుగకుండా చూస్తున్నట్టు చెప్పారు. తుపాకులగూడెం వద్ద కాపర్ డ్యాం ఏర్పాటుచేసి చెరువులకు నీరు ఇస్తున్నామని పేర్కొన్నారు. ఖమ్మం జిల్లా వాసులకు నీరు అందించేందుకు దుమ్ముగూడెం ప్రాజెక్టును రీ ఇంజినీరింగ్ చేశామని తెలిపారు. ఒక్క నీటిచుక్కను కూడా వదులుకోకుండా, ఒక ఎకరం ఎండిపోవడానికి వీలులేకుండా ప్రాజెక్టులను రీడిజైనింగ్ చేశామని మంత్రి వివరించారు. మల్లన్నసాగర్ గురించి వస్తున్న విమర్శలను మంత్రి హరీశ్ కొట్టిపారేశారు.



ప్రాజెక్టు వ్యయాలు అందుకే పెరిగాయి

ప్రాణహిత-చేవెళ్ల పథకం కింద 16 లక్షల ఎకరాలకే సాగునీటిని ప్రతిపాదించారని, రీ ఇంజినీరింగ్ చేసి 37 లక్షల ఎకరాలకు సాగునీటి వసతి కల్పించబోతున్నట్లు హరీశ్ సభకు తెలిపారు. మునుపు రిజర్వాయర్ల సామర్థ్యం 11 టీఎంసీల వరకే ఉంటే ప్రస్తుతం 147 టీఎంసీలకు పెంచామని తెలిపారు. ఇలా మార్పులు చేయడంతో ప్రాజెక్టు వ్యయం పెరుగటం అనివార్యమైందన్నారు. రీ డిజైనింగ్ చేయడంవల్లే అన్ని అనుమతులు వచ్చాయని స్పష్టంచేశారు. 2007 నుంచి 2014 వరకు అటు కేంద్రంలో, ఇటు రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పటికీ ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టుకు అనుమతులు తీసుకురాలేకపోయారని విమర్శించారు. భూపాలపల్లి జయశంకర్ జిల్లాలోని రామప్ప చారిత్రక దేవాలయానికి ప్రమాదం కలుగకుండా పైప్డ్ ఇరిగేషన్ విధానంలో పనులు చేపట్టామని చెప్పారు.

వరంగల్‌కే తొలి ఫలితం

పూర్వ వరంగల్ జిల్లాకు కాళేశ్వరం తొలి ఫలితం అందనున్నట్లు హరీశ్‌రావు చెప్పారు. నల్లగొండ జిల్లాలోని తుంగతుర్తి, కోదాడ, సూర్యాపేట నియోజకవర్గాలకు సాగునీటిని ఇస్తామని తెలిపారు. కాళేశ్వరం నుంచి మిడ్‌మానేరు, లోయర్ మానేరు డ్యాం మీదుగా హుజూరాబాద్, పరకాల, మహబూబాబాద్ అసెంబ్లీ నియోజకవర్గాల ఆయకట్టుకు నీరందుతుందని చెప్పారు. భూపాలపల్లి సెగ్మెంట్‌లో 80 వేలఎకరాలు సాగులోకి వస్తాయన్నారు. రూ. 1000 కోట్లతో శ్రీరాంసాగర్ ఆధునీకరణ పనులు ప్రారంభించామని, దాంతో పూర్తి ఆయకట్టుకు నీరందుతుందన్నారు. రెండో దశకింద చేపట్టిన పనుల వల్ల పాలకుర్తి రైతులకు సాగునీరు లభిస్తుందన్నారు.

దుష్ప్రచారం మానుకోవాలి

బీజేపీ, కాంగ్రెస్‌లు ప్రభుత్వంపై నిరాధార ఆరోపణలు చేస్తున్నాయని, గోబెల్స్ ప్రచారాన్ని మానుకోవాలని మంత్రి హరీశ్ హితవుపలికారు. డీపీఆర్ లేకుండా సాగునీటి ప్రాజెక్టుల పనులు చేపట్టారని చెప్పున్న మాటల్లో వాస్తవం లేదన్నారు. ప్రతి సాగునీటి ప్రాజెక్టుకు డీపీఆర్ ఉన్నదని, నిర్మాణ పనుల్లో ప్రతి దశలో పారదర్శకంగా వ్యవహరిస్తున్నామని చెప్పారు. నీటి లభ్యత ఎక్కువగా ఉండటం వల్లే మేడిగడ్డ వద్ద ప్రాజెక్టుకు రూపకల్పన చేసినట్లు తెలిపారు. మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం ఇలా వరుసగా బరాజ్‌లు నిర్మిస్తున్నామని, తుపాకులగూడెం నుంచి శ్రీరాంసాగర్ వరకు 270 కిలోమీటర్ల మేర గోదావరి 365 రోజులపాటు సజీవనదిగా ఉండబోతున్నదని పేర్కొన్నారు. మహారాష్ట్ర నుంచి బంగాళాఖాతం వరకు గోదావరిలో నౌకాయానం జరుగుతుందని, మత్స్యపరిశ్రమ, టూరిజం అభివృద్ధి చెందుతుందన్నారు.

జాతీయహోదా కోసం సహకరించాలి

కాళేశ్వరం ప్రాజెక్టుకు జాతీయహోదా కోసం తెలంగాణ బీజేపీ నేతలు సహకరించాలని హరీశ్ కోరారు. విభజన సమయంలో పోలవరానికి జాతీయహోదా ఇచ్చినట్టే కాళేశ్వరానికి జాతీయహోదా ఇస్తే బాగుండేదని అభిప్రాయపడ్డారు. సీఎం కేసీఆర్ దశాబ్దాల కాలంగా జరుగుతున్న అన్యాయాన్ని ప్రశ్నించడం వల్లే ఎల్లంపల్లి ప్రాజెక్టు నిర్మాణమవుతున్నదని గుర్తుచేశారు. ప్రతిపక్షపార్టీలు ప్రాజెక్టులను అడ్డుకునేందుకు కేసులు పెడుతున్నాయని, ఈ పద్ధతి మానుకోవాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన అనుమతులను సైతం అడ్డుకునేందుకు కుట్రలు పన్నుతున్నారని తెలిపారు.

వర్షాకాలానికే ఐదు పంపులతో మేడిగడ్డ లిఫ్టు

- వచ్చే డిసెంబర్‌నాటికి కీలకదశకు కాళేశ్వరం
- శాసనసభలో పూర్తి వివరాలు వెల్లడించిన ప్రభుత్వం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రికార్డు సమయంలో పనులపూర్తితో దూసుకుపోతున్న కాళేశ్వరం ఎత్తిపోతల పథకం ఈ వర్షాకాలానికే గోదావరిజలాల లిఫ్టునకు సిద్ధమవుతున్నది. గతంలో సీఎం కేసీఆర్ ప్రకటించినట్టుగానే మేడిగడ్డ నుంచి జలాలను మిడ్‌మానేరుకు తరలించేందుకుగాను రేయింబవళ్లు పనులు కొనసాగుతున్నాయి. దీంతో రాష్ట్రంలోనే కాకుండా దేశవ్యాప్తంగా కాళేశ్వరం పథకం పనుల పురోగతి చర్చనీయాంశంగా మారింది. ఈ నేపథ్యంలో ప్రస్తుతం కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా ఆయా ప్యాకేజీల పనుల పురోగతి, కీలక ప్యాకేజీలు ఎప్పటిలోగా పూర్తవుతాయనే వివరాల్ని ప్రభుత్వం బుధవారం శాసనసభలో లిఖితపూర్వకంగా వెల్లడించింది. సుమారు 36 ప్యాకేజీలుగా రూ. 60,922.49 కోట్ల విలువైన పనులకు సంబంధించి కాంట్రాక్టర్లతో ఒప్పందం జరుగగా.. ఇప్పటివరకు రూ.23,127.35 కోట్ల మేర పనులు పూర్తయినట్టు ప్రభుత్వం స్పష్టంచేసింది.

పలు కీలక ప్యాకేజీల పనుల పురోగతి వివరాలు (అంకెలు రూ.కోట్లలో)

ప్యాకేజీ నంబర్	ఒప్పంద విలువ	ఇప్పటివరకు పూర్తయింది	శాతాల్లో..
మేడిగడ్డ బరాజ్	2008.96	533.45	26.55
మేడిగడ్డ లిఫ్టు	3174.22	1168.77	36.82
అన్నారం బరాజ్	1464.93	983.24	67.12
అన్నారం లిఫ్టు	1804.58	888.00	49.21
సుందిల్ల బరాజ్	1444.34	786.23	54.44
సుందిల్ల లిఫ్టు	2051.19	822.96	40.12
ప్యాకేజీ-6	4961.31	3786.31	76.32
ప్యాకేజీ-7	1353.31	1331.62	98.40
మేడారంరి జర్వాయర్	77.04	74.71	96.98
ప్యాకేజీ-8	4900.39	3810.57	77.76
ప్యాకేజీ-9	911.32	271.69	29.81
మలక్‌పేటరి జర్వాయర్	472.28	86.87	18.39
ప్యాకేజీ-10	2715.39	1809.84	66.65
ప్యాకేజీ-11	3127.58	2041.97	65.29
శ్రీరంగనాయకసాగర్ రిజర్వాయర్	461.17	119.37	25.88
ప్యాకేజీ-12	3348.00	1689.23	50.45

వీటితోపాటు ప్యాకేజీ 13-28 వరకు, వివిధ రిజర్వాయర్ల పనులు వివిధ దశల్లో ఉన్నాయి.

కీలకమైన లిఫ్టు పనుల పూర్తిపై నిర్దేశిత లక్ష్యాలు

ప్యాకేజీ	పంపుల సంఖ్య	జూన్‌నాటికి పూర్తయ్యేవి	మొత్తం పనులు పూర్తయ్యేఅవకాశమున్నది
మేడిగడ్డ లిఫ్టు	11	05	డిసెంబర్,2 018
అన్నారం లిఫ్టు	08	04	డిసెంబర్,2 018
సుందిల్ల లిఫ్టు	09	04	డిసెంబర్,2 018
ప్యాకేజీ-6	07	04	డిసెంబర్,2 018
ప్యాకేజీ-8	07	05	డిసెంబర్,2 018
ప్యాకేజీ-9	04	-	డిసెంబర్,2 018
ప్యాకేజీ-10	04	02	డిసెంబర్,2 018
ప్యాకేజీ-11	04	02	డిసెంబర్,2 018
ప్యాకేజీ-12	08	04	డిసెంబర్,2 018
ప్యాకేజీ-14	09	-	డిసెంబర్,2 018
ప్యాకేజీ-20	03	-	డిసెంబర్,2 018
ప్యాకేజీ-21	04	-	జూన్, 2019
ప్యాకేజీ-22	04	-	జూన్, 2019
ప్యాకేజీ-27	04	02	జూన్, 2018
ప్యాకేజీ-28	02	02	ఇప్పటికేపూ ర్తి

రైతుల కండ్లల్లో బంగారు తెలంగాణ

- అన్నదాత గుండెమీద కుంపటిని తొలిగించిన సీఎం కేసీఆర్
- అందుకే దేశంలోని రైతులంతా ఆయన వైపే చూస్తున్నరు
- శాసనసభలో ఆకట్టుకున్న ఎమ్మెల్యే రసమయి ప్రసంగం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలోని రైతు కండ్లల్లో, కల్యాణలక్ష్మి అందుకుంటున్న ఆడబిడ్డ ముఖంలో, ఇంటింటికీ రక్షిత మంచినీరు తీసుకువస్తున్న మిషన్ భగీరథలో బంగారు తెలంగాణ కనిపిస్తుందని.. కానీ కొందరు కండ్లు ఉండి కూడా బంగారు తెలంగాణను చూడలేకపోతున్నారని ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అన్నారు. శాసనసభలో బుధవారం వ్యవసాయం, సహకార, పశుసంవర్ధక, మత్స్య, పౌరసరఫరాల శాఖ పద్దులపై జరిగిన చర్చల్లో పాల్గొన్న రసమయి ప్రసంగం అందరినీ ఆకట్టుకున్నది. మధ్యమధ్యలో పాటలతో తనకు కేటాయించిన 25 నిమిషాల్లోనే ప్రసంగాన్ని ముగించారు. సబ్బండ వర్ణాలు రైతు కేంద్రబిందువుగా ఏర్పడ్డాయని, ఇంతమంది బతుకుదెరువుకు ఆధారమైన అన్నదాత గతంలో ఆత్మస్థయిర్యాన్ని కోల్పోయాడని అన్నారు. అన్నదాతలో ఆత్మస్థయిర్యాన్ని నింపి.. రైతు గుండె మీద ఉన్న కుంపటిని తొలిగించాలని ఉద్యమ సమయంలోనే సీఎం కేసీఆర్ నిర్ణయించుకున్నారని చెప్పారు. రూ.17వేల కోట్ల రుణమాఫీ, 24 గంటల కరంటుతో పాటు మిషన్ కాకతీయతో చెరువులకు పూర్వ వైభవాన్ని తెచ్చి సాగునీరు అందిస్తున్నారని చెప్పారు. దేశంలో ఎక్కడాలేనివిధంగా ఏటా ఎకరాకు రూ.8 వేల పెట్టుబడి కూడా ఇస్తున్న ఘనత తెలంగాణ ప్రభుత్వానికి, సీఎం కేసీఆర్‌కు దక్కుతుందన్నారు. మహారాష్ట్ర, తమిళనాడు రైతులు కేంద్ర సర్కారు మీద తమ నిరసన వ్యక్తంచేసిన సంఘటనలు ఉన్నాయన్నారు. అందుకే సీఎం కేసీఆర్ రైతు సంక్షేమం కోసం పాటుపడుతున్న తీరు గమనించిన దేశరైతులంతా ఆయన వైపు చూస్తున్నారని రసమయి అన్నారు.



సమ్మక్క-సారక్కను తలపిస్తున్న కాళేశ్వరం

తాను ఉపాధ్యాయుడిగా పనిచేసే సమయంలో పుస్తకాల్లోని 'గలగలా గోదారి.. బిరబిరా కృష్ణమ్మ' అనే పాటలు పిల్లలకు చెప్పేవాడినని, ఒక సందర్భంలో మూడో తరగతి విద్యార్థి లేచి అబద్ధాలు చెప్తున్నారంటూ తనను ప్రశ్నించినట్టు రసమయి గుర్తుచేసుకున్నారు. సమైక్య పాలనలో రెండు నదుల్లోనూ జలాలు దిగువకు తరలిపోయేవని, కానీ తెలంగాణ ప్రభుత్వం వచ్చాక సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావు భూమి సూర్యుడు చుట్టూ తిరుగుతున్నట్టుగా ప్రాజెక్టుల చుట్టూ తిరుగుతున్నారని చెప్పారు. అక్కడ సూర్యుడు లోకానికి వెలుగులిస్తే ఇక్కడ ఈ ఇద్దరూ రైతులకు సాగునీరు ఇస్తున్నారని అన్నారు. ఈ క్రమంలోనే రూపుదిద్దుకున్న కాళేశ్వరం ప్రాజెక్టు మరో సమ్మక్క-సారక్క జాతరను తలపిస్తున్నదని రసమయి అన్నారు. అనాదిగా రైతుల నుంచి శిస్తు వసూలు చేసిన దాఖలాలు ఉన్నాయని, కానీ సీఎం కేసీఆర్ రైతులకే ఎదురు పెట్టుబడి ఇవ్వడం నూతన చరిత్రకు నాంది అన్నారు.

దూరదృష్టితో బడ్జెట్ రూపకల్పన



- ఎమ్మెల్యే ఆర్ కృష్ణయ్య ప్రశంస

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్ర ప్రభుత్వం దూరదృష్టితో బడ్జెట్ రూపకల్పన చేసిందని ఎమ్మెల్యే ఆర్ కృష్ణయ్య పేర్కొన్నారు. అసెంబ్లీలో బడ్జెట్‌పై చర్చ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉత్పత్తిరంగానికి సంబంధించి 24 గంటల కరెంటు, ఎకరానికి ఒక్కపంటకు రూ. నాలుగువేల పెట్టుబడి, వ్యవసాయానికి 24 గంటల నిరంతర విద్యుత్ సరఫరా, మిషన్ కాకతీయ ద్వారా చెరువుల పూడికతీయడం వంటివన్నీ మంచి దూరదృష్టితో కూడినవేనని కొనియాడారు. రాష్ట్ర ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి ప్రాధాన్యత ఇచ్చిందని చెప్పారు. పరిశోధన రంగంపై కూడా ప్రభుత్వం దృష్టిపెట్టాలని, వ్యవసాయ విశ్వవిద్యాలయం విద్యార్థులను గ్రామీణప్రాంతాల్లో పర్యటించేలా చేసి, నీటిపారుదల, భూసారాలపై రైతులకు అవగాహన పెంచేలా చర్యలు తీసుకోవాలని కృష్ణయ్య కోరారు.

మంత్రి హరీశ్‌రావు బాగా పనిచేస్తున్నారు



- ఎమ్మెల్యే సున్నం రాజయ్య

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: మార్కెటింగ్‌శాఖ మంత్రి హరీశ్‌రావు బాగా పనిచేస్తున్నారని, ప్రతి మండలంలో మార్కెట్లను నిర్మించారని ఎమ్మెల్యే సున్నం రాజయ్య కితాబిచ్చారు. వ్యవసాయ అభివృద్ధి కోసం చాలా చేశారని, ఇంకా చేయాల్సిన అవసరం ఉన్నదని చెప్పారు. మిషన్ కాకతీయను ప్రోత్స హిస్తున్నారని పేర్కొన్నారు.

లాబీ ముచ్చట

రెండుస్థానాల్లో విజయం మాదే

- అసెంబ్లీ లాబీలో మంత్రి జూపల్లి కృష్ణారావు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: అనర్హత వేటుతో ఖాళీ అయిన రెండుస్థానాల్లో టీఆర్‌ఎస్ అభ్యర్థులు విజయం సాధిస్తారని పంచాయతీరాజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ధీమా వ్యక్తంచేశారు. ప్రజాకోర్టులో విజయం సాధిస్తామనే నమ్మకం ఉంటే హైకోర్టుకు ఎందుకు వెళ్లారని కాంగ్రెస్ ఎమ్మెల్యేలను ఆయన ప్రశ్నించారు. బుధవారం అసెంబ్లీ లాబీలో జూపల్లి మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడుతూ.. ప్రజాకోర్టులో తేల్చుకోవడానికి తాము సిద్ధంగా ఉన్నామని చెప్పారు.

మీడియా పాయింట్

అవిశ్వాసంపై టీడీపీ రాద్ధాంతం తగదు

కేంద్రంలో అవిశ్వాసంపై టీడీపీ రాద్ధాంతం చేయడం తగదు. 2014లో బీజేపీ, టీడీపీ పొత్తుపై టీఆర్‌ఎస్‌ను సంప్రదించారా? తెలంగాణకు అన్యాయం జరిగితే టీడీపీ ఎప్పుడైనా మాట్లాడిందా? విభజనచట్టంలో ఉన్న అంశాలపై టీఆర్‌ఎస్ పార్లమెంట్‌లో పోరాటం చేస్తున్నది.

– జీవన్‌రెడ్డి, టీఆర్‌ఎస్ ఎమ్మెల్యే

ప్రతిపక్షాలవి అబద్ధాలు

కొత్తగా వచ్చిన ఎమ్మెల్యేలకు ఆదర్శంగా ఉండాల్సి ప్రతిపక్ష ఎమ్మెల్యేలు సభలో అబద్ధాలు చెప్పడం సమంజసంకాదు. ప్రభుత్వ వైఫల్యాలు లేకపోవడంతో, ప్రతిపక్షాలు అనవసర ఆరోపణలకు దిగుతున్నాయి.

– ముత్తిరెడ్డి యాదిగిరిరెడ్డి, టీఆర్‌ఎస్ ఎమ్మెల్యే

రాజ్యసభ ఎన్నికలకు దూరంగా ఉంటాం

రాజ్యసభ ఎన్నికల సందర్భంగా ఓటింగ్ విషయంలో తటస్థంగా ఉంటాం. కాంగ్రెస్, టీఆర్‌ఎస్ పార్టీలకు ఓటు వేయకూడదని నిర్ణయించుకున్నాం.

– సున్నం రాజయ్య, సీపీఎం ఎమ్మెల్యే, టీటీడీపీ అధ్యక్షుడు ఎల్ రమణ

అగ్రి వర్సిటీలో ప్రపంచ అటవీ దినోత్సవం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాలలో ఔషధమొక్కల ఈఎల్పీ కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం ప్రపంచ అటవీదినోత్సవాన్ని నిర్వహించారు. వాతావరణ మార్పుల నేపథ్యంలో అడవుల ప్రాధాన్యంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సుస్థిర నగరాలు, అడవులు అన్న థీమ్‌పై కాటన్ బోర్డు మాజీ సభ్యుడు డాక్టర్ డీ నరసింహారెడ్డి మాట్లాడారు. నిత్యజీవితంలో ఔషధమొక్కల ప్రాధాన్యం అనే అంశంపై ఆయుష్ రిటైర్డ్ డైరెక్టర్ డాక్టర్ కొండపల్లి నరసింహారెడ్డి ప్రసంగించారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ పాలకమండలి సభ్యుడు డాక్టర్ మనోహర్‌రెడ్డి, డీన్ అగ్రికల్చర్ డాక్టర్ కేఎస్ డాంగి, అసోసియేట్ డీన్ డాక్టర్ జెల్లా సత్యనారాయణ, పాలెం వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ జోసెఫ్, ఈఎల్పీ ఔషధమొక్కల డైరెక్టర్ డాక్టర్ ఏ మాధవీలతతో పాటు ఎక్స్‌పీరియన్షియల్ లెర్నింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.



డప్పు, చెప్పు చేతి వృత్తులవారిలో 50-60 ఏళ్ల మధ్యనున్న అందరికీ పెన్షన్ ఇవ్వాలనే అంశంపై ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి, మంత్రులు ఈటల రాజేందర్, హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి, లక్ష్మారెడ్డిలతో సమావేశమైన తెలంగాణ ఎమ్మార్పీఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ వంగపల్లి శ్రీనివాస్

పింఛన్లపై సీఎం దృష్టికి తీసుకెళ్తాం

- డప్పు, చెప్పు వృత్తిదారుల పింఛన్‌పై మంత్రుల హామీ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: 45 ఏండ్లు నిండిన డప్పు, చెప్పు వృత్తిదారులందరికీ పెన్షన్ ఇవ్వాలని ఎస్సీ సంఘాల ప్రతినిధులు కోరారు. బుధవారం సచివాలయంలో ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి, మంత్రులు ఈటల రాజేందర్, మంత్రి హరీశ్‌రావు, జీ జగదీశ్‌రెడ్డి, లక్ష్మారెడ్డితో ఎస్సీ సంఘాల ప్రతినిధులు సమావేశమై చర్చించారు. పింఛను అంశాన్ని సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్తామని మంత్రులు వారికి హామీ ఇచ్చారు. తెలంగాణ ఎమ్మార్పీఎస్ నేతలు వంగపల్లి శ్రీను, సుంకపాక దేవయ్య, యాతకుల భాస్కర్, మేడి పాపయ్య, రేగుంట సునిల్, ఎస్సీ అభివృద్ధిశాఖ కార్యదర్శి బుద్ధప్రసాద్ చర్చలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ (టీఎస్) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వంగపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ.. డప్పు, చెప్పు వృత్తిదారులకు పింఛను ఇవ్వాలని ప్రభుత్వం యోచిస్తున్నదని, దుర్భర పరిస్థితి గడుపుతున్న వారికి రూ.2 వేల పింఛను ఇవ్వాలని మంత్రుల బృందాన్ని కోరామన్నారు.

లేబర్‌కోడ్ అమలు విధానాలపై
ఈపీఎఫ్ ఉద్యోగుల చర్చ

- ఏఐఈపీఎఫ్‌ఎస్‌ఎఫ్ తొలి సమావేశంలో పాల్గొన్న ఎంపీ వినోద్‌కుమార్



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కేంద్ర కార్మికశాఖ నూతనంగా ప్రవేశపెట్టనున్న లేబర్ కోడ్ అమలు, విధానాలపై ఆలిండియా ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ స్టాఫ్ ఫెడరేషన్ (ఏఐఈపీఎఫ్‌ఎస్‌ఎఫ్) తొలి కార్యవర్గ సమావేశంలో చర్చించారు. బుధవారం ఢిల్లీలోని కాన్‌స్టిట్యూషన్ క్లబ్‌లో చీఫ్ పాట్రన్, కరీంనగర్ ఎంపీ వినోద్‌కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో కేంద్ర కార్మికశాఖమంత్రి సంతోష్‌కుమార్ గంగ్వార్ పాల్గొన్నారు. ఏఐఈపీఎఫ్‌ఎస్‌ఎఫ్ చీఫ్ పాట్రన్‌గా కరీంనగర్ ఎంపీ వినోద్‌కుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బుధవారం జరిగిన సమావేశంలో దేశవ్యాప్తంగా ఈపీఎఫ్ ఉద్యోగుల సమస్యలపై చర్చించారు. వంద ఏండ్ల కార్మిక చట్టాలను క్రోడీకరిస్తూ, కేంద్ర ప్రభుత్వం తీసుకురానున్న లేబర్‌కోడ్ సంఘటిత, అసంఘటిత వర్గాలకు మేలుచేసేలా ఉండాలని సూచించారు. వినోద్‌కుమార్, సభ్యులు లేవనెత్తిన అంశాలపై కేంద్రమంత్రి సంతోష్‌కుమార్ గంగ్వార్ స్పందిస్తూ.. ఈపీఎఫ్ ఉద్యోగులకు కేంద్రం అన్ని విధాలుగా అండగా నిలుస్తుందని హామీ ఇచ్చారు. తొలి కార్యవర్గ సమావేశంలో పలు కీలక తీర్మానాలను కూడా చేశారు. కొత్తగా కేంద్రప్రభుత్వం తీసుకురానున్న లేబర్‌కోడ్‌లో ఈపీఎఫ్ లాంటి సంస్థలను ఒకే గొడుగు కిందకు తీసుకురావడంపై చర్చించారు. ఏఐఈపీఎఫ్‌ఎస్‌ఎఫ్ రెండో సమావేశాన్ని హైదరాబాద్‌లో నిర్వహించాలని సమావేశంలో నిర్ణయించారు. ఏఐఈపీఎఫ్‌ఎస్‌ఎఫ్ నూతన కార్యవర్గంలో అధ్యక్షులుగా రమిణ్‌పాండే, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మోహన్‌కుమార్ ఉపాధ్యాయ్, సెక్రటరీ జనరల్‌గా పీ రాంబాబు, పాట్రాన్‌గా రాంకిశోర్ త్రిపాఠి, సలహాదారుగా రాజేశ్‌కుమార్ శుక్లా ఎన్నికయ్యారు.

స్వామిగౌడ్ కంటి ఎముకకు గాయం

నిర్ధారించిన గాంధీ వైద్యులు..నేడు మళ్లీ పరీక్షలు



బుధవారం గాంధీ దవాఖానలో శాసనమండలి చైర్మన్ స్వామిగౌడ్‌కు సీటీ స్కాన్ పరీక్ష చేస్తున్న వైద్యులు

హైదరాబాద్ సిటీబ్యూరో/గాంధీ దవాఖాన, నమస్తే తెలంగాణ: బడ్జెట్ సమావేశాల సందర్భంగా 12న అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగిస్తున్న సమయంలో కాంగ్రెస్ సభ్యులు మైక్ విసురడంతో గాయపడిన శాసనమండలి చైర్మన్ స్వామిగౌడ్ కంటి ఎముకకు(ఆర్బిట్)కు గాయమైనట్టు వైద్యులు నిర్ధారించారు. ఈ నెల 15న సరోజినిదేవి కంటి దవాఖాన నుంచి డిశ్చార్జ్ అయిన స్వామిగౌడ్ మెరుగైన చికిత్స కోసం బుధవారం గాంధీ దవాఖానకు వెళ్లారు. దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్ రవీందర్‌గౌడ్ కంటి ఎముక డీ-స్కాన్ తీసి గాయమైనట్టు గుర్తించారు. సీటీ స్కాన్ కోసం స్వామిగౌడ్‌ను గాంధీ దవాఖానకు రిఫర్‌చేశారు. మరో నాలుగురోజులపాటు చికిత్స అవసరమని పేర్కొన్నారు. అనంతరం స్వామిగౌడ్ గాంధీ దవాఖానకు వెళ్లగా రేడియాలజీ వైద్యులు సీటీస్కాన్ నిర్వహించారు. అనంతరం స్వామిగౌడ్ మాట్లాడుతూ..మూడురోజులపాటు సరోజిని కంటి దవాఖానలో వైద్యులు చికిత్స అందించి డిశ్చార్జ్ చేశారని, ఇంటికి వెళ్లాక ఒకరిని చూస్తే ఇద్దరిగా కనిపించడంతో తిరిగి వైద్యులను సంప్రదించానని చెప్పారు. సరోజిని వైద్యులు సిటీస్కాన్ కోసం గాంధీకి వెళ్లాలన్నారని చెప్పారు. ప్రైవేట్ దవాఖానకు వెళ్లమనుకున్నప్పటికీ, గవర్నర్ నరసింహన్ వైద్యం కోసం గాంధీకి రావడం.. ఇక్కడ అధునాతన వైద్య పరికరాలున్నట్టు తెలిసి ఇక్కడికే వచ్చానని వివరించారు. సరోజినిదేవి కంటి దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ రవీందర్‌గౌడ్, గాంధీ దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ శ్రావణ్‌కుమార్, రేడియాలజీ హెచ్‌వోడీ డాక్టర్ శ్రీహరి దగ్గరుండి స్వామిగౌడ్‌కు వైద్యపరీక్షలు చేయించారు.

'సకలా'నికి సమాయత్తం



నిజామాబాద్‌లో మాట్లాడుతున్న ఉద్యోగ జేఏసీ రాష్ట్ర చైర్మన్, టీఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు కారం రవీందర్‌రెడ్డి

- 25న సరూర్‌నగర్‌లో మహాసభ
- జయప్రదం చేయాలని ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్ పిలుపు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం (సీపీఎస్)ను రద్దుచేయాలనే ప్రధాన డిమాండ్‌తో ఈ నెల 25న సరూర్‌నగర్ మైదానంలో తలపెట్టిన సకల ఉద్యోగుల మహాసభకు ఉద్యోగ సంఘాల జేఏసీ సమాయత్తమైంది. తెలంగాణకు అక్రమ పద్ధతిలో కేటాయించిన ఉద్యోగులందరినీ ఏపీకి కేటాయించాలని, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు సమానంగా పనిచేస్తున్న వివిధ క్యాటగిరీల ఉద్యోగులందరికీ రూ.20 వేలు కనీస వేతనం చెల్లించాలనే డిమాండ్లతో జరిగే ఈ మహాసభకు ఇప్పటికే 140 ఉద్యోగ సంఘాలు సంఘీభావం ప్రకటించాయి. సీపీఎస్ రద్దు కోసం సమిష్టిగా పోరాడాలని తెలంగాణ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం గౌరవ అధ్యక్షుడు, ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్ పిలుపునిచ్చారు. బుధవారం బల్దియా కేంద్ర కార్యాలయంలో ఇంజినీర్లు, గెజిటెడ్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో సకల ఉద్యోగుల సభను విజయవంతం చేయాలని ఆయన కోరారు. సమావేశంలో తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు మమత, సంఘం నగర అధ్యక్షుడు కృష్ణయాదవ్, టీజీవో ప్రధాన కార్యదర్శి హరికృష్ణ, తెలంగాణ ఇంజినీర్ల సంఘం కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. హైదరాబాద్‌లోని గెజిటెడ్ అధికారుల సంఘం కార్యాలయంలో బుధవారం ఎమ్మెల్యే వీ శ్రీనివాస్‌గౌడ్ మహాసభ పోస్టర్‌ను ఆవిష్కరించారు.

సీపీఎస్ పాపం కాంగ్రెస్, బీజేపీదే: కారం రవీందర్‌రెడ్డి

నిజామాబాద్ అర్బన్, నమస్తే తెలంగాణ: సీపీఎస్ అమలులోకి తెచ్చి ఉద్యోగుల జీవితాలను చిన్నాభిన్నం చేసిన పాపం కాంగ్రెస్, బీజేపీలదేనని ఉద్యోగ జేఏసీ రాష్ట్ర చైర్మన్, టీఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు కారం రవీందర్‌రెడ్డి అన్నారు. నిజామాబాద్‌లోని టీఎన్జీవో భవన్‌లో బుధవారం నిర్వహించిన సకల ఉద్యోగుల మహాసభ సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. నాడు ఎన్డీయే ప్రభుత్వం సీపీఎస్ విధానాన్ని ప్రవేశపెట్టగా, తర్వాత అధికారంలోకి వచ్చిన యూపీఏ ప్రభుత్వం దానిని అమలు చేసిందని విమర్శించారు. టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు, ఉద్యోగ జేఏసీ చైర్మన్ అలుక కిషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో ఉద్యోగ జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజేందర్, గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పట్టిసీమ నిధులు దుర్వినియోగం

- ఏపీ బీజేఎల్పీ నేత విష్ణుకుమార్‌రాజు ఆరోపణ

హైదరాబాద్ / అమరావతి, నమస్తే తెలంగాణ: పోలవరం అనుబంధ ప్రాజెక్టు పట్టిసీమ నిధులు వృథా అయ్యాయని బీజేపీ ఏపీ శాసనసభాపక్షనేత విష్ణుకుమార్‌రాజు ఆరోపించారు. ప్రాజెక్టుల విషయంపై బుధవారం ఏపీ అసెంబ్లీలో చర్చ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టిసీమ ప్రాజెక్టులో రూ.371 కోట్లు దుర్వినియోగం అయినట్టు కాగ్ నివేదిక వెల్లడించదన్నారు. అవినీతిపై సిట్టింగ్ జడ్జి లేదా సీబీఐతో దర్యాప్తు చేపట్టాలని డిమాండ్ చేశారు.

లోకేశ్‌పై ఆరోపణలకు ఆధారాలున్నాయి

- జనసేన అధికార ప్రతినిధి శ్రీధర్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఏపీ మంత్రి నారా లోకేశ్ అవినీతి వ్యవహారంపై జనసేన అధినేత పవన్ కల్యాణ్ చేసిన ఆరోపణలకు ఆధారాలున్నాయని ఆ పార్టీ అధికార ప్రతినిధి శ్రీధర్ అన్నారు. సమయం వచ్చినప్పుడు వివరాలు బయటపెడుతామని చెప్పారు. బుధవారం జనసేన కార్యాలయంలో ఆ పార్టీ ప్రతినిధులు రియాజ్, మహేందర్‌రెడ్డితో కలిసి ఆయన మాట్లాడారు.

సిర్పూర్‌కు పూర్వ వైభవం


మొదటిపేజీ తరువాయి...

అనంతరం తన కార్యకలాపాలను ప్రారంభిస్తుంది. ఇందుకు రాష్ట్రప్రభుత్వం నుంచి అవసరమైన పూర్తి సహకారాన్ని ప్రభుత్వం ప్రకటించింది. రాయితీలు, ప్రోత్సాహకాలకు ఈనెల 14న జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో ఆమోదం తెలిపారు. మంత్రివర్గ నిర్ణయాలకు సంబంధించిన ఉత్తర్వులను పరిశ్రమలశాఖ ముఖ్యకార్యదర్శి జయేశ్‌రంజన్ బుధవారం జారీచేశారు. కంపెనీ చేసిన విజ్ఞప్తులను పరిశీలించిన మంత్రివర్గం పలు కీలక నిర్ణయాలను తీసుకున్నది. జీఎస్టీ, స్టాంప్‌డ్యూటీ రాయితీలతో సహా మూడేండ్లపాటు ఒక్కో యూనిట్‌కు రూ.3 చొప్పున విద్యుత్ చార్జీలను ప్రభుత్వం కంపెనీకి తిరిగి చెల్లిస్తుంది. పదేండ్లపాటు ఎస్జీఎస్టీ మినహాయింపునిస్తారు. ఈ మిల్లు ద్వారా 1200 మందికి ప్రత్యక్షంగా ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. వీరితోపాటుగా దాదాపుగా 1500 మందికి కాంట్రాక్టు ఉద్యోగాలు రానున్నాయి. పరోక్షంగా 10వేల మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని అంచనా వేస్తున్నారు. కార్మికులకు సంబంధించి లిక్విడేషన్ బకాయిలను ప్రభుత్వమే చెల్లిస్తుంది.

ఇదీ నేపథ్యం

సిర్పూర్ పేపర్ మిల్లును చాలాకాలం పాటు పొద్దార్ కంపెనీ నిర్వహించింది. కంపెనీకి తీవ్ర నష్టాలు రావడంతో 2014 సెప్టెంబర్ 27 న మూసేశారు. దీంతో మూడువేల మంది కార్మికులు రోడ్డున పడ్డారు. ఇందులో సిర్పూర్ నియోజకవర్గంతోపాటు ఆసిఫాబాద్, మంచిర్యాల, పూర్వ కరీంనగర్ జిల్లాకు చెందిన 1500మంది రెగ్యులర్, 1500మంది కాంట్రాక్టు కార్మికులు పనిచేసేవారు. ఎస్పీఎం మిల్లుపై పరోక్షంగా, ప్రత్యక్షంగా 10 వేల కుటుంబాలు ఆధారపడ్డాయి. గతంలో లాభాల్లో ఉన్న ఎస్పీఎంను యాజమాన్యం ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఐడీబీఐ) లో తాకట్టు పెట్టి రూ.350 కోట్ల రుణం తీసుకొన్నది. ఈ అప్పు వడ్డీతో కలిపి ప్రస్తుతం రూ.480 కోట్లకు చేరింది. ముడిసరుకు, ఇతర బకాయిల పేరుతో ఇతర సంస్థల వద్ద మరో రూ.200 కోట్లు బకాయిపడింది. నష్టాల పేరిట ఎస్పీఎంలో ఉత్పత్తిని నిలిపివేయగా కార్మికులకు రూ.70 కోట్లు చెల్లించాల్సి ఉన్నది. 2016 అక్టోబర్ 22 న ఐడీబీఐ ఎస్పీఎంను స్వాధీనం చేసుకున్నది. ప్రస్తుతం జాతీయ కంపెనీల చట్టం ట్రిబ్యునల్ (ఎన్సీఎల్టీ) ఆధీనంలో ఉన్నది.

కార్మికులపై సీఎం కేసీఆర్ ప్రేమకు నిదర్శనం



మూతపడిన సిర్పూర్ పేపర్ మిల్లును తెరిపించడానికి ఏ కంపెనీ అయినా ముందుకు వస్తే అన్నివిధాలుగా సహకరిస్తామని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు అనేకమార్లు ప్రకటించారు. దీనికి అనుగుణంగా పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ వివిధ కంపెనీలు, సంస్థలతో చర్చలు జరిపారు. ముందుకు రావాల్సిందిగా ఆహ్వానించారు. ఈ నేపథ్యంలో జేకే పేపర్ మిల్లు ముందుకొచ్చింది. ప్రభుత్వం ప్రత్యేక రాయితీలు, ప్రోత్సాహకాలను ప్రకటించింది. కార్మికుల మీద సీఎం కేసీఆర్‌కు ఉన్న ప్రేమకు ఇది నిదర్శనం. వేల కుటుంబాలకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయి. వెనకబడిన ప్రాంతంలో ఉన్న కంపెనీని తెరిపించడం ద్వారా స్థానికులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయి. దీనికి సహకరించిన సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌కు కృతజ్ఞతలు.

- కోనేరు కోనప్ప, ఎమ్మెల్యే, సిర్పూర్ కాగజ్‌నగర్

రూ.200 కోట్లు డిపాజిట్ చేయండి

■ జేపీ అసోసియేట్స్‌ను ఆదేశించిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ, మార్చి 21: ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ జేపీ ఇన్‌ఫ్రాటెక్‌కు చెందిన జయప్రకాశ్ అసోసియేట్స్ లిమిటెడ్(జేపీఎల్) రూ.200 కోట్లను రెండు దఫాలుగా డిపాజిట్ చేయాల్సిందిగా సర్వోన్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు బుధవారం ఆదేశాలు జారీ చేసింది. గృహ నిర్మాణ ప్రాజెక్టుల్లో ఫ్లాట్ల కొనుగోలుకు డబ్బులు చెల్లించిన వారికి ఇళ్లు కట్టించనందున వారికి తిరిగి చెల్లించాల్సిందగా న్యాయస్థానం ఆదేశించింది. మొదటి విడుత ఏప్రిల్ 15, రెండో విడుతలో భాగంగా మే 10 లోపు పూర్తి స్థాయి చెల్లింపులు జరుపాలని చీఫ్ జస్టిస్ దీపక్ మిశ్రా నేతృత్వంలోని ప్రత్యేక బెంచ్ ఆదేశించింది. అలాగే ఇప్పటి వరకు ఎంత మంది ఇళ్ల కొనుగోలుదారులకు నిధులు వాపస్ కోరుతున్నారనే దానికి సంబంధించి పూర్తి జాబితాలను న్యాయస్థానానికి అందచేయాల్సిందగా సుప్రీంకోర్టు..జేపీ ఇన్‌ఫ్రాకు సూచించింది. 31 వేల గృహాల కొనుగోలు చేసిన వారిలో ఇప్పటి వరకు కేవలం ఎనిమిది శాతం మందికి చెల్లింపులు జరిపినట్లు సర్వోన్నత న్యాయస్థానానికి జేపీఎల్ వెల్లడించింది. మిగతా వారు ఫ్లాట్లు కావాలని కోరినట్లు తెలిపింది. ఈ కేసుకు సంబంధించి జనవరి 25న సంస్థ రూ.125 కోట్లను సుప్రీంకోర్టు వద్ద జమ చేసిన విషయం తెలిసిందే. ఈ కేసు తదుపరి విచారణ నిమిత్తం ఈ కేసును వచ్చే నెల 16కి వాయిదావేసింది. జేపీ ఇన్‌ఫ్రా ప్రాజెక్టు కింద ఇళ్లను కట్టిస్తామని చెప్పి సరైన సమయానికి వాటిని అప్పగించకపోవడంతో కొనుగోలుదారులు తాము చెల్లించిన డబ్బులను తిరిగి ఇవ్వాలనికో రుతూ కోర్టునుఆ శ్రయించిన విషయం తెలిసిందే.

ట్రయంఫ్ నుంచి టైగర్ 800 బైకు

గరిష్ఠ ధర రూ.13.76 లక్షలు



న్యూఢిల్లీ, మార్చి 21: బ్రిటన్‌కు చెందిన సూపర్‌బైకుల తయారీ సంస్థ ట్రయంఫ్ మోటార్‌సైకిల్..దేశీయ మార్కెట్లోకి మరో రెండు మోడళ్లను అందుబాటులోకి తీసుకొచ్చింది. టైగర్ 800 విభాగంలో విడుదల చేసిన ఈ రెండు బైకులు రూ.11.76 లక్షల నుంచి రూ.13.76 లక్షల మధ్యలో లభించనున్నాయి. ఈ నూతన బైకులో సమూల మార్పులు చేసినట్లు ముఖ్యంగా టెక్నాలజీ, ఇంజినీరింగ్ పరంగా 200కి పైగా మార్పులు చోటు చేసుకున్నాయని ట్రయంఫ్ మోటార్‌సైకిల్ ఇండియా ఎండీ విమల్ సుంబ్లేతెలి పారు.

20 వేల కోట్ల సేకరణలో జియో

న్యూఢిల్లీ, మార్చి 21: ముకేశ్ అంబానీకి చెందిన టెలికం సంస్థ రిలయన్స్ జియో రూ.20 వేల కోట్ల నిధులను సేకరించేయోచనలో ఉన్నట్లు తెలుస్తున్నది. ఇందుకు సంబంధించి ఈ నెల 23న జరుగనున్న బోర్డు సమావేశంలో కీలక నిర్ణయం తీసుకోనున్నారు. ఈ విషయాన్ని మంగళవారం పొద్దుపోయిన తర్వాత సంస్థ నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్‌లకు సమాచారం అందించింది. సెక్యూర్డ్/అన్ సెక్యూర్డ్, లిస్ట్/అన్‌లిస్ట్, నాన్-కన్వెర్టబుల్ డిబెంచర్లను జారీ చేయడం ద్వారా ఈ భారీ స్థాయిలోనిధులను సేకరించాలనుకుంటున్నది. అప్పులను తగ్గించుకోవడానికి రూ.16,500 కోట్ల నిధులను సేకరించాలనుకుంటున్నట్లు భారతీ ఎయిర్‌టెల్ ప్రకటించిన కొన్ని రోజుల తర్వాత జియో నిధుల సేకరణకు సిద్ధం కావడం విశేషం. 16 కోట్ల మంది వినియోగదారులు కలిగిన జియో ఇప్పటి వరకు రూ.2 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులు పెట్టింది.



సదస్సులో బ్రోచర్‌ను విడుదల చేస్తున్న వక్తలు

మహిళా కార్మిక శక్తి పెరుగాలి

సీఐఐ సదస్సులో వక్తలు

హైదరాబాద్, మార్చి 21: మహిళా కార్మిక శక్తి మరింత పెరుగాల్సిన అవసరం ఉన్నదని, అప్పుడే దేశ ఆర్థికరంగం మరింత పరుగులు పెట్టే అవకాశం ఉన్నదని భారత పరిశ్రమల సమాఖ్య(సీఐఐ) ఏర్పాటు చేసిన ఐదో దేశీయ మహిళల సదస్సులో వక్తలు పేర్కొన్నారు. ఈ సందర్భంగా సీఐఐ సదరన్ రీజినల్ మాజీ చైర్మన్, ఫ్లాట్ గ్లాస్ మేనేజింగ్ డైరెక్టర్ బీ సంథనామ్ మాట్లాడుతూ..మహిళ కార్మికుల శక్తి భారీగా పెరిగిన యెడల 2025 నాటికి దేశ జీడీపీ మరో 500 బిలియన్ డాలర్లు చేరుకునే అవకాశం ఉన్నదని పేర్కొన్నారు. మహిళా సాధికారిత ఇండెక్స్‌లో దక్షిణాది రాష్ట్రాలు ముందు వరుసలో ఉన్న విషయాన్ని ఈ సందర్భంగా ఆయన ప్రస్తావించారు. 2030 నాటికి దేశ ఆర్థిక వ్యవస్థలో మహిళలు కీలకపాత్ర పోషించనున్నారన్న ఆయన..ఎంట్రీ లెవల్ ఉద్యోగాల్లోనూ సత్తా చాటనున్నట్లు పేర్కొన్నారు. వోల్వో గ్రూపు ఇండియా ఎండీ కమల్ బాలీ మాట్లాడుతూ..ఆర్థిక వ్యవస్థలో లింగ సమానత్వం కీలక పాత్ర పోషిస్తున్నదన్నారు. మహిళల్లో చైతన్యం కలిగించడానికి గడిచిన ఐదేండ్లలో ఐడబ్ల్యూఎన్ చేస్తున్న కృషి సత్ఫలితాలను ఇస్తున్నదని ఐడబ్ల్యూఎన్ చైర్‌పర్సన్ సుచిత్రా ఎల్లా తెలిపారు. సీఐఐ కూడా పలు కార్యక్రమాలనుఏరా ్పటు చేయడం సంతోషంగా ఉందన్నారు.

‘తయారీ’కి పన్ను పోటు




పరాయి దేశాల వైపు దేశీయ టీవీ ఉత్పాదక పరిశ్రమ చూపు

ప్యానెల్స్‌పై 15 శాతం, ఓపెన్ సెల్ తదితర భాగాలపై 10 శాతం దిగుమతి సుంకం

ఇక్కడ తయారు చేయడం కంటే.. దిగుమతులే ఉత్తమమన్న భావన

న్యూఢిల్లీ, మార్చి 21: ‘కొండ నాలుక్కి మందేస్తే.. ఉన్న నాలుకూడింది’ అన్నట్లుగా.. ‘మేక్ ఇన్ ఇండియా’ను ప్రోత్సహించేందుకు విదేశీ దిగుమతులపై కేంద్రం విధిస్తున్న పన్నులు.. దేశీయ తయారీ రంగానికే ఎసరు పెడుతున్నాయి. భారతీయ టెలివిజన్ పరిశ్రమ పరిస్థితి ఇప్పుడిలాగే ఉంది మరి. టీవీ ప్యానెల్స్, విడి భాగాల దిగుమతులపై నరేంద్ర మోదీ సర్కారు విధించిన పన్నులు.. ఆయా దేశీయ టీవీ ఉత్పాదక సంస్థల చూపును విదేశాలకు మళ్లిస్తున్నాయి. ప్యానెల్స్‌పై 15 శాతం, ఓపెన్ సెల్ వంటి ఇతరత్రా అనుబంధ భాగాలపై 10 శాతం చొప్పున దిగుమతి సుంకాలను పెంచుతున్నట్లు వచ్చే ఆర్థిక సంవత్సరానికి (2018-19)గాను గత నెలారంభంలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఇప్పటికే వివిధ మోడళ్ల ధరల పెంపును ప్రకటించిన దాదాపు అన్ని కంపెనీలు.. దేశంలో టీవీలు తయారు చేయడంకన్నా, విదేశాల నుంచి మొత్తం తయారైన టీవీలనే దిగుమతి చేసుకుంటే నయమన్న అభిప్రాయాల్ని వ్యక్తం చేస్తుండటం గమనార్హం. నిజానికి గతేడాది డిసెంబర్‌లో ఇలా మొత్తంగా విదేశాల నుంచి దేశంలోకి దిగుమతి చేసుకునే టీవీలపై వేస్తున్న పన్నును 10 శాతం నుంచి 20 శాతానికి కేంద్రం పెంచింది. అయితే ఇదంతగా టెలివిజన్ పరిశ్రమను ప్రభావితం చేయలేదు. దీనికి కారణం సామ్‌సంగ్, పానసోనిక్ మినహా చాలా సంస్థలు దేశీయంగానే టీవీలను తయారు చేస్తుండటం, ప్యానెల్స్, ఇతరత్రా భాగాల విదేశీ దిగుమతులపై పన్నులు లేకపోవడమే. అయితే వీటిపైనా పన్నులు పడుతుండటంతో.. ఇక టీవీల దిగుమతే మంచిదన్న నిర్ణయానికి దేశీయ మార్కెట్‌లో భారీ వాటా కలిగిన ఎల్‌జీ, సోనీ వంటి సంస్థలూ వస్తున్నాయి. కాంట్రాక్టు తయారీదారులైన డిక్సన్, సూపర్ ప్లాస్టోనిక్స్ సంస్థలూ ఇదే అభిప్రాయంలో ఉన్నాయి. వాస్తవానికి ప్యానెల్స్, ఇతరత్రా అనుబంధ భాగాల తయారీ ఇప్పుడు భారత్‌లో లేదని, కాబట్టి వాటిని ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకోవడం అనివార్యమని ఆయా సంస్థల ప్రతినిధులు చెబుతున్నారు. ఇదే విషయాన్ని పన్నులు తగ్గించాలంటూ ప్రభుత్వానికి సమర్పించిన విజ్ఞాపన పత్రంలోనూ కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్ అండ్ అప్లియెన్సెస్ మాన్యుఫాక్చరర్స్ అసోసియేషన్ (సీఈఏఎంఏ) పేర్కొన్నది. పన్నుల భారం ధరల పెరుగుదలకూ దారి తీస్తుందని, తద్వారా మార్కెట్‌లో టీవీ కొనుగోళ్లపై ప్రతికూల ప్రభావం ఏర్పడుతుందని సీఈఏఎంఏ అధ్యక్షుడు మనీశ్ శర్మ అంటున్నారు. పన్నులతో దేశీయంగా తయారీని ఆపేద్దామనే నిర్ణయానికి కంపెనీలు వస్తున్నాయన్నారు. కాగా, దేశంలో టీవీల తయారీని ప్రముఖ సంస్థలు నిలిపివేస్తే వేలాది మంది ఉద్యోగాలు ప్రమాదంలో పడినట్లే. స్థానిక ఉత్పాదక రంగానికీ దెబ్బే. దేశీయంగా తయారీ రంగాన్ని బలోపేతం చేయాలన్న ప్రభుత్వ ఆలోచన మంచిదే అయినా.. ఇలా భారీ సుంకాలను వేయడం తగదని, ముఖ్యంగా తయారీ వ్యవస్థ పూర్తిస్థాయిలో విస్తరించని ప్రస్తుత పరిస్థితుల్లో అస్సలు శ్రేయస్కరం కాదన్న అభిప్రాయాలు పరిశ్రమ వర్గాల నుంచి సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం దేశంలో ప్యానెల్స్ తయారీ ప్లాంట్లు లేవని, ఒకవేళ ఎవరైనా ప్లాంట్ ఏర్పాటుకు ముందుకొచ్చినా.. ప్యానెల్స్ మార్కెట్‌లో అందుబాటులోకి రావాలంటే కనీసం మూడేండ్ల సమయమైనా పడుతుందని కాంట్రాక్ట్ మాన్యుఫాక్చరర్స్ చెబుతున్నారు. అప్పటిదాకా పన్నులు చెల్లిస్తూ పోవాల్సిందేనా? అని ప్రశ్నిస్తున్నారు. అనిల్ అగర్వాల్‌కు చెందిన వేదాంత గ్రూప్.. 10 బిలియన్ డాలర్ల (రూ.65,000 కోట్లు) పెట్టుబడితో ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తున్నప్పటికీ.. ఇప్పట్లో ప్యానెల్స్ అందే అవకాశాల్లేవు. కాగా, ప్రభుత్వ నిర్ణయంతో ఎల్‌ఈడీ టీవీల ధర 5-6 శాతం పెరుగనున్నదని పానసోనిక్ ఇండియా కార్యకలాపాలకూ నేతృత్వం వహిస్తున్న మనీశ్ శర్మ చెప్పారు. ఇదే స్థాయిలో పెంపుంటుందని బీపీఎల్, సాన్యోలు తెలుపగా, 11 శాతం ధరలు పెరుగుతాయన్న సంకేతాల్ని కొడాక్ బ్రాండ్ ఇచ్చింది. నిరుడు డిసెంబర్‌లో వేసిన పన్నుతో 2-3 శాతం ధరలను సామ్‌సంగ్ ఇప్పటికే పెంచేసింది. మొత్తానికి ఈ పన్నుల భారం ‘మేక్ ఇన్ ఇండియా’ సంకల్పానికి విఘాతమేనన్న అభిప్రాయాలు గట్టిగా వినిపిస్తున్నాయి. వచ్చే నెల 1 నుంచి బడ్జెట్ ప్రతిపాదనలు అమల్లోకి వస్తుండటంతో.. ఈ లోపు ఈ ఆందోళనలపై మోదీ సర్కారు స్పందిస్తుందా? అనేది వేచిచూడాల్సిందే.



ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2017-18)లో దేశీయంగా 1.7 కోట్ల టీవీ సెట్ల అమ్మకాలు జరుగుతాయని సీఈఏఎంఏ అంచనా.

దేశంలో టీవీ తయారీ పరిశ్రమ ప్రత్యక్షంగా 11,000 మందికి, పరోక్షంగా మరో 33,000 మందికి ఉపాధిని కల్పిస్తున్నది.

“ ఇది మేక్ ఇన్ ఇండియా కార్యక్రమానికే విఘాతం. పన్నులు ఎలక్ట్రానిక్స్ రంగాన్ని నీరుగార్చుతున్నాయి. ఉద్యోగ సృష్టికి అడ్డంకిగా నిలుస్తున్నాయి.
- మనీశ్ శర్మ, సీఈఏఎంఏ అధ్యక్షుడు

పెరిగే పన్నుల భారంతో స్థానిక మార్కెట్‌లో లాభాలు తగ్గిపోతాయి. ధరలు పెంచక తప్పని పరిస్థితి. త్వరలో 6-7 శాతం ధరలు పెరుగవచ్చు.
- సచిన్ రాయ్, సోనీ ఇండియా టీవీ వ్యాపారధ్యక్షుడు

బడ్జెట్‌లో ఈ పన్నుల భారాన్ని వేయడం చాలా బాధాకరం. లాభాలు 30-40 శాతం నుంచి 10-15 శాతానికి పడిపోతాయి.
- అవ్నీత్ సింగ్ మార్వా, సూపర్ ప్లాస్టోనిక్స్ సీఈవో

అమెరికా ‘ఉక్కు’పాదం

■ భారత్, చైనా ఉత్పత్తులపై ట్రంప్ పన్నుల బాదుడు

■ స్టీల్ ఫ్లాంజ్‌లపై దిగుమతి వ్యతిరేక సుంకం



వాషింగ్టన్, మార్చి 21: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. మరో వివాదాస్పద నిర్ణయానికొచ్చారు. భారత్, చైనా నుంచి తమ దేశంలోకి దిగుమతయ్యే స్టెయిన్‌లెస్ స్టీల్ ఫ్లాంజెస్‌పై దిగుమతి వ్యతిరేక సుంకాన్ని విధించాలనే నిర్ణయం తీసుకున్నారు. ఇప్పటికే అమెరికాలోకి జరుగుతున్న విదేశీ ఉక్కు, అల్యూమినియం దిగుమతులపై 25 శాతం, 10 శాతం చొప్పున పన్నులను వేసిన ట్రంప్.. ఇప్పుడు ప్రత్యేకంగా భారత్, చైనాలపై ఈ దిగుమతి వ్యతిరేక సుంకం వేసేందుకు సిద్ధమయ్యారు. ఎగుమతిదారులకు భారత్, చైనాలు రాయితీలను ఇస్తున్నట్లు తమ ప్రాథమిక విచారణలో తేలిందని చెబుతున్న అమెరికా.. అందుకే ఈ నిర్ణయానికి వచ్చినట్లు అంటున్నది. అమెరికా పరిశ్రమల మనుగడకు, అక్కడి వారి ఉద్యోగాలకు ముప్పు తెస్తున్నవారిని ఉపేక్షించబోమని చెబుతున్న ట్రంప్.. తొలుత ఐటీ రంగాన్ని లక్ష్యంగా చేసుకున్న విషయం తెలిసిందే. హెచ్-1బీ వీసా విధానాలను కఠినతరం చేయగా, ఇప్పుడు ఉక్కు, అల్యూమినియం పరిశ్రమలపై పడ్డారు. అమెరికా మార్కెట్‌లో స్టెయిన్‌లెస్ స్టీల్ ఫ్లాంజెస్‌ను చైనా ఎగుమతిదారులు 257.11 శాతం, భారత్ ఎగుమతిదారులు 18.10 శాతం నుంచి 145.25 శాతం వరకు తక్కువ ధరలకే అమ్ముతున్నారని గుర్తించినట్లు అగ్రరాజ్య వాణిజ్య శాఖ అంటున్నది. ది కొలిషన్ ఆఫ్ అమెరికన్ ఫ్లాంజ్ ప్రొడ్యూసర్స్, కోర్ పైప్ ప్రొడక్ట్స్ ఇండస్ట్రీస్, మాస్ ఫ్లాంజ్ కార్పొరేషన్ ఫిర్యాదులతో ప్రాథమిక విచారణ జరిపినట్లు యూఎస్ వాణిజ్య శాఖ తెలిపింది. తమ విచారణలో స్థానిక ఉత్పత్తిదారులు నష్టపోతున్నారని తేలడంతోనే దిగుమతి వ్యతిరేక సుంకాన్ని వేయాలని నిర్ణయించినట్లు అమెరికా వాణిజ్య శాఖ మంగళవారం విడుదల చేసిన ఓ అధికారిక ప్రకటనలో స్పష్టం చేసింది. ఇందులోభాగంగానే చైనా, భారత్‌ల స్టెయిన్‌లెస్ స్టీల్ ఫ్లాంజెస్‌ను దిగుమతి చేసుకుంటున్నవారి నుంచి నిర్దేశిత మొత్తాల్లో నగదు డిపాజిట్లను తీసుకోవాలని అమెరికా కస్టమ్స్, సరిహద్దు రక్షణ శాఖకు వాణిజ్య శాఖ సూచనలు చేయనున్నది. 2016లో చైనా నుంచి అమెరికాకు స్టెయిన్‌లెస్ స్టీల్ ఫ్లాంజెస్ ఎగుమతుల విలువ 16.3 మిలియన్ డాలర్లుగా ఉన్నట్లు అంచనా. భారత్ నుంచి 32.1 మిలియన్ డాలర్లుగా ఉన్నట్లు తెలుస్తున్నది. కాగా, అక్రమ వాణిజ్య విధానాలకు ప్రభావితమవుతున్న అమెరికా సంస్థలు, పరిశ్రమలకు ఊరటనిచ్చేందుకు అక్కడి వాణిజ్య శాఖ పెద్ద ఎత్తున యాంటీ-డంపింగ్, కౌంటర్వేలింగ్ సుంకాల ఆదేశాలను జారీ చేస్తుండటం గమనార్హం.

చమురు బావుల వేలానికి స్పందన భేష్

డీజీహెచ్ డీజీ అటాను చక్రవర్తి



హైదరాబాద్, మార్చి 21: దేశవ్యాప్తంగా ఉన్న చమురు బావుల వేలానికి అనూహ్య స్పందన లభించిందని డైరెక్టర్-జనరల్ ఆఫ్ హైడ్రోకార్బన్(డీజీహెచ్) డైరెక్టర్ జనరల్ అటాను చక్రవర్తి తెలిపారు. ఈ రంగంలో పెట్టుబడులను ఆకట్టుకోవడానికి కేంద్ర చమురు మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 55 ఆయిల్ అండ్ గ్యాస్ బ్లాక్‌లకుగాను తొలి విడుత నిర్వహించిన వేలం పాటలో సుమారు వందకు పైగా దేశీయ, అంతర్జాతీయ సంస్థలు పోటీపడ్డాయని చెప్పారు. మరో రెండు వారాల్లో ముగియనున్న ఈ వేలం ప్రక్రియను మరో పక్షం రోజులు పెంచే అవకాశం ఉందని ఆయన సంకేతాలిచ్చారు. హైడ్రోకార్బన్ ఎక్స్‌ప్లోరేషన్ అండ్ లైసెన్సింగ్ పాలసీ(హెల్ప్) కింద నిర్వహిస్తున్న తొలి రౌండ్ బావుల వేలం ప్రక్రియను జనవరిలో ప్రారంభమైంది. 11 రాష్ట్రాల్లో 59,282 చదరపు కిలోమీటర్ల మేర పరిధి కలిగిన ఈ బావులు 2020-21 నాటికి అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందన్నారు. వీటిలో ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణాగోదావరి బేసిన్ కూడా ఉన్నది. ఈ హెల్ప్ పథకం కింద అభివృద్ధి చేయనున్న ఈ బావుల ద్వారా సమకూరనున్న ఆదాయాన్ని కేంద్రం పంచుకునే ఆలోచనలో ఉన్నట్లు తెలిపారు. హైడ్రోకార్బన్లను ఉత్పత్తి చేసే సంస్థలకు ఒకే లైసెన్స్ ఇచ్చే ప్రతిపాదన కూడా ఉందన్నారు. డీఎస్‌ఎఫ్-2 కింద మరో 60 బ్లాక్‌లను వేలం వేయాలనుకుంటున్నట్లు ఒక ప్రశ్నకు సమాధానమిచ్చారు. మొదటి విడుత చమురు బావుల కోసం రూ.46,400 కోట్ల మేర పెట్టుబడులు వచ్చే అవకాశం ఉన్నది. అలాగే పన్నుల రూపంలో కేంద్రానికి రూ.9,300 కోట్లు, రాయల్టీ కింద మరో రూ.5 వేల కోట్లు సమకూరనున్నాయి. ఈ కార్యక్రమంలో జాయింట్ సెక్రటరీ డీఎన్ మిశ్రా మాట్లాడుతూ..ప్రస్తుతం భారత్‌లో 37 మిలియన్ టన్నుల క్రూడాయిల్ ఉత్పత్తి అవుతుండగా, డిమాండ్ మాత్రం 110-120 మిలియన్ టన్నులుగా ఉందన్నారు. 2022 నాటికి చమురు దిగుమతిని మరో 10 శాతం తగ్గించాలనే ఉద్దేశంతో కేంద్రం పలు కీలక చర్యలు తీసుకుంటున్నదని, దీంట్లోభాగంగానే బావుల వేలంలో వేగం పెంచినట్లు చెప్పారు. ప్రతియేటా భారత్‌లో చమురు డిమాండ్ 4 శాతం నుంచి 4.5 శాతం వరకు పెరుగుతున్నదన్నారు.

బీఎస్ఎన్ఎల్ లక్ష వై-ఫై హాట్‌స్పాట్స్

న్యూఢిల్లీ, మార్చి 21: ప్రైవేట్ టెలికం సంస్థల నుంచి ఎదురవుతున్న పోటీని తట్టుకోవడానికి ప్రభుత్వరంగ టెలికం దిగ్గజం బీఎస్ఎన్ఎల్ స్పీడ్ పెంచింది. ప్రస్తుత సంవత్సరం ముగిసేనాటికి దేశవ్యాప్తంగా మరో లక్ష వై-ఫై హాట్‌స్పాట్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు కంపెనీ సీఎండీ అనుపమ్ శ్రీవాత్సవ తెలిపారు. వీటిలో ఇప్పటికే 18 వేల హాట్‌స్పాట్‌లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. గుజరాత్‌లోని వాల్‌సాడ్ జిల్లాలో ఉద్వాడా గ్రామంలో ఉచితంగా వై-ఫై సేవలను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ గ్రామాన్ని కేంద్ర సమాచార, టెక్స్‌టైల్ శాఖ మంత్రి స్మృతీ ఇరానీ దత్తత తీసుకున్నారు.

ఐటెల్ ఎంట్రీలెవల్ స్మార్ట్‌ఫోన్లు

ప్రారంభ ధర రూ.5,799



న్యూఢిల్లీ, మార్చి 21: ఎంట్రీలెవల్ స్మార్ట్‌ఫోన్ల పరిధిని మరింత విస్తరించడానికి ఐటెల్ మరో రెండో మోడళ్లను దేశీయ మార్కెట్లోకి విడుదల చేసింది. వీటిలో ఎస్42 ధరను రూ.8,499గా నిర్ణయించిన సంస్థ, ఏ44ను రూ.5,799కి విక్రయిస్తున్నది. 5.5 అంగుళాల టచ్‌స్క్రీన్ కలిగిన ఎస్42 మోడల్‌లో ముందు, వెనుకవైపు 13 మెగాపిక్సెల్ కెమెరాలు, క్వాల్‌కామ్ స్నాప్‌డ్రాగన్ 425 క్వాడ్‌కోర్ 1.4 గిగాహెడ్జ్ ప్రాసెసర్, ఆండ్రాయిడ్ టీఎం ఆపరేటింగ్ సిస్టమ్, 3జీబీ ర్యామ్, ఇంటర్నల్ మెమొరీ 16జీబీ(128 జీబీ వరకు పెంచుకోవచ్చును), 3000 ఎంఏహెచ్ బ్యాటరీ వంటి ఫీచర్స్ ఉన్నాయి. వీటితోపాటు ఏ44లో ఆండ్రాయిడ్ 7.0 ఆపరేటింగ్ సిస్టమ్, 64 బిట్‌క్వాడ్-కోర్ ప్రాసెసర్, 5.45 అంగుళాల టచ్‌స్క్రీన్, ముందు-వెనుకవైపు 5 మెగాపిక్సెల్ కెమెరాలు, 1జీబీ ర్యామ్, 8జీబీ మెమొరీ(32 జీబీ వరకు పెంచుకోవచ్చును), 2400 ఎంఏహెచ్ బ్యాటరీ ఉన్నాయి.

మళ్లీ 33 వేలపైకి సెన్సెక్స్

ముంబై, మార్చి 21: వరుసగా రెండు రోజులుగా లాభాల బాట పట్టిన బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ ప్రధాన సూచీ సెన్సెక్స్ 33 వేల మార్క్‌నుదాటింది. అమెరికా ఫెడరల్ రిజర్వు పాలసీ నేపథ్యంలో విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు ఈక్విటీ మార్కెట్లో భారీగా నిధులు కుమ్మరించడంతో సూచీలు పుంజుకోవడానికి దోహదపడ్డాయి. 30 షేర్ల ఇండెక్స్ సూచీ 139.42 పాయింట్లు లాభపడి 33,136.18కి చేరుకోగా, నిఫ్టీ 30.90 పాయింట్లు పెరిగి 10,155.25 వద్ద స్థిరపడింది. చక్కెర దిగుమతిపై విధిస్తున్న 20 శాతం సుంకాన్ని ఎత్తివేస్తున్నట్లు కేంద్రం ప్రకటించడంతో ఈ రంగ షేర్లను కొనుగోలు చేయడానికి మదుపరులు ఎగబడ్డారు. బల్రామ్‌పూర్ చిన్ని షేరు ధర ఏకంగా 9 శాతం లాభపడగా.. ధమ్‌పూర్ షుగర్, కేసీపీ షుగర్ 5.28 శాతం, గాయత్రీ షుగర్ 2.54 శాతం చొప్పున పెరిగాయి. టెలికం రంగంలో అత్యధికంగా భారతీ ఎయిర్‌టెల్ 4.39 శాతం లాభపడింది. వీటితోపాటు బ్యాంకింగ్ రంగ సూచీల్లో హెచ్‌డీఎఫ్‌సీ, ఇండస్‌ఇండ్ బ్యాంక్, కొటక్ బ్యాంకులు ఒక శాతంవరకు పెరిగాయి. అలాగే ఎల్ అండ్ టీ, హెచ్‌డీఎఫ్‌సీ, ఓఎన్‌జీసీ, మారుతి, మహీంద్రా, ఆర్ఐఎల్, ఇన్ఫోసిస్, విప్రో, కోల్ ఇండియా, హెచ్‌యూఎల్, ఐటీసీలు కూడా లాభపడ్డాయి. రంగాలవారీగా చూస్తే టెలికం, రియల్టీ, క్యాపిటల్ గూడ్స్, టెక్, ఇంధనం, ఆయిల్ అండ్ గ్యాస్, మౌలిక, ఐటీ, ఎఫ్ఎంసీజీ, పీఎస్‌యూ, బ్యాంకింగ్, కన్జ్యూమర్ డ్యూరబుల్ షేర్లు లాభాల్లో ముగిశాయి.

నేటి నుంచి ఐసీఐసీఐ సెక్యూరిటీస్ ఐపీవో

హైదరాబాద్, మార్చి 21: ఐసీఐసీఐ బ్యాంక్ అనుబంధ సంస్థయైన ఐసీఐసీఐ సెక్యూరిటీస్.. స్టాక్ మార్కెట్లో లిస్ట్ కాబోతున్నది. ఐసీఐసీఐ గ్రూపు నుంచి ఐపీవోకి వస్తున్న సంస్థల్లో ఇది మూడోది. గురువారం ప్రారంభమవనున్న వాటా విక్రయం.. 26న ముగియనున్నదని కంపెనీ వర్గాలు వెల్లడించాయి. ధరల శ్రేణి రూ.519-520గా ఉన్నది. రూ.5 ముఖ విలువ కలిగిన 77.24 మిలియన్ల షేర్లను విక్రయించడం ద్వారా రూ.4,140 కోట్ల నిధులను సేకరించాలనుకుంటున్నది. వీటిలో 38 లక్షల షేర్లను ఐసీఐసీఐ బ్యాంక్ వాటాదారులకు కేటాయించనున్నది. 58మంది యాంకర్ ఇన్వెస్టర్ల నుంచి రూ.1717 కోట్ల నిధులను బుధవారం సేకరించింది.

కనిష్క్ పాట వెయ్యి కోట్లు

మొదటిపేజీ తరువాయి...

వజ్ర, బంగారు ఆభరణాల వర్తకుల రుణ ఎగవేతలు కలవర పెడుతున్నాయి.

14 బ్యాంకుల నుంచి 824 కోట్ల రుణం

చెన్నై టీ నగర్ కేంద్రంగా వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తున్న కనిష్క్ గోల్డ్.. ప్రభుత్వరంగ బ్యాంకింగ్ దిగ్గజం ఎస్‌బీఐ సహా 14 ప్రభుత్వ, ప్రైవేట్‌రంగ బ్యాంకులకు రూ.824 కోట్ల వరకు ఎగ్గొట్టింది. వడ్డీతో కలిపితే బ్యాంకులకు వాటిల్లిన నష్టం రూ.1,000 కోట్లపైనే. ఈ సంస్థకు ప్రమోటర్లు, డైరెక్టర్లుగా భూపేశ్‌కుమార్‌జైన్, అతని భార్య నీతాజైన్ వ్యవహరిస్తున్నారు. గతేడాది మార్చి నుంచి వడ్డీ చెల్లించని కనిష్క్ గోల్డ్ ప్రమోటర్లు.. మరుసటి నెల ఏప్రిల్‌లో కనిపించకుండాపోయారు. నిరుడు ఏప్రిల్ 5న సంస్థ స్టాక్ ఆడిటింగ్ దగ్గర్నుంచి ప్రమోటర్ల ఆచూకీ తెలియరావడం లేదు. మే 25న బకాయిల కోసం కనిష్క్ కార్పొరేట్ ఆఫీసుకు, ఫ్యాక్టరీకి, దుకాణాలకు బ్యాంకర్లు వెళ్లగా, అవి కూడా మూసేసి కనిపించాయి. దీంతో ఈ ఏడాది జనవరి 25న సీబీఐని ఎస్‌బీఐ ఆశ్రయించింది. కనిష్క్ ప్రమోటర్లు తమ నుంచి రుణాలు తీసుకుని ఎగవేశారని, బ్యాంకులను మోసం చేశారని, రాత్రికి రాత్రే షాపులను మూసేసి పారిపోయారని ఫిర్యాదుచేసింది. అసలు రుణాలు రూ.824.15 కోట్లు, దానిపై వడ్డీ బకాయిలతో కలుపుకుని రూ.1,000 కోట్ల వరకు ఎగ్గొట్టారని వివరించింది. పోయిన మార్చిలో ఎనిమిది బ్యాంకులకు వడ్డీలను చెల్లించని కనిష్క్ గోల్డ్.. ఏప్రిల్‌లో మొత్తం 14 బ్యాంకులకు చెల్లింపులను నిలిపివేసిందని పేర్కొంది.

మారిషస్‌లో భూపేశ్ దంపతులు!

భూపేశ్‌కుమార్‌జైన్, నీతా జైన్‌లు విదేశాలకు పారిపోయినట్లు తెలుస్తున్నది. ప్రస్తుతం వీరు మారిషస్‌లో ఉన్నట్టు సమాచారం. ఈ కేసులో సీబీఐ ఎఫ్ఐఆర్‌ను నమోదుచేయగా, ఇందులో భూపేశ్‌జైన్, నీతాజైన్ మరికొందరితోపాటు ప్రభుత్వ ఉద్యోగులను పేర్కొన్నది. కనిష్క్ గోల్డ్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రమోటర్ల అధికారిక, నివాస సముదాయాల్లో సోదాలను కూడా బుధవారం నిర్వహించింది. తప్పుడు రికార్డులతో, మోసపూరిత ఆర్థిక ప్రకటనలతో కనిష్క్ రుణాలు పొందిందంటూ 14 బ్యాంకుల తరపున ఎస్‌బీఐ ఫిర్యాదు చేసినట్టు సీబీఐ తెలిపింది. కనిష్క్ గోల్డ్‌కు అప్పులిచ్చిన 14 బ్యాంకుల్లో ఎస్‌బీఐ.. గతేడాది నవంబర్‌లోనే ఆర్బీఐ దృష్టికి ఈ ఖాతాను తీసుకెళ్లింది. 2007 నుంచి రుణాలను తీర్చకుండా వడ్డీలను చెల్లిస్తూ కనిష్క్ గోల్డ్ పొడిగిస్తూ వస్తున్నట్టు వివరించింది. ఈ జనవరిలో మిగతా బ్యాంకులూ ఆర్బీఐని ఆశ్రయించి, మోసపూరిత ఖాతాగా తెలియజేశాయి. మరోవైపు నష్టాలతో గతేడాది మే నుంచే కనిష్క్ షోరూంలు మూతబడ్డాయని మద్రాస్ జ్యుయెల్లర్స్, డైమండ్ మర్చంట్స్ అసోసియేషన్ ప్రతినిధి చెప్పారు. ‘క్రిజ్’ బ్రాండ్ పేరుతో బంగారు ఆభరణాలను కనిష్క్ గోల్డ్ తయారు చేస్తున్నది.

ఏ బ్యాంకు ఎంతిచ్చింది?

ఎస్‌బీఐ	రూ.215 కోట్లు
పంజాబ్ నేషనల్ బ్యాంక్	రూ.115 కోట్లు
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా	రూ.50 కోట్లు
సిండికేట్ బ్యాంక్	రూ.50 కోట్లు
బ్యాంక్ ఆఫ్ ఇండియా	రూ.45 కోట్లు
ఐడీబీఐ బ్యాంక్	రూ.45 కోట్లు
యూకో బ్యాంక్	రూ.40 కోట్లు
తమిళనాడు మర్కంటైల్ బ్యాంక్	రూ.37 కోట్లు
ఆంధ్రా బ్యాంక్	రూ.30 కోట్లు
బ్యాంక్ ఆఫ్ బరోడా	రూ.30 కోట్లు
హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్	రూ.25 కోట్లు
ఐసీఐసీఐ బ్యాంక్	రూ.25 కోట్లు
సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా	రూ.20 కోట్లు
కార్పొరేషన్ బ్యాంక్	రూ.20 కోట్లు

కొలనుపాక ఆలయాల అభివృద్ధికి చర్యలు

■ టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పేర్వారం రాములు



రాష్ట్ర పర్యాటకశాఖ చైర్మన్ పేర్వారం రాములుకు వినతి పత్రం ఇస్తున్న ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ గొంగిడి సునీత

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: నల్లగొండ జిల్లా కొలనుపాక సోమేశ్వర, మహాలక్ష్మీవీరనారాయణ ఆలయాల అభివృద్ధితో పాటు కొలనుపాకను పర్యాటకంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పేర్వారం రాములు, టూరిజం కార్పొరేషన్ ఎండీ బోయినపల్లి మనోహర్‌రావు తెలిపారు. బుధవారం రాములుతో ఆలేరు ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వివిధ అభివృద్ధి పనులపై చర్చించారు. కొలనుపాక ఆలయ పనుల ప్రతిపాదనలను స్వదేశీదర్శన్ పథకంలో చేర్చేలా చూడాలని విన్నవించారు.



వేములవాడ కల్చరల్: వేములవాడ రాజన్న ఆలయంలో రామ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నాల్గో రోజు బుధవారం స్వామివారికి మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, సీతారామచంద్ర స్వామివారికి ఉపనిషత్ అభిషేకం చేశారు. అనంతరం శ్రీలక్ష్మి అనంత పద్మనాభస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి ఏడున్నర గంటలకు స్వామి వారి ఉత్సవ విగ్రహాలను, అశ్వ వాహనంపై వేములవాడ పురవీధుల్లో ఊరేగించారు.

పాకాలలో కలెక్టర్ ట్రెక్కింగ్

ఖానాపురం: ప్రపంచ అటవీ దినోత్సవంలో భాగంగా బుధవారం వరంగల్ రూరల్ జిల్లా ఖానాపురం మండలం పాకాలలో ఉదయం 6 గంటలకే కలెక్టర్ హరితతో సహా జిల్లా పాలనాయంత్రాంగం అటవీ బాట పట్టింది. ప్రకృతి ఒడిలో ఆహ్లాదకర వాతావరణంలో పాకాల అడవుల్లో నేచురల్ వాక్, ట్రెక్కింగ్ చేశారు. దట్టమైన అడవిలో రాళ్లు, రప్పలు దాటుకుంటూ రెండు కిలోమీటర్ల మేర నడిచిన అధికారులు, పాకాల వ్యూపాయింట్‌కు చేరుకున్నారు. అక్కడి నుంచి పాకాల అందాలను వీక్షించారు. అనంతరం పాకాల కట్టపైకి నడుచుకుంటూ వెళ్లి కట్టకు ఇరువైపులా మొక్కలు నాటారు. అనంతరం స్పీడు బోటులో కలెక్టర్ హరిత, సీసీఎఫ్‌వో అక్బర్, డీఆర్‌డీవో పీడీ శేఖర్‌రెడ్డి, డీఎఫ్‌వో పురుషోత్తం, ఆర్డీవో రవి బోటులో పాకాల సరస్సులో అరగంటకు పైగా విహరించారు.



వరంగల్ రూరల్ జిల్లా ఖానాపురం మండలం పాకాలలో ట్రెక్కింగ్ చేస్తున్న కలెక్టర్ హరిత, జిల్లా అధికారులు

తగ్గుతున్న రోడ్డు ప్రమాదాలు

■ తొమ్మిది శాతం తగ్గిన ప్రమాదాల మృతుల సంఖ్య
■ ఫలితమిస్తున్న ప్రభుత్వ చర్యలు
■ 2017లో రూ. 190 కోట్ల మేర చలాన్ల వసూలు
■ రోడ్డు భద్రత డీజీపీ కృష్ణప్రసాద్ వెల్లడి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రోడ్డు ప్రమాదాలు తగ్గించేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలనిస్తున్నాయి. గతేడాదితో పోలిస్తే 2017 ఏడాదిలో రోడ్డు ప్రమాదాల సంఖ్యలో 2శాతం తగ్గినట్లు రోడ్డు భద్రత, రైల్వేస్ డీజీపీ కృష్ణప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. రాష్ట్రంలో 2014 నుంచి 2017 వరకు రోడ్డు ప్రమాదాలు, మృతుల సంఖ్య, నమోదైన కేసులు తదితర అంశాలను ప్రకటనలో పేర్కొన్నారు. మోటర్ వాహనచట్టం కింద నమోదైన కేసుల సంఖ్యలో 2016తో పోలిస్తే 2017లో 71శాతం వృద్ధి నమోదైందనీ, 2016లో 71,07,173 కేసులు నమోదు కాగా, 2017లో ఆ సంఖ్య 84,83,509కు చేరిందన్నారు. అలాగే, ప్రభుత్వం తీసుకుంటున్న భద్రత చర్యలు, అవగాహన కార్యక్రమాలతో రోడ్డు ప్రమాదాల మృతుల సంఖ్యలో 2016తో పోలిస్తే 2017లో 9శాతం తగ్గిందని, ఇదే సమయంలో దేశవ్యాప్తంగా రోడ్డు ప్రమాదాల మృతుల సంఖ్యలో 3శాతం పెరిగిందన్నారు. చలాన్ల వసూలు కూడా 100శాతం పెరగడం పోలీస్‌శాఖ తీసుకుంటున్న చర్యలకు నిదర్శనమని, 2017లో రూ.190కోట్లు చలాన్ల రూపంలో వచ్చాయన్నారు.

రోడ్డు నిబంధనలు పాటించని వారిపై నమోదైన కేసులు, వసూలైన చలాన్ల రుసుం, ప్రమాదాలు, ప్రమాదాల్లో మృతుల సంఖ్య

ఏడాది	నమోదైనకేసులు	చలాన్లు (రూ.కోట్లలో..)	ప్రమాదాలు	మృతుల సంఖ్య
2014	49,67,534	95	20,078	6,906
2015	56,28,137	101	21,252	7,110
2016	71,07,173	124	22,811	7,219
2017	84,83,509	190	22,489	6,602

స్వల్పంగా తగ్గిన గరిష్ఠ ఉష్ణోగ్రతలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రవ్యాప్తంగా గరిష్ఠ ఉష్ణోగ్రతల్లో స్వల్పంగా తగ్గుదల నమోదయినట్టు హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. కొన్ని ప్రాంతాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2 డిగ్రీల మేర తగ్గినట్టు వాతావరణ కేంద్రం అధికారులు చెప్పారు. గురు, శుక్రవారాల్లో మాత్రం గరిష్ఠ ఉష్ణోగ్రతలు 2 నుంచి 3 డిగ్రీల మేర పెరిగే అవకాశం ఉన్నదని పేర్కొన్నారు.

ఎన్జీఆర్‌ఐ యువశాస్త్రవేత్తలకు ముగిసిన శిక్షణ

■ భూరసాయనశాస్త్ర ఆధునిక పద్ధతులపై అవగాహన

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: జాతీయ భూభౌతిక పరిశోధనా సంస్థ (ఎన్జీఆర్ఐ)లో భూరసాయన శాస్త్ర ఆధునిక విశ్లేషణా పద్ధతులపై నిర్వహించిన శిక్షణా కార్యక్రమం బుధవారం ముగిసింది. వైజ్ఞానిక, పారిశ్రామిక పరిశోధనా మండలి ఆధ్వర్యంలో ఈ నెల 12 నుంచి యువశాస్త్రవేత్తలకు శిక్షణ నిర్వహించారు. భూగర్భశాస్త్రానికి సంబంధించిన పలు వైజ్ఞానిక ఆధునిక పరికరాలు, ఉపయోగాలపై అవగాహన కల్పించారు. శిలాజాలు, శిలాద్రవం, వాటిపుట్టుక, వివిధ రకాల మూలకాల విశ్లేషణ, సాంద్రత, వ్యాపనం, వాటి స్థితిగతులు, ఖనిజాన్వేషణ, వాటి ప్రాముఖ్యం వంటి అంశాలపై ఎన్జీఆర్ఐ శాస్త్రవేత్తలతో పాటు పలు వర్సిటీల సీనియర్ సైంటిస్టులు వివరించారు. ముగింపు కార్యక్రమానికి గోవా జాతీయ సముద్ర విజ్ఞానసంస్థ సంచాలకుడు ప్రొఫెసర్ సునీల్‌సింగ్ హాజరై శిక్షణలో పాల్గొన్నవారికి ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమానికి ఎన్ఆర్ఐ ముఖ్యశాస్త్రవేత్త డాక్టర్ షకీల్ అహ్మద్ అధ్యక్షత వహించగా, ఎన్జీఆర్ఐ సంచాలకులు డాక్టర్ వీఎస్ తివారీ, శాస్త్రవేత్తలు డాక్టర్ సీ మాణిక్యాంబ, డాక్టర్ రామ్మోహన్,డా క్టర్ డీ శ్రీనివాస్ హాజరయ్యారు.

రికార్డుల్లో జీ అంటే ప్రభుత్వభూమేనా..?

■ రెవెన్యూఅధికారులను ప్రశ్నించిన ఉమ్మడి హైకోర్టు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: భూములకు సంబంధించిన వివరాలను రికార్డుల్లో ఇష్టానుసారంగా నమోదు చేస్తూ ప్రజలను అనవసర వ్యయప్రయాసలకు గురి చేయవద్దని రెవెన్యూ యంత్రాంగానికి ఉమ్మడి హైకోర్టు సూచించింది. రెవెన్యూ సిబ్బంది బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్న తీరుతో భూయజమానులు కోర్టుల చుట్టూ తిరగాల్సి వస్తున్నదని పేర్కొన్నది. హైదరాబాద్‌లోని నాంపల్లి మండలం ఆగాపురాలోని ఓ ప్రైవేట్ ఆస్తి విషయంలో టౌన్ సర్వేల్యాండ్స్ రికార్డు (టీఎస్ఎల్ఆర్)ల్లో జీ అని నమోదుచేసి, తదనంతరం ఆస్తిని ప్రభుత్వ భూమిగా పేర్కొంటూ నోటీసులు జారీచేయడాన్ని హైకోర్టు తప్పుబట్టింది. జీ అని రాస్తే ప్రభుత్వ భూమి అయిపోతుందా? అని వ్యాఖ్యానించింది. తరాలుగా అనుభవిస్తున్న స్థలాన్ని ప్రభుత్వభూమిగా పేర్కొంటూ ఖాళీచేయాలనినో టీసులుజా రీచే స్తే ఎలా అని ప్రశ్నించింది.

శ్రీరామ రథయాత్రకు అనుమతి నిరాకరణపై పిటిషన్

● విచారణ చేపట్టిన హైకోర్టు.. తీర్పు నేటికి వాయిదా

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో తాము తలపెట్టిన శ్రీరామ రథయాత్రకు పోలీసులు అనుమతించకపోవడాన్ని సవాల్‌చేస్తూ విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ) తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి ఎం గాల్‌రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై బుధవారం జస్టిస్ ఎం సీతారామమూర్తి నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరపున న్యాయవాది హరినాథ్‌రెడ్డి వాదనలుచేస్తూ.. ఈ నెల 18న బాసరలో యాత్ర మొదలుపెట్టి 31న హైదరాబాద్‌లోని తాడ్‌బండ్ హనుమాన్ దేవాలయం వరకు యాత్ర నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. ధార్మిక ప్రచారమని చెప్తున్నప్పటికీ దీని అసలు ఉద్దేశం వేరే ఉందని, ఈ యాత్ర వల్ల శాంతిభద్రతలకు విఘాతం కలిగే అవకాశం ఉందంటూ ఇంటెలిజెన్స్‌వర్గాలు హెచ్చరించినట్లు ప్రభుత్వ తరపు న్యాయవాది కోర్టుకు విన్నవించారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయస్థానం తీర్పును గురువారానికివా యిదా వేసింది.

గాంధీ దవాఖానలో ప్రిసైడింగ్ అధికారికి చికిత్స

● గుండె, లివర్, కిడ్నీ సంబంధిత వ్యాధులకు పరీక్షలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో అరెస్టయిన లేబర్ కోర్టు ప్రిసైడింగ్ అధికారి(జిల్లా జడ్జి హోదా) మల్లంపాటి గాంధీ నాలుగురోజులుగా గాంధీ దవాఖానలో చికిత్స పొందుతున్నారు. గాంధీపై ఏసీబీ అధికారులు శుక్రవారం కేసు నమోదు చేయగా, రిమాండ్‌కు తరలించాలని మేజిస్ట్రేట్ ఆదేశించడంతో ఆదివారం రాత్రి జైలుకు తీసుకెళ్లారు. అతడి ఆరోగ్య పరిస్థితిని పరిగణనలోకి తీసుకొని జైలు అధికారులు గాంధీ దవాఖానకు తరలించారు. ఆయన కొంతకాలంగా గుండె, లివర్, కిడ్నీ సంబంధిత వ్యాధులతో బాధపడుతున్నట్టు గుర్తించి చికిత్స చేస్తున్నారు. ప్రతిరోజు ఉదయం దవాఖాన సూపరింటెండెంట్, చంచల్‌గూడ జైలు సూపరింటెండెంట్, ఇతర అధికారులు కలిసి గాంధీ ఆరోగ్యంపై సమీక్షిస్తున్నారు. కోర్టు ఆదేశాల మేరకు చికిత్సకు సంబంధించి, ప్రతీరోజు సాయంత్రం మెడికల్ రిపోర్టును ఏసీబీ ప్రత్యేక కోర్టుకుపం పుతున్నట్టు జైలు అధికారులు పేర్కొన్నారు.

శరవేగంగా రంగనాయకసాగర్

జూలై చివరి నాటికి రిజర్వాయర్ పనులు పూర్తి ■ గోదావరి జలాలతో నింపడమే లక్ష్యం..

ఇక్కడి నుంచి లక్షా 10 వేల ఎకరాలకు సాగునీరు ■ ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్న మంత్రి హరీశ్‌రావు





సిద్దిపేట జిల్లా శ్రీరంగనాయకసాగర్ రిజర్వాయర్ బండ్ నిర్మాణ పనులు, కొనసాగుతున్న సర్జిపూల్ పనులు

సిద్దిపేట ప్రతినిధి, నమస్తే తెలంగాణ: వరుస కరువుతో అల్లాడుతున్న ప్రాంతానికి గోదావరి జలాలు తీసుకువచ్చి సస్యశ్యామలం చేయాలన్న లక్ష్యంతో చేపడుతున్న కాళేశ్వరం ప్రాజెక్టు ఎత్తిపోతల పనులు జోరుగా సాగుతున్నాయి. ఇందులో భాగంగా సిద్దిపేట జిల్లాలోని శ్రీరంగనాయకసాగర్ రిజర్వాయర్ (3 టీఎంసీలు) పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ రిజర్వాయర్ నుంచి చేపట్టిన కుడి, ఎడుమ కాల్వల పనులు తుది దశకు చేరాయి. జూలై చివరి నాటికి పూర్తి చేసి, ఆగస్టు మొదటి వారంలో గోదావరి జలాలతో చెరువులను నింపడమే లక్ష్యంగా పనులు నడుస్తున్నాయి. సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం చంద్లాపూర్, ఇమాంబాద్, పెద్దకోడూరు గ్రామాల శివారులో శ్రీరంగనాయకసాగర్ రిజర్వాయర్‌ను నిర్మిస్తున్నారు. మంత్రి తన్నీరు హరీశ్‌రావు రిజర్వాయర్ పనులపై ఇటు అధికారులు, ఏజెన్సీలతో నిరంతరం సమీక్షిస్తూనే, అటు క్షేత్రస్థాయిలో పనులను పరిశీలిస్తుండటంతో పనుల్లో వేగం పుంజుకున్నది. ఆగస్టులో గోదావరి జలాలను శ్రీరంగనాయకసాగర్‌లో నింపాలన్నదే మంత్రి హరీశ్‌రావు సంకల్పం. కాళేశ్వరం ఎత్తిపోతల్లో భాగంగా మిడ్‌మానేరు నుంచి అనంతగిరి రిజర్వాయర్‌కు, అక్కడి నుంచి శ్రీరంగనాయకసాగర్‌కు గోదావరి జలాలు వస్తాయి. ఈ రిజర్వాయర్ ద్వారా 1.10 లక్షల ఎకరాలకు సాగు నీరందిస్తారు. దీని సామర్థ్యం 3 టీఎంసీలు. రిజర్వాయర్ బండ్ నిర్మాణం 8.6 కిలోమీటర్ల పొడవు ఉంటుంది. ఫ్లడ్ లైట్ల వెలుతురు మధ్య రాత్రి వేళల్లోనూ పనులు చేపడుతున్నారు. అనంతగిరి నుంచి శ్రీరంగనాయకసాగర్ వరకు 8.65 కి.మీ. సొరంగం పనులు పూర్తి కావొచ్చాయి. కేవలం 200 మీటర్లు మాత్రమే బ్యాలెన్సింగ్ పనులు ఉన్నాయి. ఈ సొరంగంలో దాదాపు 6 కి.మీ. వరకు సీసీ లైనింగ్ పనులు కూడా పూర్తయ్యాయి. నాలుగు పంపుల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. ఒక్కో పంపుసెట్ 132 మెగావాట్ల సామర్థ్యం కలిగి ఉంటుంది. ఈ పనులు త్వరితగతిన పూర్తి చేసే లక్ష్యంగా చర్యలు చేపట్టారు. శ్రీరంగనాయకసాగర్ రిజర్వాయర్ నుంచి లక్షా 10 వేల ఎకరాలకు సాగునీరు అందించనుండగా రిజర్వాయర్ నుంచి కుడి, ఎడు మ కాల్వల పనులు కూడా చివరి దశకొచ్చాయి. ఎడుమ కాల్వ 22 కిలోమీటర్లకు గానూ 21 కిలోమీటర్లు పూర్తయి, సీసీ లైనింగ్ పనులూ చివరి దశకు చేరాయి. కుడి కాల్వ 25 కిలో మీటర్లకు గాను 15 కి.మీ. మేర కాల్వ పనులు పూర్తయ్యాయి.

జూలై చివరి నాటికి గోదావరి జలాలు



సిద్దిపేట జిల్లాలోని శ్రీరంగనాయకసాగర్ రిజర్వాయర్‌కు జూలై చివరి నాటికి గోదావరి జలాలను తీసుకువస్తాం. పనులు యుద్ధ ప్రాతిపదికన జరుగుతున్నాయి. క్షేత్రస్థాయిలో పరిశీలించడంతో పనులు వేగంగా జరుగుతున్నాయి. ఈ రిజర్వాయర్ నుంచి లక్షా 10 వేల ఎకరాలకు సాగునీరందిస్తాం. కుడి, ఎడుమ కాల్వల పనులు చివరి దశలో ఉన్నాయి.

- తన్నీరు హరీశ్‌రావు, భారీ నీటి పారుదల శాఖ మంత్రి

టీఆర్ఎస్‌లో భారీగా చేరికలు




హైదరాబాద్‌లో టీఆర్ఎస్‌లో చేరిన వారికి కండువాలు కప్పుతున్న మిషన్ భగీరథ వైస్‌చైర్మన్, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి



హైదరాబాద్‌లో మంత్రి లక్ష్మారెడ్డి సమక్షంలో టీఆర్ఎస్‌లో చేరుతున్న మహబూబ్‌నగర్ జిల్లా రాజాపూర్ మండలం బోడగుట్ట తండావాసులు

నమస్తే తెలంగాణ, నెట్‌వర్క్: టీఆర్ఎస్‌లోకి వివిధ పార్టీల నుంచి వలసలు పెరుగుతున్నాయి. బుధవారం మహబూబ్‌నగర్ జిల్లా రాజాపూర్ మండలం దొండ్లపల్లితో పాటు బోడగుట్ట తండాకు చెందిన 80మంది టీడీపీ, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు హైదరాబాద్‌లోని మంత్రి లక్ష్మారెడ్డి క్యాంప్ కార్యాలయంలో టీఆర్ఎస్‌లో చేరారు. కామారెడ్డి జిల్లా తాడ్వాయి మండల కేంద్రానికి చెందిన సొసైటీ చైర్మన్ దేమాగు సంజీవరెడ్డి బీజేపీ నుంచి ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి సమక్షంలో టీఆర్ఎస్‌లో చేరారు. నిజామాబాద్ జిల్లా భీమ్‌గల్ మండలం సికింద్రాపూర్‌కు చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు 30మంది అనుచరులతో హైదరాబాద్‌లో మిషన్ భగీరథ వైస్ చైర్మన్ వేముల ప్రశాంత్‌రెడ్డి సమక్షంలో గులాబీ కండువా కప్పుకున్నారు. ఎడపల్లి మండలం అంబం గ్రామానికి చెందిన పలువురు మహిళలు, కాంగ్రెస్, బీజేపీలకు చెందిన యువకులు దాదాపు 100మంది టీఆర్ఎస్‌లో చేరారు. నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజిపేట మండలం బుద్దసముద్రం గ్రామానికి చెందిన సుమారు 50 మంది యువకులు, గ్రామ పెద్దలు హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి స్వగృహంలో టీఆర్ఎస్‌లో, రంగారెడ్డి జిల్లా మాడ్గుల మండలం ఫిరోజ్‌నగర్‌కు చెందిన 50 మంది గిరిజనులు కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్సీ కశిరెడ్డి నారాయణరెడ్డి సమక్షంలో టీఆర్ఎస్‌లో చేరారు. తెలంగాణ భవన్‌లో గ్రామీణ నీటి సరఫరాలో సీపీడబ్ల్యుఎస్ పథకాల్లో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ విధానంలో పని చేస్తున్న సీఐటీయూ, ఏఐటీయూసీ, ఐఎన్టీయూసీ సంఘాల నాయకులు టీఆర్ఎస్ కార్మిక విభాగంలో చేరగా, ప్రభుత్వ విప్ పల్లా రాజేశ్వర్ రెడ్డి వారికి గులాబీ కండువా కప్పి టీఆర్ఎస్‌కేవీలోకి ఆహ్వానించారు. కాంట్రాక్టు కార్మికుల సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని విప్ అన్నారు. కార్యక్రమంలో టీఆర్ఎస్‌కేవీ రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబుయాదవ్, టీఆర్ఎస్ రాష్ట్రకార్యదర్శి గట్టు రాంచందర్ రావు, నాయకులు నారాయణ, గుర్రం వెంకట్ రెడ్డి, శారద, మారుతి రావు, సురేందర్, బిష్మందర్ పాల్గొన్నారు.



హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో కార్మికులను టీఆర్ఎస్ కార్మిక విభాగంలోకి కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న ప్రభుత్వ విప్ పల్లా రాజేశ్వర్ రెడ్డి



ఖమ్మంలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

క్షీరాభిషేకం..

కల్యాణలక్ష్మి, షాదీముబారక్ సాయం పెంపు, రజక సంక్షేమానికి బడ్జెట్‌లో 250 కోట్ల కేటాయింపులు, డప్పు, చెప్పు కళాకారులకు పింఛన్‌పై బుధవారం సైతం హర్షం వ్యక్తమైంది. రాష్ట్రవ్యాప్తంగా సీఎం కేసీఆర్ చిత్రపటాలకు క్షీరాభిషేకాలు నిర్వహించారు. ఖమ్మంలో తెలంగాణ రజక సంఘాల రాష్ట్ర కన్వీనర్ సత్యనారాయణ ఆధ్వర్యంలో, మహబూబ్‌నగర్ జిల్లా ధర్మాపూర్‌లో ఈజీఎస్ రాష్ట్ర డైరెక్టర్ కోట్ల కిశోర్‌రెడ్డి, నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి నియోజకవర్గంలో టీఆర్ఎస్ నాయకులు, మహిళలు, రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో మోచీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీరాజం ఆధ్వర్యంలో పాలాభిషేకాలు చేశారు.

బావిలో కారు బోల్తాపడి తాతామనువడు మృతి

■ తల్లి కూతుళ్లకు తీవ్రగాయాలు
■ కరీంనగర్ జిల్లా సింగాపూర్‌లో ఘటన

హుజూరాబాద్, నమస్తే తెలంగాణ/హుజూరాబాద్ రూరల్ : కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ మండలంలోని సింగాపూర్ గ్రామ సమీపంలో కరీంనగర్-వరంగల్ ప్రధాన రహదారిపై బుధవారం కారు అదుపు తప్పి వ్యవసాయ బావిలో బోల్తాపడింది. ఈ ప్రమాదంలో తాత, మనుమడు మృతి చెందగా, తల్లి కూతుళ్లకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. వరంగల్ జిల్లా కేంద్రంలోని గణేశ్‌నగర్‌కు చెందిన ఈదులగట్ల సుధాకర్(65) తన కోడలు భవానీ, మనుమడు వివాన్(9), మనమరాలు సాన్విని తీసుకొని, తన కారు(ఏపీ 36 ఏఎక్స్ 9913)లో శంకరపట్నం మండలం తాడికల్ గ్రామంలో ఉన్న భవానీ పుట్టింటికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో సింగాపూర్ గ్రామ సమీపంలో కారు అదుపు తప్పి వ్యవసాయ బావిలో పడింది. గమనించిన స్థానికులు బావిలోకి దిగి కారులో ఉన్న నలుగురిని బయటికి తీశారు. అప్పటికే సుధాకర్ మృతి చెందగా, మనువడు వివాన్‌ను దవాఖానకు తరలించే క్రమంలో మృతి చెందాడు. తీవ్ర గాయాలైన భవానీ, సాన్విని హన్మకొండ దవాఖానకు తరలించారు. సుధాకర్ కొడుకు వరుణ్ హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తుండగా, ఉగాది పండుగకు భార్యాపిల్లలతో కలిసి వరంగల్‌కు వచ్చి, మరుసటి రోజు హైదరాబాద్‌కు వెళ్లి పోయాడు. అయితే భవానీ పుట్టింటి వాళ్లను చూడటానికి మామతో కలిసి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది.



సుధాకర్, వివాన్(ఫైల్)

సీజీజీ బృందం పర్యటన



కరీంనగర్ జిల్లా కొత్తపల్లిలో కేసీఆర్ కిట్ల లబ్ధిదారులను వివరాలు అడిగి తెలుసుకుంటున్న బృందం సభ్యులు

కరీంనగర్ హెల్త్ : కరీంనగర్ ఉమ్మడి జిల్లాతో పాటు జిల్లా కేంద్రంలోని మాతా శిశు సంరక్షణ కేంద్రాన్ని సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ (సీజీజీ) బృందం బుధవారం పర్యటించింది. కేసీఆర్ కిట్ల పంపిణీ పనితీరును పరిశీలించింది. గ్రామాల్లోనూ కేసీఆర్ కిట్లు ఎలా అందుతున్నాయో అడిగి తెలుసుకుంది. కలెక్టరేట్ సమావేశమందిరంలో ఎంసీహెచ్ పనితీరును సెంట్రల్ గుడ్ గవర్నెన్స్ టీం(సీజీజీ) అధ్యయన బృందానికి కరీంనగర్ కలెక్టర్ సర్ఫరాజ్ అహ్మద్ వివరించారు. ఫీల్డ్ వెరిఫికేషన్‌లో భాగంగా పనులను పర్యవేక్షించామనీ, సంతృప్తిగా ఉందని బృందంలోని ట్రైనీ కలెక్టర్ ప్రావీణ్య, ప్రతినిధులు డాక్టర్ డీవీ రావ్, డాక్టర్ స్వాతి పేర్కొన్నారు. వివరాలను రాష్ట్ర కమిటీకి అందజేస్తామన్నారు.

వడదెబ్బతో ఒకరి మృతి

లింగాల: నాగర్‌కర్నూల్ జిల్లా లింగాల మండల కేంద్రానికి చెందిన మహ్మద్ యాకుబ్ (62) అనే వ్యక్తి వడదెబ్బకు గురై మృతి చెందాడు. రోజులాగే బుధవారం ఎండలో నిచ్చెనలు తయారు చేస్తూ సాయంత్రం 5గంటలకు తీవ్ర అస్వస్థకు గురై స్పృహతప్పి పడిపోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు అచ్చంపేట ప్రభుత్వ దవాఖానకు తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు.

అన్న చేతిలో తమ్ముడు హతం



శంకర్ (ఫైల్)

తానూర్: సాగు నీటి కోసం ఇద్దరు అన్నదమ్ముల మధ్య జరిగిన చిన్నపాటి గొడవ తమ్ముడి ప్రాణాల మీదకు తెచ్చింది. వివరాల్లోకి వెళ్తే.. నిర్మల్ జిల్లా తానూర్ మండలం జౌల(కే) గ్రామానికి చెందిన ఇఫ్తేకార్ గంగాధర్‌కు ఇద్దరు కుమారులు ఇఫ్తేకర్ దత్తు, ఇఫ్తేకర్ శంకర్(34) ఉన్నారు. గంగాధర్ తనకున్న 16ఎకరాల వ్యవసాయ భూమిలో ఆరు ఎకరాల చొప్పున కొడుకులకు ఇచ్చి, తాను నాలుగు ఎకరాలు ఉంచుకున్నాడు. గంగాధర్ ఇటీవల భూమిలో బోరు వేయించగా, నీరు ఎక్కువగా ఉండడంతో వారానికి ఒకరు చొప్పున పొలానికి నీరు పెట్టుకోవాలని కొడుకులకు సూచించాడు. ఈ విషయంపై అన్నదమ్ముళ్ల మధ్య గొడవలు జరిగాయి. ఈ క్రమంలో మంగళవారం రాత్రి 9గంటల ప్రాంతంలో తమ్ముడు శంకర్, అన్న దత్తుతో గొడవ పడ్డాడు. మాటామాట పెరిగి, కోపోద్రిక్తుడైన శంకర్‌పై దత్తు కర్రతో దాడి చేయడంతో అతడికి గాయాలయ్యాయి. శంకర్‌ను భైంసా దవాఖానకు, పరిస్థితి విషమించడంతో అక్కడి నుంచి నిజామాబాద్ తరలించారు. శంకర్ చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతి చెందాడు. అతడికి భార్య రూప, 14 నెలల కొడుకు ఉన్నారు. భార్య రూప ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గుడిపెల్లి రాజన్న తెలిపారు.

120 కేజీల క్లోరోహైడ్రేట్ స్వాధీనం

నిజామాబాద్ క్రైం: కల్తీ కల్లు తయారీకి వినియోగించే 120 కిలోల క్లోరోహైడ్రేట్‌ను పట్టుకున్నట్లు నిజామాబాద్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ డేవిడ్ రవికాంత్ తెలిపారు. ఈ మేరకు నిజామాబాద్‌లోని డీసీ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. ధర్పల్లి మండల పరిధిలోని గోవింద్‌పల్లిలో కల్తీ కల్లు అమ్ముతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు దాడి చేసి 15బాక్సులో ఉన్న కల్తీ కల్లును పారబోసినట్లు చెప్పారు. మాందాపురం రాజేశ్వర్‌గౌడ్ సమాచారం మేరకు ధర్పల్లికి చెందిన లింగాల రాజేశ్వర్‌గౌడ్ ఇంటిపై ఎన్‌ఫోర్స్‌మెంట్ టీం దాడి చేయగా మూడు ప్లాస్టిక్ సంచుల్లో 90 కేజీలతో పాటు మోర్తాడ్ మండలం ధర్మోరా గ్రామానికి చెందిన మందా అరుణ్ గౌడ్ ఇంట్లో 30కిలోల క్లోరోహైడ్రేట్ దొరికిందన్నారు. ముగ్గురిని అరెస్టు చేశారు. దీని విలువ సుమారు రూ.6 లక్షలు ఉంటుందని డేవిడ్ రవికాంత్ తెలిపారు.

యువ షూటర్ల గురి కుదిరేనా?



భారీ ఆశలతో నవతరం

పతకాలే లక్ష్యంగా ముమ్మర సాధన

నమస్తే తెలంగాణ
క్రీడా విభాగం

షూటింగ్‌లో రాణించాలంటే ఏకాగ్రత అవసరం..రెప్పపాటు చాలు గురితప్పడానికి..కొద్ది తడబాటు చాలు పతకం కోల్పోవడానికి..గాలి వీచే దశ షూటర్ భవిష్యత్‌ను మార్చొచ్చు.. ఏది ఎలా ఉన్నా..విపత్కర పరిస్థితి ఎదురైనా..లక్ష్యం వైపే చూపుండాలి..అంతకు మించిన ఆత్మవిశ్వాసంతో రాణిస్తేనే పతకం.. శారీరకంగా...మానసికంగా ధృఢత్వం.. గుండె వేగాన్ని నియంత్రించే సామర్థ్యం.. ఊపిరి తీసుకునే సమయాన్ని.. గురి చూసి కాల్చే సమయంతో సమన్వయం చేసుకుంటే రాణిస్తారు..

ఇంతటి పట్టుదల మన షూటర్లు చూపెడుతున్నారు.. అంతా యువ షూటర్లు.. షూటింగ్ ప్రపంచకప్‌లో పతకాల పట్టికలో అగ్రస్థానంలో నిలిపిన మన షూటర్లు..వచ్చేనెల 4 నుంచి జరిగే కామన్వెల్త్ షూటింగ్‌లోనూ పతకాలు కొల్లగొట్టేలా కనిపిస్తున్నారు.. ఒకప్పుడు భారత షూటింగ్ అంటే.. అభినవ్ బింద్రా.. గగన్ నారంగ్.. జీతూ రాయ్.. రాజ్యవర్ధన్ సింగ్ రాథోడ్.. విజయ్ కుమార్.. మానవ్‌జిత్ సింగ్ సంధూ.. అంజలి భగవత్.. హీనా సిద్ధూ.. ఠక్కున గుర్తొచ్చే పేర్లు. విశ్వ క్రీడలను మొదలుకొని.. ప్రపంచ చాంపియన్‌షిప్.. కామన్వెల్త్ గేమ్స్ వరకు మనోళ్ల ప్రదర్శన అద్వితీయం.. టోర్నీ ఎలాంటిదైనా పతకం గురి మాత్రం ఏనాడు తప్పలేదు. అలాంటి ఘన వారసత్వం కలిగిన భారత షూటింగ్ ఇప్పుడు యువ రక్తంతో మెరిసిపోతున్నది. అద్భుతమైన నైపుణ్యం.. అంతకుమించిన ఆధిపత్యం.. వీటికి తోడు చెదరని గురి.. సవాళ్లను ఎదుర్కొనే సామర్థ్యం.. ఇలా భారత షూటింగ్ రిజర్వ్ బెంచ్ సత్తాకు వచ్చే నెలలో గోల్డ్‌కోస్ట్‌లో జరిగే కామన్వెల్త్‌లో సరికొత్త సవాలు ఎదురుకాబోతున్నది. సీనియర్లకు తోడుగా మన యువ షూటర్ల గురి అదురుతుందా? పతకాల పంట పండుతుందా? అన్నది ఆసక్తికరంగా మారింది..!

2008 బీజింగ్ ఒలింపిక్స్‌లో అభినవ్ బింద్రా స్వర్ణం గెలువడంతో భారత షూటింగ్‌లో సరికొత్త చరిత్ర ప్రారంభమైంది. ఎందుకంటే అప్పట్లో మౌలిక వసతులు అంతంత మాత్రమే. అయినప్పటికీ బింద్రా చూపిన తెగువ, పోరాటం, భారత్‌లో షూటింగ్‌కు స్ఫూర్తిదాయకంగా నిలిచిపోయింది. అతన్ని స్ఫూర్తిగా తీసుకొని ఎంతో మంది అంతర్జాతీయస్థాయిలో పతకాలు సాధించారు.. ఇన్నేండ్ల తర్వాత ఇప్పుడు భారత్‌కు కచ్చితంగా పతకం లభించే క్రీడ అంటే షూటింగ్ అనేలా యువ షూటర్లు రాణిస్తుండడం భవిష్యత్‌పై ఆశలు పెంచుతున్నది.. గత కొన్నేండ్లుగా సీనియర్ల నీడలో అప్పుడప్పుడు మెరిసినా.. ఇప్పుడున్న యువ షూటర్లు మాత్రం పూర్తిస్థాయిలో రాణిస్తూ వరుస విజయాలు సాధిస్తున్నారు.. కామన్వెల్త్ క్రీడల రూపంలో యువ షూటర్లు మరో చరిత్ర సృష్టించేందకు మహత్తర అవకాశం వచ్చింది. గోల్డ్‌కోస్ట్‌లో వచ్చే నెల 8 నుంచి 14 వరకు బెల్‌మోంట్ షూటింగ్ కాంప్లెక్స్‌లో జరిగే పోటీల్లో భారత్ తరఫున మను భాకర్, మెహులీ ఘోష్, అనిష్ బాన్వాలా, అంజుమ్ మౌద్గిల్ లాంటి యువ షూటర్లు తమ అదృష్టాన్ని పరీక్షించుకోబోతున్నారు. ఇటీవల మెక్సికోలో జరిగిన ఐఎస్ఎస్ఎఫ్ వరల్డ్‌కప్‌లోనూ వీళ్లు అత్యుత్తమ ప్రదర్శన చూపెట్టారు. ఎవరూ ఊహించని రీతిలో 4 స్వర్ణాలతో కలిపి మొత్తం 9 పతకాలు సాధించి ఔరా అనిపించారు. అయితే ఈ ప్రదర్శనను ముందుగానే ఊహించిన భారత రైఫిల్ సంఘం (ఎన్ఆర్ఏఐ) షూటర్లకు కావాల్సిన ప్రతి వసతిని వాళ్లకు కల్పించింది. అందుకే భారత్ షూటింగ్ భవిష్యత్‌కు ఇక ఢోకా లేదని ఎన్ఆర్ఏఐ అధ్యక్షుడు రణీందర్ సింగ్ అన్నారు. 'ఈ ఏడాది మొత్తం మనకు కీలకమైన ఈవెంట్లు ఉన్నాయి. యువ షూటర్ల ప్రదర్శన కూడా అత్యద్భుతంగా ఉంది. కామన్వెల్త్‌లో కచ్చితంగా సత్తా చాటుతారని నమ్మకం ఉంది' అని రణీందర్ పేర్కొన్నారు. అనుభవం, యువకుల కలయికతో కామన్వెల్త్‌లో భారత్ పటిష్ఠమైన జట్టును బరిలోకి దింపుతోంది.



అంజుమ్ మౌద్గిల్



మను భాకర్

ఇటు రైఫిల్ షూటింగ్.. అటు పెయింటింగ్




అంజుమ్ మౌద్గిల్.. పంజాబ్ రాష్ర్టానికి చెందిన 24 ఏండ్ల యువతి భారత షూటింగ్‌లో సంచలన విజయాలతో దూసుకొస్తున్నది. కామన్వెల్త్ షూటింగ్ జట్టులో 10 మీటర్ల ఎయిర్ రైఫిల్, 50 మీటర్లు(3 పొజిషన్), 50 మీటర్ల (ప్రోన్) విభాగాల్లో భారత్ తరఫున ప్రాతినిధ్యం వహిస్తున్నది. 2010 నుంచి షూటింగ్‌లో ఎదురులేని విజయాలతో భారత ఆశాకిరణంగా నిలుస్తున్నది. అభినవ్ బింద్రా లాంటి దిగ్గజ షూటర్ ..యువత చేతిలో భారత షూటింగ్ భవిష్యత్ భద్రంగా ఉందని చెప్పడం వెనుక అంజుమ్ సాధిస్తున్న విజయాలు కూడా కీలకపాత్ర పోషిస్తున్నాయి. మెక్సికోలో ముగిసిన ఈ సీజన్ తొలి షూటింగ్ ప్రపంచకప్‌లో భారత్‌కు అంజుమ్ రజతం అందించిన విషయం తెలిసిందే.. విపరీతమైన పెనుగాలులతో ఇబ్బంది ఎదురైనా 50 మీ(3 పొజిషన్) రైఫిల్ ఈవెంట్‌లో పతకం సాధించడంతోపాటు..తొలిసీజన్ ప్రపంచకప్ పతకాలపట్టికలో మనకు తొలిస్థానం దక్కడంలో అంజుమ్ కీలకపాత్ర పోషించింది. రైఫిల్‌తో పాటు..కాన్వాస్..ఎప్పుడూ అంజుమ్ చెంత ఉంటాయి.. ఖాళీ సమయాల్లో పెయింటింగ్‌తో సేద తీరుతానని చెప్పే అంజుమ్ ..తను వేసిన పెయింటింగ్స్‌ను ఇన్‌స్టాగ్రాం ద్వారా అభిమానులతో పంచుకుంటుంది.. జాతీయ షూటింగ్ చాంపియన్‌గా నిలువడంతోపాటు అంతర్జాతీయంగా పలు పతకాలు సాధిస్తున్న అంజుమ్ .. వచ్చే నెల 4 నుంచి జరిగే కామన్వెల్త్ క్రీడలలోనూ పతకాలతో రాణించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రస్తుత ఫాం కొనసాగిస్తేనే అంజుమ్ పతకం సాధించడం ఖాయం..

షూటింగ్ సంచలనం

హర్యానాలోని జాహజ్జర్‌కు చెందిన **మను భాకర్** ఇప్పుడు భారత షూటింగ్‌లో యువ సంచలనం. 16 ఏండ్ల ఈ అమ్మాయి... తన అంతర్జాతీయ అరంగేట్రంలోనే 10 మీటర్ల ఎయిర్ పిస్టల్‌లో స్వర్ణంతో మెరిసింది. మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో ఓం ప్రకాశ్ మిత్రాల్‌తో కలిసి మరో పసిడిని ఒడిసిపట్టుకుంది. అనుకోకుండా షూటింగ్‌లో వచ్చిన మను.. ఇప్పుడు అంతర్జాతీయ యవనికపై సంచలన కోసం ఆరాటపడుతున్నది. 'మెక్సికోలో రెండు స్వర్ణాలు గెలిచినందుకు చాలా సంతోషంగా ఉంది. నా కెరీర్‌లో ఇదే మొదటి ప్రపంచకప్. రాబోయే టోర్నీలో మరింత మెరుగైన ప్రదర్శన చేయాలని భావిస్తున్నా' అని మను పేర్కొంది. తిరువనంతపురంలో జరిగిన నేషనల్స్‌లో ఈ అమ్మాయి 9 స్వర్ణాలతో కలిపి మొత్తం 15 పతకాలు సొంతం చేసుకుంది. జాయ్‌దీప్ కర్మాకర్ ఆధ్వర్యంలో మను శిక్షణ తీసుకుంటున్నది.

మిస్‌ఫైర్‌తో ముందుకు..



మెహులీ ఘోష్‌ది మరో కథ.. షూటింగ్ నేర్చుకుంటున్న దశలో బెంగాల్‌లోని శ్రీరాంపూర్ రైఫిల్ క్లబ్ తరఫున బరిలోకి దిగిన మెహులీ.. ఓసారి మిస్‌ఫైర్ చేసింది. ఇది పోలీసు ఫిర్యాదు వరకు వెళ్లింది. చిన్న కుగ్రామం నుంచి వచ్చిన మెహులీ ఆ తర్వాత తల్లి సహకారంతో సైకాలజీ తరగతులకు హాజరై క్రమంగా షూటింగ్‌లో రాటుదేలింది. కోల్‌కతాలోని కర్మాకర్ అకాడమీలో చేరిన తర్వాత ఈమె ప్రతిభ జాతీయస్థాయిలో మార్మోగింది. బరువైన ఎక్విప్‌మెంట్‌ను మోసుకుంటూ ప్రతి రోజు లోకల్ ట్రైన్‌లో నాలుగు గంటలు ప్రయాణం చేసి మరి శిక్షణ తీసుకుంది. గుడలాజారియాలో జరిగిన ఓ టోర్నీలో రెండు కాంస్యాలు గెలిచిన తర్వాత షూటింగ్‌లో తనకంటూ ఓ ప్రత్యేక స్థానాన్ని ఏర్పరుచుకుంది. బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధును స్ఫూర్తిగా తీసుకునే మెహులీ.. 2016 నేషనల్స్‌లో రెండు పతకాలు.. 2017లో ఏకంగా 8 పతకాలు సాధించి అందర్ని ఆశ్చర్యపరిచింది. జపాన్‌లో జరిగిన ఆసియా ఎయిర్‌గన్ చాంపియన్‌షిప్‌లో యూత్ క్యాటగిరీలో స్వర్ణం గెలిచి అంతర్జాతీయ అనుభవాన్ని సంపాదించింది.



మెహులీ ఘోష్

గురితప్పని మేటి..



అనిశ్ భన్వాలా

15 ఏండ్ల అనిశ్ భన్వాలా..హర్యానాకు చెందిన ఈ షూటర్ సంచలన విజయాలతో భారత షూటింగ్ ఆశా కిరణంగా మారాడు. గతేడాది జర్మనీలో జరిగిన జూనియర్ ప్రపంచకప్ షూటింగ్‌లో 25 మీటర్ల ర్యాపిడ్ ఫైర్ పిస్టల్ విభాగంలో ప్రపంచ రికార్డుతో సంచలనం సృష్టించాడు. అంతేకాదు.. ఒలింపియన్ గురుప్రీత్ సింగ్ ఇతర సీనియర్ షూటర్లు పాల్గొన్న జాతీయ షూటింగ్ చాంపియన్‌షిప్ లోనూ 25 మీటర్ల ర్యాపిడ్ ఫైర్ పిస్టల్ విభాగంలో స్వర్ణంతో ఔరా అనిపించాడు. మెక్సికోలో ముగిసిన ప్రపంచకప్ షూటింగ్ ఈవెంట్‌లోనూ అద్భుతంగా రాణించి ఆకట్టుకున్నాడు.. తాజాగా కామన్వెల్త్ గేమ్స్‌లో పాల్గొనే భారత షూటర్ల బృందంలో చోటు దక్కించుకున్నాడు.. ఇదే ఊపులో అనిశ్ రాణిస్తే భారత్‌కు మరో పతకం ఖాయమైనట్లే ..

కామన్వెల్త్ గేమ్స్‌లో పాల్గొనేందుకు చాలా దేశాలు కాస్త ఆసక్తిని తగ్గించుకోవడంతో షూటింగ్‌లో భారత్ 27 అంశాలకు బదులుగా 30 ఈవెంట్లలో పాల్గొనబోతున్నది. 15 మంది పురుషులు, 12 మంది మహిళల బృందంతో భారత్ షూటింగ్ బరిలోకి దిగుతున్నది. సీనియర్లకు తోడు యువ షూటర్లు ప్రతిభ చాటితే 2020 టోక్యో ఒలింపిక్స్‌లోనూ మనకు ఈ విభాగంలో పతకాల సంఖ్య పెరుగడం ఖాయం..

మీ కుటుంబ సభ్యుల ఖర్చు మీదే

అథ్లెట్లు, ఇతర సిబ్బందికి ఐవోఏ ఝలక్

న్యూఢిల్లీ: కామన్‌వెల్త్ గేమ్స్‌కు వెళ్లే అథ్లెట్లకు భారత ఒలింపిక్ సమాఖ్య (ఐవోఏ) చేదు వార్త చెప్పింది. ఈ మెగాటోర్నీకి అథ్లెట్లు, కోచ్‌లు, టీమ్ మేనేజర్‌ల కుటుంబ సభ్యులను ఈసారి అనుమతించబోమని అనూహ్య నిర్ణయం తీసుకున్నది. ఒకవేళ క్రీడాకారులు గానీ, ఇతర సిబ్బంది గానీ వారి కుటుంబ సభ్యులను వెంట తీసుకుపోవాలనుకుంటే ఆ ఖర్చును వారే భరించాల్సి ఉంటుందని, ప్రభుత్వం ఏ మాత్రం భరించదని క్రీడా మంత్రిత్వ శాఖ ప్రతినిధి ఒకరు స్పష్టం చేశారు. ఇందుకు సంబంధించి 222 మంది అథ్లెట్లు, 106 మంది అధికారులు, 57 మంది కోచ్‌లు, 19 మంది మేనేజర్లు, 41 మంది ఇతరత్రా సిబ్బంది జాబితాను భారత ఒలింపిక్ సమాఖ్య క్రీడాశాఖకు పంపింది. క్రీడా మంత్రి రాజ్యవర్ధన్‌సింగ్ రాథోడ్ దీనిపై మరో రెండు రోజుల్లో నిర్ణయం ప్రకటిస్తారు. 2014 గ్లాస్గో కామన్‌వెల్త్ గేమ్స్‌లో క్రీడాకారుల కుటుంబ సభ్యుల ప్రయాణ ఖర్చుల కోసం భారత ప్రభుత్వం రూ.1.75లక్షలు వెచ్చించిందని. దీనిపై అప్పట్లో విమర్శలు వచ్చిన నేపథ్యంలోనే తాజా నిర్ణయం తీసుకున్నట్టు ఐవోఏ ప్రతినిధి తెలిపారు. అథ్లెట్ల కుటుంబ సభ్యుల కోసం ప్రభుత్వం ఎందుకు ఖర్చుపెట్టాలి అని ప్రశ్నించారు.

సానుభూతితో ఉపయోగంలేదు

విజయ్‌శంకర్ ఆవేదన



న్యూఢిల్లీ: మొగుడు తిట్టినందుకు కాదు, తోడి కోడలు నవ్వినందుకే..అన్న సామెత టీమ్ఇండియా ఆల్‌రౌండర్ విజయ్‌శంకర్‌కు ప్రస్తుత పరిస్థితుల్లో అతికినట్టు సరిపోతుంది. బంగ్లాదేశ్‌తో ఫైనల్ మ్యాచ్ సందర్భంగా శంకర్ 18వ ఓవర్‌లో వరుసగా నాలుగు బంతులు మిస్ చేసి భారత్‌ను దాదాపుగా ఓడించినంత పని చేశాడు. దినేశ్ కార్తీక్ గనుక ఆఖరి బంతికి సిక్సర్ కొట్టి గెలిపించి ఉండకపోతే శంకర్‌ను అంతా ఏకిపారేసేవారు. అయితే ప్రస్తుతం శంకర్ విచిత్ర పరిస్థితిని ఎదుర్కొంటున్నాడు. చాలా మంది అతనిపై సానుభూతి చూపుతూ మెసేజ్‌లు పంపుతున్నారంట. దీనిపై నిరాశ చెందిన శంకర్ మీడియాతో మాట్లాడుతూ.. 'చాలా మంది నాపై జాలి చూపుతూ మెసేజ్‌లు పంపడం తట్టుకోలేకపోతున్నా. ఆ మ్యాచ్‌ను ఎంత మరిచిపోదామన్నా ఆ మెసేజ్‌లతో పదేపదే గుర్తు చేస్తున్నారు. నిజానికి నేను డకౌట్ అయినా నన్ను ఎవరూ పట్టించుకునేవారు కాదు. ఒకవేళ గెలిపించి ఉంటే ఆకాశానికెత్తేసే వారు. కానీ ఇలా జాలి చూపడం ఇబ్బందికరంగా ఉన్నది. అయినా భారత్ వంటి పెద్ద జట్టుకు ఆడుతున్నపుడు ఇటువంటివి తప్పవు. సవాళ్లను అధిగమిస్తేనే కెరీర్‌లో ఎదుగగలుగుతా' అని శంకర్ వివరించాడు. మ్యాచ్ గెలిచిన తర్వాత సహచర ఆటగాళ్లు సంబురాలు చేసుకుంటుంటే తాను మాత్రం తీవ్ర మనోవేదనతో ఉన్నాని ఈ చెన్నై ఆల్‌రౌండర్ తెలిపాడు. అద్భుతమైన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోలేకపోవడం దురదృష్టకరమన్నాడు. కానీ కోచ్ రవిశాస్త్రి, కెప్టెన్ రోహిత్ సహా ఆటగాళ్లంతా తనకు బాసటగా నిలిచి ఇటువంటి జరుగడం కామనే అని చెప్పడం ఊరట కలిగించిందని శంకర్‌తెలి పాడు..

ధనాధన్‌కు సై..

భారత్, ఆస్ట్రేలియా మహిళల టీ20 మ్యాచ్ నేడు



ఉదయం 10 నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో

ముంబై: ధనాధన్ పోరుకు రంగం సిద్ధమైంది. బంతి బంతికి ఉత్కంఠ రేపే పొట్టి ఫార్మాట్‌లో తలపడేందుకు భారత్, ఆస్ట్రేలియా, ఇంగ్లండ్ పక్కా ప్రణాళికతో సమాయత్తమయ్యాయి. గురువారం నుంచి ముక్కోణపు టీ20 సిరీస్ మొదలవుతున్నది. భారత్, ఆస్ట్రేలియా మధ్య మొదటి మ్యాచ్ జరుగనుంది. వన్డే సిరీస్ క్లీన్‌స్వీప్ పరాజయాన్ని టీ20ల్లో కంగారూలపై కసిగా ప్రతీకారం తీర్చుకునేందుకు హర్మన్‌ప్రీత్‌కౌర్ కెప్టెన్సీలోని టీమ్ఇండియా కసరత్తు చేస్తున్నది. దక్షిణాఫ్రికా గడ్డపై తొలి టీ20 సిరీస్ విజయమిచ్చిన ఆత్మవిశ్వాసంలో ఉన్న భారత్..అదే జోరులో ఆసీస్, ఇంగ్లండ్‌ను ఓడించాలన్న పట్టుదలతో ఉన్నది. ఈ నేపథ్యంలో మూడు జట్ల మధ్య మంచి రసవత్తర పోరు జరుగనుంది. స్మృతి మందన, జెమీమా రోడ్రిగెజ్, మిథాలీరాజ్ మంచి ఫామ్‌మీద ఉండట భారత్‌కు బాగా కలిసిరానుంది. గాయపడ్డ ఏక్తా బిస్త్‌కు బదులుగా రాజేశ్వరీ గైక్వాడ్‌ను జట్టుకు ఎంపిక చేశారు. మరోవైపు వన్డే సిరీస్ విజయమిచ్చిన ఊపును కొనసాగించాలన్న తాపత్రయంలో ఆసీస్ ఉన్నది.

'ఆరంభం'లో ఆరుగురు కెప్టెన్లు ఔట్

ఐపీఎల్ ప్రారంభోత్సవానికి ఇద్దరే
స్పష్టం చేసిన బీసీసీఐ



న్యూఢిల్లీ: ఐపీఎల్ ఆరంభ వేడుకలంటే అభిమానులకు పండుగే..బాలీవుడ్ తారల నృత్యాలు, ప్రత్యేక కార్యక్రమాలు ఆకట్టుకోవడమే ఇందుకు కారణం. అన్నిటికీ మించి తమ అభిమాన ఐపీఎల్ కెప్టెన్లందరూ ఒకే చోట చేరి హంగామా చేయడం అభిమానులకు ఎంతో మజా అందిస్తుంది. అయితే ఈసారి మాత్రం ఫ్యాన్స్‌కు ఆ కిక్ దొరుకదు. అంగరంగ వైభవంగా జరుగనున్న ఐపీఎల్ ఆరంభ వేడుకలకు ఆరుగురు కెప్టెన్లు దూరమవనున్నారు. మొత్తం ఎనిమిది ఫ్రాంచైజీలు ఉండగా..చెన్నై సూపర్ కింగ్స్, ముంబై ఇండియన్స్ మినహా మిగతా ఆరు జట్ల నాయకులు ఏప్రిల్ 7న ముంబైలో జరుగబోయే ప్రారంభ కార్యక్రమానికి హాజరుకారని బీసీసీఐ బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఆరంభ వేడుకకు ముందు రోజే (ఏప్రిల్ 6న) ఆయా జట్ల కెప్టెన్లందరితో ఒక వీడియో షూట్ చేయించి, సెర్మనీలో దానిని ప్రదర్శిస్తామని బీసీసీఐ ప్రతినిధి ఒకరు చెప్పారు. ఓపెనింగ్ సెర్మనీ మరుసటి రోజు రెండు మ్యాచ్‌లు ఉన్నాయని, ఒకవేళ అందరు కెప్టెన్లు ఈ వేడుకకు హాజరైతే మరునాడు జరిగే మ్యాచ్‌ల కోసం ఆయా వేదికలకు ప్రయాణం చేయడం కష్టమవుతుందన్నారు.

ఐపీఎల్‌లో డీఆర్ఎస్ : అంపైర్ నిర్ణయ సమీక్ష పద్ధతి(డీఆర్ఎస్)ను ఐపీఎల్‌లోనూ అమల్లోకి తీసుకురాబోతున్నారు. బుధవారం జరిగిన ఓ ప్రమోషన్ కార్యక్రమంలో ఐపీఎల్ చైర్మన్ రాజీవ్‌శుక్లా దీన్ని ధృవీకరించారు. మరోవైపు షమీ కేసుపై స్పందిస్తూ బీసీసీఐ అవినీతి నిరోధక యూనిట్ చీఫ్ నీరజ్ కుమార్ ఆధ్వర్యంలో విచారణ ముగిసిన తర్వాత నిర్ణయం తీసుకుంటామన్నారు.

దంగల్ మహిమ



బాన్సువాడ రూరల్: దంగల్ సినిమాను స్ఫూర్తిగా తీసుకున్న యువతి.. కుస్తీలో మహామహులను మట్టికరిపిస్తున్నది. యువకులతో పోటీకి దిగి వారిని చిత్తు చేస్తున్నది. మహారాష్ట్రకు చెందిన 16 ఏండ్ల మహిమ బుధవారం కామారెడ్డి జిల్లా బాన్సువాడ మండలం కోనాపూర్‌లో జరిగిన కుస్తీ పోటీలో యువకుడితో తలపడి అతడిని ఓడించింది. విజేతగా నిలిచి 30 గ్రాముల వెండి కడియం సొంతం చేసుకున్నది. అంతకు ముందు ఉగాది రోజు నిర్వహించిన పోటీలోనూ మల్లయోధులను ఓడించి ఔరా అనిపించింది.

మియామీ ప్రధాన పోరుకు యుకీ

మియామీ: మియామీ మాస్టర్స్ టోర్నీలో భారత సింగిల్స్ స్టార్ యుకీ భాంబ్రీ ప్రధాన పోరుకు అర్హత సాధించాడు. బుధవారం జరిగిన ఆఖరి అర్హత రౌండ్ పోరులో యుకీ 7-5, 6-2 తేడాతో ఎలియాస్ యెమెర్(స్వీడన్)పై అలవోక విజయం సాధించాడు. రెండేండ్ల క్రితం తనకు ఎదురైన పరాజయానికి యుకీ ప్రతీకారం తీర్చుకున్నాడు. గురువారం జరిగే తొలి రౌండ్‌లో ప్రపంచ 75వ ర్యాంక్ ఆటగాడు లోసర్ మిర్జాబేసిక్(బోస్నియా)తో యుకీ తలపడుతాడు.



ప్రపంచకప్‌లో వెస్టిండీస్

అర్హత పోటీల్లో స్కాట్లాండ్‌పై గెలుపు

హరారే: రెండు సార్లు విశ్వవిజేతగా నిలిచిన వెస్టిండీస్, ప్రపంచకప్‌కు అర్హత సాధించేందుకు ఆపసోపాలు పడుతున్న క్రమంలో వరుణుడు గట్టెక్కించాడు. బుధవారం స్కాట్లాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో వెస్టిండీస్ డక్‌వర్త్ లూయిస్ పద్ధతిన 5 పరుగుల తేడాతో గెలిచి ప్రపంచకప్‌కు అర్హత సాధించింది.. మొదట బ్యాటింగ్ చేసిన వెస్టిండీస్ 48.4 ఓవర్లలో 198 పరుగులకు ఆలౌట్ అవగా..లక్ష్య ఛేదనలో స్కాట్లాండ్ 125/5తో ఉన్న సమయంలో వర్షం కురియడంతో మ్యాచ్ నిలిచిపోయింది. డక్‌వర్త్ లూయిస్ ప్రకారం స్కాట్లాండ్ ఐదు పరుగులు వెనుకబడి ఉండటంతో వెస్టిండీస్ విజయం సాధించి ఫైనల్‌కు చేరింది. మరో బెర్త్ కోసం నేడు జరుగబోయే జింబాబ్వే, యూఏఈ మ్యాచ్ ఫలితం ఆధారపడి ఉన్నది. ప్రస్తుతం 5 పాయింట్లతో ఉన్న జింబాబ్వే, యూఏఈపై గెలిస్తే 7 పాయింట్లతో ఫైనల్‌కు చేరుతుంది. ఒకవేళ ఓడితే..మార్చి 23న జరుగబోయే ఆఫ్ఘనిస్థాన్, ఐర్లండ్ మ్యాచ్ విజేత నేరుగా ఫైనల్‌కు చేరుతుంది.



సిడ్నీలో మీడియాతో మాట్లాడుతున్న టీఆర్ఎస్ ఎన్నారై సెల్ సమన్వయకర్త మహేశ్ బిగాల, ఆస్ట్రేలియాశాఖ ఉపాధ్యక్షుడు రాపోలు రాజేశ్

గుణాత్మక మార్పుల దిశగా సీఎం కేసీఆర్ తొలిఅడుగు

- కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ దేశానికి ఆదర్శం
- ఎన్నారై బడ్జెట్‌తో చరిత్రకెక్కిన సీఎం కేసీఆర్
- టీఆర్ఎస్ ఆస్ట్రేలియాశాఖ ఉపాధ్యక్షుడు రాజేశ్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: సీఎం కేసీఆర్ ఫెడరల్ ఫ్రంట్ దిశగా వేసిన తొలి అడుగు దేశ రాజకీయాల్లో గుణాత్మక మార్పునకు శ్రీకారం చుడుతున్నదని టీఆర్ఎస్ ఎన్నారై సెల్ సమన్వయకర్త బిగాల మహేశ్, ఆస్ట్రేలియా శాఖ ఉపాధ్యక్షుడు రాపోలు రాజేశ్ చెప్పారు. సిడ్నీలో బుధవారం వారు మీడియాతో మాట్లాడారు. ఫెడరల్ ఫ్రంట్‌లో భాగంగా సీఎం కేసీఆర్.. పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీతో సమావేశమై చర్చించడంతో బంగారు భారతదేశం నిర్మించే దిశగా తొలిఅడుగు పడిందన్నారు. పేదింటి ఆడపిల్లల కోసం కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ ఆర్థికసాయాన్ని రూ.లక్షకు పెంచడం సాహసోపేతమైన నిర్ణయమని, ఈ పథకం దేశానికే ఆదర్శమన్నారు. ఎన్నారై శాఖకు బడ్జెట్‌లో రూ.100 కోట్లు కేటాయించడంతో సీఎం కేసీఆర్ చరిత్రకెక్కారని పేర్కొన్నారు. సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, ఈటెల రాజేందర్‌లకు ఎన్నారైల తరపున వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ నిధుల కేటాయింపుతో గల్ఫ్ బిడ్డల జీవితాలకు కొత్త భరోసా ఏర్పడుతుందని, తెలంగాణ బిడ్డలు ఎక్కడున్నా వారి సంక్షేమానికి సీఎం కేసీఆర్ చేస్తున్నకృషి అభినందనీయమన్నారు. ఎన్నారైల సేవల కోసం గత ప్రభుత్వాలు చేసిందేమీ లేదని చెప్పారు. గల్ఫ్ బాధితుల కోసం ఎప్పటికప్పుడు మంత్రి కేటీఆర్, ఎంపీ కవితలు స్పందిస్తున్న తీరు అభినందనీయమని అన్నారు. ఈ సమావేశంలో టీఆర్ఎస్ ఆస్ట్రేలియా ప్రతినిధులు కటికనేని విక్రమ్, కొడారపు జస్వంత్, ధూపాటి రవి, పరుశరాం, లక్ష్మణ్, రవి, వరుణ్, ఇస్మాయిల్,అ రుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



సింగపూర్‌లో జరిగిన ఉగాది వేడుకల్లో ప్రవాస భారతీయులు

సింగపూర్‌లో ఘనంగా ఉగాది వేడుకలు

హైదరాబాద్: తెలంగాణ కల్చరల్ సొసైటీ సింగపూర్ (టీసీఎస్ఎస్) ఆధ్వర్యంలో స్థానిక బుకిత్ పంజాంగ్‌లోని శ్రీ మురుగన్‌హిల్ ఆలయంలో మార్చి 18న ఉగాది వేడుకలు ఘనంగా జరిగాయి. సుమారు 400 మంది ప్రవాస తెలంగాణవాసులు వేడుకల్లో పాల్గొని పంచాంగ పఠనం విన్నారు. ఉగాది పచ్చడి సేవించారు. వేడుకల్లో టీసీఎస్ఎస్ అధ్యక్షుడు బండ మాధవరెడ్డి, ప్రధాన కార్యదర్శి బసిక ప్రశాంత్‌రెడ్డి, ఉపాధ్యక్షులు, నీలం మహేందర్, బూర్ల శ్రీనివాస్, పెద్ది శేఖర్‌రెడ్డి, ముదం అశోక్, కోశాధికారి గడప రమేశ్, ప్రాంతీయ కార్యదర్శులు దుర్గప్రసాద్, యెల్ల రాంరెడ్డి, కమిటీ సభ్యులు, గార్లపాటి లక్ష్మారెడ్డి, నల్ల భాస్కర్‌గుప్త, గర్రేపల్లి శ్రీనివాస్, పెరుకు శివరామ్‌ప్రసాద్, ఆర్సీ రెడ్డి, మొగిలి సునీత, గోపగోని దాము, చిల్క సురేశ్, చెట్టిపెల్లి మహేశ్, పింగ్లి భరత్ తదితరులుపా ల్గొన్నారు.

అడవులు, అర్బన్‌పార్కుల్లో ప్లాస్టిక్ నిషేధం

అతిక్రమించినవారికి జరిమానా

కేరళ విధానాన్ని అమలుచేయాలని అటవీశాఖ నిర్ణయం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: అటవీ ప్రాంతాలు, అర్బన్ పార్కులు, ఎకో-టూరిజం కేంద్రాల్లో ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలని రాష్ట్ర అటవీశాఖ నిర్ణయించింది. ప్లాస్టిక్‌ను వాడితే జరిమానా విధించాలని అధికారులు నిర్ణయించారు. మొదటగా అర్బన్‌పార్కుల్లో ఈ విధానాన్ని అమలుచేయాలని యోచిస్తున్నారు. జరిమానా విధించే విషయంలో కేరళలో అనుసరిస్తున్న విధానాన్ని అధ్యయనం చేయాలని రాష్ట్ర అటవీ, పర్యావరణశాఖ మంత్రి జోగురామన్న అధికారులకు సూచించారు. అటవీప్రాంతాల్లో ప్లాస్టిక్ వ్యర్థాలను పారవేయడం వల్ల వాటిని తింటున్న మూగజీవాలు మృత్యువాతపడుతున్నాయి. మన్ననూరు నుంచి శ్రీశైలం వెళ్లే దారిలో నల్లమల అటవీప్రాంతంలో ఈ సమస్య తీవ్రంగా ఉందని అటవీశాఖ అధికారులు పేర్కొంటున్నారు. ఈ క్రమంలో ప్లాస్టిక్ వ్యర్థాల వినియోగాన్ని పూర్తిగా అరికట్టాలని గత కొంతకాలంగా అటవీశాఖ అధికారులు చర్చలు జరుపుతున్నారు. అటవీ దినోత్సవం సందర్భంగా ప్లాస్టిక్ నిషేధాన్ని వెంటనే అమల్లోకి తీసుకురావాలని బుధవారం అధికారులు నిర్ణయించారు. ఇందుకు మంత్రి జోగురామన్న సమ్మతి కూడా తెలిపారు. అటవీమార్గాల్లో రహదారులకు ఇరువైపులా ప్లాస్టిక్ వ్యర్థపదార్థాలను తొలిగించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్టు అటవీశాఖ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ప్రశాంత్‌కుమార్ ఝా తెలిపారు.

జనావాసాల్లోకి వన్యప్రాణులు

- అటవీ మంటల నేపథ్యంలో వలసబాట
- అప్రమత్తమైన అటవీశాఖ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఎండాకాలం నేపథ్యంలో అడవుల్లో మంటలు చెలరేగుతున్నాయి. అభయారణ్యాల్లో జనాల చొరబాట్లు పెరిగిపోతున్నాయి. దీంతో అరణ్యాల్లోని వన్యప్రాణులు జనావాసాల వైపు వెళ్తున్నాయి. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల ఎలుగుబంట్లు, చిరుతపులులు వంటి జంతువులు జనావాసాల్లోకి చొరబడుతుండటంతో అటవీశాఖ అప్రమత్తమైంది.ప్రత్యామ్నాయ చర్యలు చేపడుతున్నది. అడవుల్లో మనుషుల చొరబాటుతో పాటు అగ్నిప్రమాదాలు పెరుగడంతో తలదాచుకోవడానికి తావును వెతుక్కుంటూ వన్యప్రాణులు సమీపంలోని గ్రామాల్లోకి వెళుతున్నాయని అధికారులు గుర్తించారు. గత మూడునెలలుగా రాష్ట్రంలో ఇప్పటివరకు రెండు వేలచోట్ల మంటలు చెలరేగినట్లు తెలిపారు. మంటలను ఆర్పడానికి చర్యలు తీసుకొంటూ, జంతువులకు నీటి సౌకర్యం కల్పిస్తున్నారు. రాష్ట్రంలోని 25 వేల చదరపు కిలోమీటర్ల వైశాల్యంలో విస్తరించి ఉన్న అడవులను ఆరువేల సెగ్మెంట్లుగా విభజించారు. ప్రతీ నాలుగు చదరపు కిలోమీటర్ల విస్తీర్ణాన్ని ఒక సెగ్మెంట్‌గా గుర్తించి పర్యవేక్షణకు ఒక్కో అధికారిని నియమించారు. నీటికోసం సోలార్ బోర్లను ఏర్పాటు చేస్తున్నారు. కంపా నుంచి అవసరమైన నిధులను మంజూరు చేస్తున్నామని అటవీశాఖ అధికారులు తెలిపారు.

అమ్రాబాద్ రిజర్వులో మంటలు.. పెద్దపులుల గాండ్రింపులు

నల్లమలలోని అమ్రాబాద్ టైగర్ రిజర్వ్‌లో గత కొన్నిరోజులుగా తరుచుగా చెలరేగుతున్న మంటలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఇది పెద్దపులుల మనుగడకు ఇబ్బందిగా మారింది. అచ్చంపేట, అమ్రాబాద్‌లలో ఇటీవల పెద్దపులుల సంచారం పెరిగినట్టు కెమెరాట్రాప్ పరిశీలనలో వెల్లడవుతున్నది. దాదాపు 18 పెద్దపులులు ఇక్కడ సంచరిస్తున్నట్లు అంచనా.



మన్ననూరు వద్ద అటవీ సరిహద్దును దాటుతున్న పెద్దపులి

వ్యవసాయానుబంధ పరిశ్రమలు అత్యవసరం

- పంట ఉత్పత్తులకు అనుగుణంగా పరిశ్రమల ఏర్పాటు
- ప్రాసెసింగ్, ఎగుమతుల యూనిట్లకు ప్రోత్సాహం
- వ్యవసాయశాఖ మంత్రి అధ్యక్షతన మంత్రివర్గ ఉపసంఘం సమావేశం



అసెంబ్లీ సమావేశ మందిరంలో బుధవారం జరిగిన మంత్రివర్గ ఉపసంఘం భేటీలో పాల్గొన్న మంత్రులు పోచారం శ్రీనివాసరెడ్డి, కే తారక రామారావు, టీ హరీశ్‌రావు, జీ జగదీశ్‌రెడ్డి, ఈటల రాజేందర్, జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యే పుట్ట మధు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: వచ్చే ఏడాది నాటికి తెలంగాణ సాగునీటి ప్రాజెక్టులు పూర్తయి కోటి ఎకరాలు సాగులోకి వస్తుందని, పుష్కలంగా నీరు లభించడంతో వ్యవసాయంతో పాటు అనుబంధరంగాల్లో ఊహించనంత మార్పు వస్తుందని మంత్రివర్గ ఉపసంఘం పేర్కొన్నది. పంటల ఉత్పత్తులు అధికమవుతాయని దీనికనుగుణంగా అనుబంధ పరిశ్రమలను ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉన్నదని అభిప్రాయపడింది. రాష్ట్రంలో ఆగ్రో ప్రాసెసింగ్ పరిశ్రమల ఏర్పాటుకు ప్రోత్సాహం, విధివిధానాల రూపకల్పనపై ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘం బుధవారం అసెంబ్లీ సమావేశ మందిరంలో వ్యవసాయశాఖమంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన సమావేశమైంది. మంత్రివర్గ ఉపసంఘం సభ్యులు కే తారక రామారావు, టీ హరీశ్‌రావు, ఈటల రాజేందర్, జీ జగదీశ్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు సమావేశంలో పాల్గొన్నారు. పరిశ్రమలతోపాటు కోల్డ్ స్టోరేజీలు, ప్రాసెసింగ్ యూనిట్లు, ల్యాబ్‌లు, ప్యాకింగ్ ఉత్పత్తులకు అపార అవకాశాలు ఉన్నాయని, మల్టీ నేషనల్ కంపెనీలు, చైన్ రిటైల్ మార్కెట్‌తో పరిశ్రమలను అనుసంధానం చేయాలని సభ్యులు అభిప్రాయపడ్డారు. వ్యవసాయ ఆధారిత పరిశ్రమల స్థాపనకు అందించాల్సిన సహకారం, మార్గదర్శకాల రూపకల్పనపై ఈనెల 24న మరోసారి భేటీ కావాలని మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయించింది. ఈ సందర్భంగా రాష్ట్రంలో పంటల విస్తీర్ణం, ఉత్పత్తి, స్థాపించాల్సిన పరిశ్రమలు, సామర్థ్యంపై అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. పారిశ్రామికవేత్తలకు అవసరమైన సబ్సిడీలు ఇవ్వడం, ప్రోత్సాహానికి ఇతర సహాయసహకారాన్ని అందించేందుకు స్లాబులవారీగా మార్గదర్శకాలను రూపొందించాలని ఉపసంఘం సభ్యులు అభిప్రాయపడ్డారు. వ్యవసాయఆధారిత పరిశ్రమల్లో తక్కువ పెట్టుబడితో ఎక్కువమందికి ఉపాధి దొరికి, రైతుల ఉత్పత్తులకు అధిక ధర లభిస్తుంది. దీనిపై రైతుల్లో అవగాహన కల్పించి పరిశ్రమల ఏర్పాటు, ఎగుమతులకు అనుకూలమైన పంటలు సాగుచేసేలా అవగాహన కల్పించాలని ఉపసంఘం నిర్ణయించింది. కార్యక్రమంలో వ్యవసాయ, మార్కెటింగ్‌శాఖ ముఖ్యకార్యదర్శి సీ పార్థసారథి, కమిషనర్ డాక్టర్ ఎం జగన్మోహన్, పరిశ్రమల శాఖ ముఖ్యకార్యదర్శి జయేశ్‌రంజన్, ఉద్యానశాఖ కమిషనర్ ఎల్ వెంకట్రామిరెడ్డి, మార్కెటింగ్‌శాఖ డైరెక్టర్ లక్ష్మిబాయి, టీఎస్ఐఐసీ ఎండీ నర్సింహారెడ్డి, వ్యవసాయ విశ్వవిద్యాలయం వీసీ డాక్టర్ వీ ప్రవీణ్‌రావు పాల్గొన్నారు.



రేపు, ఎల్లుండి సాహిత్య అకాడమీ సదస్సులు

- చైర్మన్ నందిని సిధారెడ్డి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణ రాష్ట్ర సాహిత్య అకాడమీ సారథ్యంలో తెలంగాణ భాష, సాహిత్యం, చరిత్ర, సంస్కృతిపై ఈ నెల 23, 24 తేదీల్లో రవీంద్రభారతిలో ప్రత్యేక సదస్సులు నిర్వహించనున్నట్టు అకాడమీ చైర్మన్ నందిని సిధారెడ్డి చెప్పారు. ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా ప్రచురించిన 'శాతవాహనుల నుంచి కాకతీయుల వరకు 'అనే పుస్తకం స్ఫూర్తితో చరిత్ర అధ్యయనాలు కొనసాగించే ప్రయత్నంలో భాగంగా సదస్సులు నిర్వహిస్తున్నామని చెప్పారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, 'కాకతీయుల నుంచి అసఫ్‌జాహీలవరకు' అనే అంశంతో తెలంగాణలో పరిఢవిల్లిన చరిత్ర పై అధ్యయనం చేయాలనే సంకల్పంతో సదస్సులు ఏర్పాటు చేశామని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సాహిత్య అకాడమీ, వారధి సంస్థలు సంయుక్తంగా సదస్సును నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. సదస్సుల్లో నాణేల పరిశోధకులు డాక్టర్ రాజారెడ్డి, చరిత్ర పుస్తకాలు రాసిన ఈమని శివనాగిరెడ్డి, చరిత్ర పరిశోధకులు జితేంద్రబాబు, ఉమామహేశ్వరరావు, సూర్యకుమార్,ఓయూ ప్రొఫెసర్ అడపా సత్యనారాయణ పాల్గొని పత్రాలను సమర్పిస్తారని చెప్పారు. అకాడమీ సెక్రటరీ ఏనుగు నరసింహారెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

సంచారజాతులపై 28న జాతీయ సెమినార్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: సంచార జాతులు, విముక్త జాతులు, అర్ధ సంచార జాతులపై ఈ నెల 28 నుంచి రెండురోజులు సిద్దిపేట ప్రభుత్వ కళాశాలలో జాతీయ సెమినార్ నిర్వహించనున్నారు. ఈ సదస్సులో బీసీ కమిషన్ చైర్మన్ బీఎస్ రాములు, సభ్యులు వకుళాభరణం కృష్ణమోహన్‌రావు, జూలూరు గౌరీశంకర్, ఆంజనేయగౌడ్ పాల్గొననున్నారు.